ద్రావిడ భారతి

PRASAARAANGA

ద్రావిడ విశ్వవిద్యాలయం

శ్రీనివాసవనం, కుప్పం - 517 426

ద్రావిడ భారతి

సంపుటి - 1

నవంబర్ 2017

సంచిక-1

ISSN: 2319-3905

ద్రావిడ భారతి

అర్ధవార్షిక తెలుగు పరిశోధన పత్రిక

సంపుటి - 1 మే 2018 సంచిక-1

ద్రావిడ విశ్వవిద్యాలయం

ద్రావిడ భారతి

(అర్ధవార్షిక తెలుగు పరిశోధన పత్రిక)

సంపుటి - 1 **డిసెంబర్ 2017** **సంచిక - 1**

గౌరవ సంపాదకులు

ఆచార్య ఇ.సత్యనారాయణ

అతిథి సంపాదకులు

ఆచార్య ఆర్వీయస్. సుందరం

సంపాదక మండలి సభ్యులు

ఆచార్య జి.ఎస్.మోహన్

డా.జె.వి.సత్యవాణి

డా.కె.శ్రీదేవి

డా.ఎస్.చిన్నరెడ్డయ్య

సంయోజకులు

డా.డి.ఉదయ కుమారి

ద్రావిడ విశ్వవిద్యాలయం

శ్రీనివాసవనం, కుప్పం - 517 426

Dravida Bharathi
BI-ANNUAL RESEARCH JOURNEL IN TELUGU
December 2017, Vol.I, No.1

© Dravidian University

Editorial Board

Honorary Editor
Prof.E.Sathyanarayana

Guest Editor
Prof.R.V.S.Sundaram

Members
Prof.G.S.Mohan
Dr.J.V.Sathyavani
Dr.K.Sridevi
Dr.S.Chinna Reddaiah

Convener
Dr.D.Udaya Kumari

PRASARANGA

Published by
Director
Centre for Publications & Extension Services
Dravidian University
Kuppam - 517 426

For Copies
The Director
Centre for Publications & Extension Services
Dravidian University
Srinivasavanam
Kuppam – 517 426

Printed at
Sri Sri Printers
Vijayawada

సందేశం

ప్రాచీనమైన, సుసంపన్నమైన ద్రావిడ భాషల సర్వతోముఖ అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని త్రిభాషా ప్రాంతమైన కుప్పంలో 1997వ సంవత్సరం నెలకొల్పింది. ఈ ఇరవై ఏళ్ళలో ద్రావిడ విశ్వవిద్యాలయం ద్రావిడ భాషలను మాట్లాడే వారి మధ్య భావ సమైక్యతను సాధించడానికి ఎన్నో విధాలుగా కృషి చేస్తోంది. ప్రచురణలు & విస్తరణ సేవల కేంద్రం (ప్రసారాంగ) ఐదు ప్రధాన దాక్షిణాత్య భాషలతో బాటు ఆంగ్ల భాషలో రచనల్ని వెలువరించింది. ఏ విశ్వవిద్యాలయమూ ఇన్ని భాషలలో ప్రచురణల్ని చేపట్టిన దాఖలా లేదు. స్వతంత్ర గ్రంథాలతో బాటు, అనువాదాలను, నిఘంటువులను, పరిశోధన గ్రంథాలను, భాషాశాస్త్ర గ్రంథాలను ప్రసారాంగ ప్రచురించింది. వీటితో బాటు 'ద్రావిడ భారతి' అర్ధవార్షిక పత్రిక ప్రచురణ ద్వారా తెలుగు సాహిత్య, సాంస్కృతికాభిమానులను అలరింపబూనడం ముదావహం.

తెలుగునాట 'భారతి' లాంటి పత్రికలు పరిశోధకుల పాలిటి కల్పతరువులుగా ఉండేవి. కొన్ని విశ్వవిద్యాలయాలు 'వాఙ్మయి', 'వివేచన', 'విమర్శిని' లాంటి కొన్ని పత్రికల్ని కొంత కాలం నిర్వహించాయి, నిర్వహిస్తున్నాయి. పరిశోధకులు ఉన్నత ప్రమాణాలతో కూడిన వ్యాసాలను ప్రచురించడానికి ప్రామాణిక వేదిక అవసరం ఇంకా ఉంది. ఈ విషయాన్ని గుర్తించి లోగడ ప్రచురించిన 'ద్రావిడి' స్థానంలో ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రస్తుత పత్రికను ప్రారంభించింది.

'ద్రావిడ భారతి' అర్ధవార్షిక పరిశోధన పత్రికను ఆదరించి, తెలుగును గురించిన ఉత్తమ పరిశోధన పత్రాలను పంపి సాహిత్యాభిమానులు దీన్ని మరింత బలోపేతం చేయగలరని విశ్వసిస్తున్నాను.

ఆచార్య ఇ.సత్యనారాయణ
ఉపాధ్యక్షులు

సంపాదకీయం

ద్రావిడ భాషల అధ్యయనం, ద్రావిడ సంస్కృతిని గూర్చిన పరిశోధన, ఆ భాషల్లోని విశిష్ట సాహిత్య పరిశీలన ధ్యేయంగా ద్రావిడ విశ్వవిద్యాలయం ఏర్పడింది. భారత దేశంలో ద్రావిడ భాషల ఉనికి పరిశోధకుల దృష్టిని ఆకర్షించింది. బెలూచిస్థాన్‌లో కూడా బ్రాహుయి అనే ద్రావిడ భాష ఉండడం ఈ ఉపఖండంలో ద్రావిడ భాషల ప్రత్యేక స్థానాన్ని గుర్తించేట్లు చేసింది. ఈ భాషలను గురించి చేయవలసిన పరిశోధన అపరిమితంగా ఉందనే విషయాన్ని గుర్తించి ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం జరిగింది.

విశ్వవిద్యాలయాలు చేపట్టవలసిన మూడు బాధ్యతలు బోధన, పరిశోధన, ప్రచురణ. ఈ మూడింటి వల్ల జ్ఞాన ప్రసారం సుగమమవుతుంది. ద్రావిడ విశ్వవిద్యాలయం ఈ మూడింటినీ నిర్వహిస్తూ ఉండడం ముదావహం. ముఖ్యంగా ప్రచురణల కేంద్రం ఏ విశ్వవిద్యాలయమూ చేపట్టని విధంగా ఆరు భాషలలో గ్రంథాలను ప్రచురిస్తోంది. ఇలా ప్రధాన ద్రావిడ భాషలలో, ఆంగ్లంలో పుస్తక ప్రచురణ చేస్తున్న మరో విశ్వవిద్యాలయం ఏదీ లేదు.

పుస్తక ప్రచురణతో బాటు వివిధ భాషలలో పరిశోధన పత్రికలను ప్రచురించాలనుకోవడం ద్రావిడ విశ్వవిద్యాలయం చేపట్టిన మరో మహత్కార్యం. లోగడ ఆంగ్లంలో, తెలుగులో త్రైమాసిక పత్రికలను ప్రచురించిన ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రస్తుతం ఐదు భాషలలో అర్ధవార్షిక పరిశోధన పత్రికలను ప్రచురింప బూనడం పరిశోధన రంగంలోనే అపూర్వ సంఘటన. ఈ విషయంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు, రిజిస్ట్రారు, ప్రచురణలు & విస్తరణ సేవల కేంద్రం సంచాలకులు ఎంతయినా అభినందనీయులు. పరిశోధన కోసం విశ్వవిద్యాలయం చేపట్టిన ఈ కార్యం ఇతర విశ్వవిద్యాలయాలకు మార్గదర్శకం కాగలదని చెప్పక తప్పదు.

తెలుగులో ఒకానొక కాలంలో పరిశోధన, గ్రంథ పరిష్కరణ, విమర్శ, సాంస్కృతిక అధ్యయనం వికసించాలనే ఉద్దేశంతో అనేక పత్రికలు వెలువడేవి. వృత్తాంతిని, వర్తమాన తరంగిణి, హితవాది, ఆంధ్రభాషా సంజీవని, వివేకవర్ధిని లాంటి పత్రికలు 19వ శతాబ్దిలోనే తెలుగు భాషా సాహిత్యాలకు అమూల్యమైన సేవ చేశాయి. 20వ శతాబ్ది ప్రారంభంలో గౌతమి, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, కృష్ణా పత్రిక, అముద్రిత గ్రంథ చింతామణి, ఆంధ్ర పత్రిక మొదలైనవి చేసిన సేవ చిరస్మరణీయం.

ఒకప్పుడు ఏ సాహిత్యవేత్త అయినా, పరిశోధకుడైనా తమ వ్యాసాలు ప్రచురించాలంటే ముఖ్య వేదికగా 'భారతి' ఉండేది. ఈ పత్రిక తెలుగు సాహిత్య వికాసానికి చేసిన సేవ మరువరానిది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (వాఙ్మయి), ఉస్మానియా విశ్వవిద్యాలయం (వివేచన), కాకతీయ విశ్వవిద్యాలయం (విమర్శిని), తెలుగు అకాడెమీ (తెలుగు), దక్షిణ భారత హిందీ ప్రచారసభ (స్రవంతి) లాంటి సంస్థలు కూడా పరిశోధన రంగానికి తమ వంతు సేవల్ని అందించాయి.

ప్రస్తుతం పరిశోధనకు సంబంధించిన కొత్త విషయాలను చెప్పాలంటే సరైన వేదిక అంటూ లేదు. తెలుగులో జరుగుతున్న పరిశోధనను గురించి ఎన్నో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వేలమంది తెలుగులో పరిశోధనలు జరుపుతున్నా ఉన్నత ప్రమాణాలను అనుసరించటం లేదనే ఆరోపణ ఉంది. పరిశోధన చెయ్యాల్సిన విషయాలకు కొదువ లేదు. కాని కష్టపడకుండా పరిశోధన పట్టం పుచ్చుకోవాలనే తపన పరిశోధకులలో ఎక్కువవుతూ ఉంది. అలా కాకుండా తెలుగులో ఉత్తమ పరిశోధనకు ఆకరంగా వ్యవహరించాలని, ద్రావిడ భాషల తులనాత్మక పరిశీలనకు ఒక వేదిక కావాలని ప్రస్తుత పత్రికను ప్రారంభించటం జరిగింది.

ఇలాంటి పత్రిక చాలా అవసరమని గుర్తించి దీన్ని వెలుగులోకి తీసుకురావటానికి కారకులైన ఉపాధ్యక్షులు ఆచార్య ఇ.సత్యనారాయణ గారికి, రిజిస్ట్రారు ఆచార్య బి.తిరుపతిరావు గారికి ధన్యవాదాలు. ఈ సంచికలో మహామహోపాధ్యాయ చిలుకూరి నారాయణరావు గారి వ్యాసాన్ని పునర్ముద్రించటం జరిగింది. ఈ సంచికను ప్రచురిస్తున్నామని తెలపగానే స్పందించి వ్యాసాలను పంపిన రచయితలందరికీ ధన్యవాదాలు. సంపాదక మండలి సభ్యులకు, సంయోజకులు డా. డి.ఉదయ కుమారి గారికి ధన్యవాదాలు. దీని ముద్రణ బాధ్యతను చేపట్టి ఈ కార్యంలో సహకరించిన ప్రచురణలు & విస్తరణ సేవల కేంద్రం సంచాలకులు ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్ గారికి కృతజ్ఞతలు.

ఈ మా ప్రయత్నాన్ని హర్షించి పరిశోధకులు ఉత్తమ వ్యాసాలను ప్రచురణకు పంపుతారని ఆశిస్తున్నాము.

ఆర్వీయస్. సుందరం

విషయ సూచిక

సందేశం iiii

సంపాదకీయం v

1. తెలుగులో కృత్తద్ధిత ప్రక్రియ 1

– ప్రాచార్య శలాక రఘునాథ శర్మ

2. తెలుగులో రచన చేసిన తొలి పాశ్చాత్యుడు – రాబర్ట్ డి నోబిలీ 14

– డా. పి. ఎస్. గోపాలకృష్ణ

3. కాళ్ళకూరివారి సంస్కరణోద్యమ నాటకాలు 17

– ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు

4. లిఖిత–మౌఖిక జాంబ పురాణాలు 29

– ఎ. కె. ప్రభాకర్

5. సి.పి.బ్రౌన్ ప్రజాస్వామిక భాషా దృక్పథం 41

– వి. చెంచయ్య

6. తెలుగులో ఆగమరూప నిర్మాణం 49

– ఆచార్య గాలి రాధాకృష్ణ

7. విశ్వనాథ సీసనిర్మాణ పద్ధతులు – ఒక దృష్టి 58

– డా. పి. ఆర్. హరినాథ్

8. తమిళ భాషా ప్రాచీనత 68

– కీ. శే. డా. చిలుకూరి నారాయణరావు

9. ప్రపంచీకరణ నేపథ్యంలో సాహిత్య విమర్శ పదజాలం 86

–డా. దార్ల వెంకటేశ్వరరావు

10. ఎరుకల భాష – వారణాసి శర్మ 97

–డా. వి. ఎమ్. సుబ్రహ్మణ్య శర్మ

11. కులాధారిత ఐతిహ్యాలు 102

– డా. డి. గాయత్రి

12. 15వ శతాబ్దినాటి తాళ్ళపాక పదకవులు - 21వ శతాబ్దిలో
కొనసాగుతున్న కొత్త పరిశోధన 108
- *ఆచార్య వేటూరి ఆనందమూర్తి*

13. తెలంగాణలో బౌద్ధం 115
- *డా. సంగనభట్ల నరసయ్య*

14. రాయలసీమ దళిత నవలల్లో సాంస్కృతికాంశాలు 131
–ఆర్. బాలి రెడ్డి

శైలీ పత్రం 141

"ద్రావిడ భారతి" పత్రికలో ప్రచురితమవుతున్న వ్యాసాలలోని విషయాలకు, వివరాలకు ఆయా రచయితలే బాధ్యులు. విశ్వవిద్యాలయం బాధ్యత వహించదు.

తెలుగులో కృత్తద్ధిత ప్రక్రియ

– ప్రాచార్య శలాక రఘునాథ శర్మ

మానవుని హృదయం విశ్వమంత విశాలం. అందులో పుట్టే భావాలను అభివ్యక్తం చేయటానికి మానవుడు ఒక్కొక్కసారి చాలా అవస్థపడుతూ ఉంటాడు. అంటే భాష సరిగా తెలియకో, తెలిసిన భాష తాను చెప్పదలచుకొన్న దానిని చెప్పటానికి సమర్థంగా లేదనో మానవుడు తఱచుగా అవస్థపడుతూ ఉండటం చాలామందికి అనుభవంలో ఉన్న విషయమే.

ఈ అవస్థవలన మానవుడు హఠాత్తుగానో ఆలోచనాపూర్వకంగానో ఒక్కొక్కసారి క్రొత్తపదాలను సృష్టించుకుంటున్నాడు. నూతన వస్తుసృష్టితోపాటు నూతనపదసృష్టి కూడా ఆవశ్యకమవుతున్నది.

ఈమధ్య ఒక కాన్ఫరెన్సులో పాల్గొనటం జరిగింది. ఒకరు వ్యాసం చదివిన తర్వాత దానిమీద చర్చ ప్రారంభమైంది. ఒకరు ప్రశ్నవేస్తున్నారు. ఆ ప్రశ్న సుదీర్ఘంగా కొనసాగుతున్నది. ఒక మిత్రునితో జనాంతికంగా అన్నాను. ప్రశ్న ఉపన్యాసంలా ఉంటే ఎలా? అని. ఆయన ఇది 'Lec-question' అని Lecture cum question అని వివరించాడు. నేను ఇంకొంచెం సంగ్రహించి 'Lecstion' అందాం, పొందికగా ఉంటుంది అన్నాను. పదిమంది దీనిని వాడితే 'ఉపన్యాసంలాగా సాగిపోయే ప్రశ్న' అనే అర్థంలో ఇది రూఢికెక్కవచ్చును.

ఇంతకూ చెప్పవచ్చినదేమంటే ఉన్న భాష చాలదన్న భావంతో మానవుడీవిధంగా క్రొత్తపదాలను సృష్టించుకుంటున్నాడు. ఈ పని ప్రాచీనకాలంనుండి జరుగుతూనే ఉంది. చాలా భాషలకు ఉపజీవకమైన సంస్కృతభాషా, ఆ కోవలోనే మఱికొన్ని భాషలూ నూతన పదసృష్టి విషయంలోవిస్తృతమైన ప్రణాళికలు వేసుకొన్నాయి. సంస్కృతంలో ఈ విధమైన నూతన పదసృష్టికి అయిదు మార్గాలున్నాయి. 1. ధాతువులకు అర్థవిశేషాలలో ప్రత్యయాలు చేరటం, 2. నామములకు అర్థవిశేషాలలో ప్రత్యయాలు చేరటం, 3. రెండు గాని అంతకంటె ఎక్కువగాని పదాలు ఒకటిగానయి ఒక అర్థాన్ని చెప్పటం, 4. రెండు పదాలలో ఒకటి మిగిలి రెంటి అర్థాన్ని చెప్పటం, 5. ధాతువులకూ, నామములకూ కొన్ని ప్రత్యయాలు చేరిన విశేషార్థాన్ని ప్రతిపాదిస్తూ ధాతువులవటం – క్రమంగా వీనిని కృత్తద్ధిత సమాసైకశేష సనాద్యంత ధాతు వృత్తులంటారు.

ఈ పై చెప్పిన అయిదింటికీ సామాన్య వ్యవహారం 'వృత్తి'. 'పరార్థాభిధానం వృత్తిః' అని వృత్తి నిర్వచనం. ఒక నామమో ఒక ధాతునో ఒక అర్థంలో బంధింపబడి ఉంటాయి. ప్రత్యయ సంసర్గం చేతనో పరపదసంసర్గంచేతనో దానికి ప్రాథమికంగా ఉన్న అర్థంకంటె భిన్నమైన అర్థం లభిస్తుంది. ఈవిధంగా పరపదార్థాన్ని చెప్పటం వృత్తి లక్షణం. ఈ అయిదు వృత్తులలో బహువిశాలమైనవి కృత్తద్ధితాలు.

తెలుగు కృత్తద్ధితప్రక్రియను గురించి వివరించటానికి ముందు, ఈ ప్రక్రియకు మూలకందమైన సంస్కృత భాషలో వీని స్థితిగతులను గురించి స్థూలంగా సమీక్షించటం అవసరం. ముందు కృద్విచారణ చేద్దాం.

'కృత్తు' అనేది ఒక వ్యాకరణ సంజ్ఞ. కృధాతువునకు 'క్విప్' అనే కృత్ప్రత్యయం చేరితే ఏర్పడేరూపం. చేయునది అని దీని శాబ్దికార్థం. ధాతువును నామంగా చేయునది అనే అర్థం ఇక్కడ సంభవించుకోవచ్చును.

సంస్కృత వ్యాకరణానికి సమగ్రరూపం కల్పించిన పాణిని కాత్యాయన పతంజలి నామక మునిత్రయం వ్యవహారం కోసం, సౌలభ్యం కోసం ఎన్నో సంజ్ఞలను తాము సృష్టిస్తూనే, బాగా రూఢములైన ప్రాచీన సంజ్ఞలను తమ గ్రంథాలలో వ్యవహరించారు. అట్టి ప్రాచీన సంజ్ఞలలో ఇది ఒకటి. మహామహోపాధ్యాయ కాశీనాథ వాసుదేవ అభయంకర్ గారు తమ సంస్కృత వ్యాకరణ నిఘంటువులో దీనిని గురించి యిట్లా వ్రాస్తున్నారు.

Krit and Taddhita appear to be the ancient pre-paninian terms used in the Nirukta and Pratisakhya works in the respective senses of root born and noun born words (Kridanta and Taddhitanta according to Panini's terminology) and not in the sense of mere suffixes.

దీన్నిబట్టి ప్రాచీనులు శబ్దరూపాలనే కృతద్ధితాలుగా వ్యవహరిస్తే పాణిని వానిని ప్రత్యయాలుగా మాత్రమే వ్యవహరించారని తెలుస్తున్నది. పాణిని పరిభాషనుబట్టి కృదంతం, తద్ధితాంతం అనేవి పదాలకు సంబంధించిన వ్యవహారం.

ఇక్కడ ఒకమాట. నూతన పదసృష్టి అనే మాటనుబట్టి తప్పనిసరిగా కృదంతాలన్నీ వ్యాకరణం చేత సిద్ధించినవే అనుకోనక్కరలేదు. వ్యవహారసిద్ధరూపాలను వ్యాకర్తలు ప్రకృతి ప్రత్యయవిభాగం చేసి చూడటం కూడా చాలా వానిలో జరిగే ఉంటుంది. కానీ ధాతువు మూలరూపంగా ఉండటం, అనేక రూపాలు దానినుండి ఉత్పన్నమైనట్లు కానరావటం అనేది నేటికీ విస్పష్టంగా ఏర్పడిన పద్ధతి. ఆ దృష్టితో మాత్రమే వీనిని నూతన పదాలనటం.

వ్యాపారావబోధకమైన క్రియాపదం ఒక్కొక్క అర్థవిశేషానికి ఒక్కొక్క ప్రత్యయం చొప్పున అనేక ప్రత్యయాలు ఒక మూలరూపానికి చేరగా నేర్పడిన రూపం. ఆ ప్రత్యయాలన్నీ క్రమక్రమంగా తొలగిపోగా, ఇంక ప్రత్యయ రూపంలో తొలగించటానికి వీలులేని స్వరూపాన్ని 'ధాతువు' అంటారు. ఇది స్వభావత: వ్యాపారావబోధకమే అవుతుంది. కాని కొన్ని ప్రత్యయాల చేరికవల్ల ఇది నామంగా – సు, ఔ మొదలైన నామప్రత్యయాలు చేరటానికి ప్రాతిపదికగా – రూపొందుతుంది.

ఈ సందర్భంలో ధాతువులకు చేరే ప్రత్యయాల స్వరూపస్వభావాలను సమీక్షించటం అవసరం. ఈ ప్రత్యయాలన్నీ అష్టాధ్యాయిలో 3-1-91 వద్ద ప్రారంభమై అధ్యాయాంతం వరకు వ్యాపించి ఉన్నాయి. ఇందులో చాలా సూత్రాలు ప్రత్యయవిధాయకాలు. ఆ ప్రత్యయాల చేరికవల్ల

1. క్రియాపదాలు, 2. ప్రాతిపదికలు, 3. అవ్యయాలూ ఏర్పడుతాయి. ఇందులో కేవల క్రియానిష్పత్తికి సంబంధించిన 'తిఙ్ ప్రత్యాహారస్థ ప్రత్యయాలు తప్ప తక్కినవన్నీ కృత్తులనబడతాయి. (కృదతిఙ్ 3-1-93 ధాతోర్విహిత: తిఙ్భిన్న: ప్రత్యయ: కృద్ భవతి – సిద్ధాంతకౌముది 374వ సూత్రము). విజ్ఞులు మొత్తం పదునెనిమిది – అవి, నానికాదేశాలుగా విధింపబడినవీ కాక ధాతువులకు చేరే తక్కిన ప్రత్యయాలన్నీ కృత్తులని తాత్పర్యం. మళ్ళీ ఈ కృత్తులలో రెండు తెగలున్నాయి. సర్వధాతువులకూ చేరే ప్రత్యయాలు కొన్ని, కొన్ని ధాతువులకు కొన్ని అర్థ విశేషాలలో చేరే ప్రత్యయాలు కొన్ని, క్త్వా, శతృ, శానచ్, క్త, క్తవతు, తుమున్ మొదలైనవి ధాతువులన్నింటికి చేరే ప్రత్యయాలు. ణ్వుల్, తృచ్, ఖశ్, ఖ్యున్, క్విప్ మొదలైనవి ప్రత్యేకార్థాలలో కొన్ని ధాతువులకు మాత్రమే చేరతాయి. ఈ కృత్ప్రత్యయాలు అపాదాన, సంప్రదాన, కరణ, అధికరణ, కర్మ కర్త్రర్థాలలో వస్తాయి. అంటే ధాతువునకు ప్రత్యయం చేరగా నేర్పడిన రూపం అపాదానాద్యర్థ విశిష్టమవుతుంది. కృత్తులలోనే ఒక భాగమైన కృత్యప్రత్యయాలు, కృత్తులలోనివే అయిన క్తప్రత్యయ, ఖలర్థప్రత్యయాలు సాధారణంగా భావకర్మార్థాలలో వస్తాయి. తయారేవకృత్యక్త ఖలర్థా: 3-4-70, 2833, మిగిలిన ప్రత్యయాలన్నీ ప్రత్యేకించి చెప్పిన సందర్భాలలో తప్ప, తక్కినవానివిషయంలో కర్త్రర్థంలో వస్తాయి. (కర్తరికృత్ 3-4-62, 2832) అంటే సంస్కృతంలో ఇంచుమించు కృత్తులన్నింటికీ కారకాద్యాశ్రితమైన అర్థనిర్దేశం సూత్రకర్తచేతనే చేయబడింది. తెలుగులో ఇది అంత సుగమం కాకపోవటంవల్లనూ, చేస్తే గ్రంథం బాగా పెరిగిపోతుంది కాబట్టి తెలుగువ్యాకర్తలు ఆ పనికి పూనుకోలేదు. దీనిని ముందు కొంత వివరిస్తాను.

సంస్కృతంలో కృత్తులకు సంబంధించిన భావాద్యర్థాలను ఈ క్రింది ఉదాహరణల ద్వారా చూడవచ్చు.

1. చేతవ్యశ్చయనీయోవా ధర్మ: – కర్మార్థము
2. ఏధితవ్య మేధనీయం త్వయా – భావార్థము
3. దీయతేఽ స్మై దానీయో విప్ర: – సంప్రదానార్థము
4. స్నాన్త్యనేన స్నానీయం చూర్ణమ్ కరణార్థము
5. పుష్యన్త్యస్మిన్నర్థా: పుష్య: – అధికరణార్థము, ఇత్యాదులు.

సంస్కృతంలో పాణినికృతమైన కృత్ప్రక్రియయే చాలా విశాలమైనది ఉంది. అందులో గతార్థాలు కాని అనేక రూపాలను ఉణాదిప్రకరణం సాధిస్తున్నది. ఈ ఉణాదిసూత్రాలు శాకటాయనకృతాలని ప్రసిద్ధి. ఈ విధంగా ఈ కృద్విధానం చాలా పటిష్ఠమైనది. ఈ పూర్వరంగంతో తెలుగులోని కృత్ప్రక్రియను పరిశీలిద్దాం.

తెలుగులో ప్రాచీనవ్యాకరణాలయిన ఆంధ్రభాషాభూషణం, చింతామణి మొదలైన వానిలో కృదంతాలను విశేషంగా చెప్పలేదు. ఆంధ్రభాషా భూషణంలో మాత్రం 'అమి లేమికి, ఇమి కల్మికి' అని రెండుప్రత్యయాలు తద్ధితాల వరుసలో చెప్పబడ్డాయి. (166వ పద్యం) అట్లాగే 157వ

పద్యంలో క్త్వార్థక వ్యతిరేక క్త్వార్థక ప్రత్యయాలు చెప్పబడ్డాయి. అమి ఇములలో మొదటిది సర్వధాతువులకూ చేరుతుంది. రెండవది కొన్నింటికి మాత్రమే చేరుతుంది. ఆంధ్రశబ్దచింతామణిలో కృద్విధానం ప్రత్యేకంగా లేదనే చెప్పాలి. కృదంతాలను గూర్చి విశేషంగా కృషి చేసి ప్రత్యయ స్వరూపాలను, ధాతుగుణాలను, కార్యవిశేషాలను ఏర్పరచుకొని ఒక ప్రకరణం నిర్మించినవాడు చిన్నయసూరియే అని చెప్పాలి. సంస్కృతవ్యాకరణఫక్కిలో తెలుగువ్యాకరణానికి ఒక సమగ్రతను సాధించటానికి ప్రత్నించిన సూరి కృదంత ప్రక్రియను చేపట్టి చాలవఱకు కృతకృత్యుడయ్యాడు. అహోబలపతి గణపవరపు వేంకట కవులీ విషయంలో సూరికి కొంతవరకు మార్గదర్శకులయ్యారనే మాట నిర్వివాదాంశం. కానీ యీ విషయంలో సూరి కృషి మాత్రం అనల్పమైనది, ప్రశంసనీయమైనది అని చెప్పక తప్పదు.

సంస్కృతవ్యాకరణంలోవలె సూరికూడా 'ధాతువునకు జేరుదు ఙ్చిన్న ప్రత్యయంబు కృత్తునాబడు' అని కృత్సంజ్ఞను వివరించాడు. ఆ లెక్క ప్రకారం క్రియాపరిచ్ఛేదంలో చెప్పిన ట, మిజి, ఇ, కజి, నుజి, సన్, దున్, చున్, ఎడి, ఎడు, ఉన్న, కలజి, స, నిజి అనే పదునాలుగూ కృత్ప్రత్యయాలే. కృద్విధానానికి ఒక ప్రకరణాన్ని కేటాయించిన సూరి యీ పదునాల్గింటినీ క్రియాపరిచ్ఛేదంలో ఎందుకు చెప్పి ఉంటాడని ప్రశ్నించుకొని కీ.శే.దువ్వూరి వేంకటరమణ శాస్త్రులు గారు చక్కని సమాధానం ఈ క్రిందివిధంగా చెప్పారు.

'కృత్తులలో కొన్నిటిని విడదీసి క్రియాపరిచ్ఛేదమున జేర్చుటకు సూరి దృష్టిలో ప్రబలమగు కారణము గలదు.

అతడు బాలవ్యాకరణమున నిర్దేశింపదలచిన కృత్తులు మొత్తము ముప్పది యెనిమిది. వీని స్వరూప స్వభావములలోని భేదమును సుదూరము వివేచించి వీనిని రెండు జాతులుగా విభజించినాడు.

మొదటి జాతి 24, రెండవజాతి – 14. ఈ రెండు జాతులకును గల భేదమెట్టిదన, మొదటి జాతిలోని కవర్ణకాదులు కొన్నికొన్ని ధాతువులకు మాత్రమే వచ్చుచుండును.

రెండవజాతిలోని టవర్ణకాదు లట్లుగాక సర్వధాతు సాధారణములు.

మఱియు, మొదటిజాతిలో కృత్ ప్రత్యయములలోని క, గ, త, ప, వ, ఇమి అనునవి పరమయిన యెడ ధాతువు తుది నున్న క, గ, చ, య, వలు లోపించును.

రెండవజాతి కృత్తులలోని క, గ, త, ప, వేములు అట్లు క, గ, చ, య, వల లోపమునకు నిమిత్తములు కానేరవు.

ఇంతియగాక మొదటిజాతికృత్తులలో ఒక్కొక్కదానికి అనేకార్థము లుండుట, ఒకేయర్థమున ననేక కృత్తులు వచ్చుట, యను గజిబిజి యుండుటచే ఈ కృత్తులకు సూటిగా నర్థములు నిర్దేశించుట కుదురుపడదు. రెండవ జాతి కృత్తులగు టవర్ణకాదులు పదునాలుగింటికిని భావాద్యర్థములను సునిశ్చితముగా నిర్దేశింప వీలుగలదు.

ఇట్టి భేదములను పర్యాలోచించి సూరికృత్తుల మొత్తమునుండి సర్వధాతుసాధారణములగు వానిని వేరుపఱచి యా పదునాలుగింటిని క్రియాపరిచ్ఛేదమున జేర్చియుండెను (రమణీయము 447, 448 పుటలు).

ఈ విధములగు సుపపత్తులను జూపి క్రియాపరిచ్ఛేదంలో అవి ఉండటం సముచితమే అని శ్రీ శాస్త్రి గారు నిరూపించారు.

అయితే సూరి కృత్తుల అర్థనిరూపణ విషయంలో సమగ్రతను సాధించటం కష్టమని గుర్తించాడు. తన్నిరూపణకు పూనుకుంటే వ్యాకరణ ప్రధాన లక్షణం సంక్షిప్తత అనేది దెబ్బ తింటుందని భావించాడు. కాబట్టి 'కృత్తుల కర్థంబులు యథావ్యవహారంబుగ గ్రాహ్యంబులు' (కృ.ప. 1వ సూత్ర) అని సూత్రించి 'కృత్తులకు వక్ష్యమాణంబులకు భావకర్తృ కర్మాద్యర్థంబులు మహాజన వ్యవహారానుసారిగా నెఱుంగునది' అని వివరించాడు. తానేల ఇట్లా చెపుతున్నాడో పాఠకునకు గుర్తింపజేయడానికి కొన్ని ఉదాహరణలిచ్చాడు.

అగు+క–ఆక, మొలచు+క – మొలక. ఈ రెండుచోటులా ప్రత్యయ స్వరూపమొకటే. కాని మొదటి దానికి భావార్థంలోనూ, రెండవ దానికి కర్త్రర్థంలోనూ చేరింది.

ఏలు+ఇక – ఏలిక, కోరు+ఇక – కోరిక, ఆడు+ఇక – ఆడిక, ఓడు+ఇక – ఓడిక. వీనిలో మొదటిదానిలో 'ఇక' కర్త్రర్థము ఏలువాడు. రెండవదానిలో భావ కర్మార్థములు రెండూ ఉన్నాయి. వాంఛయు, వాంఛితంబును, మూడవదానిలో ఆడబడునది అనే రూపంలో కర్మార్థం, నాల్గవదానిలో ఓడునది స్రవించునది అని కర్త్రర్థం.

ఈ విధంగా తెలుగులో 'కృద్విధానం అర్థాన్ని బట్టి ఒక క్రమంలో లేదు. అందుకని మహాజన వ్యవహారాను సారిగా నెఱుంగునది' అని చెప్పక తప్పలేదు.

తెలుగు కృత్ప్రక్రియలో ఒక విశేషం ఉంది. సాధారణంగా ప్రత్యయంపరంగా ఉన్నప్పుడు ధాతువుతుదివర్ణం లోపిస్తున్నది. 'ఇటంగృత్కగతపవేములు పరంబులగునపుడు కగచయవలకు లోపంబగు (బా.వ్యా.కృ.2) అని సూరి సూత్రం వ్రాశాడు. ఈ సూత్రాన్నివినియోగించుకోవటం చాలా సులభమే కాని ఈ సూత్రనిర్మాణానికి వ్యాకర్త పడిన శ్రమమాత్రం తక్కువదికాదు. ఈ లోపం జరిగేచోటులు కొన్ని వందలుంటాయి. ఆ అన్నింటినీ పట్టుకోవటం అతివ్యాప్త్యవ్యాప్తులు రాకుండా లక్షణం చెప్పటం – భాషమీద ఎంతో అధికారం ఉంటే తప్ప సాధ్యమయ్యే విషయం కాదు. ఈ సూత్రాన్నిబట్టి తెలుగులో తొంభైశాతం ధాతువులలో కృదంతరూపాలేర్పడేటప్పుడు అంత్యాక్షరలోపం జరుగుతున్నదని తేలింది. ఈ లోపానికి హేతువు లేమిలో భాషాశాస్త్రజ్ఞులు క్షుణ్ణంగా పరిశీలించాలి.

బా.వ్యా.లో క, ఇమి, తజ్, కువ, ట, టు, ప, త, పు, ఇక, నజి, బడి, గడ, ఇకి, వు, ఆ, అక, దు, ఉ, పడి, వి, ఆవు, ఇ, కలి – అనే ఇరవై నాలుగు కృత్ప్రత్యయాలు చెప్పబడ్డాయి. అయితే సూరి వీనితో కృత్ప్రణాళిక సమగ్రమైందని భావించలేదు.

"భాషేయ మమితా తత్ర దేశ్యా చిత్రస్వభావయుక్

తచ్చిత్రతా తు ద్రష్టవ్యా పూజ్యపాదసుభాషితే" (వి.వి.క్రియా. 36) అనే ఆథర్వణ కారికోక్తిని దృష్టిలో పెట్టుకొని ప్రకరణ పరిసమాప్తిలో 'ఇత్యాదులు మహాజన వ్యవహారంబుల నెఱుంగునది' అన్నాడు. అంటే ఒక అనుగతికి లొంగినవానిని, విస్పష్టంగా చెప్పుకోవటానికి వీలైనవానిని మాత్రమే అతడు సాధించాడు. ఈ సాధనమార్గాన్ని విస్తరించుకోవచ్చునని, విస్తరించుకోవలెనని అతని సూచన.

ఈ ప్రత్యయాలలో కొన్నింటిని గూర్చి కొంత విచారణ చేయవలసియున్నది. 1. ట: క్రియాపరిచ్ఛేదంలో చెప్పబడిన కృతులలో ఇదే స్వరూపం గల ప్రత్యయం ఒకటి ఉన్నది. ఏర్పడేరూపంలో, అర్థవిశేషంలో భేదం ఉండటం వలన రెండు ప్రత్యయాలు చెప్పవలసివచ్చింది. క్రియాపరిచ్ఛేదంలోనిది భావార్థంలో మాత్రమే వస్తుంది. ఇది భావకర్తృ కర్మార్థాలలో వస్తుంది. ఉదా: ఆడుటలో భావార్థం ఉంది. ఆట – ఆడబడునది అని కర్మార్థంలో ప్రత్యయం. ఆట – పలుకుట అనే అర్థంలో భావార్థకం, పండు – పంట మొదలైనవానిలో కర్త్రర్థం – ఇలా ఈ కృత్తు మూడర్థాలలోనూ వస్తుంది. దీనికి సంబంధించిన విశేషాలన్నీ రమణీయంలో విపులంగా వ్రాయబడి ఉన్నాయి.

2. ఉ: ఈ ప్రత్యయం కేవలం వ్యాకరణ సంప్రదాయ పరిరక్షణకు మాత్రమే గ్రహింపబడింది. ధాతు రూపానికీ, ప్రత్యయాంతరూపానికీ పర్యవసానంలో భేదమేమీ కానరాదు. ధాతువు యథాతథంగా ప్రత్యయసంపర్కం లేకుండా నామం కావటం సంస్కృతవ్యాకరణ పద్ధతికి విరుద్ధం కనుక, తెలుగు వ్యాకరణాలు సౌలభ్యం కోసమూ, శాస్త్ర గౌరవం కోసమూ సంస్కృత వ్యాకరణ సంప్రదాయాలను పాటించాయి కనుక ఈ ప్రత్యయాన్ని చెప్పవలసిన అవసరం ఏర్పడింది. తెలుగులో అనేక ధాతువులు ఈ విధంగా కృదంతాలవుతున్నాయి. ఈ విషయాన్ని గమనించిన వ్యాకర్త ధాతుస్థితినుండి నామస్థితికి మార్చటానికి రూపభేదాన్ని కలిగించే ఏ ప్రత్యేకతా లేని ఒక అక్షరాన్ని ప్రత్యయంగా చెప్పవలసివచ్చింది.

ఈ కృత్ప్రత్యయాలు చేరేటప్పుడు లోగడ చెప్పుకున్న కగచయవల లోపంతో పాటు మఱికొన్ని కార్యవిశేషాలు కూడా జరుగుతున్నాయి. 1.బిందులోపం – ఎఱుగు – ఎఱుక, 2. కనునకు దీర్ఘం రావటం – కను – కానుక, కానిక, కానుపు 3. కినియు, ముదియులకు ఉత్వం రావటం – కినుక, ముదుక, 4. ప్రత్యయానికి ముందు బిందువు రావటం – చేయు – చేత, 5. అంత్యాక్షరం లోపించటం ఊరు – ఊట, 6. ధాతువు లాద్యక్షరశేషాలై దీర్ఘాన్ని పొందటం, పడు – పాటు 7. కలియునకు అత్వం రావటం కలపము 8. తూగునకు తూనురావటం తూగు – తూనిక, 9. చకారం వకారం కావటం, దానిమీద ఉకారం అకారం కావటం – వీచు – వీవన, 10. వచ్చునకు రా రావటం – రాబడి, 11. చూచునకు చూడుకావటం – చూచు+ఇకి – చూడికి, 12. హ్రస్వందీర్ఘం కావటం – చచ్చు – చావు, 14. ధాతువు ద్విత్వాంతమైతే ప్రత్యయంతో కూడిన రూపం ద్విత్వాంతం

కావటం ప్రుచ్చు – ప్రువ్వు, 14. వండు దకారం టకారం కావటం, వండు+అక – వంటకము, 15. చయలకు పవర్గం రావటం – త్రోచు – త్రోపుడు, మాయు – మాపుడు, 16. కలుగునకు లే కావటం – కలుగు+వడి – లేవడి. ఇందులో చాలా కార్యాలను సూరి సూటిగా చెప్పాడు. కొన్ని ఊహకు వదిలివేశాడు.

చిన్నయ, నియతగణాలయితే ఇవి, అని, ఆకృతిగణాలయితే ఇత్యాదులు అని సాధారణంగా వ్రాస్తాడు. కాని ఈ కృదంతప్రకరణంలో కొన్నింటికి చివర ఈ రెంటిలో దేనిని చేర్చలేదు. కలుగ్వాదులు, చేయ్వాదులు, అప్పాదులు, ఏల్వాదులు, చేర్వాదులు, కోర్వాదులు, మన్వాదులు, గీఱ్వాదులు, మాఱ్వాదులు, అడుక్వాదులు అనే పదమూడు గణాల చివర 'ఇవి' అని ఇత్యాదులు అనిగాని లేదు. వ్యాకరణ నిర్మాణంలో చిన్నయసూరికున్న పరమసూక్ష్మేక్షికను గుర్తించినవారికి వీనిని ఇలా వదలటంలో ఏదో తాత్పర్యం ఉందనే అనిపిస్తుంది. 'ఇత్యాదులు' అనేమాట విస్పష్టంగా గుర్తించే రూపాలున్నప్పుడు చేరుస్తాడనీ, ఏమీ చేర్చకపోయినంతమాత్రాన అది ఆకృతిగణంకాదని సంభావింపరాదనీ నా భావన. ఉదాహరణకు అడుక్వాదులను తీసుకుందాం. ఇందులో చెప్పని ఎన్నో కృదంతరూపాలు భాషలో ఉన్నాయి. శ్రీ వేంకటరమణ శాస్త్రి గారు నలువదింటిని చూపారు (మ.పు.491) అందులోని నవ్వు క్రొవ్వులు, తన్ను తిట్టులు సూరిదృష్టికి రాలేదని సంభావింపలేముగదా.

ఈ సందర్భంలోనే ఇంకొక విశేషం కూడా చెప్పుకోవాలి. 'తవర్ణకం బావులించు లోనగు వానికగు' బా. వ్యా.కృ.10) అనే సూత్రంలో గణాంతంలో ఇత్యాదులు అనే పదంతో పాటు 'ఎఱుంగునది' అని కూడా చేర్చారు. ఈమాట కృత్ప్రకరణంలో మఱియే గణం చివరా కనబడదు. బహుశ: ఈ చేర్పుతో 'త' వర్ణకానికి 'తజ్' వర్ణకానికీ భేదం గుర్తించండి అనే హెచ్చరిక ఉండి ఉండాలి. ఏకాకారంగా ఉన్న ప్రత్యయాలు రెండింటినీ కలిపి చెప్పగూడదా? అని యెవరికైనా సందేహం వస్తుందేమో, 'తజ్' ప్రత్యయ విషయంలో ధాతువులో లేని బిందువు వస్తున్నది. తప్రత్యయం విషయంలో బిందువు ధాతుస్థమే. ఆ విభేదం కోసం రెండు ప్రత్యయాలు చెప్పాను 'ఎఱుంగునది', అని చెప్పటం ఆయన తాత్పర్యం అయివుండాలి.

బా.వ్యా.కు పూరకగ్రంథం ప్రౌఢవ్యాకరణంలో సీతారామాచార్యులు మఱికొన్ని ప్రత్యయాలు చెప్పారు. ఇ, ఇడి, ఎన, పుర, మతి, ప, వు, వలి అనేవి ఈయన చెప్పిన కృత్ప్రత్యయాలు. కడహల్లులు పవర్ణాలు కావటం, డయ్యు – డప్పి, చకారబకారాలు పవర్ణాలు కావటం – ఈర్చు+ఎన – ఈర్పెన, ఉబ్బు+ఎన – ఉప్పెన, వడ్డించు నించులోపించటం, వడ్డించు+ఎన – వడ్డెన, ఎక్కు – ఎగు కావటం, ఎక్కు – ఎగుమతి మొదలైనవి యీయన చెప్పిన కార్యవిశేషాలు.

ప్రౌ.వ్యా. చెప్పినవానిలో 'వడ్డెన' అనేది నేటికాలంలో అత్వమధ్యంగా రూఢమై యున్నది. ఎత్వమధ్యరూపాన్ని నిర్ధారించే కవిప్రయోగాలు దొరకని పక్షంలో దీన్ని 'అన' ప్రత్యయాంతంగా భావించటమే సముచితం. శ.ర.లో ప్రయోగం చూపబడలేదు.

ప్రౌ.వ్యా. కారుడు ఎక్కు నుండి ఎగువను సాధించినట్లుగా, తగ్గు నుండి తక్కువను గూడా సాధించి ఉంటే సముచితంగా ఉండేది. తగ్గుధాతువు నుండి భావార్థకంలో 'తగ్గుదల' అనే కృద్రూపం కూడా శ.ర.లో చూపబడింది.

ఇటీవల వెలువడిన ముక్తలక్షణకౌముదిలో కృత్తులకు సంబంధించిన విశేషాలు ఇవి. శ్రీ వంతరాం రామకృష్ణారావుగారు చెప్పిన ప్రత్యయాలు: అటి – ఓమటి, అలి – కూడలి, అలి – పొంగలి, అర – పొంగరము, అస – వ్రాయసము, ఇమి – బలిమి, ఇస – దోకిస, ట – నింట, నిట్ట, దల – కూడుదల, ది – విడియు – విడిది, పిడి – దోపిడి, వ – తెగువ, వు – తెలివు, వర – కలవరము, సు – సుగసు, ప – కడప, ఉ – చెప్పు.

పై దానిలో 'ఇమి' వర్ణకం బా.వ్యా.లో చెప్పబడింది. బహుశ: సూరి గణాంతంలో 'ఇత్యాదులు' అని వ్రాయకపోవటం ఈ సూత్రరచనకు ప్రేరకమై ఉంటుంది. శ్రీ వేంకట రమణశాస్త్రి గారు సూరి చెప్పిన గణాలలో చేర్పదగిన పదాలను రమణీయంలో వ్రాసి ఉంచారు. ఇందులో కలుగ్వాదిగణంలో చేర్చదగినవిగా బలియు, మదియు అనేవి చూపబడ్డాయి. శ్రీ రావు గారు 'బలియు'నకు ప్రత్యేకసూత్రం వ్రాసి 'ముదియును' వదిలిపెట్టారు. బహుశ: వారికి బలియటం మీద ఉన్న ఆసక్తి ముదియటం మీద లేదనుకుంటాను.

'ఉవర్ణకంబు చెప్పులో నగు వానికిని గానంబడియెడి' అనే వీరి సూత్రం కూడా అడుక్వాది గణం ఆకృతిగణమని సంభావింపకపోవటం వలన రూపొందిందనుకుంటాను. రమణీయంలో అడుక్వాదులలో చేర్పదగినవిగా నలువది ధాతువులు చూపబడ్డాయి.

'వ' వర్ణకం వద్ద తగ్గు – తక్కువ అనే దానిని కూడా వీరు సాధించి ఉంటే బాగుండేది. ఒకవిధంగా చెప్పాలంటే ఈ కృత్ప్రక్రియకు అంతమంటూ ఉండదు. భావించిన కొలదీ ధాతుప్రత్యయ విభాగం చేయటానికి అవకాశాలు ఏర్పడవచ్చు. ఆ తాత్పర్యంతోనే శ్రీ రావు గారు కూడా ప్రకరణాంతంలో 'ఇత్యాదులు మహాజన వ్యవహారంబున నెఱుంగునది' అన్నారు.

లాక్షణికులు ఇట్లా కొన్ని చెప్పారు. ఈ మార్గంలో ఊహింపదగినవి మఱికొన్ని కనిపిస్తాయి. వ్యాకర్తలు చెప్పినంత పటిష్ఠంగా ప్రకృతి ప్రత్యయ విభాగాన్ని మనం చూడలేకపోవచ్చు గానీ ధాతుమూలకాలు అనిపించే మఱికొన్ని మనకు కనిపిస్తున్నాయి. పై మూడింటిలోను గతార్థాలు కాని కొన్నింటిని ఇక్కడ పేర్కొంటాను. ఇందులో కొన్ని చాలా కృత్రిమాలుగా తోచవచ్చును. కాని సంస్కృతభాషలోని వ్యుత్పత్తులను, రూఢిపదాలను ఆదర్శంగా పెట్టుకొని అంగీకరింపవచ్చును. నిజానికి వ్యాకర్తలు సంక్షిప్తత నపేక్షించి వీనిని గుఱించి ఎక్కువ పట్టించుకోలేదు కాని సమగ్రత దృష్ట్యా కృదంతాలను తుదిముట్ట పరిశీలించాలి. 1. కను – కన్ను, 2. విను – వీను, విన్ను (శబ్ద గుణక మాకాశమ్) 3. మూర్కొను – ముక్కు, 4. తిను – తిండి, 5. మూయు – మూతి, 6. మను – మన్ను, 7. చెడు – చెడ్డ – చెడిన అనేదాని రూపాంతమైన 'చెడ్డ' అనేది ధాతుజవిశేషణం – దానికి విభక్తి వివక్షించేటప్పుడు త్ఛబ్దమను ప్రయుక్తం కావాలి. కాని 'మంచిచెడ్డలు'

మొదలైనవానిలో ఇది స్వతంత్రంగా కనిపిస్తుంది. 8. తలచు – తల, 9. విరియు– విరి, 10. కలియు – కలుపు – పొలములలో పంటతో కలిసి పెరిగే పనికిరాని మొక్కలు – ఇది మాయ్వాదులలో చేర్చుకంటే ఇత్వాని కుత్వం చెప్పాలి.

ఇలా మఱెన్నో భావించటానికి వీలుంది. తెలుగులో కృత్తద్ధితాలను గూర్చి సమగ్రమైన పరిశోధన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. కృదంత విచారణ వ్యాకరణంలో ఒక ప్రధానమైన అంశం. అర్థావగతికి, భాషాస్వరూపావగతికి, ప్రకృతిప్రత్యయ విశ్లేషణం ద్వారా మనోవికాసానికి, అవసరమైతే నూతనపదాలను సృష్టిచేసుకోవటానికి ఈ విధానం ఎంతో సహకరిస్తుంది.

ఇంక తద్ధితవిషయానికి వద్దాం. సంస్కృతంలో తద్ధితం చాలా పెద్ద ప్రకరణం. అష్టాధ్యాయిలో 4-1-76 వద్ద ప్రారంభమైన తద్ధితాధికారం అయిదవ అధ్యాయం చివర వఱకు వ్యాపించి ఉంది. అంటే సుమారు 1100 సూత్రాలు తద్ధిత ప్రత్యయాలను విధిస్తున్నాయి.

Dictionary of Sanskrit Grammar తద్ధితాన్ని గురించి యిట్లా వ్రాశారు. It is to be noted that the word Taddhita is used by the ancient grammarians in the sense of a word derived from substantiative (pratipadika) by the applications of suffixes like 'Ana', 'ti' etc. which were termed Namakarana, as possibly contrasted with the word Taddhita used by Yaska in II. 5.

పాణిని శబ్దరూపానికి కాక కృత్తువలెనే ప్రత్యయానికి మాత్రమే తద్ధితపదాన్ని వ్యవహరించాడు. కాబట్టి పాణినీయ పరిభాషలో తద్ధితాంతం అని శబ్దరూపాలకు వ్యవహారం. వైయాకరణులు విస్పష్టంగా తద్ధితశబ్దార్థాన్ని వివరింపలేదు గాని మహాసంజ్ఞ కాబట్టి అర్థసంభావన చేయవచ్చు. 'తస్మైహితమ్' అని దీనికి విగ్రహం చెప్పుకుంటే ఒక ప్రాతిపదికను చేరుతున్న ప్రత్యయం దానికి విశేషార్థసమర్పణశక్తిని కలుగజేయటం ద్వారా హితాన్ని చేస్తున్నదనే తాత్పర్యం సిద్ధిస్తుంది. ఈ సందర్భంలో శ్రీ అభయంకర్ గారి క్రింది మాటను పరిశీలింపవచ్చు.

The term taddhita is evidently echoed in the Sutra of tasmai hitam which, although it is not the first Sutra of the taddhita section, may imply that there were possibly long lists of secondary nouns with the senses of secondary suffixes, and taddhita was perhaps, the first sense given there (Dictionary of Sanskrit Grammar p.169).

పాణినీయంలో తద్ధితాలకు సంబంధించిన ప్రధాన ఉపవిభాగాలు పదమూడు ఉన్నాయి. 1. అపత్యార్థకాలు, 2. రక్తాద్యర్థకములు, 3. శైషికములు, 4. ప్రాగ్దీవ్య తీయములు, 5. ప్రాగ్వహతీయములు, 6. ప్రాగ్ఘితీయములు, 7. ఆర్హీయములు, 8. ఠనాదికారస్థములు, 9. భావకర్మార్థకములు, 10. పాంచమికములు, 11. మత్వర్థీయములు, 12. విభక్తిసంజ్ఞకములు, 13. స్వార్థికములు.

సంస్కృతముతో పోల్చిచూస్తే తెలుగు తద్ధితం చాలా చిన్నది. అవాంతర ప్రకరణ విభాగావసరం కూడా పెద్దగా కలగలేదు.

తద్ధితవిభాగ క్రమవికాసాన్ని గూర్చి తెలుసుకోవటానికి తెలుగులో వచ్చిన కొన్ని వ్యాకరణ గ్రంథాలు ఏమి చెప్పాయో చూద్దాం.

ఆంధ్రభాషాభూషణంలో చెప్పిన తద్ధితప్రత్యయాలు.

1. కాడు – నేర్పును తెలుపును – కొనబుకాడు

2. ఈడు – బాస తెలుపును – కన్నడీడు

ఈడు – గుణము తెలుపును – కపటీడు

ఈడు – కులము తెలుపును – సాలీడు

3. ఇండి – లేదనుటను దెలుపును – ముక్కిండి, వెరవిండి

4. ఆడు – అధమకార్యమును దెలుపును – బొంకులాడు

5. అరి – అధమకార్యమును దెలుపును – ముందరి

6. తనము – ధర్మమగుటను దెలుపును – మంచితనము, లోభితనము

7. ఆడు, ఈడు, కత్తె, కాడు కర్తను తెలుపును – ఉదాహరణములు చూపలేదు.

8. బోడి – ఆడు పేళ్లకు జెల్లును – ఉదాహరణములు చూపలేదు.

కేతన చెప్పిన తద్ధిత ప్రత్యయాలు తక్కువే అయినా అతడు చెప్పిన అర్థాలు మాత్రం విలక్షణంగా ఉన్నాయి. నేర్పును దెలుపుట, అధమకార్యములను దెలుపుట మున్నగు విధంగా తక్కినవారెవ్వరూ చెప్పలేదు. 'బోడి' అనేది తక్కిన వ్యాకర్తలు స్వతంత్రశబ్దంగా భావింపగా ఇతడు ప్రత్యయంగా భావంచినట్లు సాహచర్యాన్ని బట్టి, ఊహించవలసివస్తున్నది. బోడిని ప్రత్యయ మనటమే సముచితం. కృత్‌తద్ధితశబ్దాలను కేతన వాడలేదు.

విన్నకోట పెద్దన తన కావ్యాలంకారచూడామణిలో తద్ధితప్రకరణమని ఒక విభాగం చేశాడు. అరి, ఇడి, కాడు, ఆడు, అఱ అనే అయిదు ప్రత్యయాలు చూపాడు. కాని అర్థవివరణ జోలికిపోలేదు. పై వానిలో నాలుగు కేతన చెప్పినవే. 'అఱ' అనేది యీతడు స్వయంగా చెప్పిన ప్రత్యయం. కాని కేతన చెప్పిన కత్తె, తనము, ఇండి, బోడి అనే వానిని ఈతడు ప్రస్తావించలేదు. తద్ధితానికి గల వైశిష్ట్యాన్ని ఈతడిట్లా వక్కాణించాడు.

అరి యిడి కాడా డఱ యవ
ధరలో నొక కొన్ని చెల్లు తద్ధితపదముల్
పరువడి వానినెఱుంగుట
పరమపరిజ్ఞాన మంధ్రభాషాకవితన్

కా. చూ. 9–142

విశేష ప్రయత్నం అవసరమని చెపుతూనే వివరించే ప్రయత్నం నుండి విరమించాడు.

ఆంధ్రశబ్దచింతామణిలోతద్ధిత విషయాలుగా భావింపదగినవి రెండు సూత్రాలు మాత్రమే.

1. త్వార్థే తనశ్చ వికృతౌ స్యాత్. హలన్త. 28.

2. వామ్పు: కవర్ణక: స్యాత్సుర్థే స్యాదుత్వమపి పరేతస్మిన్. హలంత. 29

చింతామణికి శేషగ్రంథప్రాయమైన అథర్వణ కారికావళిలో తద్ధితాలకు సంబంధించిన మూడు కారికలు కలవు.

కాదుర్గాదు ర్ఛవేదీడు రస్తీత్యాద్యర్థబోధకా:
ఏకత్వవాచకాత్పుంసి స్యాదాడు స్త్వన్యథా మత:
స్త్రియా మాడిర్బహుత్వే స్యా త్పుంసి దీర్ఘాన్నిరుచ్యతే
ఉతో లోపశ్చలులయో స్తయో: పుంసి రురౌ మతౌ
అన్యే చ బహవో దేశ్యవర్ణకా అర్థభేదకా:
క్వచిదంత్యస్య లోపస్స్యాత్త్వ చి ద్వర్ణాగమో మత: (అజంత. 50, 51, 52)

ఈ కారికలలో కాడు, గాడు, ఈడు, ఆడు, ఆడి, అనే మతుబర్థక ప్రత్యయాలుమాత్రమే చెప్పబడ్డాయి. 'అన్యేచబహవ:' ఇత్యాది పాదంలో కృత్తులను కలుపుకొని తక్కినవన్నీ సంగ్రహింపబడ్డాయి.

సంస్కృతవ్యాకరణ సంప్రదాయాలను చక్కగా అనుశీలించి, ఆ ఒరవడిలో తెలుగు వ్యాకరణాన్ని తీర్చిదిద్దటానికి యత్నించిన ప్రాచీన వైయాకరణులు కృత్తద్ధితములమీద సమగ్రమైన దృష్టి పెట్టకపోవటానికి హేతువేమో తెలియదు. పెట్టకపోవటం మాత్రం లోపమే అనిపిస్తుంది.

చిన్నయ ఈ విషయంలోనూ గట్టి కృషియే చేశాడు. తన, తిక, ఇమి, స, ఇక మొదలైన భావార్థక ప్రత్యయాలు, ఇక, ఉక, కొన్ని యెడల కా, కత్తియ అనే స్వార్థిక ప్రత్యయాలు కాకత్తియ, ఆ, అరి, ఇ, త,ఆడి, ఆ, ఇడి, అ, అము అనే మతుబర్థక ప్రత్యయాలు, మానార్థకమైన 'ఎదు' వర్ణకం, దప్యర్థకములైన బంటి కొలదులు, మారి, పోతు అనే తాచ్ఛీల్యార్థక ప్రత్యయాలు ఈతని పరిగణకు వచ్చాయి. ఈ ప్రత్యయాలలో అర్థభేదాలు, వచనవిశేషాలు, ఉత్సర్గాసవాదాలకు సంబంధించిన విశేషాంశాలు సూరి పటిష్ఠంగా చెప్పాడు. అన్నింటికంటె గణనిర్మాణం చాలా కష్టమైనది. దానిని కూడా సమర్థంగా నిర్వహించాడు. ఇంతటితో అయిపోయిందనుకోరాదని సూచిస్తూ 'ఇత్యాదులూహ్యంబులు' అనిప్రకరణాన్ని ముగించాడు.

ప్రౌ. వ్యా. కర్త యే యితర వ్యాకర్తా చేయనపని, తద్ధితశబ్ద నిర్వచనం చేశాడు. 'తద్ధితములనగా విశేష్యవిశేషణములగు శబ్దములమీద భావాద్యర్థములయందు రాదగిన ప్రత్యయవిశేషములని యర్థము' ఈతడు చెప్పిన ప్రత్యయాలు అ – చెదుగడు,అద – వేఁడడము, అడి – వెల్లడి, ఇడి – తెలివిడి, ఇద – ఒప్పిదము, ఇరి – వాపిరి, కర – నాయకరము, కార – చెలికారము, మిరి – చలిమిరి, – టి – ఒంటి, మయట్ – తనమయము.

వీనిలో వెల్లకు అడి అనటంకంటె 'డి' మాత్రమే ప్రత్యయమంటే ప్రక్రియలో సౌలభ్యమేర్పడుంది.

ప్రౌ.వ్యా.కర్త బా. వ్యా. లో చెప్పిన కొన్ని ప్రత్యయాలకు సంబంధించిన కొన్ని కార్యవిశేషాలు కూడా చెప్పాడు. పదముల దువర్ణకాదులకు లోపం, తచ్ఛబ్దార్థలోపం, పూజసొన్నముల తుది యచ్చునకుదీర్ఘం, చెంచున కివర్ణాదేశం.

ముక్తలక్షణకౌముది కూడా తద్ధిత ప్రక్రియను సుదీర్ఘంగానే వివరించింది. ముప్పైమూడు సూత్రాల ప్రకరణమిది. ఇందు చెప్పిన ప్రత్యయాలు. 1. అట – త్రిప్పట, 2. అద – వఱద, 3. అర – బ్రద్దర, 4. అల – తావలము, 5. అలి – ప్రబ్బలి, 6. అస – కంటసము, 7. ఇగ – బుడ్డిగ, 8. ఇడి – ఒత్తిడి, 9. ప్రక్క – పుక్కిలి, 10. స – అంటిస, 11. ఉ – ఇరుసు, 12. ఉడి – ఏడుడి, 13. ఉవ – చలువ, 14. ఉవు – గడువు, 15. కట్టె – పెడసర కట్టె 16. కడ – అఱకడము, 17. కాయ – తలకాయ, 18. కిలి – కమికిలి, 19. గడ – వెలిగడ, 20. ట – రివట, 21. దల – పట్టుదల, 22. ప – బడప, 13 23.పల – వెలుపల, 24. పిరి – వలిపిరి, 25. వలి – వలిమిరి, 26. వు – ఎడవు, 26. సు – పొలసు, 27. ఎడు – కదుపెడు.

ఇవికాక తెలుగు ప్రత్యయాలైన కా, కత్తియ, ఇమి అనేవి సంస్కృతశబ్దాలకు చేరటం, సంస్కృతప్రత్యయమైన 'తర' అనేది తెలుగుశబ్దాలకు చేరటం మొదలైన విశేషాలు ఈ పరిచ్ఛేదంలో చెప్పబడ్డాయి.

ఇందులో ఒకటి రెండు విశేషాలు. కట్టెకాయలు ప్రత్యయాలుగా భావించటం కంటె నుడికారపు విశేషాలుగా అనుకోవటం బాగు. కట్టెలాగా లొంగకుండా ఉండే వ్యక్తిని 'పెడసర కట్టె' అని వ్యవహరిస్తారు. అలాగే తలకాయ, మెడకాయ ఇత్యాదులలో కాయ వంటిది కాయ అనే అర్థమే సంభావ్యం. ఇంక మొట్టికాయ, జెల్లకాయ మొదలైన వానిలో మఱికొంచెం కష్టపడాలి. 'కాయ' ప్రత్యయమంటే 'విభూతిపండు'లో పండుకూడా ప్రత్యయమే అనాలి. ఆవకాయ మాగాయ మొదలైన వానిలోనూ ఆలోచించవలసి ఉంటుంది.

కృదంతాలవలెనే తద్ధితాంతాలను గూడ వ్యాకరణకర్తలు తుదిముట్టచెప్పలేదు. చెప్పటం సాధ్యము కాదు. కాబట్టి తద్ధితాంతాలుగా భావింపదగిన మఱికొన్నింటిని గమనిద్దాం.

1. బాట+సారి – బాటసారి – 'చారి', 'సారి' అనే సంస్కృత కృదంతరూపం అనుకోకపోతే దీనిని తెలుగు తద్ధితప్రత్యయంగా భావించాలి.

2. పసి+అర – పసరము

3. పిన్న+ఇ–పిన్ని

4. చిన్న+ఇ – చిన్ని

5. రేపు+ఆడి – రేపాడి శ.ర. ఇందలి 'ఆడి' ఏడాదిలోని 'ఆది' వంటిదనెను.

6. పాడి+ఉము – పాడుము

7. చెవి+ఉడు – చెవుడు. 'ముక్కిడి' వలె చెవి+ఇడి – చెవిడి అను క్రమముగా 'చెవిటి' 'చెవుడు' అయి యుండునా? అని యొక ఉహ. బింద్వభావమును ఈ ఊహను బలపఱచుటలేదు.

8. విత్తు+అన – విత్తనము

9. చెలువు+ఆ – చెలువ శ.ర.

10. ప్రాపు+ఆక – ప్రాపకము

11. చప్పుడు – చప్పట మొదలగునవి.

స్థాలీపులాక న్యాయంగా మాత్రమే యీ తద్ధితాంతాలు చూపబడ్డాయి. అర్థవిశేషాలు మున్నగు వానికై విశేషకృషి జరగవలసివుంది.

ఈ విధంగా నిఘంటువులను దగ్గఱపెట్టుకొని పరీక్షిస్తూ పోతే మరెన్నో కృత్తద్ధిత విశేషాలు బయటపడవచ్చు. ఈ పరీక్ష వలన వ్యుత్పత్త్యర్థ సంభావనకు ఎక్కువ ఆస్కారం లభిస్తుంది. కృత్తులాగానే తద్ధితం కూడా మంచి పరిశోధనారంగంలో చాలా విశేషఫలదాయకమవుతుందని ఆశిస్తూ, తెలుగు వైయాకరణుల భాషాశాస్త్రజ్ఞుల సంవాద సదస్సులో పాల్గొనటానికి తద్వారా నా అభిప్రాయాలను ఇతరులకు పంచిపెట్టటానికి, ఇతరుల అభిప్రాయాలను సవిమర్శకంగా ఆకళింపుచేసుకోవటానికి అవకాశం కల్పించిన పూజ్య శ్రీ ఆచార్య జి.యన్.రెడ్డి గారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలర్పిస్తూ విరమిస్తాను.

(శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం – తెలుగుశాఖ నిర్వహించిన తెలుగు వైయాకరణుల – భాషా శాస్త్రజ్ఞుల సదస్సు నిర్వాహకుల సౌజన్యంతో – 1970)

తెలుగులో రచన చేసిన తొలి పాశ్చాత్యుడు – రాబర్ట్ డి నోబిలీ

– డా.పి.ఎస్.గోపాలకృష్ణ

పాశ్చాత్యులలో తెలుగు నేర్చుకున్నవారు ఎందరో కనిపిస్తారు. కాని వారిలో మొట్టమొదటి తెలుగు నేర్చిన వారెవరు అనే ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టం. అయితే దొరుకుతున్న ఆధారాలనుబట్టి తెలుగులో రచన చేసిన తొలి పాశ్చాత్యుడు రాబర్ట్ డి నోబిలీ (ROBERT DE NOBILI). ఈ పేరును రాబర్టో డి నోబిలీ (ROBERTO DE NOBILI) అనీ వ్యవహరించేవారు.

డి నోబిలీ క్రైస్తవ మత బోధకుడుగా భారతదేశానికి వచ్చాడు. ఆయన మాతృభాష ఇటాలియన్. 1577 సెప్టెంబర్‌లో టస్కనీలోని మాంట్‌పుల్సియానో (కొందరి అభిప్రాయం ప్రకారం రోమ్ లో) జన్మించిన నోబిలీ మూడవ జూలియస్, పదమూడవ గ్రెగరీ అనేఇద్దరు పోప్‌లకు చుట్టం. నోబిలీ తండ్రి పియెర్ ఫ్రాన్ సెస్కో – పోప్ సైన్యంలో అధికారి (జనరల్). నోబిలీ తల్లిదండ్రులకు తొలి సంతానం. ఇరవై ఏళ్లప్రాయంలో నోబిలీ క్రైస్తవ మతప్రచారకుడు కావాలని నిర్ణయించుకున్నాడు. అట్లా 1597లో కేపుల్స్‌లోని జీసస్ సంఘం (Society of Jesus) లో సభ్యుడయ్యాడు. 1603లో పోర్చుగల్ నుండి భారతదేశానికి ప్రయాణమయ్యాడు. పద్నాలుగు నెలల ఓడ ప్రయాణం తర్వాత గోవా చేరుకున్నాడు. 1606 ప్రారంభంలో కొచ్చి వెళ్లి అక్కడి నుంచి తమిళనాడులోని తూత్తుక్కుడి ప్రాంతాలకు చేరుకొన్నాడు. ఆ ప్రాంతాలలో ఆరేడు నెలలు ఉన్న తర్వాత 1606 నవంబర్ 15 నాడు మధురై చేరాడు. ఒక ఏడాది గడిచేటప్పటికి తన వేషభాషలూ పేరు మార్చుకొన్నాడు.

భారతీయ సన్యాసులలాగా కాషాయం ధరించాడు. ఒక దండమూ కమండలమూ తనతో పెట్టుకొనేవాడు. మాంసాన్నీ మద్యాన్నీ త్యజించాడు. తన పేరు 'తత్త్వబోధక స్వామి' అని చెప్పుకోసాగాడు. ప్రతి నిత్యమూ సాయంకాలం నాలుగు గంటలప్పుడు ఒంటిపూట భోజనం చేసేవాడు. ఈ ఏకభుక్తాలతో ఆరోగ్యం పాడయితే – 1645లో విశ్రాంతి తీసుకోవడానికి శ్రీలంక వెళ్ళి అక్కడ యాళ్ పాణం (జాఫ్నా)లో నివసించాడు.

విశ్వనాథ సత్యనారాయణ గారి 'ఏకవీర' నవలలో నోబిలీ ప్రస్తావనా, ఏకవీర వాదంలో నోబిలీని ఓడించిన సంఘటనా ఉన్నాయి. "రాబర్టు డి నోబిలీయను నొక పోర్చుగీసు క్రైస్తవ మత వ్యాపకుడు సన్యాసి వేషము వేసికొని తత్త్వబోధక స్వామియని పేరు పెట్టుకొని పరిబోధితులు కాని సామాన్యులను మతాంతరుల చేయుచున్నాడు" అని 'ఏకవీర' నవలలో నోబిలీ పాత్రను పరిచయం చేస్తారు విశ్వనాథ.[1]

జాఫ్నానుంచి నోబిలీ 1648 మద్రాసు మైలాపూరు చేరాడు. అప్పటికే నోబిలీ దృష్టి మందగించింది. కళ్లు కనబడని ఆ స్థితిలోనూ తన రచనలను పునస్సమీక్షించి మార్పులూ చేర్పులూ సూచించాడు. 1656 జనవరి 16 నాడు మైలాపూరులో మరణించాడు.

నోబిలీ నేర్చిన భాషలు ఎన్నో. తన మాతృభాష కాని పోర్చుగీస్, లాటిన్ భాషలలోనూ తమిళం, తెలుగు, సంస్కృత భాషలలోనూ ప్రావీణ్యం గడించాడు. ఇంగ్లీషుతో కలిపి ఆరు భాషలలోనూ నోబిలీ రచనలున్నాయి. నోబిలీ రచనలన్నీ కాకపోయినా ఆయన రాసిన తమిళ రచనలు ఎన్నో దొరికాయి.

నోబిలీ మధురైలో మొదట తమిళం నేర్చుకొన్నాడు. కొన్నాళ్ల తరువాత తెలుగు, సంస్కృతం నేర్చుకోవలసిన అవసరాన్ని గుర్తించాడు. మధురై పాలకులయిన నాయక రాజులది తెలుగు భాష. ఇక పండితులతో సంపర్కానికి సంస్కృతంలో పరిచయం అవసరం. నోబిలీకి శివధర్ముడనే తెలుగు బ్రాహ్మణుడు తెలుగు, సంస్కృతమూ బోధించాడు. నోబిలీ శివధర్ముడికి క్రైస్తవ మతంబోధించాడు.

సంస్కృత పండితుల దృష్టిని ఆకర్షించడానికి నోబిలీ క్రైస్తవ సిద్ధాంతాలను సంస్కృతంలో రూపొందించాడనే వాదం ఒకటుంది. అట్లా 'ఎజుర్ వేదం' పేర ఫ్రెంచ్ భాషలోకి వచ్చిన సంస్కృత రచనకు నోబిలీ కర్త అని మద్రాసు పౌరసేవలోఅధికారి అయిన ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్ (Francis Whyte Ellis)[2] రాశారు. ఎల్లిస్ రచన ఆయన మరణానంతరం 1822లో ఏషియాటిక్ జర్నల్ (సంపుటం XIV)లో వెలువడింది.

అయితే కొందరు ఎల్లిస్ అభిప్రాయంతో ఏకీభవించక – 'ఎజుర్‌వేదం' మరెవరో సృష్టించిందై ఉండవచ్చునన్నారు. ఈ పని చేసిన వారు వీరే కావచ్చునని కొందరి పేర్లూ సూచించారు.

నోబిలీ తమిళ రచనలు ఇరవై అనీ వాటిలో పదిహేను ఆయన రచనలని రూఢిగా చెప్పవచ్చునీ వాటిలో ఎనిమిది లభించలేదనీ ఆయన కృషి గురించి విశేష పరిశ్రమ చేసిన ఎస్.రాజమాణిక్కం గారు పేర్కొన్నారు. నోబిలీ సహచరుడయిన ఫాదర్ ఆంటనీ ప్రీన్ కా (Fr. Antony Preenca) నోబిలీ మరణించిన 1656లో రాసిన వార్షిక నివేదికలో నోబిలీ తమిళ రచనలను ప్రస్తావించాడు. ప్రీన్‌కాకు తెలుగు, సంస్కృతం రాకపోవడంతో తన ప్రస్తావనలో "నోబిలీ తన తమిళ రచనలు ఎన్నిటినో తెలుగులోకి అనువదించాడు. అవి తెలుగు వారికి సాయపడడంతో పాటు ఆ భాష నేర్చుకోవాలనుకొనే మావంటి వారికీ తోడ్పడగలవు" అన్నాడు. నోబిలీ తెలుగు రచన 'పునర్జన్మ ఆక్షేపం' తాళపత్ర ప్రతి పారిస్‌లోని జాతీయగ్రంథాలయంలోఉందని రాజమాణిక్కం గారు పేర్కొన్నారు.

నోబిలీకి తెలుగులో ఉన్న ప్రవేశం గురించి మరికొన్ని సూచనలు కూడా దొరుకుతున్నాయి. తిరుమల నాయకుడికొడుకు పన్నెండు పద్నాలుగేళ్ళ బాలుడు. నోబిలీని కలుసుకొని క్రైస్తవంగురించి అడుగుతుంటే నోబిలీ ఆ బాలుడికి తమిళంలోనూ తెలుగులోనూ రాసి ఉన్న కొన్ని తాళపత్రాలను

ఇచ్చాడట. వాటిలో క్రైస్తవ సిద్ధాంతాన్ని ప్రశ్నోత్తరాల రూపంలో వివరించారట. ఆ పత్రాలను రాజభవనంలో వారూ ఆ బాలుడూ శ్రద్ధగా చదివించుకొని విన్నారట. ఈ సంఘటన 1639 నాటిది. అంటే అప్పటికే నోబిలీ తెలుగులో రచనలు చేయగలిగాడనవచ్చు.

నోబిలీ భారతీయ సన్యాసి వేషం వేసుకోవడం, ఆయన అనుసరిస్తున్న పద్ధతులూ క్రైస్తవ మత విధానాలకు పొసగనివన్న అభిప్రాయాలు చెలరేగాయి. ఆ సందర్భంలో రాసిన ఒక లేఖలో నోబిలీ తన భాషాపరిజ్ఞానం గురించి పేర్కొన్నాడు. అట్లాగే నోబిలీ 1644లో రాసిన లేఖలో నోబిలీతో కలిసి అతని సహచరుడు డ కోస్టా తిరుమల నాయకుడిని చూడడానికి వెళ్లిన ముచ్చట చెప్పాడు.

తమ సంగీత వాద్యాలను చూసి తిరుమల నాయకుడు సంతోషించినట్టు అనిపించిందనీ తిరుమల నాయకుడిముందు నోబిలీ తెలుగులోనూ, తమిళంలోనూ సంస్కృతంలోనూ సంభాషించాడనీ రాశాడు డకోస్టా.

రాజమాణిక్కం గారి అభిప్రాయం ప్రకారం నోబిలీ ఆధునిక తమిళ రచనకు ఆద్యుడు. ఆయన అభిప్రాయం ప్రకారం నోబిలీ తెలుగులోనూ వచన రచన చేసి ఉండాలి.

అయితే నోబిలీ తెలుగు రచనలను కానీ, పారిస్‌లో ఉన్న 'పునర్జన్మ ఆక్షేపం' ప్రతిని కానీ ఎవరయినా తెలుగు వారు చూసిందీ లేనిదీ తెలియదు.

అందువల్ల తెలుగులో రచన చేసిన తొలి పాశ్చాత్యుడు నోబిలీ అని మాత్రం చెప్పుకోవచ్చు.

ఎస్.రాజమాణిక్కం గారు చాలా ఏళ్ల క్రితం చెప్పిన సమాచారం ఈ రచనకు కొంత ఆధారం.

పాదసూచికలు:

1. 'ఏకవీర' నవల పద్నాలుగవ ముద్రణ, 1992, పుట. 81
2. ఈ ఎల్లిస్ 1816లో వెలువడిన కేంబెల్ తెలుగు వ్యాకరణం పీఠికకు విస్తృతమైన సూచన రాశాడు. అందులో ద్రావిడ భాషలు అని పేర్కొనకున్నా తెలుగు, తమిళ, కన్నడ భాషలు సంస్కృతం నుంచి భిన్నమైనవన్నాడు. ఎల్లిస్‌కు ఈ అభిప్రాయం కలగడానికి వేదం పట్టాభిరామశాస్త్రి 'ఆంధ్రధాతు పాఠము' సాయపడింది.

కాళ్ళకూరివారి సంస్కరణోద్యమ నాటకాలు

– ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు

మన ప్రాచీన భారతంలోని మంచిని గ్రహించి, సమాజగమనానికి నిరోధంగా కనిపిస్తున్న చెడును సంస్కరించుకొంటూ, ఆంగ్ల భాషా సంస్కృతుల ప్రభావంతో అవసరమైన నవీకరణ చెందుతూ, కొత్తపాతల మేలుకలయికతో నవభారత నిర్మాణం చెయ్యాలని రాజారామమోహ్‌రాయ్ బ్రహ్మ సమాజాన్ని స్థాపించాడు. రాయ్‌కి అండగా ద్వారకానాథ్ ఠాకూరు, దేవేంద్రనాథ్ ఠాకూరులు వరుసగా నిలిచారు. బ్రహ్మసమాజం మరీ ఆధ్యాత్మికంగా హిందూ సనాతనత్వంతో అంటకాగటం నచ్చని కేశవచంద్రసేన్ 1866లో ప్రతాపచంద్ర మజుందార్‌తోకలిసి బ్రహ్మసమాజాన్ని భారత బ్రహ్మసమాజంగా మార్చాడు. తెలుగునాడు వరకు ప్రవహించింది ఈ బ్రహ్మ సమాజమే. తొలినాటి బ్రహ్మ సమాజం ప్రత్యేకంగా అలాగే ఉంది.

కేశవచంద్రసేనుడు క్రైస్తవభావాల పట్ల ఆసక్తిని చూపటం, ఆ ధోరణిలోనే బ్రహ్మసమాజాన్ని ప్రచారం చేయటం నచ్చక హిందూ సనాతన ధర్మవాదాన్ని దాని వైశిష్ట్యాన్ని చెప్పాలనే ఉద్దేశంతో 1875లో దయానందుడు ఆర్యసమాజాన్ని స్థాపించాడు. ఇది బ్రాహ్మణేతర వర్గాలలో బాగా నిలదొక్కుకోగలిగింది గాని బ్రాహ్మణ వర్గాల్ని పెద్దగా ఆకర్షించలేక పోయింది. రాజారామమోహన్‌రాయ్, సతీసహగమన ఉద్యమాన్ని సంఘసంస్కరణ ఉద్యమానికి పర్యాయపదంగా చేసి, స్త్రీల జీవితంలో వెలుగులు నింపటానికి అనేక విధాలుగా కృషి చేశాడు. రామమోహన్ రాయ్ కృషిని అవిచ్ఛిన్నంగా కొనసాగించినవాడు ఈశ్వర చంద్ర విద్యాసాగర్. మన వీరేశలింగంగారికి ప్రేరకశక్తి ఈ విద్యాసాగరే. కేశవ చంద్రసేన్ మతభావాల సంస్కరణ దృష్టితో పునర్నిర్మాణకృషి చేశాడు. బ్రహ్మసమాజం – ఆర్యసమాజం – రామకృష్ణ వివేకానందులు – దివ్యజ్ఞానసమాజం – వీరందరి ప్రయత్నాల ఫలితమే భారత జాతీయ పునరుజ్జీవనం – సంఘ సంస్కరణోద్యమం. వీటి ప్రతిధ్వనులు తెలుగునాట వినిపించని ఫలితంగానే నూతన సాహిత్యోద్యమ ఫలితాలు రావటం ప్రారంభమయ్యాయి.

1868లో వీరేశలింగంగారికి బ్రహ్మసమాజంతో పరిచయం ఏర్పడింది. తన సాంఘిక సంస్కరణోద్యమానికి బ్రహ్మసమాజంవారి ఆచరణ విధానం అనుకూలంగా కనిపించటంతో కందుకూరి బ్రహ్మసమాజాన్ని స్వీకరించారు. ఆంగ్లవిద్య, మతసంస్కరణ భావాలు, వీరేశలింగంగారి ప్రచార ప్రబోధాలు, సాంఘిక సంస్కరణోద్యమ కార్యకలాపాలు – వీటి ప్రభావంతో మూఢాచారాల మౌఢ్యత క్రమంగా తెలుగునాట సడలిపోసాగింది. వీరేశలింగంగారు ప్రారంభించిన పునరుజ్జీవనోద్యమనండి – సంస్కరణోద్యమమనండి, ఆనాటి సమకాలీనులు చాలామందిని ప్రభావితం చేసింది.

వీరేశలింగంగారి బ్రహ్మసమాజ ధార్మిక ప్రభావం కంటే సంఘసంస్కరణోద్యమ ప్రభావమే ఎక్కువమందిని ఆకర్షించింది. రామమోహన్‌రాయ్‌ని, ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌ని రెండు కళ్లుగా చేసుకొని భాషాసాహిత్య వైజ్ఞానిక రంగాలతోపాటు, మత సాంఘిక సంస్కరణ విషయాలతో ఉద్యమించిన వీరేశలింగం ఆధునికతకు తెలుగు సాహిత్యంలో తొలి సరిహద్దయినాడు.

క్రీ.శ. 1900 నుండి 1933 వరకు వందేమాతరం – ఆంధ్రోద్యమం – సంస్కరణోద్యమం – భావకవిత్వం – బ్రాహ్మణేతరోద్యమం – రాయలసీమ సమస్య – వామపక్ష భావజాల ప్రసారం – ఆర్. ఎస్. ఎస్. కార్యకలాపాలు – చలంగారి స్త్రీ జనాభ్యుదయం వీటన్నింటినీ తన కడుపులో ఇముడ్చుకున్న జాతీయోద్యమం – వీటితో మన భాషా సాహిత్యాలు నవనవోన్మేషమయ్యాయి. ఈ నేపథ్యంలో నుండి కాళ్ళకూరి వారిని మనం చూడాలి.

కాళ్ళకూరివారి సంస్కరణ హృదయానికి జాతీయతా భావాలకు మధుసేవ నాటకంలోని అవతారికలో పేర్కొన్న మాటల్ని గమనిస్తే తెలుస్తుంది. “మన దేశమునకిప్పుడు మద్యపానము మహత్తర శత్రువైయున్నది. ఈ దుర్వ్యసనమునకు లోనైన వారీ దేశమున నిప్పుడు రెండుకోట్లయిన నుండక పోరు. బ్రాంది, విస్కీల వారి యెక్కుడు వ్యయమును, కల్లుసారాల వారి తక్కువ వ్యయమును గలిపి, తలకు దినమునకెనిమిది యణాల వంతునఁ జూచినను రెండుకోట్ల మీదను, దినమునకుఁగోటి రూప్యములు దగ్ధమగుచున్నట్లు తేలుచున్నది. అనగా, సంవత్సరమునకు మూడు వందల యఱువదియైదు కోట్లన్నమాట. అనగా మన దేశముపై దొరతనము వారికి వచ్చునాదాయముకంటె రెండు రెట్లధికమన్నమాట. ఈ దుర్వ్యసనము హరించి, ఈ సొమ్ము మిగిలినచో మనదేశము మహైశ్వర్యముతోఁదులఁదూఁగదా! ఇప్పటి నేరములు ఇప్పటి హత్యలు ఇప్పటి కోర్టులు ఇట్టే రూపు మాయవా! ఇంతకన్న స్వరాజ్యమిఁకనేమున్నది. కాబట్టి, ఈ ప్రబల శత్రువును భస్మీకరించుటకై ప్రయత్నింపవలసిన బాధ్యత ప్రతి భారతీయునియందును గలదు. ఈ రూపముగా నా బాధ్యతను నిర్వర్తించుకొను తలంపుతో నేనీ రూపకమును వ్రాసినాడను.” – ఇది కాళ్ళకూరివారి బాధ్యతాహృదయం.

సాంఘిక సంస్కరణోద్యమంలో భాగంగా జరిగిన సాహిత్యసృష్టిలో నాటకాల పాత్ర ప్రభావ వంతమైంది. కాళ్ళకూరివారు సాంఘిక సమస్యలపై ఎక్కుపెట్టిన నాటకాస్త్రాలు చింతామణి, వరవిక్రయం, మధుసేవ. సమాజంలో అర్థకామాలకున్న ప్రాధాన్యత తెలియంది కాదు. వాటి వెర్రివేషాలు, వైపరీత్యాలే వరకట్న, వేశ్యాలంపటత్వాలు. కామాన్ని అనుసరించి పుట్టుకొచ్చిన మరో సమస్యే మధుసేవనం. ఈ మూడు సమస్యలపై రాసిన మూడు నాటకాలు బహుళ ప్రచారాన్ని పొందాయి.

నారాయణరావుగారు పౌరాణిక రూపకాల్ని నాటకాలని, సాంఘిక రూపకాల్ని ప్రకరణాలని పేర్కొన్నాడు. ఈ ప్రకరణాలలో పది అంకాలున్నాయి. ఒక్కొక్క అంకం సాధారణంగా ఒక రంగమే. కొన్ని అంకాలలో రెండు మూడు రంగాలు కూడా ఉన్నాయి. తాను సాంఘిక సంస్కరణోద్యమంతో

ప్రేరితుడై, ఆ ప్రేరణతో వ్రాసిన నాటకాలే ఈ మూడు. కులబహిష్కరణను సైతం లెక్కచేయకుండా, బ్రహ్మసమాజం పట్ల గల గౌరవంతో, ఆ పద్ధతిలోనే కళావంతుల కుటుంబానికి చెందిన యువతిని పరిణయం చేసుకున్న సంస్కరణవాది నారాయణరావుగారు. అనులోమ, విలోమ వివాహాలు ఈనాడు పెద్దగా పరిగణించేకాలం కాదు కాని 1890 ప్రాంతంలో సంప్రదాయ కుటుంబాలలో ఎంతటి సంచలనవార్త అది. ఎంత ధైర్యం, పట్టుదల కావాలి? రఘుపతి వెంకటరత్నంనాయుడుగారి స్నేహ ప్రభావం కూడ దీనికి కారణం. ప్రకాశంపంతులుగారితో కలిసి నాటకాలు వేయటం, (దమయంతి – ప్రకాశం; నలుడు – కాళ్ళకూరి), నాటక సమాజాన్ని నడపటం, దర్శకత్వం వహించటం ఇవన్నీ నారాయణరావుగారిని నాటక రచనలో నిష్ణాతుడిని చేశాయి.

నారాయణరావుగారు చాలాకాలం కృష్ణకర్ణామృతంలోని శ్లోకాలకు అభినయ శిక్షణ ఇచ్చారు. తత్ఫలితంగా లీలాశుకుని చరిత్ర వారి హృదయంలో బాగా ముద్రితమైంది. దీనికి తోడు వేశ్యా లంపటత్వంలో ధ్వంసమైపోతున్న జీవితాలను గమనించి సమాజాన్ని సంస్కరించాలన్న ఉద్దేశంతో వేశ్యాజీవితాన్ని ఖండిస్తూ చింతామణి నాటకాన్ని రచించారు. రాయప్రోలు సుబ్బారావుగారి ‘స్నేహలత’ కావ్యానికి ప్రేరణ కలిగించిన పత్రికా వార్తే నారాయణరావుగారి వరవిక్రయంలోనూ చోటుచేసుకుంది. కన్యాశుల్కం నుండి క్రమంగా వరవిక్రయం వైపు ప్రయాణిస్తున్న సమాజాన్ని గమనించి దాని విశ్వరూపాన్ని ముందుగానే ఊహించి రచించిన నాటకం వరవిక్రయం. గాంధీగారి అసహాయోద్యమాన్ని, మద్యపాననిషేధ ఉద్యమాన్ని చూసి ప్రభావితమవటమే కాకుండా ఎంతోమంది సంస్థానాధీశులు మద్యపానం వలన అంతమైపోవటాన్ని గమనించి మధుసేవ నాటకాన్ని రచించారు. పోలవరం జమీందారు రాజాకొచ్చర్ల కోట వేంకటకృష్ణారావుగారు విద్యావంతుడై వుండి కూడా మద్యపానానికి బానిసై ఆస్తిని ధ్వంసం చేసుకొని ఇక్కట్ల పాలయ్యాడు. మధుసేవ నాటకంలోని రఘునాథరావు ఈ కొచ్చర్లకోట వేంకటకృష్ణారావుగారే. మధుసేవ నాటకంలోని రంగడి పాత్రగా, విజయవాడ సత్యనారాయణపురం స్టేషన్ దగ్గర వున్న హరనాథ బాబాగుడి దగ్గర వున్న శేషమ్మ అనే భక్తురాలి భర్త జీవితానికి దర్పణం. వరవిక్రయం నాటకంలోని సింగరాజు లింగరాజు పాత్రని సింగరాజు మల్లపురాజు అనే వ్యక్తిని దృష్టిలో పెట్టుకొని రాసింది. ఆంధ్ర గ్రంథాలయ ప్రెస్‌లో చింతామణి నాటకాన్ని అచ్చువేసుకోవటానికి నారాయణరావుగారు అన్ని ఏర్పాట్లు చేసుకుంటే, ఆ ప్రెస్సు యజమానియైన అయ్యంకి వెంకటరమణయ్యగారికి ఏవో నేరాలు చెప్పి ఆ పుస్తకం ముద్రణకు అంతరాయాన్ని కల్పించారు. ఆ కోపాన్ని ఈ రూపంలో నారాయణరావుగారు తీర్చుకున్నాడు. వరవిక్రయంలోని వెర్రి బుర్రల వెంగళప్ప పాత్ర కూడా అటువంటిదే. అప్పటి తాలూకా బోర్ట్ ప్రెసిడెంట్‌గా వున్న గంటి వెంకట్రావు ఉపాధ్యాయుల్ని ఇబ్బందిపెడుతూ ప్రతిదానికి ‘పిడతా’ అనే ఊతపదాన్ని తిట్టుగా ఉపయోగిస్తూ ఉండేవాడు. ఆయన్ని దృష్టిలో పెట్టుకొనే ఈ పాత్ర సృష్టించబడింది.

చింతామణి

దీని రచనాకాలం 1920. ప్రథమ ద్వితీయ ముద్రణలు 1921లో జరిగాయి. నారాయణరావుగారి పేరు తెలుగునాట ప్రసిద్ధం చేసిన నాటకమిది. నారాయణరావుగారు దీనిని ప్రకరణమనే పేర్కొన్నారు. వేశ్యాసమస్యపై ఎక్కుపెట్టిన బాణం ఈ చింతామణి. ఇది పది అంకాల రూపకం. ఇవాళ మనం వేదికల మీద చూస్తున్న చింతామణికి, కాళ్ళకూరి నారాయణరావుగారి చింతామణికి హస్తిమశకాంతరం తేడా కనిపిస్తుంది. బూతులమయం చేసి నాటకాన్ని ప్రసిద్ధం చేసిన పాత్ర సుబ్బిశెట్టి. కన్యాశుల్కంలో గిరీశంలాగ, ప్రతాపరుద్రీయంలో పేరిగాడిలాగ సుబ్బిశెట్టి పాత్ర తెలుగువాళ్ళకు హాస్య వర్షాన్ని కురిపించింది. అరవపల్లి సుబ్బారావు, గండికోట జోగినాథం వంటివారు ఈ పాత్ర ద్వారా బహుళఖ్యాతిని సంపాదించారు. కాళ్లకూరివారు ఈ పాత్రను ఆశించినట్లుగా ఇలా వచ్చి అలా వెళ్ళకుండా ప్రధాన కథను, నాటక ప్రయోజనాన్ని వెనుకకు నెట్టి హాస్యం పేరుతో ముందుకువచ్చి కూర్చుంది. సుపుత్రునిగా, ఆదర్శభర్తగా, గృహమేధిగా, ఉత్తమ పౌరుడిగా ఖ్యాతికెక్కిన బిల్వమంగళుడు చింతామణి అనే వేశ్య వలలో చిక్కి చివరకు పరివర్తన పొందిన చింతామణిలాగే తాను కూడా విరాగి కావటం ఇందులోని ప్రధాన ఇతివృత్తం. ఈ రూపక రచనోద్దేశం – సంఘసంస్కరణమే. ఈ ప్రకరణం చివరలో బిల్వమంగళుడి చేత ఫలశ్రుతిగా చెప్పించిన ఈ పద్యాన్ని గమనించండి.

సీ॥ పాత కృత్యములలో బహు నికృష్టంబగు
వ్యభిచారము వినాశమందుగాక!
మన దేశమునకెల్ల మచ్చను గలిగించు
గణికాకులము మార్పుగాంచుగాక!
విటులు దుర్వృత్తులు విడనాడి, భార్యల
కూర్మిమీరగ నేలుకొంద్రు గాక!
పతి పరకామినీ రతుడయ్యెనను చింత
యువతు లెన్నడెరుంగకుంద్రు గాక!
తే.గీ. బ్రతుకు చంచలమని, దైవభక్తి మోక్ష
సాధనంబని, యనుతాప సంగతులగు
వారిపై దేవునకు దయవచ్చునని, యె
ఱింగి మానవులెల్ల దరింత్రు గాక!

ఈ లక్ష్యాన్ని సాధించటానికే నాటకకథను కాళ్ళకూరివారు నడిపారు. కృష్ణకర్ణామృతాన్ని రచించిన బిల్వమంగళుడి కథను తన కథకు అవసరమయినంత మేరకు ఉపయోగించుకున్నారు కాళ్ళకూరి వారు.

చింతామణి సౌందర్యాన్ని, బిల్వమంగళుని సచ్ఛీలాన్ని చెప్పి ఈ రెండింటికి స్పర్థ కలిగించి రచయిత పరస్పర ఆకర్షణకు గురిచేస్తాడు. చింతామణిని కాళ్ళకూరి వారు ఇలా వర్ణిస్తాడు.

ఉ॥ ఱెప్పలు వాల్చకుండిన, ధరిత్రిని పాదము లంటకుండినన్
దప్పక రంభయో, మతి ఘృతాచియో, మేనకయోయటంచునీ
కప్పుర గంధి పట్ల భ్రమ కల్గకపోవునే? యాలకింపలే
దిప్పురమందే యిట్టి జలజేక్షణ యున్నదటంచు నెన్నడున్

ఇది బిల్వమంగళుని విభ్రమతకు గురిచేసే చింతామణి సౌందర్యం. చింతామణి మాటలలో బిల్వమంగళుని సౌందర్యానికి సంబంధించిన మాటలవి.

ఉ॥ కమ్మలు లేకయే చెవులు కస్తూరి తావులు గ్రమ్ము పత్రభం
గమ్ములు లేకె చెక్కిళులు కాటుకనిగ్గులు లేకయే కనుల్
సొమ్ములు లేకయే గళము చొక్క పులత్తుక పూత లేకె పా
దమ్ములు సొంపు నింపును గదా! మగవారి యదృష్టమేమొకో

ఇది చింతామణిని ఆకర్షించిన బిల్వమంగళుని రూపం. తల్లి బలవంతం మీద వేశ్యావృత్తిని కొనసాగిస్తున్న చింతామణి బిల్వమంగళుని సౌందర్యం పట్ల ఆకర్షితురాలై, బిల్వమంగళుని స్నేహితుడైన భవానీ శంకరుని సహాయంగా తీసుకొని ముగ్గులోకి దించుతుంది. బిల్వమంగళుడు పరమ నైష్ఠికుడని తెలిసికూడా చింతామణి వలవేస్తుంది. ఆ సందర్భంలో భవాని శంకరుడు, చింతామణుల సంభాషణ గమనిస్తే ప్రవరునితో వరూధిని చేసిన సంభాషణలాగా అనిపిస్తుంది.

భవాని : అతడినిచ్చటికి రప్పించుట అలవియైన కార్యం కాదు.
చింతామణి : ఎందుచేత
భవాని : మహాపండితుడు
చింతామణి : వ్యాసుని కంటేనా?
భవాని : పరమ నైష్ఠికుడు
చింతామణి : విశ్వామిత్రుని కంటేనా?
భవాని : బహునీతిమంతుడు
చింతామణి : విప్రనారాయణుని కంటేనా?
భవాని : పరస్త్రీ పరాఙ్ముఖుడు
చింతామణి : ఋష్యశృంగుని కంటేనా

అంటే ఈ సంభాషణను బట్టి ఎంతటి గొప్పవారినైన లొంగదీసుకోవాలనేతత్త్వం వేశ్యలకున్నదని రూఢి అవుతున్నది. బిల్వమంగళుని ఆకర్షించిన మరొక విషయం చింతామణి ప్రజ్ఞ. భవానీ శంకరుడు చింతామణిని బిల్వమంగళుని వద్దకు ఏవో విద్యా సంబంధమైన సమస్యలున్నాయని తీసుకువస్తాడు. చింతామణి అడిగిన ప్రశ్నలకు బిల్వమంగళుడు తడవుకోకుండా

ఇచ్చిన సమాధానాలు ఆతని విద్యపట్ల చింతామణిని ఆకర్షితురాలిని చేస్తాయి. ముత్యాలహారాన్ని కానుకగా చింతామణి బిల్వమంగళుని మెడలో వేస్తుంది. బిల్వమంగళుడు చింతామణిని చూడగానే ఆమె అందానికి ఆశ్చర్యచికితుడై తాను కూడా ఆమెకు బహుమానం ఇవ్వాలని భవానీశంకరునితో కలిసి చింతామణి ఇంటికి వెళ్తాడు. ఈ సందర్భం సహజంగానే స్త్రీ పట్ల పురుషుని హృదయంలో ఉండే బలహీనతను, కలిగే ప్రకంపనలను సూచిస్తుంది. ఈ సందర్భంలో చింతామణికి, ఒక పరీక్షపెట్టి, ఒక కానుకను ఆమె మెడలో అలంకరిస్తాడు బిల్వమంగళుడు.

అవంతీసుందరి కథగా ప్రసిద్ధమైన దానిని కాళ్ళకూరివారు ఈ సందర్భంలో చింతామణిలో వాడుకున్నాడు. రాజశేఖరుడు అవంతీ సుందరికి ఒక దంతపు పెట్టెను కానుకగా ఇస్తూ "నీ పుట్టినరోజు కానుక ఈ పెట్టెలో ఉంది. ఈ పెట్టెపైన ఉన్న సర్పం, శివుడు, ఆంజనేయుడు లోపలవున్న వస్తువుకి కాపలా కాస్తున్నారని, ఈ బొమ్మల ఆధారంగా లోపలవున్న వస్తువు ఏమిటో కనుక్కోమని అవంతీసుందరినడిగాడు. అవంతి రవంత నవ్వి మొదటి బొమ్మ పాము. పాము దేనిని హరిస్తుంది? గాలిని. గాలి దేనిని మోస్తుంది? పరిమళాన్ని మోస్తుంది. పరిమళం ఎందులో ఉంటుంది? పుష్పంలో. కాబట్టి ఇందులో ఉన్నది పుష్పమని రూఢి. అయితే ఆ పుష్పం ఏమిటి? రెండవ బొమ్మ శివుడు. శివుడు ఎవరిని దహించాడు? మన్మథుణ్ణి. అంటే ఇందులో ఉన్న కుసుమం. మన్మథుని పంచబాణాలు అయి వుంటాయి. మన్మథుని పంచబాణాలేమిటి? అరవిందం, అశోకం, చూతం, నవమల్లిక, నీలోత్పలం. మూడవ చిత్రం ఆంజనేయుడు. ఆంజనేయుడు ఉదయించే సూర్యుణ్ణి అడ్డుకున్నాడు కాబట్టి సూర్యునికి ఇష్టమైన కుసుమం కమలం కాబట్టి ఇందులో ఉండేది కమలమని చెప్పి రాజశేఖరుని మెప్పుపొందింది. అలాగే చింతామణి కూడా బిల్వమంగళుని మెప్పుపొంది పెట్టెలోని వజ్రకమలాన్ని దక్కించుకుంది. అందుకు ప్రతిగా తనకు కామశాస్త్రాన్ని బోధించమని అభ్యర్థించింది. బిల్వమంగళుడు తొలుత అవాక్కయినా ఆమెపై ఉన్న వ్యామోహంతో అంగీకరించాడు. చింతామణి కోరికను తిరస్కరించలేని బిల్వమంగళుని బుద్ధి, పాండిత్యాలు చింతామణికి లొంగిపోయాయి.

విటులను ఆకర్షించి తద్వారా ధనార్జన చేసేవాళ్ళు పడుపుగత్తెలు. వీళ్ళనే భోగినులు అని కూడా అంటారు. రెండవరకం లలితకళాసక్తితో ఏదో ఒక కళలో ప్రావీణ్యాన్ని సంపాదించి, కళాకారునిగా జీవనం సాగించే వాళ్లని గణికలని అంటారు. బిల్వమంగళుడు చింతామణిని గణికయా? లేక చక్కదనముల కణికయా? అని వర్ణించుకుంటూ వెళ్ళిపోతాడు.

బిల్వమంగళుడు లోకంలోని పురుషులకు సంకేతం. ప్రవరునిలా అకలుష జీవనాన్ని సాగించే వ్యక్తి. చింతామణి మోహపాశబద్ధుడైన తర్వాత విటుడై, పండంటి సంసారాన్ని విచ్ఛిన్నం చేసుకొని తల్లిదండ్రి భార్య మిత్రులు ఎంత చెప్పినా వినిపించుకోని స్థితిలో చింతామణికోసం ఏమైనా చేయటానికి సన్నద్ధమైనాడు. సుబ్బిశెట్టినిగాని, భవానీశంకరుణ్ణిగాని ఇంతవరకు చెప్పిన బిల్వమంగళుని పాత్రనుగాని కాళ్ళకూరివారు వేశ్యా సమస్యను, దాని తీవ్రతను వివరించటానికే

ఉపయోగించుకున్నారు. ఆ తరువాత ఈ సమస్యకు ఆధ్యాత్మిక పరిష్కారాన్ని సూచించాడు. తండ్రి మరణించిన స్థితిలో శవజాగరణ బాధ్యత భార్యకు వదలి చింతామణికోసం పెనువర్షంలో భార్య శవాన్నే ఆధారం చేసుకొని చింతామణి ఇంటికి వెళ్ళినపుడు ఆతని దుర్మోహస్థితిని విడమర్చి చెప్పి ఈ బ్రతుకు యొక్కనశ్వరత్వాన్ని చింతామణి బోధిస్తుంది. చింతామణి చేసిన ఈ ప్రబోధంతో పాటు సోమగిరి అనే యోగి తారసపడి శ్రీకృష్ణమంత్రోపదేశం చేసి లీలాశుకనామకరణం చేస్తాడు. బిల్వమంగళుడాయోగి వెంట వెళ్ళిపోతాడు. చింతామణి తన వల్ల నష్టపోయిన భవానీశంకరుడికి, సుబ్బిశెట్టికి ఆర్థిక సహాయం చేసి, ఆరునెలలపాటు దేశమంతా తిరిగి వేశ్యాలంపటత్వంతో వీరుపొందిన నష్టాన్ని ప్రచారం చేయమని ఆ తర్వాతే వారికా ఆర్థిక సహాయం లభిస్తుందని చెబుతుంది. తల్లితోపాటు కొన్ని బాధ్యతలను కూడా చిత్రకప్పగించి తాను సానివాడలకు వెళ్ళి, వారిని సన్మార్గగాములుగా చేయటానికి ప్రయత్నం ప్రారంభిస్తుంది. ఈ నాటకంలో చింతామణి పాత్రలో ఒక భావ సంఘర్షణను, ఒక వైరాగ్య వీచికను అంతర్లీనంగా పొదిగి ఆ పాత్ర ఉదాత్తతను కాళ్ళకూరి వారు చెడనివ్వలేదు. కానీ, ఈ నాటకోద్దేశం వేశ్యావ్యామోహం నుండి సమాజాన్ని విముఖం చేయటం కాబట్టి వెలయాళ్ళ లోపాల్ని ఎత్తి చూపటం, వేశ్యావృత్తిని దూషించటం బహుళంగా కనిపిస్తుంది. మారిన చింతామణి మాటలు కూడా వేశ్యావృత్తిని ఖండిస్తూ చేసిన ఉపన్యాసం లాగే అనిపిస్తాయి. ఈ రూపకం నిండా వేశ్యా వ్యసన విహారులైన వారిని గురించిన ప్రస్తావనే ఎక్కువగా కనిపిస్తుంది.

ఆనాటి సమాజాన్ని సజీవంగా కాళ్ళకూరివారు చూపించారు. విటుల మధ్య పోటీ వుండటం, సంపన్నురాలైన వేశ్యను ఉంచుకోవటం గౌరవంగా భావించటం, సానులు విటుల్ని పొగిడితే పొంగిపోవటం, తిడితే సంతృప్తి పడటం, అలిగితే కాళ్ళమీద పడటం, పాడితే పరవశించటం, తన్నినా ఆనందంగా పాదాలను పట్టుకోవటం, ఇంటినుండి గెంటించినా వెళ్ళక ఇంటినే అంటి పెట్టుకోవటం వంటి వైపరీత్యాలను కాళ్ళకూరి వారు భవానీ శంకరుడు, సుబ్బిశెట్టి, బిల్వమంగళుని పాత్రలద్వారా నిరూపించారు. వేశ్యాలోకంలోని అవలక్షణాలు, కుటిలత్వాన్ని ఆచార వ్యవహారాల్ని చెప్పి సంసారాల్ని సరిచేసి, సమాజాన్ని బాగుచేయాలన్న లక్ష్యంతో కాళ్ళకూరివారు ఈ నాటకాన్ని రచించారు.

గీ॥ ములగ మొక్కకుఁ జేవ వేమునకుఁ దీపి
కటికి వానికి జాలి, చిల్కలకుఁ బ్రేమ
గులకరాతికి గాంతి, బొగ్గునకుఁ దెలుపు
పడుపు గత్తెకు వలపు విశ్వమునఁ గలదె?

ఆ.వె॥ పాముకాటు వలనఁ బ్రాణముల్ మాత్రమే
పాయు! వేశ్యకాటువలన జనుని

యశము, తెలివి, పుణ్యమైశ్వర్య మారోగ్య
మాయువును దుదంటపాయు నిజము –

ఇలా సానులకు వలపు వుండదని, సంసారాల్ని పాడుచేసుకోవద్దని చెప్పటం నాటక సారాంశం. ఒక వసంతసేన, ఒక మధురవాణి, ఒక చింతామణి భారతీయ సాహిత్యంలోనే అపురూప శిల్పాలు. సాంఘిక రుగ్మతను మాపటానికి ఎత్తిన దీపాలు.

ఈ చింతామణి నాటకం చాలామంది నాటక రచయితలను ప్రభావితం చేసింది. చక్రావధానుల మాణిక్యశర్మ, జొన్నలగడ్డ మృత్యుంజయశర్మ, శొంఠి గంగాధర రామశాస్త్రి, రామనారాయణ కవులు, శ్రీపాద కామేశ్వరరావు ఈ కథను మళ్ళీ నాటకంగా రాశారు. ఒక నాటక ఇతివృత్తం, ఒక సంఘ సంస్కరణోద్యమానికి దోహదం చేస్తూ, తర్వాత కవుల్ని ప్రభావితం చేయటమే కాకుండా, ఇప్పటికీ రంగస్థలంపై నిలిచి ఉన్నదంటే దాని గొప్పతనం ఏ పాటిదో అర్థమవుతుంది. ఈ నాటకం సినిమాగా కూడా వచ్చింది.

వరవిక్రయం

గురజాడ కన్యాశుల్కాన్ని 1892లో రాస్తే నారాయణరావుగారు వరవిక్రయాన్ని 1921–22 ప్రాంతాల్లో రాశారు. అంటే అప్పటికి క్రమంగా కన్యాశుల్కం పోయి, వరశుల్కం చోటుచేసుకొని పీడిస్తున్న కాలం. ఆడపిల్ల తల్లిదండ్రుల బాధ, మగపెళ్ళివారి ఆర్భాటాలు, దళారుల దౌష్ట్యాలు మొదలయినవన్నీ నారాయణరావుగారు గమనించి వరవిక్రయం నాటకాన్ని రాశారు. చింతామణి నాటకంలో సుబ్బిసెట్టిలాగే, వరవిక్రయంలో లింగరాజు పాత్రకూడా తెలుగువారిని ఆకర్షించిన పాత్ర. ఇప్పటికీ ఎవరైనా లోభిని ప్రస్తావించవలసివస్తే అన్యాపదేశంగా 'వాడొట్టి లింగరాజు!' అనటం తెలుగువాళ్ళ నోళ్ళల్లో వినిపిస్తుంది.

గాంధీమహాత్ముని సహాయ నిరాకరణోద్యమం తీవ్రంగా జరుగుతున్న కాలమది. సంఘ సంస్కరణంలో భాగంగా వరవిక్రయమనే సాంఘిక సమస్యను ప్రధానంగా తీసుకొని, సందేశాత్మకంగా ఈ నాటకాన్ని రచించారు. రచయిత చెప్పదలచుకున్న సందేశాన్ని పెళ్ళిళ్ళ పేరయ్యతో సహా అన్ని పాత్రలు చివరి వరకూ మోస్తాయి. వాస్తవానికి ఈ నాటకం తొమ్మిదవ అంకంతో ముగుస్తుంది. కానీ దశమాంకంలో మొత్తము వరకట్న నిషేధ సందేశాన్ని వినిపిస్తారు. పదే పదే చెప్పదలచుకున్న సందేశాన్ని బహుముఖాలుగా చెప్పటం ఈ నాటకంలోని విషయం. ఇది పది అంకాల నాటకం. కొన్ని అంకాలలో రంగ విభజన కూడా ఉంది. నాటకాన్ని సరళ గ్రాంథికంలో రాసినప్పటికీ పెళ్ళిళ్ళ పేరయ్య, వీరయ్య, గంటయ్య, టీచర్, వెర్రివెంగళప్ప వంటి పాత్రలు వ్యావహారికాన్నే మాట్లాడుతాయి. వాటిలో ఎంత హాస్యముందో అంత ఆవేదన కూడా వ్యంగ్యరీతిలో కనిపిస్తుంది. ఈ నాటకాన్ని ఉద్దేశించి కొంతమంది ఇలా అంటారు. 'కన్యాశుల్కం కళింగ దేశపు వైదిక కుటుంబాల పెళ్ళి ఆచారాల్ని దుమ్మెత్తితే, వరవిక్రయం మధ్య కోస్తా జిల్లాలలో

నియోగి బ్రాహ్మణ కుటుంబాల పెళ్ళి దురాచారాన్ని దూసిపోస్తున్నద'ని అంటారు. ఇందులో సమయోచితంగా అప్పటి దురాచారాల్ని తిరస్కరించటం కనిపిస్తుంది.

ఏ కవిసమాజమైనా బాధ్యతలేని యువతరాన్ని గురించి బాధపడుతుంది. పుణ్యమూర్తుల పురుషోత్తమరావు సహాయనిరాకరణోద్యమానికి ఆకర్షితుడైన గాంధేయవాది. తాను నమ్ముకున్న సిద్ధాంతాన్ని ఆచరణలో అమలు చేయలేక రాజీపడిన వ్యక్తి. తన భార్య భ్రమరాంబతో పురుషోత్తమరావుగారు అప్పటి యువతరాన్ని గురించి చెప్పిన ఈ పద్యాన్ని గమనిస్తే నారాయణరావుగారి హృదయంలోని ఆవేదన ఎలాంటిదో అర్థమవుతుంది.

సీ॥ పంచాద్రి క్రాపింగు ప్రక్కపాపిడి జూలు
లేనివాడు ధరిత్రి లేనివాడు
కాఫీ హెూటళ్ళును, కాతాలు, బిల్లులు
లేనివాడు ధరిత్రి లేనివాడు
సిగరెట్లు బీడీలు చెక్కిటి ఖిల్లీలు
లేనివాడు ధరిత్రిలేనివాడు
చలువ యద్దములు సైకిలు కట్టు పెడగోచి
లేనివాడు ధరిత్రి లేనివాడు
తే.గీ॥ తనదు తలమించినట్టి వృధావ్యయంబు
లేనివాడు ధరిత్రి లేనివాడు
ఇట్టులున్నారు విద్యార్థులిప్పుడక్క
డక్క డొక్కరిద్ద రెవ్వరో దక్క సుదతి!

వేదికలపైన ఉపన్యాసాలు వల్లించి, ఆచరణలో పగటి చుక్కలయ్యే వాళ్ళని గురించి పురుషోత్తమ రావుగారిలా తన ఆవేదనను వెలిబుచ్చుతారు. "బాల్య వివాహములనఁ బటబట పండ్లు కొఱకు బాపిరాజుగా రేమి చేసినారో విన్నావా? – అభము శుభము నెఱుంగని యాఱేండ్ల పిల్లను నలుబది యేండ్లు గడచిన నాల్గవ పెండ్లి వానికి ముడిపెట్టి – అదేమన – అత్తగారి పట్టన్నారు. స్త్రీ పునర్వివాహముల కొఱకుఁ జిందులు త్రొక్కిన శివయ్యగారు బంగారు బొమ్మ వంటి పదునారేండ్ల చెల్లెలికి భర్తచావగానే, వంటలక్కను మానిపించి, వంట తపేలా చేతికిచ్చి, అదేమన మాయమ్మ చావనిమ్మన్నారు. శవవాహనమును గూర్చి శంఖములు పూరించు శరభయ్యగారు – ప్రక్క యింటి యిల్లాలు భర్తచచ్చి, శవవాహకులకు డబ్బిచ్చు శక్తిలేక దేవుడాఁ గోడాయని దేవులాడుచుండ వీధి తలపునకు గొండ్లెము వైచి, విత్తెదు నైవేద్యముపెట్టి, పెరటి త్రోవన పేకాటకు జక్కబోయి – అదేమన ఆమె వచ్చి అడగలేదన్నారు. విన్నావా? వీరేకాదు. ఈ యూరి సంఘసంస్కర్తలందఱునిదేమాదిరి."

ఆడపెళ్ళివాళ్ళను మగపెళ్ళివారు పెట్టే హింసల్ని, అనారోగ్య వాతావరణాన్ని ఇలా చెబుతారు. "ఈ రోజుల్లో ఆడపిల్ల పెళ్ళిచేశాక ఇంకా వుండేదేమిటి? ఉద్ధరి: తొలినాడు హడావిడి, మలినాడు ఆయాసం, మూడు మంగళాష్టకాలు, నాలుగు సిగపట్ల గోత్రాలు, అయిదు అప్పగింతలు, ఆరు అంపకాలు, ఏడు వంటబ్రాహ్మల తగవు, ఎనిమిది రుణదాత నోటీసు, తొమ్మిది జవాబు, పది దావా, పదకొండు స్టేటుమెంటు, పన్నెండు విచారణ, పదమూడు డిక్రీ, పద్నాలుగు టమటమ, పదిహేను వేలం, పదహారు చిప్ప. ఈ రోజుల్లో ఇదే పదహారు రోజుల పండుగ." – ఈ వాక్యాల్ని గమనిస్తే ఆడపిల్లల్ని కన్న తల్లిదండ్రుల కష్టాలేమిటో అవగతమవుతాయి.

పెళ్ళిళ్ళ పేరయ్యలాంటి దళారులు, భ్రమరాంబ లాంటి తల్లులు పురుషోత్తమరావులాంటి సమాజంతో రాజీపడే తండ్రులు, వెర్రిబుర్రలు వెంగళప్పలాంటి తాలూకా బోర్డు ప్రెసిడెంట్‌లు, లింగరాజు వంటి లోభులు ఇప్పటికీ మనకు సమాజంలో తగులుతూనే ఉన్నారు. ముదిమి వయస్సులో పడుచుభార్యని చేసుకొని ఆమెను వేపుకుతినే లింగరాజు వంటి భర్తలు కళ్లముందు మనకు నేటికీ తారసిస్తూనే ఉన్నారు. లింగరాజు సుభద్రల దాంపత్యజీవనం అసమవయస్కతతో పాటు అననురూపమైంది. సుభద్ర తనకు ఈ అననురూపమైన సంబంధం చేసినవాళ్ళను ఉద్దేశించి చెప్పిన ఈ మాటలు ఇప్పటికీ పాతబడి పోనివే.

గీ॥ విద్యయు, వయస్సు, పరువును విడిచిపెట్టి
భాగ్యమొక్కటియే చూచి బడుగు పిసిని
గోటు పీన్గునకుం దన కూఁతు నిచ్చు
తల్లికుత్తుకతతీగినఁ దప్పు గలదె!

ఈ నాటకంలో వరకట్న సమస్యకు కాళింది ఆహుతి అయిపోతే, కమల సమస్యపై తిరగబడి పోరాడుతుంది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాన్ని మాని ఇంట్లో రాట్నం వడకటం వంటి గాంధేయ వాతావరణాన్ని చిత్రించి ఆనాటి జాతీయోద్యమం పట్ల ప్రేక్షకుల్ని, పాఠకుల్ని ఆకర్షించే ప్రయత్నం నారాయణరావుగారు చేశారు. స్త్రీ విద్యను గురించి, దాని అవసరాన్ని గురించి నారాయణరావుగారు కమల పాత్రద్వారా నిరూపించారు. నాటకంలో కేవలం శుభలేఖలలోని ఒక చిన్న మెలికను ఆధారం చేసుకొని నాటకీయంగా సమస్యకు పరిష్కారం చూపటం నాటక మర్యాద కావచ్చేమోగానీ లోకసమస్యకి పరిష్కారం చూపించే దారికాదు. వరశుల్క తీవ్రతను సంప్రదాయబద్ధంగా, వ్యంగ్యంగా వివరించినప్పటికీ సమస్యకి పరిష్కారం చూపిన తీరు ఆచరణయోగ్యమైందీ కాదు. అందువల్లనే వరవిక్రయం సమస్య అప్రస్తుతం కాకపోయినప్పటికినీ, కన్యాశుల్కం నాటకంలా నిలబడలేకపోయింది.

నాటకంలోని పాత్రలన్నీ చివరి అంకంలో ప్రచారం చేయటం కనిపిస్తుంది. ఇందులో ఒక శెట్టిని, ఒక విప్రుడిట, ఒక కమ్మను ప్రవేశపెట్టి వాళ్ళవాళ్ళ వరవిక్రయ సంబంధమైన కష్టాల్ని చెప్పిస్తాడు. చివరిగా కవి యిలా స్వప్నిస్తాడు.

సీ॥ ఆడుబిడ్డల వివాహములకై తండ్రులు
పడు బాధలెల్లను బాయుఁగాక! (పురుషోత్తమరావు)
కట్నాల కోసము గడ్డి కఱచువారి
కెల్ల నాపాట్లె ఘటిల్లుఁగాక (లింగరాజు)
పణములు గొనువారు భార్యల కేప్రొద్దు
నూడిగంబులు సేయు చుంద్రుగాక! (బసవరాజు)
వెలమగల్ మెడల బుస్తెలు కట్టు దౌర్భాగ్య
దశ కన్నియుల కింకఁ దప్పుఁగాక! (కమల)
కట్నముల నందుకొంటయే గౌరవమను
వెడగుఁదన మాడు వారిని వీడుఁగాక (భ్రమరాంబ)
ఉర్వి నన్నిటఁ గాళింది కుద్దియైన
వెలదులే యెప్పుడును బ్రభవింత్రుగాక! (అందఱు)

కాళ్ళకూరి నారాయణరావుగారు వరవిక్రయాన్ని చూసి నాటక సరస్వతి, గరికపాటి కామేశ్వరరావు, చెరుకుపల్లి వెంకటనారాయణ, అల్లమరాజు నారాయణ, ఎర్రాప్రెగడ సత్యనారాయణ మూర్తివంటి వారు వరవిక్రయ నాటకాలను రాశారు. ఈ నాటకం చలన చిత్రంగా కూడా వచ్చింది.

మధుసేవ

మధుపాన సమస్యను చర్చించిన నాటకం మధుసేవ. సద్గుణాలఖనియైన రఘునాథరావనే జమీందారు స్వారీచేస్తూ గుర్రంపై నుండి పడిపోతాడు. స్పృహ కోల్పోయిన స్థితిలో 'రంగడు' – అనే తాగుబోతు ఈయన గొంతులో సారాపోస్తాడు. వైద్యులు కూడా దెబ్బల బాధనుండి ఉపశమనానికి మద్యం పుచ్చుకొమ్మంటారు. ఇలా మందులా అలవాటైన మందు రఘునాథరావును త్రాగుబోతునిగా మార్చింది. శర్మ అనేవాడు 'కస్తూరి' – అనే వేశ్యతో పరిచయం కలిగించి, రఘునాథరావును దుర్వ్యసన లోలుడిని చేసి బికారిని చేస్తాడు. విశ్వాసానికి మారుపేరైన ఆయన మేనేజర్ విశ్వాసరావు చేసిన ప్రయత్నమంతా వ్యర్థమవుతుంది. నిర్మల నిర్మల మనస్కురాలు, భర్తకోసం తల్లడిల్లే ఆమెను రఘునాథరావు పట్టించుకోకపోగా కనీసం కన్నెత్తి చూడలేదు. కస్తూరికి 'కాశింసాహెబ్' – అనే రహస్య విటుడున్నాడు. ఆ విషయాన్ని తెలియజెప్పి, కస్తూరినుండి రఘునాథరావును దూరం చేయాలని ప్రయత్నిస్తున్న విశ్వాసరావుపై నేరాలు చెప్పి, ఉద్యోగాన్ని ఊడగొట్టించి తానే మేనేజర్ అవుతాడు శర్మ.

దిక్కూ దివాణం లేని నిర్మల బయట ఒక చిన్న ఇంటిని విశ్వాసరావు సహాయంతో కొనుక్కుంటుంది. నిర్మల తండ్రి చనిపోతూ, ఆమెకు ఇచ్చిన పదివేల రూపాయలను ఇమ్మని, అడుగమని శర్మ రఘునాథరావుతో చెప్పినప్పటికీ అందుకు రఘునాథరావు అంగీకరించలేదు.

నిర్మలను రంగని చేత శర్మ చంపిస్తాడు. ఆ నేరం రఘునాథరావుపై పడుతుంది. జైలుపాలైన రఘునాథరావును, రక్షించటానికి విశ్వాసరావు పూనుకొంటాడు. చివరికి పాపభయంతో కస్తూరి–రంగడు కోర్టులో వాస్తవాల్ని వెల్లడించగా రఘునాథరావు విముక్తుడవుతాడు. చివరికి కనువిప్పు కలిగిన రఘునాథరావు విశ్వాసరావుతో కలిసి మధుసేవ వలన కలిగే అనర్థాలను ప్రచారం చేయటానికి పూనుకొంటారు.

సీ॥ దేశంబు నానాcట నాశంబుగావించు
మద్యపానమురూపుమాయుగాక!
పేదసాదలనెల్లc జీల్చిపిప్పియొనర్చు
కల్లంగడులు నేలc గలియుగాక!
సంసారులను ముష్టిసన్యాసులంజేయు
రమ్ముకొట్లను దుమ్మురాలుcగాక!
సంస్థానములను శ్మశానంబులంజేయు
బ్రాందిషాపులు మూలcబడెడుcగాక!
తే.గీ. విధిగ నేటేట నీపాడు విషపునీళ్ళ
కొఱకువ్యయమగుకోటాను కోట్లు దేశ
మునకు దక్కి దరిద్రులు ముదుకుకూడు
ముదుక గుడ్డలనేని పొందుదురుగాక!

ఇది ఎంతగా ఖ్యాతిగడించిందంటే ఇదే పేరుతో నాటక సరస్వతి, మద్దూరి శ్రీరామమూర్తి, కొడాలి సత్యనారాయణరావు, పులిజాల వేంకట అప్పారావుగారు వంటివారు నాటకాల్ని రాశారు.

కాళ్ళకూరివారి పాత్రలలో కొన్ని పోలికలు కనిపిస్తాయి. చింతామణిలోని సుబ్బిశెట్టి – మధుసేవలోని కాశింసాహెబ్, చింతామణిలోని రాధ – మధుసేవలోని నిర్మల ఒకే విధమైన వ్యక్తిత్వంగలవారిగా కనిపిస్తారు. మూడు ప్రకరణాల చివర ఆయా సమస్యలపై ప్రచారం చేయటం విషయంలో ఒకే విధమైన తీరుగా కనిపిస్తాయి.

పౌరాణిక నాటకాలలోలాగే ఈ సాంఘిక సమస్యలను గురించిన నాటకాలలో కూడ పద్యాలు కనిపిస్తాయి? మరి ఇవి అవసరమా? అనే ప్రశ్న కనిపిస్తుంది.

"Prose is the information of the subject
Poetry is the emotion of the content"

అంటే భావతీవ్రతను తెలియజెప్పటానికి చేసిన రచనయని గ్రహించాలి.

లిఖిత–మౌఖిక జాంబ పురాణాలు

– ఎ.కె.ప్రభాకర్

ఉంద ఇల్లు లేదు – పంద మంచం లేదు – శివారి మీద కూలి లేదు – వదుక రాట్నం లేదు – బ్రహ్మాండ దానం లేదు – కాలికి చెప్పు లేదు – పరాభిక్షం లేదు – మాదిగల్ని మాత్రమే త్యాగం అడుక్కోవాలి. ఊళ్ళో ఇళ్ళ ముందు సానుపు చల్లిన వాకిలి తొక్కకూడదు. వ్యవసాయం చేయరు. అగ్రకులాల సేవ చేయరు. ఆ కారణంగానే పుట్టు నేరస్తులుగా ముద్ర. బ్రహ్మల్తో ముక చూపుల్లేవు ('బాపనోనికి ఇప్పటికీ కాళ్ళు మొక్కం' – కన్నెగంటి గోపాల్, దక్కలి కళాకారుడు, నష్కల్). సంచార జీవనం; స్థిర నివాసం లేకపోవడం వల్ల పౌరసత్వం లేదు...

జాంబపురాణంలో సామాజికాంశాల గురించి వివచేన చేసేముందు యీ దేశంలో దళితుల్లో దళితులైన దక్కలి కళాకారులు యీ జీవన విధానాన్ని, పరిస్థితిని మనసులో వుంచుకొని తొలి అడుగు వేయాలి; అప్పుడు మాత్రమే దానిని పాఠ్యం లోతుల్లోకి వెళ్ళాలి.

కుల పురాణాలన్నీ సాధారణంగా ప్రధాన స్రవంతిగా భావించే పురాణాలకి సమాంతర భావజాలాన్ని ప్రచారం చేయడానికే వుద్దేశించినవని నిర్ధారణ చేయాలంటే పాఠ్యాన్ని యెంతగా తరచి చూస్తామో ఆ యా పురాణాలు చెలామణిలో వున్న స్థల కాలాదుల్ని సైతం అంతగానే పట్టించుకోవాలి. ఒక విధంగా కుల పురాణాధ్యయనం అంటే సమాజ అధ్యయనమే. ఏ కుల పురాణాన్నైనా అధ్యయనం చేయాలంటే మొత్తం సమాజంలో ఆ కులానికీ దాన్ని చెప్పే వాళ్ళకీ వున్న సామాజిక స్థితి గతుల్ని– సాంస్కృతిక స్థాయినీ, ఆశ్రిత దాతృ కులాల మధ్య వున్న సంబంధాన్నీ పరిగణనలోకి తీసుకోవాల్సి వుంటుంది. సమాజం, మతం, చరిత్ర, సంస్కృతి, భాష – వీటిని విడి విడిగా గాక, స్థిరమైన అంశాలుగా గాక పరస్పర సంబంధాలతో పరిశీలించాల్సి వుంటుంది. మిగతా కులపురాణాల మాటెలా వున్నా జాంబపురాణంలో సామాజికాంశాల గురించి పరిశీలించడంలో యెన్నో సంక్లిష్టతలున్నాయి. జాంబ పురాణం కేవలం మాదిగ కుల పురాణం మాత్రమే కాదు; మాల గొల్ల చాకలి కుమ్మరి గౌడ ముత్తరాసి విశ్వకర్మపిచ్చుకకుంట్ల ఎరుకల మొదలైన కులాల చరిత్రని అది పుట్టుపూర్వోత్తరాలతో సహా వర్ణిస్తుంది. అందువల్ల జాంబపురాణం శ్రామిక కులాల సామాజిక సాంస్కృతిక చరిత్ర కూడా. ఆయా కులాల మధ్య అనివార్యంగా చోటుచేసుకొనే ఉత్పత్తి సంబంధాలకు గతిశీలమైన వ్యాఖ్య.

భారతీయ సమాజంలో మూలవాసీ సంస్కృతినీ వెలికి తీయడానికీ, జాతుల సమస్యలలో వివిధ కోణాల్ని అధ్యయనం చేసి లోతుపాతుల్ని గ్రహించడానికీ, తరతరాలుగా మరుగున పడివున్న ఉత్పత్తి కులాలకు చెందిన ప్రజాశ్రేణుల చరిత్ర అవగాహనకీ, వారి మధ్య నెలకొన్న సాంస్కృతికి అగాథాల్ని పూడ్చి ఐక్యత సాధించడానికీ మౌఖికంగా భిన్న రూపాల్లో లభ్యమౌతున్న జాంబ పురాణాలు ఎంతగానో దోహదం చేస్తాయి.

జాంబపురాణాన్ని చిందు భాగవతులు గోసంగి వేషం కట్టి సంవాద రూపంలో ప్రదర్శిస్తారు. చిందు కళాకారుల జాంబవ పురాణ ప్రదర్శన హాస్య వీర రసాలతో వ్యంగ్య అధిక్షేపాలతో మాదిగ సంస్కృతిని కొండ నెత్తం మీద నిలబెట్టి ప్రసిద్ధమైంది. నులక చందయ్యలు జాంబవ కథని పురాణరూపంలో ప్రవచిస్తారు. డక్కలి వాళ్ళు పటకథగా చెబుతారు. పటం కథనే ఇటీవల ఒక విలక్షణమైన వీధి నాటకంగా మలచుకొని వాళ్ళు ప్రజారంజకం చేశారు. డక్కలి కళాకారులే కొందరు కిన్నెర మీద పాడతారు, కొందరు గద్య కథనం చేస్తారు. బైండ్ల వాళ్ళు తాము చెప్పే ఎల్లమ్మ కథా చక్రంలో భాగంగా జాంబవుడి కథని కూడా జమిడికల మీద గానం చేస్తారు. మాదిగ మాష్టీదులు ఆసాదులు దీన్ని కథగా చెబుతారు. కొన్ని ప్రాంతాల్లో డక్కలి స్త్రీలు వాద్య సహకారంతో బృంద సహకారంతో బృందగానం చేస్తారు. వీటిలో ఏ జాంబపురాణమైనా పాఠ్యంలో గానీ, ప్రదర్శనలో గానీ శిష్ట పురాణాల పాఠ్యానికీ, ప్రదర్శనకీ ఏ మాత్రం తీసిపోదు. ఒకే కుల పురాణంలో యిన్ని రకాల వైవిధ్యం మరెక్కడా కనిపించదు. వాటిలో ప్రక్రియా వైవిధ్యంతో పాటు రూపానుగుణంగా మూలకథలో కథాంశాల్లో కూడా భిన్నత్వం కనిపిస్తుంది. ఏ ఉపకులానికి చెందిన పాఠ్యం వారిదే. వారికది పవిత్రం కూడా. వాటిలో ప్రతిపాదించిన అంశాలకు ఎవరికి వారు కట్టుబడి వుంటారు. అయితే అన్నిటిలోనూ సామాన్యంగా అనిపించే అంశాలు చాలా వుంటాయి. వాటిలో ముఖ్యమైనది ఆదిజాంబవుని మహోన్నతుడిగా వర్ణించడం, తమ కులాన్ని తక్కిన కులాలన్నిటి కంటే వున్నతమైనదిగా స్థాపించడం. పోషక కులాన్ని ఉన్నతీకరకరించడంతో పాటు తమ ఉప కుల అస్తిత్వాన్నీ దాని హక్కుల్నీ స్థిరీకరించడం కనిపిస్తుంది. తమ ప్రదర్శనల్లో పాఠ్యంలో అందుకు అనుగుణమైన మార్పులు జోడిస్తారు. ఆ జోడింపులు ఆయా ఉప కులాల అస్తిత్వ ప్రకటనలుగా గుర్తించాలి.

ఆయా ఉప కులాల్లో జాంబపురాణం మౌఖిక లిఖిత రూపాల్లో కనిపించినా మౌలికంగా మౌఖికమే. స్థిర పాఠ్యాలుగా వేటినీ భావించలేం. అందువల్ల వైవిధ్యభరితమైన పాఠ్యాలు లభిస్తాయి. వాటిలో ఆవిష్కారమయ్యే సామాజికాంశాల్లో సైతం గణనీయమైన వైవిధ్యం చూస్తాం.

అయిదు పోగుల జంధ్యాన్ని ధరించే డక్కలి వాళ్ళు కయిగట్టగలరు (మౌఖిక సాహిత్య సంప్రదాయం), కమ్మగట్టగలరు (లిఖిత గ్రంథ రచన సంప్రదాయం). పంచాంగం చూసి మాదిగలకు పెళ్లి ముహూర్తాలు, చనిపోయాక దినవారాలూ నిర్ధారిస్తారు. వైద్యం చేస్తారు. అయినా పోషకులైన మాదిగ వారికి అంటరానివాళ్ళే. (చదువులు బడిలో మాత్రమే నేర్చుకోవడం ఆధునికత తెచ్చిన మార్పు మాత్రమే.) తాటాకు గ్రంథాలు తయారుచేసుకొనే నైపుణ్యం కూడా వీరికి సొంతం.

డక్కలి జాంబపురాణం ఆదిమ రూపం పటకథ. జాంబపురాణాన్ని డక్కలి కథలు కేవల 'పటకథ'గా చెప్పేటప్పుడు చేత తాటాకుల గ్రంథాల్ని ధరించి అందులో చూసి చెబుతారు. మధ్యలో కథకుడి వ్యాఖ్యలూ వివరణలు వున్నప్పటికీ యీ మూల పటకథకి ఒక మేరకు స్థిర పాఠ్యం

వున్నట్టుగానే చెప్పుకోవాలి. కథలోని అంశాన్నీ కథాగమనాన్నీ పటం పాఠ్యం పరస్పరం ఒకదాన్ని మరొకటి నిర్దేశిస్తాయి కాబట్టి నూతన కల్పనలకూ ప్రక్షేపాలకూ అవకాశం తక్కువ. కానీ వారి దగ్గర లభించే లిఖిత ప్రతులకు సైతం మూలం మౌఖిక పురాణమేనన్న విషయాన్ని పరిశోధకులు గమనంలోకి తీసుకోవాలి. 30 నుంచీ 60 అడుగుల పొడవూ, 3 నుంచీ 5 అడుగుల వెడల్పూతో చుట్టుకోడానికి అనువుగా వుండే పటాల్ని (scroll paintings) నకాషీ కళాకారులు చిత్రిస్తారు. వాటిలోని కథా విశేషాలు కూడా డక్కలి వారు పుక్కిటపట్టి చెప్పేవే. మౌఖికంగా ప్రచారంలో వున్న వాటికే చిత్ర రూపం – లిఖిత రూపం ఏర్పడుతుంది. పటచిత్రం తయారయ్యాకా మూల కథలో మార్పులకు అవకాశం తక్కువ.

అయితే పటాన్ని చూపుతూ యక్షగాన రూపంలో ప్రదర్శించేటప్పుడు మాత్రం ప్రదర్శనకు అనుకూలంగా మూల కథకు ఎన్నో మార్పులూ చేర్పులూ జరుగుతాయి. ప్రదర్శనలో సైతం మధ్యలో పటం చూపించి కథని వివరిస్తారు. కథ గాడి తప్పినా నటులు కథాంశాలను మరిచిపోయినా సంభాషణల్లో తప్పులు దొర్లినా సరిదిద్దడానికి ఆ మేళంలోని పెద్ద తాళపత్ర గ్రంథంతో సిద్ధంగా ఉంటాడు. లిఖిత రూపంలో వున్న ఆ పురాణ గ్రంథం వారికి ప్రామాణికమైనప్పటికీ సందర్భాన్ని బట్టి, ప్రేక్షకుల స్థాయినిబట్టీ, నటుల గాయకుల కథకుల జీవిత నేపథ్యాల్ని బట్టీ మనస్తత్వాల్ని బట్టీ దృక్పథాల్ని బట్టీ ప్రదర్శించే పాఠ్యంలో ఏకరూపత కనిపించదు. ప్రేక్షకుల్నీ శ్రోతల్నీ ఆకట్టుకొని ప్రదర్శనని జనరంజకం చేయడానికే పటకథ యక్షగానంగా మారింది. మారిన క్రమంలో పాటలు పద్యాలు ద్విపదలు రగడలు దరువులు వంతలు తాళాలు – వీటితో పాటు మృదంగం డోలక్ హార్మోనియం వంటి సంగీత వాద్యాలు – కేవలం సంభాషణలకే గాక పాటలకు నృత్యాలు – అన్ని రకాల అభినయాలు తోడయ్యాయి. అప్పటికప్పుడు సామెతలు పొడుపు కథలు జానపద గేయాలు సినిమా పాటలు హాస్యంకోసం పిట్టకథలు వంటి కొత్త కొత్త అంశాలు వచ్చి చేరాయి. ఒక్కోసారి ప్రేక్షకుల కోరిక మేరకు సందర్భానుసారంగా మార్పులు చేర్పులు జరుగుతాయి. ప్రదర్శన జరిగే గ్రామానికి చెందిన భౌగోళిక అంశాలు సామాజికత వంటివి కూడా ప్రదర్శనలో భాగమవుతాయి. దళిత కళారంగ స్వరూపాన్ని అధ్యయనం చేయడానికి డక్కలి జాంబపురాణం గొప్ప వనరుగా ఉపయోగపడుతుంది.

ప్రస్తుతం యక్షగాన రూపంలోని లభ్యమౌతున్న డక్కలి జాంబపురాణంలో సూత్రధారిగా వ్యవహరించే విదూషక పాత్ర (బుడేన్ ఖాన్, బఫూన్, జోకర్ అని పిలుస్తారు) చాలా ప్రధానమైనది. హాస్య స్ఫోరకమైన అతని సంభాషణల్లో సమకాలీన సామాజిక – రాజకీయ – సాంస్కృతిక అంశాలెన్నోదొర్లుతూ ఉంటాయి. అయితే అవన్నీ సందర్భానుసారంగా అవసరానుగుణంగా అప్పటికప్పుడు చోటుచేసుకొనేవే. అందువల్ల ఆ పాఠ్యంలోనూ అందులో ద్యోతకమయ్యే సామాజికాంశాలలోనూ స్థిరత్వముండదు. కానీ అతని మాటల్లో చేతల్లో అంతటా బ్రాహ్మణ వాద నిరసన, మాదిగ కుల చైతన్యం, అణగారిన అట్టడుగు వర్గాల ఆవేశం, జీవితం పట్ల భౌతిక వాద

దృక్పథం, సంచార జీవితంలో లోకం పోకడని పరిశీలించిన విశేష అనుభవం, తద్వారా అలవర్చుకొన్న ఒక ప్రజాస్వామికమైన జీవిత తాత్త్వికత అంతస్సూత్రంగా కనిపిస్తాయి. ఆ విధంగా దేశ పౌరసత్వం పొందలేని దక్కలి కళాకారుడు మానవీయ సందేదనలను ఒంట బట్టించుకొని విశ్వమానవుడుగా దర్శనమిస్తాడు.

దక్కలి జాంబపురాణ యక్షగాన ప్రదర్శనలో బహుదైవ విశ్వాసం కనిపిస్తుంది. జాంబవం శాక్తేయం శైవం ఇస్లాం క్రైస్తవం – వాటన్నిటి సమ్మిళిత సంస్కృతి ఒకటి కాలానుగుణంగా రూపొందింది అనిపిస్తుంది. 'శివుడు శంకర సాంబమూర్తిని/ ఏసుదేవుడు – అల్లా నేనే / / అయిదు నామములు గల / పరమాత్మరూపుడ.. నామములు వేరైనా దేవుడంతా ఒకటే. పశు వులు వేరైనా పాలంతా ఒకటే' వంటి భావజాలం మత సంస్కరణల కాలంలో చోటు చేసుకొన్నది అనడంలో సందేహం లేదు (దక్కలి జాంబపురాణం, జయధీర్ తిరుమలరావు మొ. 2011, పే. 263) అయినప్పటికీ పురాణం పొడవునా మూలపురుషుడైన ఆది జాంబవుడితే అగ్రస్థానం.

సాధారణంగా జానపద సంస్కృతిలో కనిపించే నమ్మకాలు ఆచారాలు విధి నిషేధాలు దక్కలి జాంబ పురాణంలో సైతం కనిపిస్తాయి. అయితే వాటికి ప్రామాణికతను సాధించడానికి దక్కలి వారు నిర్మించే తర్కం విభ్రమం కలిగిస్తుంది. కొండొకచో అది వితండంలాగానూ ఛలవాదంలాగానూ పరిణమించడం చూస్తాం. ప్రదర్శనాంశాలు ఏ మేరకు బ్రాహ్మణీకరణకి గురయ్యాయో తెలుసుకోవాలంటే పటకథనీ యక్షగానాన్నీ తులనాత్మకంగా అధ్యయనం చేయాలి.

కిన్నెర మీద వివిధ చారిత్రక సామాజిక సంఘటనల్ని గానం చేసే దక్కలి కళాకారులు జాంబపురాణాన్ని మౌఖికంగా గద్య కథనం చేస్తారు. అయితే వీరి కథనానికి కూడా మూలం పటకథ లేదా యక్షగాన ప్రదర్శనమో అయివుంటుంది.

నులక చందయ్య జాంబ పురాణంలో చాలా చోట్ల బ్రాహ్మణీయ భావజాలం స్పష్టంగా కనపడుతుంది. తమని తాము మాదిగ మఠాధిపతులు. వారసత్వంగా మాదిగలకు గురు స్థానంలోవుంటూ సంచారం చేస్తూ జాంబ పురాణాన్ని ప్రవచిస్తూ మాదిగల వంశ చరిత్ర చెబుతూ పూజలు అందుకుంటారు. అస్పృశ్యత పాటిస్తారు. మాదిగల యింట వంట తినరు. వారి నుంచి స్వయంపాకం స్వీకరిస్తారు. సాధారణంగా శాకాహారులు. వీరి వేషం భాషా జీవన విధానం బ్రాహ్మణుల్లానే వుంటుంది. రుద్రాక్షలు విబూధి ధరించి బ్రాహ్మణ పీఠాధిపతుల్లాగానే వ్యవహరిస్తారు. తమ గురుత్వాన్ని ప్రామాణీకరించే రాగిరేకుల హక్కు పత్రాలు వీరి వద్ద వున్నాయి. మాదిగమఠంలో వున్న రాగి శాసనం శాలివాహన శకం 1143 ప్రభవ నామ సం. బహుళ త్రయోదశి (క్రీ.శ. 1222) నాటిదిగా పేర్కొంటూ దాని మీద రాసివుంది. ఈ మఠంకూడా అప్పటిదే అని చెబుతారు.

కొలను పాక ప్రసిద్ధమైన జైనక్షేత్రం. శివక్షేత్రం కూడా. శైవ మత ప్రవర్తకుల్లో ఒకరైన రేణుకాచార్య జన్మస్థానం. అక్కడ వున్న ప్రాచీన శివాలయానికి (సోమేశ్వరాలయం) అనుబంధంగా 18 కులాలకు 18 మఠాలు ఉన్నాయి. ఈ శివాలయం పూజారులు జంగములు. అక్కడ వున్న

వేర్వేరు కుల మఠాధిపతులు కూడా జంగములే. 'శాస్య ముని' సంతతిగా, వీరభద్ర గోత్రీకులుగా చెప్పుకొనే (రెండు తరాల నులక చందయ్యలతో ముఖాముఖి సంభాషణలు, మార్చి 1-6-1996, నష్కల్ (గ్రా. వరంగల్ జిల్లా & కొలనుపాక (గ్రా. నల్గొండ జిల్లా, సెప్టెంబర్ 11-12,1997) వీరు తమను మాదిగల వంశానుచరిత్రకు ప్రామాణిక రక్షకులుగా భావిస్తారు. అయితే యుగమునిలా చిందుజింహ్మ మహామునిలా మాతంగమునిలా నులక చందయ్యల మూలపురుషుడైన 'శాస్య ముని' జాంబవ వంశీయుడు కాదు. శివాంశ సంభూతుడు (కొలనుపాక నులక చందయ్యల ఆది జాంబ మహా పురాణం, పులికొండ సుబ్బాచారి, 2008, పు. 49). అందువల్ల బ్రాహ్మణ పురోహితుల్లోలా వీరిలో కూడా ఆధిక్య భావన కనిపిస్తుంది. కానీ మాదిగలకు గురువులుగా వుండడం వల్ల తక్కిన జంగాల చిన్నచూపుకి గురయ్యారు. ఇతర జాంగాలతో కంచం మంచంపొత్తు లేవు. నులక చందయ్య కూడా జాంబవ సంతతేనని ముచ్చయదాసు చిందు జాంబవ పురాణం చెబుతుంది; కానీ అందుకు సంబంధించిన వివరాలు తక్కువ (గడ్డం మచ్చయ దాసు విరచిత చిందు జాంబవ పురాణం – తంగెడ కిషన్ రావు & గడ్డం మోహన్‌రావు, 2015, పు. 140).

నులక చందయ్యల దగ్గర జాంబపురాణం లిఖిత రూపంలో కాగితం చుట్టలుగా లభిస్తోంది. మౌఖికంగా చెప్పే పురాణమే రాతలోకి తర్జుమా చేసినప్పటికీ అసలు సిసలు జాంబపురాణం తమదేననీ అదే అంతిమ సత్యం అని నిర్ధారించే తత్త్వంతోనూ ప్రవర్తిస్తారు. ఆశ్రిత కులాలలో ఉపకులాలలో ప్రచారంలో వున్న జాంబ పురాణాలన్నిటికీ తాము ప్రవచించే పురాణమే మూలమని వారి నమ్మకం. నులక చందయ్యల జీవిత విధానంలో ఆభిజాత్యం, ఆధిక్య భావన ఒకవైపు – ప్రవచించే జాంబపురాణంలో సమత్వ భావన మరొక వైపు – ఇది స్పష్టంగా కనిపించే వైరుధ్యమేగాని కొత్త తరంలోసంస్కరణ భావాలు మొగ్గ తొడుగుతున్నాయి. షెడ్యూల్ కులాల్లో మాదిగల సరసన తమ కులాన్ని నమోదు చేయాలని మీరు కోరుతున్నారు.

నులక చందయ్యల పురాణ ప్రవచన పద్ధతి కూడా బ్రాహ్మణ పౌరాణికుల పద్ధతిని పోలి వుంటుంది. రాతలో వున్న జాంబపురాణాన్ని రాగయుక్తంగా (అధిక భాగం గద్యం) చదువుతారు. ఆ గద్య పాఠ్యం గ్రాంథికంలో వున్న కారణంగా కథని మౌఖికంగా చెబుతూ సొంత వ్యాఖ్యానాలు జోడిస్తారు. రాతలో లేని పాటలూ పద్యాలూ ఈ వ్యాఖ్యానంలో చోటుచేసుకుంటాయి. అందువల్ల వీరి జాంబపురాణ ప్రవచనం మిశ్ర మౌఖిక సంప్రదాయ ధోరణికి చెందినదిగా పరిగణించాలి. లిఖిత జాంబపురాణ అంశాలన్నీ, సుదీర్ఘమైన సూర్య చంద్ర వంశ యాదవ రాజుల వంశచరిత్రలతో సహా, వారికి కంఠగతమే.

నులక చందయ్యలు శివారాధకులు కావడం వల్ల జాంబవుడితోబాటు పురాణంలో శివుడు కూడా ప్రధాన దైవ స్థానం ఆక్రమించాడు. శైవ సంప్రదాయాన్ని అడ్డుబెట్టుకొని బ్రాహ్మణ మతవాదులు తమ భావజాలాన్ని శూద్ర అతి శూద్ర దళిత కులాల్లో ప్రచారం చేయడానికే కులపురాణాల్ని వుపయోగించుకున్నారా అని అనుమానించేంతగా ఈ ఆక్రమణ జరిగింది. నులక

చందయ్యల జాంబపురాణ ప్రవచనంలోకి చొచ్చుకొచ్చిన బ్రాహ్మణీయ భావజాలం గురించి, అందుకు కారణమైన వారి కుల మత సామాజిక నేపథ్యం గురించి ప్రత్యేకంగా పరిశీలించాల్సి వుంది.

అందుకు భిన్నంగా బ్రాహ్మణ భావజాలాన్నీ ఆధిపత్యాలనీ ఖండ ఖండాలుగా చీల్చిన చిందు జాంబవ పురాణం విశిష్టమైన కళారూపం. పరాజితుల విస్మృత చరిత్రగా, ఆర్య పురాణాలకు ప్రత్యామ్నాయంగా ఈ నేల మూలవాసులు స్వయంగా నిర్మించుకొన్న పురాణం యిది. శిష్ట బ్రాహ్మణ వర్గాలు పుక్కిటి పురాణాలని చేసిన తిరస్కారానికి అవమానాలకీ అవహేళనలకీ ధీటైన జవాబుగా నిలువెత్తు ఆత్మ గౌరవ ప్రకటనగా కళ్ళు మిరమిట్లు గొలిపే మెరుగు కాంతితో వెలువడ్డ పురచేతి పురాణ: - Left hand mythology యిది.

ఈ పురాణంలో జాంబవంతుడు మొత్తం జంబూ ద్వీపానికే కాక ఇక్కడున్న మొత్తం ప్రాణ కోటికీ సమస్త ప్రకృతికీ సకల జాతులకూ వారి పంటలకు పశువులకూ పనిముట్లకూ ఆహార వ్యవస్థకూ నాగరికతకూ ప్రతిరూపంగానే కాదు పరిరక్షకుడిగా కూడా కనిపిస్తాడు. సంపద సృష్టికర్తలైన శ్రామిక కులాల వారి ఉత్పత్తి ఫలాల్ని కష్టార్జితాన్ని దోచుకొని సంస్కృతీ నాగరికతలనూ ధ్వంసం చేసి రాజ్యాధికారాన్నీ గుంజుకొని దస్యులుగా అసురులుగా రాక్షసులుగా అస్పృశ్యులుగా ముద్రవేసిన మనువాద ఆర్యబ్రాహ్మణ ప్రతినిధితో సంకుల సమరం చేసే వీర యోధుడిగా జాంబవుడు ఈ పురాణంలో సాక్షాత్కరిస్తాడు. ఆ జాంబవుడే ఇవ్వాళ ఆధునిక ప్రగతిశీల కళా సాహిత్యాలకు దిక్సూచి.

జాంబవ సంతతి క్షేత్రీయులనీ, ఆర్య బ్రాహ్మణ సంతతి వారి వద్ద యాచన చేసేవారనీ, జాంబవులని మోసం చేసి వారి విద్యలనీ శాస్త్రాలనీ వైద్యాన్నీ కళలనీ అపహరించారనీ, జాంబవ పురాణాన్ని నాశనం చేసి అబద్దాలతో కూడిన అష్టాదశ పురాణాలని ప్రచారం చేశారని కూడా చిందు జాంబవ పురాణం తెలియజేస్తుంది. (గడ్డం మచ్చయ దాసు విరచిత చిందు జాంబవపురాణం–తంగెడ కిషన్‌రావు & గడ్డం మోహన్‌రావు, 2015, పుట. 122, 123)

జాంబవుడి వంశ చరిత్రనీ జంబూ ద్వీపాన్నీ ఏలిన జాంబవ రాజుల చరిత్రనీ చిందు జాంబవ పురాణం సగర్వంగా ప్రకటిస్తుంది. హిరణ్యాక్ష హిరణ కశివులనూ బలి చక్రవర్తినీ ఆర్య బ్రాహ్మణులు మోసం చేసి జయించిన ద్రోహాన్ని ఎండగడుతుంది. దురాక్రమణ వాదులైన ఆర్య బ్రాహ్మణుల ప్రతినిధులుగా త్రిమూర్తులు రావణ నరక బాణాది మూలవాసుల రాజుల్ని, త్రిపురాధిపతుల్నీ సంహరించి జాంబవుల నాగరికతను ధ్వంసం చేసిన దుర్మార్గాన్ని ఛీకొడుతుంది. పరశురాముని ఎదిరించిన కార్తవీర్యాది క్షత్రియ రాజుల పరాక్రమాన్ని కీర్తిస్తుంది. ఆర్య బ్రాహ్మణులతో జరిగిన యుద్ధసమయాల్లో ఆదిజాంబవుడు అతని కుమారుడు చిందు జింహ్మ మహాముని కట్టిన గోసంగి వేషాన్ని గొప్ప ఆరాధానతో వర్ణిస్తుంది (వారు ఆనాడు కట్టిన గోసంగి వేషాన్నే ప్రదర్శనలో బ్రాహ్మణ ప్రతినిధితో తలపడ్డానికి చిందు కళాకారులు ఎన్నుకొన్నారు.)

కృత త్రేతా ద్వాపర కలి యుగాలు నాలుగు అని బ్రాహ్మణ వాఙ్మయం పేర్కొంటూ వుండగా జాంబ పురాణాలన్నీ అనంత అద్భుతతామంద తారజాది... యుగాలు 18 అని చెబుతున్నాయి. కానీ అందుకు కారణాన్ని చిందు జాంబవ పురాణం మాత్రమే స్పష్టంగా తెలుపుతుంది. బయట నుంచీ వచ్చిన ఆర్య బ్రాహ్మణుల ఆధిపత్యం కృత యుగం నుంచీ మొదలైంది కాబట్టి అనంత మొదలుకొని అలంకృత వరకు 14 యుగాల పాటు జాంబవ వంశీయులు రాజ్యాలేలిన చరిత్రని తుడిచివేసే కుట్రలో భాగంగా సమస్త మానవ వికాస కాలాన్నీ నాలుగు యుగాలకు కుదించి వేయడం జరిగింద్న ప్రతిపాదన చిందు జాంబపురాణంలో కనిపిస్తుంది. అందుకే మూలవాసుల ప్రత్యామ్నాయ చరిత్ర నిర్మాణానికి జాంబపురాణం గొప్పగా దోహదం చేస్తుందని అనడం.

జాంబవులకు ఇతర శ్రామిక కులాలతో ఉత్పత్తిపరంగా సంస్కృతిపరంగా ఉన్న సంబంధాలను చిందు జాంబవపురాణం ప్రత్యేకంగా పేర్కొంటుంది. గొల్లలతో గౌడలతో సాంస్కృతికంగా సంబంధ బాంధవ్యాలున్నాయని ఆచార వ్యవహారాల్లో ఏకరూపత వుందనీ చిందు డక్కలి జాంబపురాణాలు పేర్కొంటున్నాయి. గొల్లలు మాదిగలకు పాలివాళ్ళనీ, పెళ్ళి తంతులు చావు క్రతువులు ఒకరు లేకుండా మరొకరికి జరగవనీ నొక్కి చెబుతున్నాయి (తంగెడ కిషన్ రావు & గడ్డం మోహన్‌రావు, 2015, పైనే పు. 133).

ఈ నేల మీద సామాజిక విప్లవాన్ని సమానత్వ భావజాలాన్ని ప్రచారం చేసిన వేమన వీరబ్రహ్మంల తాత్వికతని కూడా చిందు జాంబవ పురాణం తనలో ఇముడ్చుకుంది. ఇవ్వాళ దళిత బహుజనుల ఐక్యతకు అవసరమైన బీజాల్ని ఈ పురాణం వెతుక్కోవచ్చు.

దళితులు పోశమ్మ, మైసమ్మ, పోలేరమ్మ, ఎల్లమ్మ వంటి గ్రామదేవతల్ని పూజించడానికి కారణాల్ని కూడా జాంబపురాణాలు పేర్కొంటున్నాయి. బైండ్ల కళాకారులు చెప్పే జాంబవుడి కథల్లో ఎల్లమ్మతో మాదిగలకీ వారి ఉపకులాలవారికీ వున్న అనుబంధం విస్తృతంగా వర్ణించడం చూస్తాం.

బైండ్ల వారు మాదిగలకు పూజారుగా వ్యవహరిస్తారు. పురోహితులుగా పెళ్ళిళ్ళు చేస్తారు. కొలుపులు, జాతర్లకి పట్నాలేస్తారు. క్రతుకాండలు జరుపుతారు. గావు పడతారు. జమిడికలమీద కథాగానం చేస్తారు. బైండ్ల వారు చెప్పే ఎల్లమ్మ కథలో తండ్రి జమదగ్ని ఆజ్ఞ మేరకు పరశు రాముడు తల్లి రేణుకాదేవిని చంపడానికి ప్రయత్నించినపుడు రక్షణ కోసం ఆమె లోకాలన్నీ తిరిగింది. ఆమెను కాపాడటానికి ఎవరూ సాహసించనపుడు జాంబవుడే తన లందలో దాచి రక్షించాడు. ఆ విధంగా ఎల్లమ్మ మాదిగల ఇలవేల్పు అయ్యిందన్న కథని అన్ని జాంబ పురాణాలూ ప్రముఖంగా చెబుతాయి. అందుకే చిందు కళాకారుల్లో స్త్రీలు ఎల్లమ్మ వేషం కట్టడం పరిపాటి అయ్యింది. డక్కలి స్త్రీలు ప్రదర్శనలోగానీ పటకథ చెప్పడంలో గానీ పాలుపంచుకోరు. కొలనుపాక మాదిగ మఠంలో అరుదుగా స్త్రీలు సైతం పురాణం చెబుతారని పరిశోధకులు పేర్కొన్నారు గానీ (పులికొండ సుబ్బాచారి, పైన, 2008) బహిరంగ ప్రదర్శనలు ఇచ్చిన దాఖలాలు లేవు.

స్త్రీలు బృందగానంగా జాంబపురాణం చెప్పడం అనంతపురం జిల్లాలో కనిపిస్తుంది. నల్లచెరువు మండలం కె.పూలుకుంటకి చెందిన పూలుకుంటాదెమ్మ బృందం, మగవాళ్ళు డప్పువాద్య సహకారం అందించగా పాడే జాంబపురాణం పాట పదిహేను 'రాగి తామ్రా'ల్లో (రాగిరేకులు) లభిస్తుంది. మౌఖిక ప్రదర్శనగా సాగే ఈ గేయ కథలో జాంబవుడు తన బిడ్డ యుగముని గొంతుకోసి అతని చర్మాన్ని విశ్వకర్మకు తిత్తిగా ఇవ్వడం స్త్రీల గొంతులో హృదయ విదారకంగా పలుకుతుంది. దక్కలి వాళ్ళకూ మాదిగలకూ మధ్య వున్న అర్థి పోషక సంబంధం విషయికంగా అటు రాయలసీమలోనూ ఇటు తెలంగాణాలోనూ ఒకే విధమైన కథ ప్రచారంలో వుండడం గమనించాలి (APGOML &RI హైదరాబాదు, ఏప్రిల్ 18, 2006 ప్రదర్శన సందర్భంగా చేసిన సంభాషణ).

అన్ని జాంబ పురాణాలు కొద్దోగొప్పో తేడాలతో సృష్టి మూలం గురించి వర్ణిస్తాయి. జాంబవుడు కేవలం మాదిగ కులపురుషుడని మాత్రమే గాక చరాచర జగత్తుకి మూలపురుషుడని పేర్కొంటాయి. ఉత్పత్తి కులాల శ్రమ శక్తిని గౌరవిస్తాయి. ఆ క్రమంలోనే చతుర్ముఖ బ్రహ్మకు ధీటుగా పంచముఖుడైన విశ్వకర్మని సృష్టికర్తగా నిలిపాయి. లోకంలో సమస్త వస్తు సంపద సృష్టికీ తామే మూలకారణమనీ విశ్వకర్మకు ఉత్పత్తి పరికరాలు ఇవ్వడానికి జాంబవుడు తన కుమారుడు యుగమునిని సంహరించిన వృత్తాంతాన్నీ, ఆ తర్వాత మృత శరీరపు అవశేషమైన డొక్కలో నుంచీ దక్కలి బాలకుడు పుట్టిన వైనాన్నీ అన్ని జాంబ పురాణాలూ ఏకీభావంతో ముక్త కంఠంతో గొప్ప గర్వంతో వెల్లడిస్తున్నాయి.

అదేవిధంగా మూలచెన్నయ్య కామధేనువుకు కావలిగా వుండి దాని మరణానికి కారకుడు కావడం, సూదిమాన పర్వతం మీద వున్న జంబవంతుడిని 'మహా దిగిరా' అని ప్రార్థించి తీసుకువచ్చి దాని మాంసాన్ని అతనితో కలిసి అనుభవించడం వంటి అంశాల్లో ఎక్కడా విభేదించడం లేదు. మాలమాదిగల మధ్య చోటుచేసుకొనే ఐక్యత సంఘర్షణలకు ఈ భాగం చక్కటి ఉదాహరణగా నిలుస్తుంది. పంచుకొని పెంచుకోవాల్సిన బాంధవ్యాన్ని నొక్కి చెబుతుంది. వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయం కోరుతున్న ఆదిగల ఆకాంక్షను తరతరాల సాంస్కృతిక సాక్ష్యంగా దీన్ని భావించవచ్చు. ఇవాళ మాలమాదిగల మధ్య వైరుధ్యాలను పరిష్కరించుకోవడానికి అవసరమైన పరికరాలు జాంబ పురాణాంతర్గతమైన మాల చెన్నయ్య పురాణంలో వున్నాయేమో పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఈ ఘట్టంలో పాలు పెరుగు చల్ల వెన్న అనే నాలుగు పంటలతో పాటు కామధేనువు తన మాంసాన్ని అయిదో పంటగా అందించినట్లు పేర్కొనడం మాంసభక్షణం తప్పుకాదని చెప్పడంగా భావించవచ్చు ('గోవును తింటే సాయిబులంటిరి / గోదను తింటే మాదిగలంటిరి / రక్తం చుక్కలే పాలుగా మారెను'. జయధీర్ తిరుమలరావు మొ. 2011, పు. 339).

తోలు, వారు పదాలకు జానపద నిరుక్తి ద్వారా అర్థాలు చెప్పడం, చెప్పు డప్పులు గొప్పదనాన్ని కీర్తించడం అన్ని జాంబపురాణాల్లోనూ సామాన్యంగా వుంటుంది. మాదిగ కుల వృత్తిని, వృత్తి కౌశలాన్నీ, అందులోని కళా నైపుణ్యాలనీ, తోలును శుభ్రపరచడం, దాన్ని అనేక

విధాలు పనిముట్టుల తయారీకి అనుకూలంగా మలచుకోవడం వంటి సాంకేతిక పరిజ్ఞానాన్నీ, సామాజికోపయోగిత వున్న సమస్త ఉత్పత్తి సంబంధాల్లో అనివార్యమైన మాదిగ అస్తిత్వాన్ని వున్నతీకరించడంలో భాగంగా పురాణంలో వీటికి ప్రముఖ స్థానం లభించింది అని చెప్పవచ్చు. ప్రభుత్వ రికార్డుల్లోకి ఎక్కని, షెడ్యూల్ కులాలుగా చట్టంలో గుర్తింపు పొందని, ఆశ్రిత కుల పరిశోధకుల దృష్టికి రాని ఎన్నో కులాల ప్రస్తావన అన్ని జాంబపురాణాల్లోనూ వుంది. వారంతా ఇప్పుడు గుర్తింపును కోరుకొంటున్నారు. జాంబపురాణమే వారికి ప్రాథమిక గుర్తింపు పత్రం. మచ్చయ దాసు చిందు జాంబవ పురాణంలో 34 పోషక కులాలు, వారి కుల గాథలను గానం చేసే ఉపకులాల జాబితా లభిస్తుంది.

ఆశ్రిత పోషక కుల వ్యవస్థలో ప్రధానాంశమైన అర్థి హక్కుల గురించి ప్రతి కులపురాణం నిర్ధారించినట్లే జాంబపురాణం నిర్దేశిస్తుంది. అర్థి హక్కుల్ని మిరాశీ పత్రం స్థాయిలో స్థిరీకరించి నిర్ధారించడం, అందుకు అవసరమైన పాత్యాన్ని నిర్మించడం, పౌరాణికాంశాలను సామాజిక జీవితానికి అన్వయించడం, సామాజికాంశాలను సాంస్కృతిక వారసత్వంతో ముడివేయడం, వాటిని కులకట్టుగా అనతిక్రమణీయ శాసనాలుగా నిర్వహించడం అన్ని రకాల జాంబపురాణాల్లోనూ అనివార్యంగా కనిపించే విషయాలు.

అస్పృశ్య భావాన్ని ఖండిస్తూ జాలా రంగస్వామి వంటి ఆధునిక కవులు రచించిన పాటల్ని (నర జాతిలో అంటు లేదన్నా!) ఆయా సందర్భాల్లో ఉపయోగించడం నులక చందయ్యల పురాణ ప్రవచనంతో సహా (లిఖిత ప్రతిలో లేనప్పటికీ పురాణ ప్రవక్త వివరణల్లో తప్పకుండా వుంటుంది) అన్ని జాంబ పురాణాల్లోనూ కనిపిస్తుంది. అయినప్పటికీ గురుస్థానంలో వున్న నులక చందయ్యలకు మాదిగలు అస్పృశ్యులు. మాదిగలకు అర్థి స్థానంలో వున్న దక్కలి వారు అస్పృశ్యులు. ఈ అంటరానితనం వల్ల వెనుకటి తరం వారికి పెద్ద పట్టింపు లేదు. పనిముట్లు తయారు చేయడానికి యుగమునిని చంపినందువల్ల అతనిచ్చిన శాపమే మాదిగల యీ దురవస్థలన్నిటికీ కారణమని వారి నమ్మిక. ఆ శాపం తీరే కాలం దగ్గరలోనే వుందని విశ్వాసం. కొత్తతరం యువతలో మాత్రం మాదిగ సామూహిక చైతన్యం కారణంగా మాదిగ ఉపకుల కళాకారులతో ముఖాముఖి సంభాషణలు, మార్చి 1-6-1996, నష్కల్ (గ్రా. వరంగల్ జిల్లా). ఈతరం దళితుల ఆత్మగౌరవం గురించి రాజ్యాధికారం గురించి మాట్లాడుతోంది.

మాదిగ సంస్కృతిలోని ఔన్నత్యాన్ని కొనియాడుతూ బ్రాహ్మణాధిపత్యాన్ని అన్ని జాంబపురాణాలూ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నాయి. కులాల మధ్య సాంఘిక అంతరాల్ని ప్రశ్నిస్తాయి. అరుంధతీ వశిష్టుల వివాహ ఘట్టాన్ని అందుకు ప్రధాన వాహికగా ఎన్నుకోవటం అన్ని చోట్ల కనిపిస్తుంది.

చిందు భాగవతుల జాంబ పురాణంలో ఆదిజాంబవ - బ్రాహ్మణుల సంవాదంలో బ్రాహ్మణ ఆధిపత్యం మీద నిరసన, వ్యతిరేకత, అవహేళన ప్రత్యక్షంగా కనిపిస్తాయి. అక్కడ అధిక్షేపం

ఎంతో తీవ్రంగా ఉంటుంది. వ్యంగ్యం చాలా బలంగా ఉంటుంది. సంవాదంలో తర్కబద్ధత వుంటుంది గానీ దాన్ని మించిన ఆవేశం కూడా వుంటుంది. ఒక్కోసారి అది నిందా రూపం తీసుకొంటుంది. మాటలతోనే సమాజంలో బలంగా వేళ్ళూనుకొన్న మనువాద భావజాల ఆధిపత్యం కోరలు పీకి పైచేయి సాధించాలనే తపన, వాగ్యుద్ధంలో గెలవాలనే పట్టుదల కోరిక జాంబవ పాత్రలో కనిపిస్తాయి. దక్కలి జాంబ పురాణంలో కూడా అగ్ర కులాల ఆధిక్యంపై అహంకారంపై వ్యతిరేకత వ్యక్తమౌతుంది. కానీ అది సున్నితంగా ప్రకటితమౌతుంది. తర్కం కంటే హాస్యం మోతాదు ఎక్కువ. అధిక్షేపం కంటే అపహాస్యం పాలు ఎక్కువ. నులక చందయ్యల పురాణ ప్రవచనం 'ఇదీ పురాణంలో అసలు విషయం' అని నిర్ధారించి చెబుతున్నట్టు గంభీరంగా వుంటుంది.

విజేతల అష్టాదశ పురాణ పాఠ్యాలతో, వాటి ద్వారా ప్రచారం చేసిన ఆధిభౌతిక భావజాలంతో తలపడి ప్రత్యామ్నాయ భౌతిక లౌకిక భావాలను ప్రచారం చేసిన పరాజిత క్షత్రియుల కుల మహా పురాణం జాంబపురాణం. క్షతగాత్రమైనప్పటికీ తరాలుగా తల ఎత్తుకొని నిలబడి మాతంగ వాడలో ఎగిరిన ఆత్మగౌరవ పతాకం జాంబ పురాణం. మనుబ్రాహ్మణ వాదం స్థాపించిన అమానవీయ వర్ణ ధర్మ నిర్మూలన కోసం ఎక్కుపెట్టిన అస్త్రం జాంబపురాణం. మూలవాసుల రాజ్యాధికార సాధనం జాంబపురాణ పాఠ్యం. దాన్ని అధ్యయనం చేయడం దళిత సామాజిక సాంస్కృతిక పోరాటాల్లో పాల్గొనే వాళ్ళందరి కర్తవ్యం.

ఆధారాలు:

- దక్కలి జాంబపురాణం (సంపా. జయధీర్ తిరుమలరావు, కె.పి.అశోక్‌కుమార్, ఎ.కె.ప్రభాకర్, ఆర్.భాస్కర్‌రావు), జానపద ప్రచురణ, హైదరాబాదు తొలి (1998), మలి (2011) ప్రతులు
- జాంబపురాణం – మాదిగల కుల సాంస్కృతిక చరితం, చిందు భాగోతం (సంపా. బిట్టు వెంకటేశ్వర్లు), జానపద కళా పరిశోధన వేదిక, హైదరాబాద్, 1997.
- కొలనుపాక నులక చందయ్యల ఆది జాంబవ మహాపురాణం (సంపా. పులికొండ సుబ్బాచారి), ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం, 2008.
- గడ్డం మచ్చయదాసు విరచిత చిందు జాంబ పురాణం (సంపా. ప్రొ.తంగెడ కిషన్‌రావు, గడ్డం మోహన్ రావు), చిందు పబ్లికేషన్స్, హాజీపూర్ 2015.
- కొలనుపాక మాదిగ మఠంనులకచందయ్యల నుంచి సేకరించిన జాంబ పురాణం కాగితం చుట్టల రాత ప్రతికి నకలు ప్రతి.

2. వ్యాసాలూ సమీక్షలు:

- దక్కలి – తదితర దళిత కులాల జానపద సంస్కృతీ అధ్యయన సదస్సు, నష్కల్, వరంగల్ (1-6, మార్చి- 1996) – నివేదిక
- నేను – జయధీర్ – దక్కలి గోపాల్, జయధీర్ తిరుమలరావు (నిజామాబాద్ టైమ్స్, 8 మే 2014)

- దళిత తాత్త్విక చింతనకు పునాది జాంబ పురాణం – ఎ.కె.ప్రభాకర్ (ఆంధ్రజ్యోతి ఆదివారం నవంబర్ 1997)
- సమాంతర సాంస్కృతిక దర్పణం: దక్కలి జాంబపురాణం. కె.పి.అశోక్‌కుమార్ (ఆంధ్రభూమి, 19 జూన్. 2011)
- దక్కలి జాంబ పురాణం –Halley (మే 9, 2014, http://pustakam.net/?p=16792)
- గోసంగి వేషం – మందకృష్ణమాదిగ (డిసెంబర్ 28, 2008) https://mandakrishnamadiga.wordpress.com/2008/12/28/the-gosangi-vesham/)
- 'మార్పు' తాత్విక కోణమే జాంబపురాణం,భూపతి వెంకటేశ్వర్లు (నవ తెలంగాణా, 5 జూలై 2015)

3. ప్రదర్శనలు:

- దక్కలి జాంబ పురాణం యక్షగానం (కన్నెగంటి గోపాల్ – నష్కల్, మేళం) వరంగల్ జిల్లా, నష్కల్ గ్రామం, ..., హైదరాబాదు ప్రదర్శనలు.
- దక్కలి జాంబపురాణం – పటకథ (బాణాల పెద్ద ఎల్లయ్య – రామ్మదుగు, కరీంనగర్ జిల్లా, కర్నెగంటి రాజయ్య, కర్నెగంటి చినరాజయ్య – నిష్కల్, వరంగల్ జిల్లా) నష్కల్‌లో మార్చి, 5, 96
- గోసింగి వేషం (గజవెల్లి వెంకటనర్సు – ఇప్పగూడెం, స్టే, ఘనపూర్) నష్కల్‌లో మారి&, 3, 96 నాటి ప్రదర్శన
- నులక చందయ్యల(నందాదీపం నాగలింగం, నందాదీపం సోమలింగం, మిర్యాల మల్లయ్య – నల్గొండ జిల్లా కొలనుపాక గ్రామం, మాదిగ మఠం) జాంబ పురాణ ప్రవచనం, మార్చి 4, 1996జ
- దక్కలి జాంబ పురాణం, మాల చెన్నయ్య పురాణం, రెండు రోజుల సదస్సు డాక్యుమెంటేషన్, కొలనుపాక, నల్గొండ జిల్లా, సెప్టెంబర్ 11-12, 1997జ
- ఎల్లమ్మ కథ, బైండ్ల కళారూపం, జిలకర సామనాగయ్య, వలిమిడి గ్రామం, పాలకుర్తి మండలం – బృందం, నష్కల్ మార్చి 2, 1996 & కొలనుపాక, నల్గొండ జిల్లా, సెప్టెంబర్ 12, 1997 ప్రదర్శనలు.
- చిందు జాంబ పురాణం (గడ్డం స్వామి – బోగారం దళం) అక్టోబర్ 3, 99న హైదరాబాదు ప్రదర్శన
- దక్కలి స్త్రీల పాటల్లో జాంబ పురాణం (పూలుకుంట ఆదెమ్మ బృందం, అనంతపురం జిల్లా, నల్లచెరువు మండలం, కె.పూలుకుంటగ్రామం) APGOML & RI హైదరాబాదు, ఏప్రిల్, 18, 2006.

–దక్కలి, చిందు కళాకారులతో, నులక చందయ్యలతో భిన్న సందర్భాల్లో చేసిన ముఖాముఖి సంభాషణలు

– కిన్నెర కళాకారుల జాంబ పురాణ గానం (డాకూరు కిష్టప్ప, రేణికుంట పోశప్ప, తిమ్మయ్య – జిట్లేరు, మక్తల్ మం. మహబూబ్ నగర్ జిల్లా), UOH హైదరాబాద్, మే 9, 2016 ప్రదర్శన.

సి.పి.బ్రౌన్ ప్రజాస్వామిక భాషా దృక్పథం

– వి. చెంచయ్య

దృక్పథం అంటే చూసే విధానం. ఒక విషయాన్ని చూసే పద్ధతిలో ఎవరి ప్రత్యేకత వారికుంటుంది. అది సాంప్రదాయిక విధానం కావచ్చు, ప్రగతిశీల పద్ధతి కావచ్చు. మరేదైనా కావచ్చు. కాబట్టి భాషను చూసే పద్ధతిని భాషా దృక్పథం అనొచ్చు. సాంప్రదాయికంగా మనకలవాటైన భాషా దృక్పథానికీ, బ్రౌన్ భాషా దృక్పథానికీ, బ్రౌన్ భాషా దృక్పథానికీ స్పష్టంగా తేడా ఉంది. భాష పుట్టుక గురించిన విషయంలో, భాషను నేర్చుకోవడం లేదా నేర్పడంలో, పదాలకు అర్థాలను నిర్ణయించడంలో, స్పెల్లింగ్ విషయంలో – ఇలా అన్నిటిలోనూ ఈ దృక్పథం వ్యక్తమవుతూ ఉంటుంది.

"I had intercourse with all classes, from the learned pundit to raja, to the illiterate prosecutor or prisoner. Tradesmen, doctors, hunters and sailors, poets and painters all became my instructors as they fell in my way" అని బ్రౌన్ తన తెలుగు – ఇంగ్లీషు నిఘంటువు ముందు మాటలో చెప్పుకున్నాడు. కోర్టులో ముద్దాయిల, సాక్షుల మాటల్నీ, వాది ప్రతివాదుల సంభాషణల్నీ జాగ్రత్తగా గమనించేవాడు. తనకు తటస్థపడ్డ పండితుల నుండి పామరుల దాకా అందరూ తనకు భాష నేర్పు గురువులుగానే కనిపించేవారు. భాష పండితుల దగ్గరే ఉంటుందన్న భ్రమ బ్రౌన్‌కు లేదు. పామరులు మాట్లాడేది కూడా నేర్చుకోదగిన భాషేనని బ్రౌన్ అభిప్రాయం. ఈ దృష్టికోణం వల్లనే బ్రౌన్ సులభంగా తెలుగు భాషను నేర్చుకోగలిగాడు.

25 ఏళ్ళ వయసు వచ్చేదాకా బ్రౌన్ నేర్చుకున్నది వ్యావహారిక భాష మాత్రమే. అప్పటికే ఎంతోకొంత కృషి చేసిన పాశ్చాత్యులు కొందరు తెలుగు భాష, తెలుగు సాహిత్యం చాలా క్లిష్టమైనవని బ్రౌన్‌ను భయపెట్టి ఉన్నారు. కాని బ్రౌన్ భయపడలేదు. ఇలా భయపడకపోవడానికి భాషను నేర్చుకోవడంలో బ్రౌన్‌కున్న దృక్పథమే కారణం. అందుకే "I think Telugu will no longer be considered the most difficult language in India" అని స్వీయచరిత్రలో రాసుకున్నాడు.

బ్రౌన్ దృష్టిలో భాష నేర్చుకోవడం అంటే ప్రజలు ఎలా మాట్లాడతారోమొదట గమనించటం. ఆ తర్వాత మాత్రమే గ్రంథాలలోని భాష నేర్చుకోవాలి. పరభాషను నేర్చుకొనే వారికి ఇది మొదటి సూత్రం. కానీ మన పండితులు దీనికి విరుద్ధంగా నేర్పిస్తారు. అందుకే తెలుగు భాష కష్టం అనే దురభిప్రాయం ఏర్పడింది. మొదట జాబులు, అర్జీలు, పత్రికావార్తలు మొదలైనవి చదవాలి. ఆ తర్వాత మాత్రమే పద్యాలు చదవడం ప్రారంభించాలి. పద్యాలలో కూడా మొదట వేమన పద్యాలు, సుమతీ శతకం పద్యాలు లాంటి సులభ శైలిలో ఉన్నవి చదవాలి. మన పండితుల అభిప్రాయాల్ని పక్కనబెట్టి, బ్రౌన్ తన సొంతప్రణాళిక ప్రకారం తెలుగు భాషను నేర్చుకున్నాడు. తెలుగు సాహిత్యాన్ని చదివాడు. భాషను నేర్పించే విషయంలో ఈనాటికీ మనం పాత దృక్పథాన్ని వదిలిపెట్టడంలేదు.

అందుకే మన విద్యార్థులకు అటు గ్రాంథిక భాషగానీ, ఇటు వ్యావహారిక భాషగానీ సక్రమంగా రావడంలేదు. దీనికి కారణం మనం అనుసరిస్తున్న విధానంలో లోపమే. ఎవరికైనా కొద్దిమందికి భాష సరిగ్గా వస్తున్నదంటే అది వారి ప్రయత్న ఫలితమేగాని, మన ప్రణాళిక ఫలితం కాదు.

ప్రతి భాషకీ వర్ణ సంయోజన పద్ధతులూ, పద సంయోజన పద్ధతులూ కొన్ని ఉంటాయి. రెండు వర్ణాలు కలిసి ఒక అక్షరంగా ఏర్పడితే దాన్ని వర్ణ సంయోజనం అంటారు. ఏ రెండు హల్లులైనా ఒక అక్షరంలో కలుస్తాయనుకోవడం సరైన అవగాహన కాదు. కొన్ని హల్లులు మాత్రమే అలా కలుస్తాయి. కొన్ని హల్లులు అసలు కలవవు. ఉదాహరణకు స్ఠ, స్థ, ష్ఫ, ర్య, ఖ్బ వంటి వర్ణ సంయోజనాలుండవు. అలాగే మంచివాడు అంటామేగాని, మంచివీడు అని అనం. వాడు, వీడు అనేవి రెండూ సర్వనామాలేగదా, మంచి అనే విశేషణంలో 'వాడు' కలిపినప్పుడు 'వీడు' ఎందుకు కలవదు అనేతర్కం ఇక్కడ పనికిరాదు. ఇలాంటి వర్ణ, పద సంయోజనాల్ని మొదట గుర్తించిన వాడు బ్రౌన్.

తెలుగు వాళ్ళు సంస్కృత పదాల్ని తరచుగా తప్పుగా ఉచ్చరిస్తారని బ్రౌన్ అంటాడు. "The Telugus as negligent in spelling as the English were before the days of Johnson. the words borrowed from Sanskrit are often mispelt" అని మిశ్ర భాషా నిఘంటువు ముందు మాటల్లో చెప్పాడు. సంస్కృతంలో ఉన్నట్టుగా పలకడం సాధారణ ప్రజలకు సాధ్యంకాదు. తమ మాతృ భాష ఉచ్చారణ పద్ధతి అనుకూలంగా పలుకుతారు. ఇది తెలుగు వాళ్ళకే కాదు, ఏ భాషా ప్రజలకైన సహజమే. తెలుగు పదాల్ని తెలుగు వాళ్ళు పలికినట్టుగా ఇంగ్లీషువాళ్ళు పలకలేరు. అలాగే ఇంగ్లీషు పదాల్ని ఇంగ్లీషువాళ్ళు పలికినట్లుగా తెలుగువాళ్ళు పలకలేరు. దీనికి కారణం ఆయా ప్రాంతాల శీతోష్ణ పరిస్థితులు, ఆయా ప్రజల వాగవయవ నిర్మాణాలు మొదలైనవి. తెలుగు భాషలో మహాప్రాణ ధ్వనులు లేవు కాబట్టి, సంస్కృతంలోని మహాప్రాణాల్ని తెలుగువాళ్ళు అల్పప్రాణాలుగా పలికే అవకాశం ఉంది. ఇలా ఉచ్చరింపబడ్డ పదాల్నే తద్భవాలన్నారు. కాబట్టి తప్పుగా ఉచ్చరిస్తున్నారనడం సరైంది కాదు. భాష ప్రకృతి అయితే బాస వికృతి, అంటే తద్భవం. అయితే మన పండితులు ఈ తద్భవాల్ని కూడా ఫలానే పదాలే తద్భవాలు అని నిర్ధారించేశారు. 'భాష'ను ఎవరైనా 'భాష' అంటే దీన్ని తద్భవంగా అంగీకరించరు. వాళ్ళ దృష్టిలో 'బాస అన్నదే తద్భవం, 'బాష' అన్నది తప్పు ఉచ్చారణ.

తెలుగు ఇంగ్లీషు నిఘంటువులో బ్రౌన్ 'ఘ' అనే అక్షరాన్ని ఆరోపంగా ఇచ్చి ఇలా రాశాడు – "The Telugu etymologists declare that no Telugu word ought to be spelt with an aspirate; but this rule is not acknowledged by the people in general who always pronounce and write ఘట్టిగా, ఘమ్మని .. గట్టిగా, గమ్మని". ఇక్కడ ఉచ్చారణ తారుమారైంది. మహాప్రాణాలకు బదులు అల్పప్రాణాలను అల్పప్రాణాలను పలికే తెలుగువాళ్ళు తెలుగు పదాలలోని అల్పప్రాణాలను మహాప్రాణాలుగా పలుకుతున్నారు. అలా అని అన్ని అల్ప ప్రాణాలనూ మహాప్రాణాలుగా పలకరు. నొక్కి చెప్పవలసిన సందర్భాల్లో మాత్రమే అలా పలుకుతారు. గట్టిగా

అనే శబ్దానికున్న భావావేశం బహుశ అలా పలికిస్తుంది. బ్రౌన్ భాషా పరిశీలనలో ఇలాంటి విషయాలు కొన్ని కనిపిస్తాయి.

19వ శతాబ్దంలో కాల్డ్‌వెల్ ద్రావిడ భాషా కుటుంబాన్ని చెప్పి, అందులో 12 ద్రావిడ భాషలున్నాయనీ, వాటికి మూలం మూలద్రావిడ భాష అనీ చెప్పేదాకా తెలుగునాట "జనని సంస్కృతంబు సకల భాషలకును" అనే నానుడి వాడుకలో ఉండేది. 'సకల భాషలకును' అనే మాట అటుంచి, కనీసం తెలుగు భాషకైనా తల్లి సంస్కృతం కాదనే విషయం శాస్త్రీయంగా నిరూపించబడింది. తెలుగు భాషపైన సంస్కృత ప్రభావం ఎంతయినా ఉండొచ్చు, తెలుగులో సంస్కృత శబ్దాలు ఎన్నైనా ఉండొచ్చు. అది సంస్కృతం నుండి తెలుగు పుట్టిందనడానికి కారణం కాదు. వ్యాకరణం, అందులో భాగమైన వాక్య నిర్మాణం ఒక భాష మరో భాష నుండి పుట్టిందా లేదా అని నిర్ణయించడానికి గీటురాళ్ళు. "Sanskrit is to the southern tonguas, what Arabic is to Hindustani, or Latin is to English, ... But the grammar of Telugu is independent of Sanskrit" అన్నాడు బ్రౌన్. (తెలుగు, ఇంగ్లీసు నిఘంటువు ముందుమాట). సొంత పరిశీలన లేకుండా దేన్నీ నమ్మే స్వభావం బ్రౌన్‌కు లేదు. బ్రౌన్‌కంటే బాగా మన పండితులకు సంస్కృతం, తెలుగు భాష వ్యాకరణాలు తెలుసు. కానీ వ్యాకరణం ఒక భాష నుండి మరో భాష పుట్టిందని నిర్ధారించడంలో ప్రధాన పాత్ర వహిస్తుందనే విషయాన్ని మనం గుర్తించలేకపోయాం.

ప్రాచీన కాలంలో సంస్కృతమే మన ప్రపంచం. అదే మనకు సర్వస్వం. వేదాలు, ఇతిహాసాలు, పురాణాలు సంస్కృతంలోనే ఉన్నాయి. తెలుగు లిఖిత సాహిత్యం ప్రారంభ చరిత్ర అంతా సంస్కృతం నుండి తెలుగులోకి అనువాదం చేసుకోవడమే. అందువల్ల సంస్కృత పదాలు తెలుగులోకి కుప్పలుతెప్పలుగా వచ్చిపడ్డాయి. ఆంధ్రశబ్ద చింతామణి అనే తెలుగు వ్యాకరణం సంస్కృతంలోనే రాయబడిందంటే ఆనాటి పండితులు సంస్కృతానికిచ్చిన ప్రాధాన్యం ఎంతటిదో అర్థమవుతుంది. ఇవన్నీ నిజాలే అయినా, తెలుగు సంస్కృతం నుండి పుట్టిందనడం నిజం కాదు. ఇలాంటి మౌలిక విషయాల పట్ల సునిశిత పరిశీలన బ్రౌన్ భాషా దృక్పథంలో ప్రధానమైన విషయం.

"In some places a hard initial is softened: that is T changes into D; or P into B & C. పడుట>బడుట, కలుగుట>గలుగుట. But a soft letter is never changed into a hard one" అని Explanation of theTelugu Alphabet అనే వ్యాసంలో అన్నాడు. పదాది పరుషాలు సరళాలుగా మారతాయనే విషయం మనకు తెలిసిందే. మన వ్యాకరణవేత్తలందరూ చెప్పిన విషయమే. ఇది మనకు కొత్త కాదు. అయితే సరళం ఎప్పుడూ పరుషంగా మారదని బ్రౌన్ అన్నాడు, ఇందులో ఆధునిక భాషా శాస్త్రం సూత్రం ఇమిడి ఉంది. భాషలో మార్పులు ఇష్టం వచ్చినట్టు జరగవు. వాటికొక పద్ధతి ఉంటుంది. ఆ పద్ధతే పరుషాలు సరళాలుగా మారతాయేగాని, సరళాలు పరుషాలుగా మారవనడం.

"All the nasal letters may be changed into 'O' sunna either when they are followed by a consonant or when they are final" (Explanation of theTelugu Alphabet) సున్నా అనేది ఒక ప్రత్యేక వర్ణం కాదనే విషయాన్ని బ్రౌన్ ఈ మాటల్లో సూచించినట్టయింది. 5 అనునాసిక వర్ణాలకూ కలిపి మనం ఏర్పర్చుకున్న ఒక లిపి సంకేతమే సున్న. అందుకే సున్నకు ఒకే రకమైన ఉచ్చారణ లేదు. అయితే రకాల ఉచ్చారణలున్నాయి. సంస్కృతంలో అసలు సున్న అనేదే లేదు. తెలుగులిపిలో రాసినట్లు సంస్కృతంలో సున్నను రాయరు. ఆయా అనునాసికాలనే రాస్తారు – అఙ్గం, పఞ్చ, దణ్డకం, గ్రన్థం, కమ్పనం మొదలైన విధంగా, తెలుగులో ఈ పదాల్ని అనునాసిక వర్ణాల్ని తీసేసి, వాటి స్థానంలో 'ం'ను చేర్చి రాస్తాం. సంస్కృత పదాలయినా, తెలుగు పదాలయినా మనం ఈ పద్ధతినే పాటిస్తాం – వంక, పంచ, బండ, కింద, కంప మొదలైన విధంగా. ఒకవేళ ఈ పదాల్ని సంస్కృత లిపిలో రాయవలసి వస్తే వఙ్క, పఞ్చ, బణ్డ, కిన్ద, కమ్ప మొదలయిన విధంగా రాయాలి. తెలుగులో సున్నను రాసే లేఖన సంప్రదాయం ఉంది కాబట్టి, సున్నను ఒక వర్ణంగా భ్రమించే అవకాశం ఉండొచ్చు గాని, సంస్కృతంలో ఆ అవకాశమేలేదు. కాని తెలుగులో ప్రామాణికంగా భావింపబడే చిన్నయసూరి బాలవ్యాకరణంలో కూడా తెలుగుతోబాటు సంస్కృతంలోనూ 'ం' ఒక వర్ణంగా ఇవ్వబడింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే బ్రౌన్ 'ం' ను ఒక వర్ణంగా ఇవ్వలేదు.ద బ్రౌన్ వర్ణమాలలో ం, ఁ లేవు. అందుకే బ్రౌన్ 'ం'ను letter అనడు, circle అంటాడు.

చేత, లేత, మేక మొదలైన పదాల్లోని 'ఏ' అనే అచ్చును ఏగా పలకం. 'ఏ'ని నిమ్నొచ్చుగా పలుకుతాం. దానికి తెలుగులో లిపి సంకేతం కాదు. భాషా శాస్త్రంలో దీనికి లిపి సంకేతం (æ) ఉంది. తెలుగు మాతృభాషగా కలిగిన వాళ్ళకు లిపి లేకపోయినా ఇలా పలకడం తెలుసు. అకారానికి పూర్వం ఉన్న 'ఏ' నిమ్నొచ్చుగా పలకబడుతుందని భాషా శాస్త్ర సూత్రం. ఈ సూత్రాన్ని చెప్పకపోయినా ఉచ్చారణలోని ఈ తేడాని మొదట గుర్తించినవాడు గిడుగు రామమూర్తి పంతులని చేకూరి రామారావు గారన్నారు. కాని గిడుగుకు ముందే బ్రౌన్ దీన్ని గుర్తించాడు. అకారానికి పూర్వం ఉన్న 'ఏ' ఇలా పలకబడుతుందని బ్రౌన్ చెప్పలేదుగాని, కొన్ని పదాలిచ్చి వాటిలోని 'ఏ' అనే అచ్చును కొంచెం తేడాగా పలుకుతామని అన్నాడు. బ్రౌన్ ఇచ్చిన ఉదాహరణలు ఇవి – వేళ–వ్యాళ, లేత–ల్యాత, పేట–ప్యాట, చేత–చాత, చేప–చాప. ఈ ఉదాహరణల్ని చూస్తే భాషా శాస్త్ర సూత్రం సరిగ్గా ఇక్కడ అన్వయిస్తుంది.

మనకు వ్యాకరణాలున్నా, నిఘంటువులన్నా గ్రాంథిక భాషను దృష్టిలో పెట్టుకొనే తయారు చేస్తారు. వీటికి కావ్య ప్రయోగాలు చాలా ముఖ్యం. "లక్షణ విరుద్ధంబగు భాష గ్రామ్యంబు", "ఈ భాష ప్రయోగంబున కనర్హంబు" – ఇవి చిన్నయసూరి మాటలు. లక్షణమంటే గ్రాంథిక భాషా లక్షణమే గాని, వ్యావహారిక భాషకూ, గ్రామ్యభాషకు కూడా లక్షణముంటుందనే దృష్టిలేదు. లక్షణం లేకుండా మాండలిక భాష కూడా ఉండదు. అయితే దేని లక్షణం దానిది. బ్రౌన్ శిష్టవ్యావహారిక

భాష అనే మాట వాడినట్టు కనిపించదు. వ్యావహారిక భాష, గ్రామ్యం అనే మాటల్నే ఉపయోగించాడు. ఈ రెండిటినీ కూడా ఒకే అర్థంలో వాడాడు. బ్రౌన్ దృష్టిలో వ్యావహారికమంటే గ్రామ్యం అనే. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే మాండలికమే. బ్రౌణ్యంలో రాయలసీమ మాండలిక పదాలు చాలా కనిపిస్తాయి. నిండా, శానా, శానామాట్లు, శానామంది, చీదర, మునుపు, యిన్నూరు, విచినాడు, వండినాడు, పిల్లకాయలు, పిల్లగాడు మొదలైన రాయలసీమ మాండలికాలు ఎన్నో ఉన్నాయి. వీటిలో నిండా, శానా, చీదర, మునుపు, ఇన్నూరు, పిల్లగాడు మొదలైన వాటిని నిఘంటువులో ఆరోపాలుగా కూడా ఇచ్చాడు. వీటిలో నిండా, శానా, చీదర లాంటి పదాలు శబ్దరత్నాకరంలో ఆరోపాలుగా లేవు. ఇన్నూరు శకట రేఫతో ఉంది. ఉచ్చారణలో వినిపించని అరసున్ననూ, ఉచ్చారణలో సాధురేఫతో భేదం లేని శకటరేఫనూ బ్రౌన్ తన నిఘంటువులో తొలగించాడు.

తెలుగులో అచ్చులు అనవసరం అని బ్రౌన్ అభిప్రాయపడ్డాడు. వాటిని యకార, వకారాలు చేర్చి వాడుకోవచ్చన్నాడు. అయితే దీన్ని తన ఆలోచనకే పరిమితం చేశాడు. ఆచరణలోకి తేలేదు. ఉచ్చారణలో ఎలా ఉన్నా, రాతలో అచ్చుల్ని వాడుతున్నాం కాబట్టి తన ఆలోచనను ఆలోచనకే పరిమితం చేశాడు. బ్రౌన్ తన డిక్షనరీ నోట్స్‌లో ఈ చర్చ చేశాడు. అయితే బ్రౌన్ కూడా గుర్తించని విషయం ఇక్కడ ఒకటుంది. అ, అలసు మాత్రం పదాదిలో అచ్చులుగానే పలుకుతాం. తక్కిన అచ్చులన్నిటినీ పదాదిలో కూడా యకార వకారాల్ని చేర్చి పలుకుతాం. గ్రాంథిక భాషలో అన్ని అచ్చులకూ యడాగమ సందర్భంలో యకారం వస్తుంది. వకారం వ్యావహారిక భాషలోనే వస్తుంది. ఈ కింది ఉదాహరణల్ని చూడండి:

మా+ అమ్మ = మాయమ్మ	
మా+ ఇల్లు = మాయిల్లు	అయితే ఈ యడాగమం అన్ని సందర్భాల్లో రాదు.
మా+ఊరు = మా యూరు	సంధి జరగని చోట మాత్రమే వస్తుంది.
అది+ఏమి = అది యేమి	ఇది గ్రాంథిక భాషా నియమం
ఇది+ ఒకటి = ఇది యొకటి	

గ్రాంథిక భాషలో అన్ని అచ్చులకూ యడాగమం వస్తుంది. వ్యావహారిక భాషలో ఉ, ఊ, ఒ, ఓ లకు మాత్రం వకారం వస్తుంది. అ, ఆ లను అ, ఆలు గానే పలుకుతాం. ఇ, ఈ, ఎ, ఏ లను మాత్రం యి, యీ, యె, యేలుగా పలుకుతాం.

అది – అది (యది అనం)	
ఆట – ఆట (యాట అనం)	
ఇక్కడ – యిక్కడ	
ఈనాడు – యీనాడు	వ్యావహారిక ఉచ్చారణను బట్టి అచ్చులు అవసరం అని
ఉడుత – వుడుత	అనుకున్నా అ, ఆలు మాత్రం అవసరం. మాయమ్మ లాంటి

ఊయల – వూయల   అరుదైనసందర్భాల్లో మాత్రమే 'అ' 'య'గా వ్యవహారంలో కూడా
ఎక్కడ – యెక్కడ   ఉచ్చరింపబడుతుంది. అక్కడ అది ఉన్నది అంటామే గాని
ఏది – యేది   ఇక్కడ యది ఉన్నది అనం.
ఒకటి – వొకటి
ఓడ – వోడ

ఏమయినా, రాతకూ ఉచ్చారణకూ ఉన్న తేడాల్ని ఆనాటికి ఇలా చర్చించడమే బ్రౌన్ భాషా పరిశీలనకు తార్కాణం.

అన్ని సందర్భాలనూ బ్రౌనుకు వ్యావహారిక భాషా దృష్టి ఉంది గానీ, గిడుగు లాగా దాన్ని ఒక ఉద్యమంగా చెయ్యలేదు.

'పలుగురాయి' అనేదాన్ని ఆరోపంగా ఇచ్చి అర్థంగా - A mass of stone; generally applied to white marble అని ఇచ్చాడు. దీన్ని నిర్ధారించిన విధానం గురించి: సన్నపాటి మొరపరాళ్ళు i.e. gravel అని ఎవరో చెప్పిన దాన్ని నమ్మలేదు. స్వయంగా పరిశీలించి అర్థాన్ని నిర్ణయించాడు. "I have visited a village named పలుగురాలపల్లె in the Cuddapah district (in the year 1827) and absorved that the place was full of white marble stones" అని తన డిక్షనరీ నోట్స్‌లో రాసుకున్నాడు. (D.1391. vol.3)

'ఏమి' అనే పదం వ్యవహారంలో ఎన్ని సూక్ష్మమైన అర్థ భేదాల్లో ఉందో బ్రౌణ్యంలో ఇచ్చిన ఉదాహరణ వాక్యాలు చూస్తే తెలుస్తుంది. వాడు యేమయినాడు, ఇంక చేయవలసినది మరియేమి లేదు, నేను కూడా ఉండడం వల్ల ఫలమేమి, వాడేమి నేనేమి, వచ్చినాడా ఏమి, ఎవ్వడైనానేమి, యేమి వచ్చినావు, యేమిటీ.

'పులసరము' అనే పదానికి indigestion అని అర్థం ఇచ్చాడు. నోట్స్‌లో ఇలా రాసుకున్నాడు - I heard this word in a comedy acted at Rajahmundry. వానికి కడుపులో పులసరముగా ఉన్నది, బేదికి తీసుకవలసినది. (D.1391. vol. 3)

'బేడ' అనే పదానికి half an anna అని మాత్రమే ఇచ్చాడు. బేడ అంటే 2 అణాలు గదా, అర్ధణా అనే అర్థం ఏమిటి అనుకుంటాం. అవన్నీ పరిశీలించే క్రమంలో నోట్స్‌లో ఇలా రాసుకున్నాడు: బేడ in Guntur means half an anna but in Nellore it means two annas. (D.1391.Vol.3)

'అంకణము' అనే దానికి రెండు దూలముల లేక స్తంభముల నడిమి ప్రదేశము అని బ్రౌణ్యంలోఉంది. శబ్దరత్నాకరంలో 'నలుచదరపుచోటు' అని మాత్రం ఉంది. బ్రౌణ్యంలో అంకణానికి ఒక కొలత తెలుస్తుంది. శబ్దరత్నాకరంలో కొలత తెలియదు. నలుచదరపుచోటు అంటే చిన్నదైనా కావచ్చు, ఎంత పెద్దదయినా కావచ్చు.

'క' అనే అక్షరాన్ని ఆరోపంగా ఇచ్చి శబ్దరత్నాకరకారుడిచ్చిన అర్థం 'ఒక యక్షరము' అని, బ్రౌణ్యం ఇచ్చిన అర్థం - Ka is a sign of the negative participle as చేయక, రాక అని ఇచ్చాడు.

'అనిమిష' శబ్దానికి అర్థంగురించి ఆలోచిస్తూ నోట్స్‌లో ఇలా రాసుకున్నాడు – "దేవతలు విగ్రహాల రూపంలో ఉంటారు. విగ్రహాలకు రెప్పపాటు లేదు. కాబట్టి అనిమిషులు". ఇది నిఘంటువులో ఇవ్వలేదు గాని, బ్రౌన్ చూపు ఎలా ఉంటుందో, బ్రౌన్‌లోని sense of humour ఎలాంటిదో తెలుస్తుంది.

"While at cadapa, I read Greek, Hebreu and Person" అని స్వీయచరిత్రలో రాసుకున్న వాక్యంలో కడపకు స్పెల్లింగ్ Cadapa అని రాశాడు. Cuddapah అని రాయడం ఇష్టంలేదు. ఇన్నాళ్ళకు మనం Kadapa అని మార్చుకున్నాం.

శిథిలమైపోతున్న తాటాకు ప్రతుల నుండి కాగితం ప్రతుల్ని తయారు చేసేటప్పుడు పద్యాలకు పాద విభజన చేయడం, పద్యాలకూ వచనాలకూ సంఖ్యలను నిర్దేశించడం, విరామ చిహ్నాలు సూచించడం, విషయ సూచికలు ప్రవేశపెట్టడం – ఇవన్నీ భాషకు సంబంధించినవే. భాషపట్ల బ్రౌన్ శ్రద్ధను తెలియజేసేవే. ఇవి ఇవాళ మనకు అలవాటైపోయాయి కాబట్టి మనకేమీ అనిపించకపోవచ్చుగానీ, మొదట వీటిని ప్రవేశపెట్టేటప్పుడు ఎంత శ్రమ, ఎంత పరిశీలన అవసరమో ఊహించుకోవచ్చు.

బ్రౌన్ కాలం నాటికి తెలుగులో రాయవాచకం లాంటి ఒకటీ అరా తప్ప వచన రచనలు లేవు. కావ్యాలలో ఉండే వచనం వచనం కాదు. అది ఛందస్సు లేని పద్యం. తెలుగు విద్యార్థులకు వచన రచనల అవసరాన్ని గుర్తించాడు బ్రౌన్. వచన రూపంలో మనకు లభించిన తొలి తెలుగు లేఖలు బ్రౌన్ సేకరించి భద్రపరచినవే. వీటిలో ఆనాటి తెలుగు భాషా స్వరూప లక్షణాలు తెలుస్తాయి. భాషా పరిణామ చరిత్రకు ఇవి ఎంతో ఉపయోగకరం. కుంటి, గుడ్డి, అవిటి వాళ్ళకు ప్రతి నెలా డబ్బు రూపంలో బ్రౌన్ ధర్మం చేసేవాడు. బిచ్చగాళ్ళు కూడా బ్రౌన్‌కు జాబులు చేసేవారట. ఆ జాబులూ బ్రౌన్‌కు పాఠ్యగ్రంథాలే. బ్రౌన్ సేకరించిన జాబులు 20 సంపుటాలలో ఉన్నాయి. ఆయన సేకరించిన అర్జీలు 2000లకుపైగా ఉన్నాయి. నిఘంటు రచనకు, వ్యాకరణ రచనకు, తెలుగు పాఠ్యగ్రంథాల ప్రచురణకు వీటిని బ్రౌన్ ముడిసరుకుగా భావించాడు. తాతాచార్యులు అప్పటి వాడుక భాషలో చెప్పగా బ్రౌన్ రాయించుకున్న కథలే "తాతాచార్ల కథలు"గా ప్రసిద్ధి చెందాయి. తేటతెలుగు, నుడికారపు సొంపు వీటి సొంతం. అది జీవద్భాష. పాండిత్యభారంలేని వ్యావహారికం.

కావ్యాలలో కూడా ద్విపద కావ్యాలూ, శతకాలూ అంటే బ్రౌన్‌కు చాలా ఇష్టం. దీనికి కారణం అవి సులభ శైలిలో ఉండడం, తెలుగుదనం కొట్టొచ్చినట్టు కనపడడం మాత్రమే. మొత్తం బ్రౌన్ 41 ద్విపద కావ్యాలను సంపాదించాడు. 11 ద్విపద కావ్యాలను పరిష్కరింప చేశాడు.

వీటిలో బసవపురాణం, పండితారాధ్య చరిత్ర, పల్నాటి వీరచరిత్ర, సారంగధర చరిత్ర ముఖ్యమైనవి. 81 శతకాలను సేకరించాడు. వేమన, సుమతి శతకాల్ని ఆంగ్లంలోకి అనువదించాడు. 1829లో వేమన శతకాన్ని, 1842లో సుమతి శతకాన్ని ప్రచురించాడు. బ్రౌన్ పామర సాహిత్యాన్నీ, వ్యవహార భాషా శైలినీ, జానపదుల పాటలనూ, పలుకుబళ్ళనూ, గాథలనూ, సామెతలనూ అభిమానించాడు. ఇవాళ మనం తెలుగు భాషను కాపాడుకోవాలనీ, తెలుగు పదాలకు మన మాటల్లో, రచనల్లో ప్రాధాన్యం ఇవ్వాలనీ ఉద్యమాలు నడుపుతున్నాం. మన సమాజంలో నడిచే ఉద్యమాలలో ఇవాళ భాషోద్యమం కూడా ఒకటి. కానీ బ్రౌన్ 200 సంవత్సరాల క్రితమే దీనికి పూనుకున్నాడు. అవసరం లేనప్పుడు మాటల్లో, రాతల్లో మిశ్ర భాష మంచిది కాదన్నాడు. సాధ్యమైనంత వరకు ఆ తరహా పరిహరించాలన్నాడు.

ఒక్కక్షణం ఆలోచిస్తే ఇంత పని చేసిన బ్రౌన్‌కు ఇంత తీరిక ఎక్కడిదని ఆశ్చర్యం కలుగుతుంది. కానీ ఆయనన్న మాటలు చూడండి: "Want of leisure, so often lamented in India, usually denotes want of inclination; I have always had leisure".

బ్రిటీష్ వాళ్ళు భారతదేశ సంపదను దోచుకున్న దోపిడీదారులనే విషయంలో సందేహం లేదు. అయితే అందులో బ్రౌన్ లాంటి వాళ్ళు కూడా భాగమేననీ, బ్రౌన్ తెలుగు భాషా సాహిత్యాల ఉద్ధరణ కోసం శ్రమపడడం ఆ ఉద్దేశంతోనేననీ కొందరు విమర్శలు చేస్తారు. నిజమే, బ్రౌన్ కూడా ఒక విధంగా దోపిడీదారుడే – ఎందుకంటే తెలుగు భాషా సాహిత్యాలకు ఆయన చేసిన సేవల ద్వారా తెలుగు ప్రజల హృదయాలను దోచుకున్నాడు కాబట్టి!

మొత్తం మీద బ్రౌన్ కఠోర పరిశ్రమ తెలుగు భాషా సాహిత్యాలకు పట్టిన పాండిత్య భారాన్ని కాస్తయినా వదిలించి, ప్రజాస్వామిక సంస్కారాన్ని కలిగించడానికి తోడ్పడిందనడంతో సందేహం లేదు.

తెలుగులో ఆగమరూప నిర్మాణం

– ఆచార్య గాలి రాధాకృష్ణ

1.0. భాషా నిర్మాణంలో వివిధ రకాల పరివర్తన ప్రక్రియలు పాల్గొంటాయి. తెలుగులో ఆదేశాత్మకం (Replacive) , ఆగమాత్మకం (Addition), రూపలోపం (Deletion) మొదలైన ప్రక్రియలు కన్పిస్తున్నాయి. ఆగమాత్మక ప్రక్రియ వల్ల వ్యంజనరూపం అదనంగా చేరుతుంది. అంటే రెండు (పూర్వరూప అంత్య, పరరూప ఆద్య) స్వరూపాల నడుమ వ్యంజనరూపం చేరుతుంది. ఈ వ్యంజన రూపాన్ని ఆగమరూపం అని వ్యవహరిస్తారు. ఇక్కడ పూర్వరూప అంత్య స్వరానికి పరరూప ఆధ్యస్వరం పరమైనపుడు స్వరాదేశ ప్రక్రియ (పూర్వ రూప అంత్య స్వరానికి పరరూప ఆద్యస్వరం ఆదేశం చెందడం) గాని, పూర్వరూప అంత్య స్వరూపానికి పరరూప ఆద్యస్వరం చేరినపుడు స్వరలోప ప్రక్రియ (పూర్వరూప అంత్య స్వరలోపం) గాని జరగవలసి ఉంది. కాని పూర్వరూపం అంత్య, పరరూప ఆద్య స్వరాలు రెండూ వ్యవహార ఉచ్చారణలోగాని, రాతలోగాని అలాగే ఉంటూ వాటి నడుమ వ్యంజనరూపం చేరడం చూడవచ్చు. ఈ వ్యంజనరూపం ఆగమంగా రావడం వల్ల పూర్వరూప అంత్య, పరరూప ఆద్యస్వరాల్లో ఎలాంటి మార్పు లేకుండా అలాగే నిలిచి ఉంటాయి.

తెలుగులో కేవల వ్యంజనరూపాలు (క్, గ్,ట్, డ్, త్, న్, ప్, మ్, య్, ర్,వ్, స్, హ్), సంయుక్త వ్యంజనరూపం (ణ్ట్) ఆగమాత్మక ప్రక్రియలో పాల్గొంటున్నాయి.

1.1. కేవల వ్యంజనాగమం: పూర్వ రూప అంత్యస్వరం, పరరూప ఆద్యస్వరం నడుమ కేవల వ్యంజనరూపం ఆగమంగా రావడం.

ఎ) కకారాగమం: కకారం అ–ఒ స్వరాల నడుమ ఆగమం వస్తుంది.

1) స్వరపరివర్తన ప్రక్రియ (పూర్వరూప అంత్యస్వరం ఉకారం అకారంగా పరివర్తన చెందడం)తో పాటు కకారాగమం.

పది+ఒండు = పదకొండు

బి) గకారాగమం: గకారం అ–ఇ స్వరాలనడుమ ఆగమంగా వస్తుంది.

1) కేవల గకారాగమం: పూర్వరూప అంత్య, పరరూప ఆద్య స్వరాల నడుమ వ్యంజనరూపం 'గ్' ఆగమంగా రావడం

తెలుగు రూపం+తెలుగు రూపం:

పెల్ల=ఇంచు = పెల్లగించు

తెలుగు రూపం+సంస్కృత రూపం:

చెమ్మ+ఇల్లు = చెమ్మగిల్లు

దోర+ఇల్లు = దోరగిల్లు

బీట+ఇల్లు = బీటగిల్లు

సంస్కృతరూపం+తెలుగురూపం:

ఇచ్ఛ+ఇంచు= ఇచ్ఛగించు

2) అక్షరలోప ప్రక్రియ (పూర్వరూప అంత్యాక్షరం-ము లోపం చెందడం)తో పాటు గకారాగమం.

తెలుగురూపం+తెలుగురూపం:

పంతము+ఇంచు = పంతగించు

పల్లము+ఇంచు = పల్లగించు

సంస్కృతరూపం+తెలుగు రూపం:

కోపము+ఇంచు = కోపగించు

మోసము+ఇంచు = మోసగించు

సి) టకారాగమం: టకారం అ-ఇ, ఇ-అ, ఇ-ఇ, ఉ-అ, ఉ-ఆ, ఉ-ఇ, ఉ-ఉ, ఉ-ఎ, ఉ-ఏ, ఉ-ఒ, ఎ-ఊ స్వరాల నడుమవస్తుంది.

1) కేవల టకారాగమం: పూర్వరూప అంత్య, పరరూప ఆద్య స్వరాల నడుమ వ్యంజన రూపం 'ట్' ఆగమంగా రావడం.

తెలుగురూపం+తెలుగురూపం:

అన్ని+ఇ = అన్నిటి

కులుకు+ఎలుఁగు = కులుకు టెలుఁగు

చిగురు+ఆకు = చిగురుటాకు

తళుకు+అద్దము = తళుకుటద్దము

నిన్న=ఇ = నిన్నటి 'నిన్నటి కథ; నిన్నటి-కి'

నిలువు+అద్దము = నిలువుటద్దము

నువ్వు+ఉండలు = నువ్వుటుండలు

మగ+ఇమి = మగటిమి

పల్లె+ఊరు = పల్లెటూరు

పెంకు+ఇల్లు = పెంకుటిల్లు

పేరు+ఆమని = పేరుటామని

రంకు+ఆలు = రంకుటాలు

వేయి+అ = వేయిట 'వేయిట-న్'

వేయి+ఇ = వేయిటి 'వేయిటి-కి'

తెలుగురూపం+సంస్కృతరూపం

చెమ్మ+ఇల్లు = చెమ్మటిల్లు

గెలుపు+ఉత్సవము = గెలుపుటుత్సవము

2) ఆదేశాత్మక ప్రక్రియ (పూర్వరూప అంత్య వ్యంజనం మకారం పకారంగా ఆదేశం చెందడం)తో పాటు టకారాగమం.

తెలుగురూపం+తెలుగురూపం:

ఇల్లటము+అల్లుడు = ఇల్లటపుటల్లుడు

తెలుగు - ముప్రత్యయాత్మక సంస్కృత రూపం + తెలుగురూపం

చదరంగము+ఎత్తె = చదరంగపుటెత్తు

మదము+ఏనుగు = మదపుటేనుగు

సముద్రము+ఒడ్డు = సముద్రపుటొడ్డు

3) స్వరపరివర్తన ప్రక్రియ (పూర్వరూప అంత్య స్వరం ఉకారం ఇకారంగా పరివర్తన చెందడం)తో పాటు టకారాగమం.

మూడు+ఇ = మూడిటి

మొదలు+ఇ = మొదలిటి

నూరు+ఇ = నూరిటి

4) స్వరలోప ప్రక్రియ (పూర్వరూప అంత్య స్వరం ఉకారం లోపించడం), అద్విరుక్తీకరణం మరియు మూర్ధన్యీకరణం (పూర్వరూప అంత్య ద్విరుక్త వ్యంజనం అద్విరుక్తం కావడం మరియు పూర్వరూప అంత్య దంత్య మరియు దంతమూలీయ వ్యంజనం మూర్ధన్యం కావడం; న్న్ = ణ్), ప్రక్రియలతో పాటు టకారాగమం, డకారాగమం

కన్ను+అ = కంట 'కంట-న్'

కన్ను+ఇ = కంటి 'కంటి-కి'

మిన్ను+అ = మింట 'మింట-న్'

మిన్ను+ఇ = మింటి 'మింటి -కి'

కన్ను+లు = కండ్లు

పన్ను+లు = పండ్లు

ఇ) తకారాగమం: తకారం అ-ఇ, ఉ-ఇ, ఒ-ఇ స్వరాల నడుమ వస్తుంది.

1) స్వరలోప ప్రక్రియ (పూర్వరూప అంత్య స్వరం ఉకారం లోపించడం), అద్విరుక్తీకరణ ప్రక్రియ (పూర్వరూప అంత్య ద్విరుక్త వ్యంజనం 'ర్ర్' అద్విరుక్తం చెంది 'ర్' కావడం)తో పాటు తకారాగమం.

అ(్రు+ఇ = అర్తి

కు(్రు+ఇ = కుర్తి

గొ(్రు+ఇ = గొర్తి

ఎఫ్) నకారాగమం: నకారం అ–ఆ, ఉ–అ, ఉ–ఇ స్వరాల నడుమ ఆగమంగా వస్తుంది.

1) కేవల నకారాగమం: పూర్వరూప అంత్య, పరరూప ఆద్య స్వరాల నడుమ వ్యంజనరూపం 'న్' ఆగమంగా రావడం.

తెలుగురూపం+తెలుగురూపం:

కడుపు+అందు = కడుపునందు

చదువు+అతఁడు = చదువునతఁడు

చెంచు+ఇంటికి = చెంచునింటికి

చేయు+అపుడు = చేయునపుడు

తెలుగు – ముప్రత్యయాత్మక సంస్కృత రూపం+తెలుగురూపం:

కయ్యము+అందు = కయ్యమునందు

దూరము+అందు = దూరమునందు

హృదయము+అందు = హృదయమునందు

హృదయము+అందు = హృదయమునందు

సంస్కృత రూపం+సంస్కృత రూపం:

గురువు+ఆజ్ఞ = గురువునాజ్ఞ

జి) పకారాగమం: పకారం అ–ఇ, ఆ–ఇ, ఇ–ఇ స్వరాల నడుమ ఆగమంగా వస్తుంది.

1) స్వరలోప ప్రక్రియ (పూర్వరూప అంత్య స్వరం ఉకారం లోపించడం) తోపాటు పకారాగమం.

అను+ఇంచు = అన్పించు

కను+ఇంచు = కన్పించు

విను+ఇంచు = విన్పించు

2) స్వరపరివర్తన ప్రక్రియ (పూర్వరూప అంత్య స్వరం ఉకారం ఇకారంగా పరివర్తన చెందడం.) పాటు పకారాగమం.

అను+ఇంచు = అనిపించు

కను+ఇంచు = కనిపించు

విను+ఇంచు = వినిపించు

3) స్వరదీర్ఘీకరణ ప్రక్రియ (పూర్వరూప ఆద్య హ్రస్వస్వరం అకారం దీర్ఘమై 'ఆ' గా కావడం)తో పాటు పకారాగమం.

కను+ఇంచు = కాన్పించు

4) స్వరపరివర్తన ప్రక్రియ (పూర్వకరూప అంత్య స్వరం ఉకారం ఇకారం పరివర్తన చెందడం), స్వర దీర్ఘీకరణ ప్రక్రియ (పూర్వరూపం ఆద్యహ్రస్వ స్వరం అకారం దీర్ఘమై 'ఆ'గా కావడం) లతో పాటు పకారాగమం.

కను+ఇంచు = కానిపించు

హెచ్) మకారాగమం: మకారం అ–అ, ఉ–అ స్వరాల నడుమ ఆగమంగా వస్తుంది.

1) కేవలమకారాగమం: పూర్వ రూప అంత్య స్వరం, పరరూప ఆద్యస్వరం నడుమ వ్యంజన రూపం 'మ్' ఆగమంగా రావడం.

తెలుగు రూపం+ తెలుగు రూపం:

దడదడ+అను = దడదడమను

బుస్సు+అను = బుస్సుమను

సంస్కృత రూపం+తెలుగు రూపం:

ధగధగ+అను = ధగధగమను

భగ్గు+అను = భగ్గుమను

ఐ) యకారాగమం: యకారం అ–అ, అ–ఇ, ఆ–ఎ, ఆ -అ, ఆ–ఆ, ఆ–ఇ, ఇ–అ, ఇ–ఆ, ఇ–ఇ, ఇ–ఉ, ఇ–ఎ, ఇ–ఏ, ఇ–ఒ, ఈ–అ, ఈ–ఎ, ఏ–అ, ఏ–ఏ, ఓ–ఈ స్వరాల నడుమ ఆగమంగా వస్తుంది.

1) కేవలయకారాగమం: పూర్వరూప అంత్య, పరరూప ఆద్య స్వరాల నడుమ వ్యంజన రూపం 'య్' ఆగమంగా రావడం.

తెలుగు రూపం+తెలుగు రూపం:

అడి+అరి = అడియరి

అంది+ఇచ్చు = అందియిచ్చు

అరటి+ఆకు = అరిటియాకు

అ+అన = ఆయన

ఆ+ఆ = ఆయా

ఇచ్చి+ఇచ్చి = ఇచ్చియిచ్చి

ఇంచుక+ఇంచుక = ఇంచుకయించుక

ఈ+అన = ఈయన

ఎంత+ఎంత = ఎంతయెంత

ఏ+అన = ఏయన

ఏ+ఏ = ఏయే

ఏగి+ఏగి = ఏగియేగి

ఏమి+ఏమి = ఏమియేమి

ఓ+ఈ = ఓయీ

కణకణ+అను = కణకణయను

కాలి+అందు = కాలియందు

గుండె+అదురు = గుడెయదురు

చెల్లి+అలు = చెల్లియలు

తల+ఎత్తు = తలయెత్తు

తేలి+ఆడు = తేలియాడు

పడి+ఉండు = పడియుండు

పది+ఆఱు = పదియాఱు

పది+ఏడు = పదియేడు

పెండ్లి+అగు = పెండ్లియగు

పెండ్లి+ఆడు = పెండ్లియాడు

మఱి+ఏమి = మఱియేమి

మేన+అత్త = మేనయత్త

మేన+అల్లుడు = మేనయల్లుడు

సంస్కృత రూపం+తెలుగురూపం:

అంజలి+ఎత్తు = అంజలియెత్తు

ఆజ్ఞ+ఇదు = ఆజ్ఞయిదు

అనతి+ఇచ్చు = ఆనతియిచ్చు

ఇచ్ఛ+ఇంచు = ఇచ్ఛయించు

రుచి+ఇంచు = రుచియించు

విద్య+అందు = విద్యయందు

శాంతి+ఒనర్చు = శాంతియొనర్చు

సరి+అగు = సరియగు

స్తుతి+ఇంచు = స్తుతియించు

పర్షియో–అరబిక్ రూపం+తెలుగు రూపం:

చీటీ+ఎత్తె = చీటీయెత్తు

2) అక్షరలోప ప్రక్రియ (పూర్వరూప అంత్యాక్షరం – నా లోపం చెందడం) తో పాటు యకారాగమం.

పర్షియో – అరబిక్‌రూపం+ తెలుగు రూపం

అటకానా+ఇంచు = అటకాయించు

బదలానా+ఇంచు = బదలాయించు

3) అక్షరలోప ప్రక్రియ (పూర్వరూప అంత్యాక్షరం – ము లోపం చెందడం), స్వర పరివర్తన ప్రక్రియ (పూర్వరూప మధ్యస్వరం అకారం ఇకారంగా పరివర్తన చెందడం)లతో పాటు యకారాగమం.

తెలుగు–ము ప్రత్యయాత్మక సంస్కృత రూపం + తెలుగు రూపం:

త్యజము+ఇంచు = త్యజియించు

సుఖము+ఇంచు = సుఖియించు

4) అక్షరలోప ప్రక్రియ (పూర్వరూప అంత్యాక్షరం–ము లోపం చెందడం), స్వరపరివర్తన ప్రక్రియ (పూర్వరూప మధ్య స్వరం అకారం ఇకారంగా పరివర్తన చెందడం), స్వర హ్రస్వీకరణ ప్రక్రియ (పూర్వరూప ఆద్య దీర్ఘస్వరం 'ఆ' హ్రస్వమై అకారం కావడం)లతో పాటు యకారాగమం.

తెలుగు – ము ప్రత్యయాత్మక సంస్కృత రూపం+తెలుగు రూపం:

తాపము+ఇంచు = తపియించు

ఔ) ర/ఱ కారాగమం: ర, కారం అ–ఆ, అ–ఇ, అ–ఒ, ఇ–ఇ, ఇ–ఒ, ఇ–ఓ, ఉ–అ, ఉ –ఆ, ఎ–ఒ, ఓ–ఈ స్వరాల నడుమ ఆగమంగా వస్తుంది. ఱకారం అ–ఇ స్వరాల నడుమ ఆగమంగా రావడం చూడవచ్చు.

1) కేవల ర/ఱ కారాగమం: పూర్వరూప అంత్య. పరరూప ఆద్యస్వరాల నడుమ వ్యంజనరూపం 'ర్/ఱ్' ఆగమంగా రావడం.

తెలుగు రూపం+తెలుగు రూపం:

అక్క+ఒ = అక్కరొ

ఇంతి+ఒ/ఓ = ఇంతిరొ/ఇంతిరో

ఓ+ఈ = ఓరీ

కేక+ఇంచు = కేకరించు

గొడ్డు+ఆలు = గొడ్డురాలు

చిటుక్కు+అను = చిటుక్కురను

చెల్లె+ఇ = చెల్లెరొ

పేద+ఆలు = పేదరాలు

పేద+ఇమి = పేదరిమి/పేదఱిమి

బొబ్బ+ఇంచు = బొబ్బరించు

మనుమ+ఆలు = మనుమరాలు

సంస్కృత రూపం+తెలుగు రూపం:

తల్లి+ఒ/ఓ = తల్లిరొ/తల్లిరో

బీద+ఆలు = బీదరాలు

వెజ్జు+ఆలు = వెజ్జురాలు

2) ఆదేశాత్మక ప్రక్రియ (పూర్వరూప అంత్య వ్యంజనంమకారం పకారంగా ఆదేశం చెందడం)తో పాటు రకారాగమం.

వియ్యము+ఆలు = వియ్యపురాలు

3) స్వరపరివర్తన ప్రక్రియ (పూర్వరూప అంత్యస్వరం ఉకారం అకారంగాగాని, ఇకారంగాగాని పరివర్తన చెందడం)తో పాటు ర/ఱ కారాగమం.

కమ్ము+ఇంచు = కమ్మిరించు

క్రమ్ము+ఇంచు = క్రమ్మరించు/క్రమ్మఱించు

కె) వకారాగమం: వకారం ఇ–ఆ, ఆ–అ, ఆ–ఇ స్వరాల నడుమ ఆగమంగా వస్తుంది.

1) కేవల వకారాగమం: పూర్వరూప అంత్య, పరరూప ఆద్యస్వరాల నడుమ వ్యంజనరూపం 'వ్'ఆగమంగా రావడం.

మడి+ఆలు = మడివాలు

రా(.. వచ్చు)+ అటము = రావటము

రా(.. వచ్చు)+ఓయీ = రావోయీ

ఎల్) సకారాగమం: సకారం అ–ఇ, ఓ–ఈ స్వరాల నడుమ ఆగమంగా వస్తుంది.

1) కేవల సకారాగమం: పూర్వరూప అంత్య, పరరూప ఆద్యస్వరాల నడుమ వ్యంజనరూపం 'స్' ఆగమంగా రావడం.

తెలుగురూపం+తెలుగురూపం:

ఓ+ఈ = ఓసీ

తెలుగురూపం+సంస్కృత రూపం:

సొమ్మ+ఇల్లు = సొమ్మసిల్లు

ఎమ్) హకారాగమం: హకారం అ–ఆ, అ–ఐ, ఆ–ఆ, ఇ–ఏ, ఈ–ఈ, ఊ–ఊ. ఏ–ఏ ఓ–ఓ స్వరాల నడుమ ఆగమంగా వస్తుంది.

1) కేవల హకారాగమం: పూర్వరూప అంత్య, పరరూప ఆద్య స్వరాల నడుమ వ్యంజన రూపం 'హ్' ఆగమంగా రావడం.

ఆ+ఆ = ఆహా

ఈ+ఈ = ఈహీ

ఊ+ఊ = ఊహూ

ఏ+ఏ = ఏహే

ఓ+ఓ = ఓహో

పది+ఏడు = పదిహేడు

పది+ఏను = పదిహేను

2) స్వర పరివర్తన ప్రక్రియ (పూర్వరూప అంత్యస్వరం ఇకారం అకారంగా పరివర్తన చెందడం)తోపాటు హకారాగమం.

పది+ఆరు/ఆఱు = పదహారు/పదహాఱు

పది+ఐదు = పదహైదు

1.2. సంయుక్త వ్యంజనాగమం: పూర్వరూప అంత్య స్వరం, పరరూప ఆద్య స్వరం నడుమ సంయుక్త వ్యంజనరూపం ఆగమంగా రావడం.

ఎ) ణ్ట కారాగమం: పూర్వరూప అంత్య, పరరూప ఆద్య స్వరాల నడుమ సంయుక్త వ్యజనం రూపం 'ణ్ట్' ఆగమంగా రావడం.

1) కేవల ణ్ట కారాగమం: పూర్వరూప అంత్య, పరరూప ఆద్య స్వరాల నడుమ సంయుక్త వ్యంజన రూపం 'ణ్ట్' ఆగమంగా రావడం.

ఎనిమిది+ఇ = ఎనిమిదింటి 'ఎనిమిదింటి – కి'

వేయి+అ = వేయింట 'వేయింట–న్'

వేయి+ఇ = వేయింటి 'వేయింటి–కి'

2) స్వరపరివర్తన ప్రక్రియ (పూర్వరూప అంత్య స్వరం ఉకారం ఇకారంగా పరివర్తన చెందడం)తో పాటు హ కారాగమం.

మూడు+ఇ = మూడింటి 'మూడింటి–కి'

మొదలు+ఇ = మొదలింటి 'మొదలింటి–కి'

ఉపయుక్త రచనలు:

1. అనంతరామశాస్త్రి, నేతి – శ్రీనాథ భాషా పరిశీలన
2. కృష్ణమూర్తి, భద్రిరాజు (సం.) – తెలుగు భాషా చరిత్ర
3. చిన్నయసూరి, పరవస్తు – బాలవ్యాకరణము
4. బ్రౌన్, చార్లెస్ ఫిలిప్ – నిఘంటువు తెలుగు–ఇంగ్లీషు
5. రాధాకృష్ణ గాలి – తెలుగు భాషా వ్యాసాలు, సంపుటం 1–2
6. రామకృష్ణయ్య, కోరాడ – సంధి
7. వేంకటేశ్వర్లు, వజ్ఝల – ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం
8. శివరామమూర్తి, ఎన్ – ఆధునిక తెలుగు వ్యాకరణం

విశ్వనాథ సీసనిర్మాణ పద్ధతులు – ఒక దృష్టి

– డా॥ పి.ఆర్.హరినాథ్

తెలుగు కావ్య ప్రపంచంలో విస్తృతమైన ప్రాచుర్యం ఉన్న ఛందస్సు సీసం. ఈ పేరు వినగానే ఒక లోహం గుర్తుకు వస్తుంది. ఆ లోహాన్ని వంచటం, కరిగించటం ఎంత సులభమో ఈ పద్యాన్ని రచించడం అంత సులభమని లోకోక్తి. శబ్దానికీ దీనికి సంబంధం లేదు. సంస్కృతంలోని 'శీర్షక' శబ్దం నుంచి ఇది రూపొందింది.

అక్కడ కూడా కేవలం నామ నిష్పన్నత తప్పిస్తే లక్షణ సాదృశ్యం లేదు. సీసం ఉపజాతికి చెందిన ఛందస్సు. ఇందులో ప్రతి పాదం రెండు దళాలుగా విభక్తమై ఉంటుంది. మొదటి దళంలో 4 ఇంద్ర గణాలుంటాయి. రెండవదళంలో 2 ఇంద్రగణాలు+2 సూర్యగణాలు ఉంటాయి. అంతకంటె ఎక్కువ పాదాలతో 'సీసమాలిక'లు కూడా ఉన్నాయి. అయితే సీసపద్యానికి నాలుగు పాదాలు ఉండడం సర్వసాధారణం. అయితే సీసపద్యానికి నాలుగు పాదాలు ఉండడం సర్వసాధారణం. ఈ నాలుగు పాదాలకు అనుబంధంగా ఒక తేటగీతిని లేదా ఆటవెలదిని జత చేస్తారు. దీనిని ఎత్తుగీత అంటారు. సీస పద్య పాదాలకు ప్రతి దళంలోనూ మూడవ గణాద్యక్షరం యతి స్థానం. ప్రాసయతి కూడా చెల్లుతుంది. కొన్ని పాదాలకు ప్రాస నియమం లేదు.

ఈ పద్యానికి ఉన్న నామ సామంజస్యాన్ని పాటిబండ వారు ఇలా నిరూపించారు. "జనాశ్రయుని యభిప్రాయమును బట్టి చూచినచో శీర్షకమను నామకరణమునకు గారణము ఊహింప వీలగును. ఒక విధమైన లక్షణము గల పద్యముపై వేఱొక విధమైన లక్షణము గల పద్యమును జేర్చినచో రెండును గలిసి శీర్షకమను పద్యభేదమేర్పడును. రెండవ పద్యము మొదటి పద్యమునకు శిరోభూషణము వలెనుండును. కనుక మొత్తము పద్యమును శీర్షకమని వ్యవహరింపవచ్చును. శీర్షకమునకు వికృతి సీసకము".[1]

ఆధునిక సాహిత్యంలో జ్ఞానపీఠ ప్రశస్తిని పొందిన శ్రీమద్రామాయణ కల్పవృక్షం ఒక మహాకావ్యం. అందులో బాల–అయోధ్యాది కాండల నుంచి ఒక కాండను గ్రహించి సీస నిర్మాణాలను పరిశీలించడం ఈ వ్యాసోద్దేశ్యం. ప్రస్తుతం బాలకాండలోని సీస పద్యాల పోకడల గురించి విచారించబడుతుంది.

స్థూలదృష్టితో చూసినపుడు బాలకాండలోని సీసపద్యాల పోకడలు ఇలా కనిపిస్తాయి.

అ) నిర్వచన సీసం: ఇందులో ఒక అంశాన్ని గురించి నిశితమైన నిర్వచనం కనిపిస్తుంది. కవికి ఆ అంశం పట్ల ఉన్న ఒక అవగాహన, అభిప్రాయం ఇందులో ప్రకటితమవుతాయి. ఒక్కోదళం సూత్రంలాగా ఉంటుంది.

ఆ) ఉపమాన ఉత్ప్రేక్షలు అంతంగా ఉండే పాదాలతో నడచినవి.

ఇ) విభక్తులతో అంతమైన సీసం.

ఈ) ఉపమావాచకాలతో నడచిన సీసం.

ఉ) నమక సీసం: ఇందులో అది నీవు, ఇది నీవు అని చెప్పడం ఉంటుంది.

ఊ) సంభాషణాసీసం: నాటక సంభాషణల లాగా నడచే పాదాలివి.

ఎ) సంబోధనల సీసం: సీస పాదాలన్నీ సంబోధనలే.

ఏ) ఆశ్చర్యార్థకాల సీసం: విస్మయాన్ని అంత్యానుప్రాసను పాటించే పాదాలు.

ఐ) అనుప్రాసల సీసం: రెండవ దళంలో అంత్యానుప్రాసను పాటించే పాదాలు.

ఒ) ఆజ్ఞా సూచక సీసం: ఇందులో ఆజ్ఞలను జారీ చేయడం కనిపిస్తుంది. ప్రతిపాదమూ ఒక ఆజ్ఞ.

ఓ) విరళ దళాలున్న సీసం. పాదంలోని దళాలు వేటికవే అర్థ ప్రతిపాదన చేసేవిగా ఉండటం ఇక్కడ కనిపిస్తుంది. ఇది ఒకటవ భేదంలాగా అనిపిస్తుంది. కానీ (అ)లో సవిమర్శక నిర్వచనం ఉంది. ఇక్కడ కేవలం విషయ ప్రకటన మాత్రమే ఉంది. విమర్శలేదు.

ఔ) క్రియాపదాంత పాదాలున్న సీసం.

అం) ప్రారంభాంతపదాలు పునరుక్తి పొందడం . ప్రథమ దళాలలో అదేపదం ఆరంభంలో ఉండడం. అలాగే ద్వితీయ దళం చివరలో ఏ పదం ఉంటే అదే పదం తక్కిన ద్వితీయ దళాల చివరిలోనూ పునరుక్తి పొందడం ఇక్కడ కనిపిస్తుంది.

అః) ఆశీరర్థక సీసం: పద్యమంతటా ఆశీర్వాదాలే ఉండడం దీని లక్షణం.

క) అభ్యర్థన సీసం: ప్రతిపాదంలోనూ ఒక అభ్యర్థన ఉండడం ఇక్కడ కనిపిస్తుంది.

ఖ) పాదారంభాల్లో ప్రాసను, అనుప్రాసను పాటించడం.

గ) నిందార్థక సీసం.

ఘ) ప్రథమ పాదం చివరలో వచ్చే కర్తృపదం నాలుగు పాదాల్లో పునరావృత్తి పొందడం.

ఙ) ప్రశ్న–సమాధానాల సీసం: ప్రథమ దళంలో ఒక ప్రశ్న ఉండి, దానికి సమాధానంగా రెండవ దళంలో ఒక ప్రకటన చేయడం ఇక్కడి పద్ధతి.

చ) సంస్కృత సమాస పాదాలు: సీసం లోని ఒక్కొక్క పాదం ఒక దీర్ఘ సంస్కృత సమానంగా ఉండటం.

ఛ) అనిబద్ధ పాదాలు: సీసపద్యంలో పాదాలు ఒక నియతికి లోబడక, సాగిపోవడం. ఇవి స్థూల విభజనకు ఒదిగిన పోకడలు. వీటికి వరుసగా ఉదాహరణలివి:

అ) ఋషి వంటి నన్నయ రెండవ వాల్మీకి తిక్కన శిల్పపు తెనుగుతోట.[2]

మొదటి దళం నన్నయ గురించిన ఒక సవిమర్శక నిర్వచనంలాగా ఉంది. వాల్మీకి ఆదికవి. నన్నయ కూడా. ఋషిత్వం ఇద్దరిలోనూ కనిపించే మహా ప్రతిభ. నన్నయ గురించి కవి అభిప్రాయం

అత్యంత సూక్ష్మరూపంలో ఒక సూత్రంలాగా ప్రకటితమైంది. తక్కిన పాదాలన్నిటిలోనూ ఈ సవిమర్శక దృష్టి, సూక్ష్మ ప్రకటన కనిపిస్తాయి.

అ) స్వర్గమన్గోవు వెన్ జను త్వత్పురీ వృష గళమున వ్రేలాడు గంగడోలు[3]

అయోధ్యాపురీ వర్ణనలో ఈ పద్యంలో కనిపిస్తుంది. తక్కిన పాదాలన్నింటిలోనూ ఇదే పోకడను గమనించ వీలుంది.

ప్రళయకాలమున వైవస్వత మనువుచే
మిగిలిన తొలిచోఱ మీను ముల్లు
....
....
పార్థివేంద్ర, యయోధ్య వప్రంపు గోడ
యీపురీ జయలక్ష్మికి నినుప తొడుగు[4]

ఇ) రాగాను సారి భావాగణ్య గీతిచే
నర్థానుగుణ హస్తాప్తి చేత
హస్తానుకారి నేత్రాపాంగ రోచిచే
లక్ష్యానుగాస్య చాలనము చేత[5]

ఋష్యశృంగుని తీసుకుని రావడానికి వెళ్లిన వారకాంతలు త్రమ అద్భుత నృత్యవిన్యాసంతో అతని నాకట్టుకోవడానికి యత్నించారు. ఉవ్వెత్తు అలలతో ముందు వెనుకలుగా తూగే అందమైన నాలుగు అంబుధులలాగా ఆ అతివలు అతిశయించారు. ఆ సందర్భంగా సాగిన వర్ణన ఇది. ప్రతి దళంలోనూ విభక్తిని నిలిపిన విన్యాసాన్ని గుర్తించవచ్చు.

ఈ) ఒనర బోర్కాడించి యుయ్యేల తొట్టెలో
బండబెట్టిన పసిపాప వోలె
వీధులం బడి తిర్గి బూదియ మై జల్లు
కొని పర్వులం బెట్టు కుఱ్ఱవోలె[6]

దశరథుడికి సంతానం గురించి ఆశారేఖలు పొడ చూపాయి. ఋష్యశృంగుడి రాకతో దశరథుడి చింత తీరుతుందని మంత్రి విన్నవించాడు. ఆ రాత్రి జాబిల్లి రాజు కళ్లకు ఇలా కనిపించింది. పద్యమంతటా ఉపమ పరచుకుని ఉంది. ఉపమా వాచకాలు పాదాంతంలో ఉన్నాయి.

ఉ) అశ్వమేధంబు నీవా పుత్రకామేష్టి
నీ వధ్వరంబులు నీవ తండ్రి!
యగ్నిహెూత్రంబున నావిర్భవించిన
సొదప్రజాపతి పురుషుండ వీవ[7]

శ్రీరాముడిగా అవతరించబోతున్న శ్రీమహావిష్ణు స్వరూప స్తుతి ఈ పద్యం. నమకస్తుతిని తలపించే పోకడ ఈ రచనలో కనిపిస్తుంది.

ఊ) చీకటిలో నంత చెట్టగా దొలగి పో
యెదనేమి బుట్టెనే యెమ్మెలాడి
నీ చేతిలో నేదొ దాచి యే మెఱుగని
యట్లుగా బలికెదే హొసుకత్తి[8]

ఇది దాసీల సంభాషణ. గర్భిణులైన ముగ్గురు రాణులకు అంత:పురంలో మన్ను దొరకలేదు. గర్భిణులైన స్త్రీలు మట్టిని తింటారనడం ప్రసిద్ధోక్తి. అంచేత రాణుల కోసం రహస్యంగా మన్ను తీసుకువస్తున్న దాసీజనం పరస్పరం మాట్లాడుకోవడం ఇక్కడ సందర్భం. ఒక్కో పాదం ఒక్కొక్కరి సంభాషణగా సాగిన పద్యమిది. లక్ష్మీపార్వతీ సంవాద పద్యాలను గుర్తుకు తెచ్చే సంభాషణలివి.

ఎ) నా తండ్రి రామచంద్రా! నన్ను గన్నట్టి
బంగారు తండ్రి, నా ప్రాణప్రదమ
మార్తాండ కులదీపమా, దిలీప రఘు ది
వ్యాన్వయ జలధి శీతాశురోచి![9]

పుత్రప్రేమతో పులలించిపోతున్న పుడమిరేడు పలికిన పలుకులివి. ఈ దశరథుని మాటలన్నీ సంబోధనలే.

ఏ) ఈ పసికందుల యీ పసి చేతులు
ప్రగ్రహంబుల నెట్లు పట్టగలిగె
నీ పసి బాలుర యీ పసి మనసులు
నశ్వంబులను నెట్లు లదుపు జేసెపెట్టె.[10]

ఎదుగుతున్న రామలక్షణ భరత శత్రుఘ్నులు రథచోదనం చేస్తున్నపుడు రాజు పడిన భయాశ్చర్యాలు రెండూ ఇక్కడ ప్రకటితం. పద్యంలో రాజుపడిన ఆ ఉద్విగ్నతను ప్రతిపాదంలోనూ సూచించాడు కవి.

ఐ) ఎవరయా యా స్వామి లెవరికో యీవంగ
దపు తొలివెల్గు కప్రపు నివాళి
యెవరయా యా దొర లెవరికో యాదిరా
జ పవిత్ర కీర్తి చొక్కపు వయాళి
యెవరయా యా తండ్రులెవరికో చిన్నారి
వపువు డాల్కేళి నీలపు దువాళి.[11]

ఇలా సాగే పద్యంలో ప్రతిపాదం చివర అనుప్రాస పాటించబడింది. నివాళి – వయాళి – సుమాళి – దువాళి – అని ఒక సమతూకంతో సాగిన నిర్మాణమిది. పుత్రులను దశరథుడు లాలించిన వర్ణన యీపద్యం.

ఒ) కక్ష్యాంతరముల జక్కగ ద్రోవ వదలుడా

ద్వారపాలకుల మొత్తముల వారు

ఇరువంకలను బరాబరులుగా నిలువుడా

చాలులై వెండిబెత్తల వారు[12]

ప్రతిపాదంలోనూ ఆజ్ఞలను జారీ చేయడం ఉంది. హెగ్గళ్ల వారినీ, కంచువాల వారినీ కూడా హెచ్చరిస్తూ వారి వారి స్థానాలలో నిలబడమని ఆజ్ఞాపిస్తుంది ఈ పద్యం. విశ్వామిత్రుడు వస్తున్నపుడు దశరథుని అంత:పురంలోని హడావుడిని వర్ణించిన సందర్భమిది.

ఓ) సుంకులౌ జులపాల జుత్తుల వారలు

మూపుల నమ్ముల పొదులు వారు[13]

ప్రతిదళమూ ఒక ప్రత్యేక ప్రకటనగా ఉన్న నిర్మాణమిది. యజ్ఞ రక్షణకు బయలుదేరిన రామలక్ష్మణుల రూప చిత్రణ ఇది. ప్రతిదళమూ ఒక పువ్వుగా చేరి రూపొందిన భావాల సుమమాల ఈ పద్యం.

ఔ) చలికాలమున హిమాచల గంధకావర్త

ముల నీళ్లులను వెచ్చగిలగ దెచ్చి

వేసంగిలో మంచు పూసకట్టుల నీళ్లు

లొద్దుముత్తెపు బిందులొత్తిగించి[14]

పాదం మొత్తం ఒక భావాన్ని చూపుతూ అసంపూర్ణ క్రియాపదంతో ముగించడం, చివరికి ఆ భావాన్నంతా ఒక వ్యక్తికి ముడివేయడం ఇక్కడి పద్ధతి. నదిగా మారి ప్రవహిస్తున్న తన సోదరి గురించి కౌశికుడు చెప్పిన సందర్భమిది.

అం) మహియందునను శింశుమార మీనంబులు

నలి శింశుమార మీనములు వింట

మహియందునమరాళ మహిత గరుచ్ఛట

శారదాభ్రంబుల చాయ మింట[15]

గంగావతరణ సందర్భంలోని వర్ణన ఇది. భూమ్యాకాశాల మధ్య ఒక లంకెను సూచించే నేపథ్యమిది. మహియందు అని ఆరంభంలో మింట అని పాదాంతంలోనూ ఒకే పదాల జంట పునరుక్తి పొందింది. భూమిని క్రింద చూపుతూ చివరి మాటగా ఆకాశాన్ని పైన చూపుతున్న రీతిలో సాగిన పాదాలివి.

అ:) రఘుపుల కోవ క్షీరథి చందమామకు

వింటి కోసలయందు విజయమగుత!

కౌసల్య బిడ్డకు గన్నతండ్రికివిదే

హాధీశు సభల గళ్యాణ మగుత![16]

ప్రతిపాదంలోనూ ఒక ఆశీర్వాదం ఉంది. ఇది శ్రీరామునికి అహల్య ఇచ్చిన ఆశీస్సు. యజ్ఞరక్షణ ముగిశాక జనకసభకు వెళ్లే దారిలో అహల్యా శాపవిమోచనానంతరం ఆమె పల్కిన మాటలివి. ప్రతిపాదంలోనూ విశిష్టమైన దీవెన వినిపిస్తుంది.

క) ఓయమ్మ, భూదేవి, యీ యయ్య రఘుశిశు

బడల బెట్టకు మమ్మ యడుగులందు

ఓ వాయుదేవ, రఘూద్వహు శ్రీరాము

జొక్కి పోకుండంగ జూడుమయ్య[17]

ప్రతి పాదారంభంలోనూ పంచభూతాలలో ఒక దానిని సంబోధించడం, తత్కారుణ్యం కోసం అభ్యర్థించడం ఇక్కడి నిర్మాణంలో కనిపిస్తుంది.

ఖ) తరులచే దేవ కిన్నర సిద్ధచారణ

దానవ యక్ష సంతత భుజంగ

దరులచే సమద దంతావళ మృగరాజ

హరిణ శార్దూల సౌహార్ద దీప్తి

సిరులచే బ్రహ్మఋషి త్రిదశర్షి ప

ర్ణానిల వారి భక్షాగ్ర శైక్ష

గురులచే జపహోమ నిరత హృషీకసం

యమనదీక్షా ప్రతి హరుల చేత[18]

ఇత్యాదిగా సాగే పద్యంలో ప్రతి పాదారంభమూ ప్రాసను, అనుప్రాసనూ పాటించింది. వృత్తాలకు నియత లక్షణమైన ప్రాసను సీసంలో నిలిపి, అనుప్రాసను కూడా పాటించడం ఇక్కడి వైలక్షణ్యం. కౌశికుడిని ఆకర్షించిన వశిష్ఠాశ్రమ వర్ణన ఈ పద్యం.

గ) ఛీ క్షత్రియబలంబు, ఛీ క్షత్రియబలంబు

నస్త్రబలము ఛీ యస్త్రబలము

బలమన్నచో బ్రహ్మబలమే బలంబగు

బలమన్నచో బ్రహ్మబలమె బలము[19]

వశిష్ఠునితో యుద్ధం చేసి తన ప్రతాపం వ్యర్థమైనపుడు కౌశికుడు పొందిన పశ్చాత్తాపం ఇది. తన శక్తిని నిందించుకోవడం, వ్యర్థమైపోయిన తన బలాన్ని కించపరచుకోవడం ఇక్కడ కనిపిస్తుంది. పాదారంభాల్లోనే పాత్రగత మనస్తత్వాన్ని ప్రకటించే నిర్మాణముంది.

ఘ) కోకిల కొమ్మలో కూసిన నీవటే

నన్ను బిల్చితివంచు నవ్వుమౌని[20]

ఇదే పద్ధతిలో సాగిన

'కోకిల దూరాన గూసిన నీవటే

నన్ను బిల్చితివంచు నవ్వు సామి[21]

ప్రతి పాదాంతంలోనూ కర్మపదం ఉంది. ఈ పోకడలో ఉన్న పద్యాలలో క్రియాపదాంతంగానూ కనిపిస్తాయి.

జ) 'ఏమీ మహోరాశి, యేను బ్రహ్మర్షినా

యనినంత నౌను బ్రహ్మర్షి వంచు[22]

కౌశికుడు బ్రహ్మర్షి అయిన వేళ వశిష్ఠుడు అతడిని బ్రహ్మర్షిగా గుర్తించిన సందర్భమిది. తొలి దళంలో 'ఔనా – నేను బ్రహ్మర్షినయానా' అనే ఉద్విగ్నత, దానిని ధ్రువీకరించాల్సిన వశిష్ఠునితో ప్రశ్నించడం ఉన్నాయి. రెండవ దళంలో దానికి సమాధానం ఉంది. వరుసగా ప్రతిపాదంలోనూ ఇదే పోకడ ఉంది. దీనిని వశిష్ఠుడు ధ్రువీకరించడముంది.

చ) 'పునరుద్భవద్గంత ముగ్ధమోహన రుచి

ప్రకట రేఖాహాస భావ పరిధి.'[23]

'కలవింక చాషకంక శశాద నోలూక

మౌకలికారండ వాకులములు

పుష్కరాహ్వ రథాంగ భుజగ భుక్కీర వ

న ప్రియ కూజిత నర్తితములు[24]

'రఘువంశ ప్రాణధారాభూత ముగ్ధ మో

హన మందహాస బాహాట మూర్తి'[25]

ఇత్యాది పద్యాలలో పాదంలో సంస్కృత సమాసాల దైర్ఘ్యత కనిపిస్తుంది. సందర్భంలో ఒక గాంభీర్యాన్నీ, వైభవాన్నీ ప్రకటించాల్సి వచ్చినపుడు కవి ఈ పోకడననుసరించినట్లు తెలుస్తుంది.

(ఛ)

'ఈ నెల బాలుడు నింతలో నింత మొ

న్నటిదాక బాలు నన్నమును బైడి

వెండి గిన్నెలలోన బెట్టి తా వచ్చెడు

దినిపింప – ' [26]

ఇది పాద నియతి లేకుండా సాగిన రచన. నన్నయాది కవులలోనూ ఇది కనిపిస్తుంది. నిరలంకారమైన కథనంలో ఈ నిర్మాణం కనిపిస్తుంది.

ఈ భేదాలే కాకుండా నిషేధార్థకాలను ప్రయోగించిన రచన ఇది:

కౌసల్యయొడిలోన గాని కూర్చుండదు

జడ సుమిత్రయె గాని ముడువరాదు

కైకేయితో గాని కైలాగు బూనదు

వారితో గాని నవ్వంగ రాదు[26]

శాంతకు దశరథుని పట్టపు రాణులతో ఉన్న ప్రేమాభిమానాలను ప్రకటించే పద్యమిది. ప్రతి దళంలోనూ చివర నిషిద్ధార్థకముంది.

మరొక భేదం:

క్షీరాద్ధి తరగలో శ్రీ పయోధరములో

తొలిపాము పొలుసులో తూగుశయ్య'[27]

వరస ఉపమానాలుండి, పాదాంతం ఉపమేయంగా కనిపిస్తుంది. రెండవ భేదం ఉపమానాంతమైతే, ఇది ఉపమేయాంతంగా కనిపిస్తుంది. ఇక్కడ వరుస ఉత్ప్రేక్షలు. అక్కడ ఒక ఉపమానం.

'వచ్చి తానంతలో వచ్చును మఱల భూ

నాధుండు గౌసల్య సౌధములకు'[29]

'శంపా సహస్రాభ ఛండ కాంతి చ్ఛటా

మేయ వారావర్త మెఱసి మెఱసి'[30]

'ప్రభుమేనిపై గాలి పై వచ్చినంతనే

పాషాణ మొకటికి స్పర్శవచ్చె'[31]

'చుఱచుఱ నెఱ్ఱనై జూచెడు చివురాకు

చివురాకు వెనుక పొంచిన లతాంత

బాణుండు విసరగా బట్టిన పిడి బాకు'[32]

'ఎలయించి కికురించి వలపుల ప్రాకించి

దొంగయౌ కన్నె సంపంగి చేత'[33]

'సచ్చిదానందముల్ స్కంధత్రయము గుర్తు

గానున్న యొక చెట్టుగాని చెట్టు'[34]

వంటి అనేక పోకడలున్నాయి.

పద్య నిర్మాణ రీత్యా సీసం విశాలమైనది. కథనానికీ, వర్ణనకూ అనుకూలమైన పద్య ఛందస్సు ఇది. ఇందులో భిన్న నిర్మాణ విధానాలను కవులు అనుకరించారు. కల్పవృక్ష బాలకాండలో ఆ భిన్న నిర్మాణాలను దృజ్మాత్రంగా పరిశీలించడం ఈ వ్యాస పరమార్థం. మహా కవుల సీస పద్య నిర్మాణ వ్యూహాలు ప్రత్యేకించి పరిశోధించదగినవి.

ఆధారగ్రంథాలు:

1. శ్రీమదాంధ్ర మహాభారతము – ఛందశ్శిల్పము; ఆచార్య పాటిబండమాధవ శర్మ
2. శ్రీమద్రామాయణ కల్పవృక్షము – శ్రీ విశ్వనాథ సత్యనారాయణ
3. శ్రీమద్రామాయణ కల్పవృక్ష బాలకాండ – ఛందోవస్తు శిల్పము (సిద్ధాంతగ్రంథం) డా. పి. ఆర్. హరినాథ్.

పాదసూచికలు:

1. చూ.'ఆంధ్రమహాభారతము - ఛందశ్శిల్పము'; ఆచార్య పాటిబండ మాధవ శర్మ.
2. శ్రీమద్రామాయణ కల్పవృక్షం; బాలకాండ - అవతారిక, 30 ప.
3. శ్రీమద్రామాయణ కల్పవృక్షం; ఇష్టిఖండం, 56.
4. శ్రీమద్రామాయణ కల్పవృక్షం; ఇష్టిఖండం, 56.
5. బాలకాండ; ఇష్టి - 177 ప.
6. బాలకాండ; ఇష్టి - 204 ప.
7. బాలకాండ; అవతార. 97 ప.
8. బాలకాండ; అవతార, 154 ప.
9. అవతార. 329 ప.
10. అవతార. 364 ప.
11. అవతార, 376 ప.
12. అహల్య, 3 ప.
13. అహల్య, 74 ప.
14. అహల్య. 260 ప.
15. అహల్య. 391 ప.
16. ధనుష్ఖండం. 2 ప.
17. ధనుష్ఖండం. 4 ప.
18. ధను, 59 ప.
19. ధను, 109 ప.
20. ధను, 193 ప.
21. కళ్యాణ ఖండం. 226 ప.
22. ధను, 257 ప.
23. ధను, 300 ప.
24. ఇష్టి, 215 ప.
25. ధను, 216 ప.
26. కళ్యాణ. 149 ప.
27. ఇష్టి. 227 ప.
28. అవతార. 112 ప.
29. అవతార. 155 ప.
30. అహల్య. 378 ప.

31. అహల్యజ 254 ప.
32. ధను. 231 ప.
33. కళ్యాణజ 218 ప.
34. అహల్య. 551 ప.

తమిళ భాషా ప్రాచీనత

– కీ.శే. డా. చిలుకూరి నారాయణరావు

భాష అనేది అనాది. పశుపక్ష్యాదులకు గూడా నాటి జీవితావసరములకు కావలసిన భాష ఉండనే ఉంటుంది. దానిని గురించి ఎవ్వరున్ను పరిశోధన చేయలేదు. మనుష్యునికి మాత్రం మాట్లాడేజంతువు అని పేరు పెట్టినారు. ఈ మనుష్యులు దేశభేదమునుబట్టి, కాలభేదమునుబట్టి, యితర అవస్థా భేదములను బట్టి వేర్వేరు సంఘములుగా నివసించి, భాషా విషయమై ప్రత్యేక సంకేతములను ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. ఆయా తెగల భాషలన్నీ మొదట ఏకభాషగా ఉండి ప్రత్యేక భాషలుగా విడిపోయినవో, లేదా ప్రత్యేక భాషలుగా ప్రత్యేక స్థలములలో ఉద్భవించి, ఆయా జాతుల పరస్పర సమ్మేళనమువలన విశాలమైన భాషలుగా పరిణమించినవో చెప్పడానికి వీలులేదు.

ప్రపంచములోని భాషలన్నిటిని వర్గీకరించి వాటి వాటి లక్షణ సామ్యమువల్ల శాస్త్రజ్ఞులు వాటిని వేర్వేరు కుటుంబములుగా విడదీసినారు. ఆ కుటుంబములలో ఇండో–యూరోపియను కుటుంబము చాలా విస్తారమైనది. అది ఆసియా, ఐరోపా ఖండములలో అనేక భాషలకు సామాన్యమైన కుటుంబముగా ఉన్నది. ఆ ఇండో–యూరోపియను భాషలలోవైదిక భాష, సంస్కృత భాష, ప్రాకృతభాషలు అనేవి చేరి ఉన్నవి. భారత వర్షములోనున్న భాషల కన్నిటికిన్నీ ఇవి మూలములని ఆయా భాషల వ్యాకరణములను వ్రాసినవారు తెలిపి ఉన్నారు. కాని కాల్డువెల్లు అనే పాశ్చాత్య పండితుడు దక్షిణ ఇండియాలోని ద్రావిడ భాషలకును, ఉత్తర హిందూస్థానములోని ఆర్యభాషలకున్ను ఎట్టి సంబంధమున్ను లేదనిన్నీ, ద్రావిడ భాషలు మధ్యఆసియాలో ఉండిన, ఇండో–యూరోపియను భాషలకు సంబంధించినవి, సిథియను భాషలలో పోలిక గలిగి ఉన్నవనిన్నీ, సిద్ధాంతము చేసినాడు. అసలు సిథియను భాషా కుటుంబమను పేరు తగినదికాదనిన్నీ, సిథియనుభాషలని చెప్పబడే వాటిలోనే పరస్పర సంబంధము కానరాకున్న దన్నినీ, సిథియనరు భాషలని చెప్పబడేవాటిలోనే పరస్పర సంబంధము కానరాకున్న దనిన్నీ, సిథియను భాషలని చెప్పబడేవాటిలో కొన్ని ఇండో–యూరోపియను భాషాకుటుంబమునకు జెందినవనిన్నీ, సిథియను భాషలకున్న ద్రావిడ భాషలకున్ను గల కాల్డువెల్లు చూసిన పోలికలుగావనిన్నీ నిర్ణయిస్తూ గ్రియరుసను మొదలైన పాశ్చాత్య పండితులు ద్రావిడ భాషలను ప్రత్యేక కుటుంబముగా ఏర్పాటు చేసినారు. సంస్కృత ప్రాకృతములకును ద్రావిడ భాషలకును గల సంబంధము గురించి వారెట్టి పరిశ్రమనూ చేయలేదు. హిందూదేశ చరిత్రమునుబట్టి ఆలోచిస్తే ద్రావిడులను అనార్యజాతులు అని పరిగణించడానికి కారణములు కనబడవు. హిందూదేశములో అనార్యజాతులు లేకపోలేదు. కాని జాతులకున్ను, భాషలకున్ను ఎడతెగని సంబంధము ఉంటుందని చెప్పవీలులేదు. బలవంతులు, నాగరికులు ఐన జాతుల వారి భాషలను, అంతకంటె తక్కువ నాగరికత కలవారు అవలంబిస్తారని

చెప్పడానికి ప్రపంచ చరిత్ర నుండి అనేకములైన ఉదాహరణములను చూపవచ్చును. ద్రావిడ భాషల తత్త్వమును బట్టిన్నీ, దక్షిణ హిందూ దేశపు చరిత్రమునుబట్టిన్నీ, లక్షణగ్రంథములను వ్రాసిన పండితుల అభిప్రాయములనుబట్టిన్నీ ఆలోచిస్తే, ద్రావిడ భాష లార్యకుటుంబములో చేరినవే అనిన్నీ, అవి ఒక రీతి ప్రాకృత భాషా విశేషము లనిన్నీ నేను రచించిన ఆంధ్ర భాషా చరిత్రములో నిరూపించడానికి ప్రయత్నించినాను.

హిందూ దేశములోని అనేక భాషలలో వాఙ్మయము లేదు. ఉత్తర హిందూస్థాన భాషల వాఙ్మయము చాలా నవీనమైనది. ద్రావిడ భాషావాఙ్మయము అంతకంటె కొన్ని శతాబ్దములకు పూర్వమునుంచీ ఉన్నట్లు చరిత్ర తెలుపుతున్నది.

ద్రావిడ భాషావాఙ్మయములో అతి ప్రాచీనమైనది తమిళ మనిన్నీ తరువాత కన్నడ వాఙ్మయమూ, పిమ్మట తెలుగువాఙ్మయము, ఆ తర్వాత మలయాళవాఙ్మయమూ, ప్రాచీనములనిన్నీ ఇప్పుడు మనకు లభ్యములైన గ్రంథజాలమునుబట్టి చరిత్రకారులు నిర్ణయించినారు. ఇది స్థూలముగా సత్యముగానే కనిపిస్తున్నది. ఈ ప్రాచీనత విషయమున తమిళ భాషకును తక్కిన ద్రావిడ భాషలకును వేయి సంవత్సరములకు తక్కువకాని అంతరమును తమిళ భాషాప్రియులు నిర్ధారణ చేస్తున్నారు. తమిళ భాష తమిళ విద్వాంసులు చెప్పినంత ప్రాచీనమైనది కాదనిన్నీ, ప్రధాన ద్రావిడ భాషలలో వాఙ్మయమించుమించు ఏక కాలముననే బయలు వెడలినదనిన్నీ, చెప్పడానికి తగిన ఆధారములున్నవి.

తమిళభాష అతిప్రాచీనమైనదని చెప్పడానికి ముఖ్యాధారము దానిలో “సంగం” (‘సంగము’) వాఙ్మయము అనేది ఉండడమని తమిళభాషాప్రియులు చెప్పుతున్నారు. కనక సబాపిళ్ల గారు “1800 ఏండ్లక్రిందట తమిళులు” (Tamils 1800 years ago) అనే గ్రంథమును వ్రాసి దానికి సంగం వాఙ్మయమునే మూలాధారముగా చేసి తమిళులు తమ తమిళ భాషతో పాటు, క్రీ.శ. మొదటి శతాబ్దములలో అత్యుచ్ఛదశలో ఉండేవారని తెలిపినారు. నాటి నుంచిన్నీ పాశ్చాత్యచరిత్రకారుల సిద్ధాంతమునే అవలంబించి దానిని లోకములో ప్రచారము చేసినారు. కొందరు తమిళులు తమ భాష ప్రాచీనత చాలక క్రీస్తుపూర్వము ఐదవ శతాబ్దమునుంచిన్నీ తమిళభాష ఉన్నదని నిర్ధారణ చేయడానికి ప్రయత్నించినారు. ఇటీవల తమిళపండితులలో కొందరు క్రీస్తు మొదటి శతాబ్దముల వరకు మాత్రము తమిళ భాషా వాఙ్మయమును నిలిపినారు. కొందరు దానిని క్రీ.శ. ఏడవ శతాబ్దము వరకును తీసుకొనివచ్చినారు. ఈ రీతిగా తమిళపండితులలోనే తమిళభాషా ప్రాచీనతను గురించి అనేకములైన భిన్నాభిప్రాయములున్నవి.

ఈ ప్రాచీనతను నిర్ణయించడానకి ఈ పండితుల కందరికిన్నీ గల ఆధారము ‘సంగము వాఙ్మయ’మనేది ఒక్కటే. ఈ వాఙ్మయము స్వరూపమును మనము కొంత వరకు తెలుసుకొంటేనేగాని తమిళ భాషా ప్రాచీనతత్త్వము బోధపడదు. తమిళములో పాటలు, పదములుమొదలైన గేయరూపములతో కొంత వాఙ్మయమున్నది. ఆ పాటలలో కొన్నిటిలో పూర్వ వీరుల పరాక్రమము,

దాతృత్వము మొదలైన గుణ విశేషములు కీర్తింపబడి ఉన్నవి. కొన్నిటిలో శృంగారరసము వర్ణితమై ఉన్నది. కొన్నిటిలో నీతులుపదేశింపబడినవి. కొన్ని మత విషయములకు సంబంధించినవి. వీటి అన్నిటినుంచిన్నీ ఆయా పాటలు రచింపబడి ఆ కాలమునాటి జనుల ఆచార వ్యవహారములను గురించి తెలుసుకొనవచ్చును. మొదట ఈ పాటలకున్నూ, పదములున్నూ చాటువులవలె ప్రత్యేకము ప్రత్యేకముగా ఉండేవి. వాటినన్నిటినీ ఎవరో ఒక చోట జేర్చి "అహం" "పురం" మొదలైన విభాగములుగా ఏర్పాటు చేసినారు. "అహం" అనగా శృంగారమును వర్ణించునట్టి భాగము. "పురం" అనగా పరాక్రమము మొదలైన విషయములను వర్ణించే భాగము. ఈ రీతిగా ఆయా సంపుటములను ఏర్పాటు చేసి వానిలోని ప్రత్యేకములైన పాటలకును పదములకును ఛందో వ్యాకరణాలంకారాది జ్ఞాపికతో ఆ గ్రంథములను వ్రాసి ఉంచినారు.

ఈ జ్ఞాపికలలో కొన్నిటిని తరువాతి వారు కూడా నేర్చినారు. ఈ గ్రంథములోని పాటలున్ను పదములున్ను అనేకములు చాలా చిన్నవి. కొన్ని పెద్దవి కూడా కలవు. కొన్నిటిలో వాటిని రచించిన కవులపేళ్లు అంకితములై ఉన్నవి. కొన్నిటిలో లేవు. ఈ గ్రంథ సంచయములవ్రాతప్రతులలో అనేకములయిన తబ్బిబ్బులు కావస్తున్నవి. వాటిలో పాఠభేదములనేకములున్నవి. ఈ పాఠభేదముల వలన ఆ పాటల కర్తృత్వాది విషయమున ఎన్నో సందేహములు కలుగుతున్నవి. వీటినన్నిటిని గమనించి మహామహోపాధ్యాయ వి. స్వామినాథయ్యరు గారు అనేక వ్రాతప్రతులను పరిశోధించి తమయభిప్రాయమున కనుకూలమగునట్లు వాటిని పాఠభేదముల ననుసరించి సవరణలను చేసి లభ్యమయిన ఈ వాఙ్మయమును ప్రకటించినారు. దీనినే సంగము వాఙ్మయమని అంటున్నారు.

"సంగము" అనేది సంఘశబ్దభవము. రాజాస్థానములందు ప్రఖ్యాతి వహించిన మహాకవులు నియమింపబడి, దేశములో కవిత్వము చెప్పగలవారు చేసిన కావ్యములు తమచే పరిశీలింపబడి తమమెప్పును పొందితేనే గాని వాటికి ప్రచారము కలుగకూడదని శాసించేవారట. ఈ మహాకవుల సమూహమునకే సంగమని పేరుండేదట. ఇటువంటిసంగములు మూడు ఉండేవట. ఈ సంగముల గూర్చిన గాథ "ఇరైయనార్ అహప్పొరుళ్" అనే గ్రంథముమీది వ్యాఖ్యానములో ఈ విధముగా ఉన్నది.

'పాండ్యరాజులు ఆదిసంగము, మధ్య సంగము, అంత్యసంగము అని మూడు సంగములను స్థాపించినారు. వీటిలో మొదటి సంగము(549) మంది కవులుండేవారు. వీరిలో మొదటి వాడు 'అగత్తియనార్' (అగస్త్యుడు.) త్రిపుర సంహారకుడైన ధూర్జటి శివుడు, మురుగ లేక కుమారస్వామి, మురంజియురి ముడినాగరాయడు, దిక్పాలకుడైన కుబేరుడు కూడా యీ పరిషత్తులోనివారే. వీరి యెదుట (4449) మంది కవులు తమ కావ్యములను విమర్శార్థము సమర్పించినారు. ఆ కావ్యములలో 'పరిపాడల్', 'ముదునారై', 'ముదుకురుహు', 'కలరియావిరై' అనేవికొన్ని ఉన్నవి. ఈ సంగములోని 549 మందిన్నీ 4400 ఏండ్లు తమ వ్యాపారమును సాగించినారు. వారిని 'కాయ్సినవళుది' అనే రాజు నుండి 'కడుంగోన్' అనేరాజువరకు 89 మంది రాజులు ఆదరించినారు.

ఈ రాజులలో ఏడుగురు స్వయముగా కవులు. ఈసంగము మదురలో ఉండేది. ఈమదుర తరువాతి కాలమున సముద్రములో మునిగిపోయినది. ఈ సంగము వారు 'అగత్తియమ్' అనే వ్యాకరణమును ప్రమాణముగా తీసుకొన్నారు.

రెండో సంగములో 59 మంది ఉండే వారు. వారిలో 'అగస్త్యుడు', 'తొల్కాప్పియనారు', 'ఇరుందయ్యూర్ కరుగోయి', 'మోశి', 'వెల్లూర్ క్కాప్పియనారు', 'శిరుపాండరంగన్', 'తువరై' (ద్వారక) రాజైన 'తిరైయ మార', 'కీరందై' అనేవారుండేవారు. వీరియెదుటికి 3700 మంది తమ కావ్యములను తెచ్చినారు. ఆ కావ్యములలో 'కలి', 'కురుహు', 'వెండాళి, 'వియాళమాలై అహవల్' అనేవి కొన్ని. అగత్తీయం, 'తొల్కాప్పియము' 'మాపురాణము', 'ఇశైనుణుక్కము', 'బూదపురాణము' అనేవి వీరనుసరించిన వ్యాకరణములు. ఈ సంగము 3700 సంవత్సరములున్నది. 'వెండేల్ శెలియ్' అనే రాజు నుండి 'మురత్తెరుఆర' అనే రాజు వరకు 59 మంది పాండ్యరాజులు దాని నాదరించినారు. ఈ రాజులలో ఐదుగురు స్వయముగా కవులు. ఈ సంగము కవాటపురములో చేరేది. ఈ స్థలము కూడా సముద్రములో మునిగిపోయి ఉంటుంది.

మూడో సంగములో 49 మంది ఉండే వారు. వీరిలో ముఖ్యులు శిరుమేదావియారు, శేందం బూదనారు, అరివుడయనార్ పెరంగొరూల్క్కిళార్, ఇళందిరుమారన్, నల్లందోనార్, మరుద ఇళనాగనార్, నక్కీరర్ అనేవారు. వీరి యెదుటికి 449 మంది కవులు వచ్చినారు. వారు పరిశీలనార్థము సమర్పించిన కావ్యములలో 'నెడుందొగై' (అహనానూఱు), కురుందొగై – నానూఱు, నట్రినై – నానూఱు, పుఱ –– నానూఱు, అయింగుఱు – నూఱు, పదిట్రుప్పత్తు, (పదిపదులు), కళి (నూటయాభై), పరిపాడల్ (డెబ్బై), కూత్తు, వరి, శిట్రిశై, పేరిశై అనేవి ముఖ్యములు. ఈ సంగము వారు 'అగత్తియము', 'తొల్కాప్పియము' అనే వ్యాకరణాలను ప్రమాణాలుగా అంగీకరించినారు.

ఈ సంగము 1850 సంవత్సరములుండినది. తన రాజ్యములో కొంతభాగము సముద్రములో మునిగిపోగా మదురలో రాజధానిని స్థాపించుకొన్న 'ముడత్తిరుమార' అనే రాజు నుండి 49 మంది రాజులీ సంగమును ఆదరించినారు. ఈ రాజులలో తుదివాడు 'ఉక్కిరప్పెరువళుది' అనేవాడు. ఈ సంగము ఉత్తర మధురలో అనగా నేటిమదురలో సమావేశమయ్యేది."

పైని తెల్పిన విషయములం దత్యద్భుతములు, అసాధారణములు, అసాధ్యములు, అసంభావ్యములు ఐన సంగతులు గోచరిస్తున్నవి. శివుడు, మురుగుడు, కుబేరుడు మొదలైన దేవతలే యీ సంగములలో ఉండడమూ, ఈ దేవతలు ఊరుసు పేరును లేని కవులతోను, కవయిత్రులతోను కలిసి ఉండడమూ, ఈ సంగము లుండిన అతి దీర్ఘకాలము, పాండ్యరాజుల దీర్ఘ రాజ్యకాలములు, కృత్రిమపుటంకెలు, ఒక సంగపుకవి తక్కిన సంగములలో కూడా ఉండడము, ఇవన్నీ యీసంగం గాథ కృత్రిమ మనిన్నీ, కల్పిత మనిన్నీ చెప్పకయే చెప్తున్నవి. మొదటి సంగము 4440 ఏండ్లుండినదట. ఇంత కాలములోనూ 4449 మంది కవులు

మాత్రమున్నారట. రెండవ సంగములో 3700 ఏండ్లకు 3700 మందే కవులున్నారట. మూడవ సంగములో 1850 ఏండ్లున్నూ 449 మంది సభ్యులట. అంటే ఈ మూడు సంగములకాలము, 4440+3700+1850 = 9990 సంత్సరములన్నమాట. తక్కిన పదేండ్లను చేర్చి పదివేలేండ్లుగా చేస్తే బాగుండేది. విన్నవారు నమ్మరేమోనని అట్లు చేయడం మానివేశి ఉంటారు.

ఈ సంఘములగాథ అవిశ్వసనీయ మనడానికి ఈ క్రింది కారణములను మద్రాసు విశ్వవిద్యాలయము పరిశోధన శాఖలో పనిచేస్తూ ఉన్న కె.ఎన్.శివరాజపిళ్ల గారు వివరించి ఉన్నారు.

1. సంగములను గూర్చిన సంప్రదాయము జనసామాన్యమునకు తెలియదు. కొందరు విద్వాంసులును పురోహితులునూ గలసి దీనిని కల్పించినారు.
2. సంగం గ్రంథములు అని చెప్పబడే వాటిలో ఏ సంగమును గూర్చిన్నీ ప్రస్తావన లేదు.
3. సంగము వాఙ్మయములో గనబడే రాజకీయ సాంఘిక పరిస్థితులను బట్టి అట్టి సంగస్థాపనకు గాని, పోషణకుగాని అవకాశములు లేవు.
4. ఈ సంగసంప్రదాయములో తెలుపబడిన విషయములును, అంకెలును చాలకృత్రిమములు. వాటిని బుద్ధిపూర్వకముగా అంకగణితము చేసి ఆరీతిగా ఏర్పరచినట్లు స్పష్టమవుతున్నది. అవి సహజములు కావు.
5. సంగసభ్యులలో దేవతలనూ మనుష్యులను కలిపి చేర్చడము ఆర్యులు తమిళ దేశమునాక్రమించి తమ పురాణకథలను తమిళదేశములో వ్యాపింపజేయ ఆరంభించినకాలము నుండి జరిగి ఉంటుంది.
6. మూడుసంగముల కాలము 9990 సంవత్సరమును వాటిని పోషించిన పాండ్య రాజుల సంఖ్య 197తో భాగిస్తే ఒక్కొక్క తరమునుకు 50 చిల్లర ఏండ్లు ఏర్పడుతవి. సాధారణముగా ఒక్కొక్క తరమునకు 25 ఏండ్లకంటే ఎక్కువ ఇవ్వడానికి వీలులేదు.
7. ఈ దీర్ఘ కాలములో ఒకటి రెండుసార్లు సముద్రము భూమిని ముంచివేసినది. అట్టి సందర్భములో ఒక సంగము నాటి వృత్తాంతములు తక్కిన సంగము వారికి ఎట్లు తెలిసినవో వింతగా ఉన్నది.
8. మదురకు 'తళయ్యారన గానత్తుపాండ్యన్' కాలమువరకును 'కూడల్' అనే పేరుండేది. దానికి తరువాతి కాలములో ఉత్తర మదుర అని పేరు పెట్టడము దక్షణమదుర సముద్రములో మునిగిపోయినదని చెప్పినదానిని సమర్థించుకొనడానికై ఉంటుంది. ఆ ప్రాచీన కాలంలో మదుర అనే సంస్కృతము పేరుండడానికి వీలులేదు.
9. మొదటి రెండు సంగములలోని గ్రంథములలో ఒక్కటిన్నీ నేడు మిగిలి ఉండలేదు. ఆ రెండు సంగములలోని గ్రంథములవిషయము కేవలము కట్టుకథగాని మరొకటి గాదు.
10. ఈ సంగమువృత్తాంతమంతా అసహజము, అశాస్త్రీయము. ఏ దేశములోనైనా, జ్ఞానము,

పాండిత్యము క్రమక్రమంగా అభివృద్ధి ఔతవిగాని ఒక్కసారి క్షీణించిపోవు. సంగమును గూర్చిన కథనుబట్టి తమిళ వాఙ్మయములో నానాటికి క్షీణత ఉన్నట్లు తెలుస్తున్నది. ఇది సరికాదు.

ఇట్టి కారణములనే తెలుపుతూ ఇతర తమిళవిద్వాంసులు కూడా మొదటి రెండు సంగములను వదులుకొన్నారు.

ఇక మూడో సంగమును గూర్చిన గాథ. 'వంగియ సాగరన్' (వంశ శేఖరుడు) అనే రాజు కాలములో కాశీపట్టణములో బ్రహ్మకు సరస్వతిమీద కోపము వచ్చి ఆమె శరీరమైన 5 వర్ణములలో ఆ నుండి హవరకు 48 వర్ణములునూ మనుష్యజన్మ మెత్తి కవులగుదురుగాక అన్నిన్నీ, తక్కిన వర్ణములను మొదటిదిన్నీ, మదురలోనిదేవుడన్నూఅయిన 'అ'కారము దేహమును ధరించి కవియై తక్కిన వారితో 49వవాడై ఒక సంగమును స్థాపించునుగాక అనిన్నీ అతడు చెప్పినాడట. ఆ శాపము ప్రకారము 49 అక్షరములున్నూ భౌతిక దేహములతో ప్రపంచములో సంచరిస్తూ, అనేక స్థలములలో విద్వాంసులతో వాదములు చేసుకొంటూ తుదకు మదురకు జేరుకొన్నారట. అక్కడ వారికి శివుడు, మనుష్య రూపముతో ఎదురుపడి మదురలోని దేవుని పూజించవలసినదని ఉపదేశించినాడట. అప్పుడు వారా దేవునిమీద పద్యములను జెప్పి పాండ్యరాజు సమ్ముఖమునకు పోయినారట. ఆ రాజు దేవాలమునకు వాయవ్యదిశను వారికోసమొక సభామంటపమును గట్టించి వారి కనేకములైన బహుమానములను చేసినాడట. అంతకుపూర్వము రాజసమ్మానమును బొందుతూ ఉండే విద్వాంసుల కీర్ష్య పుట్టినదట. ఈ కొత్త విద్వాంసులు పాత విద్వాంసులను వాదములో ఓడించి ఇతరుల కవితా ప్రాశస్త్యమును, పాండిత్యమును పరీక్షించేటప్పుడు తాము తాము కూర్చొనడానికి ఒక కట్టెపలకను ప్రసాదించవలసినదని శివుని వేడుకొన్నారట. అప్పుడు శివుడొక కవివేషముతో వారికి సాక్షాత్కరించి రెండు జేనల చదరపు పలకను చేతితో పట్టుకొని వారియెదుట నిలిచినాడట. వారాపలకకు ధూపము వేసిన మీదట 'నక్కీరరు' మొట్టమొదట దానిమీద కాలు పెట్టినాడట.

అతని తరువాత ఒకరినెనుక ఒకరు కపిలరు, పరణరు మొదలైనవారెక్కినారట. సరియైన విద్వాంసుడు దానిపై ఎక్కుతూ ఉన్న కొద్దీ ఆ పలక పెద్దదికావడమారంభించిందట. ఇట్లు కొంతకాలానికి నాకవిత్వం గొప్పదంటే నాకవిత్వం గొప్పదని ఆ కవులు పోట్లాడుకోవడం ఆరంభించినారట. అందుచేత శివుడు పదేపదే వచ్చి వారిని వాదాలను పరిష్కారం చేసేవాడట. ఇది కథ.

ఈగాథ విశ్వాసపాత్రమైనా కాకపోయినా సంగమమనే దొక్కటే ఉండే దనిన్నీ, మూడు లేవనిన్నీ స్థిరపరుస్తుంది. ఈ మూడో సంగము కూడా లేదనే తమిళ విద్వాంసులు కూడా లేకపోలేదు. కాని తమిళ వాఙ్మయమునుబట్టి తమిళ భాష ప్రాచీనతను నిర్ణయించడానికి ఇంకా అనేకులు ప్రయత్నిస్తున్నారు. కాబట్టి దాని తత్త్వమును గురించి కొంత వరకు ఆలోచింతాము.

మొదటి సంగములోని గ్రంథములన్నీ పోయినవి. దానిలోని 'పరిపాడల్' అనేది మూడో సంగముదై ఉంటుంది. తక్కిన గ్రంథములకొనన 'నారై కురుహు' అనే పదములుండడం చేత అవి సంగీత గ్రంథములై ఉండవచ్చునంటారు. రెండో సంగం గ్రంథములు కూడా అన్నీ నష్టములైపోయినవి. అప్పటి గ్రంథములలో 'తొల్కాప్పియమ్' మాత్రము మిగిలినది. కాని ఇది కూడా మూడో సంగములోనిదే అని కొందరంటారు; కొందరు ఈ తొల్కాప్పియము నవీనమైనదని కూడా అంటారు. ఈ తొల్కాప్పియమును గురించి యీ క్రింథగాధను చెప్పుతారు.

మూడో సంగం కాలమున పాండ్య దేశములో ద్వాదశవర్షక్షామము కలిగినదట. అప్పుడు పాండ్యరాజు తనసభలోని పండితులనూ కవులనూ పోషించలేక మరియెక్కడికైనా పోయి జీవనము చేయమని పంపివేసినాడట. కరువుపోయిన తర్వాత అక్కడక్కడ మిగిలిన పండితులందర్నీ పిలిపించి అడుగగా వారిలో యెవ్వరికిన్నీ తొల్కాప్పియములోని 'ఇరయనార్ అహప్పొరుళ్' అనే భాగమును గురించి తెలియలేదట. ఏమి చేయుదునా అని రాజు ఆలోచిస్తూంటే శివునికి రాజుమీద కనికరం పుట్టి యీ భాగమును అరవైసూత్రములలో పూర్తి చేసి రాగిరేకుల మీద చెక్కింది మధుర దేవాలయములలో విగ్రహము పీఠముక్రింద పెట్టిపోయినాడట. పూజారి ఉదయం పోయి గర్భగుడిని తుడుస్తుండగా ఈ రాగిరేకులు అతని కంటబడినవట. తొల్కాప్పియములోని అంత పెద్ద అధ్యాయము అరవై సూత్రములలో మాత్రము సంగ్రహింపబడడము చేత దాని అర్థమెవరికీన్న బోధపడలేదు. అందుచేత రాజు తన ఆస్థాన విద్వాంసులను ఆ సూత్రములకు వ్యాఖ్యానము వ్రాయమన్నాడట. అనేకులు ప్రయత్నించినారు. కాని ఆ వ్యాఖ్యానము సరిగా ఉన్నదో లేదో నిర్ణయించడానికి ఒక అధ్యక్షుడు కావలసి వచ్చింది. అట్టి అధికారం కలవాడు ఎవడున్నూ కనిపించలేదు. అందుచేత రాజు శివునికే మొరపెట్టుకున్నాడు. మొరపెట్టుకోగా అతడు మదురలోనున్న ఒక బ్రాహ్మణుని కొడుకును చూపినాడు. ఆ పిల్ల వాని వయస్సు ఐదేండ్లు. వాడు పుట్టుమూగ. వాని పేరు రుద్రశర్మ. వాని తండ్రిపేరు 'ఉప్పూరిక్కుడిక్కిళా'. ఆమూగ బాలునికి యీ వ్యాఖ్యానములన్నీ చదివి వినిపించినారు. ఒక్కొక్క వ్యాఖ్యానమువింటూ వాడు ఊరుకునేవాడు. తుదకు 'మురుగ ఇడనాగ' అనేవాని వ్యాఖ్యానమును చదువుతూంటేకొన్ని కొన్ని పట్టులలో ఆ పిల్లవాడు ఏడ్చేవాడట. తరువాత 'నక్కీర' తన వ్యాఖ్యానమును చదవ నారంభించినప్పటి నుంచి ముగించే వరకూ ఒక్కటే ధారగా కన్నీళ్లు విడిచినాడట. ఈ తొల్కాప్పియములో మూడధికారములున్నవి. 'ఎళుత్తదిగారం', 'శొల్లదిఆరం', 'పొరుళదిగారం' అని వాటి పేర్లు. గ్రంథములో మొత్తము 1276 సూత్రములున్నవి. ఒకొక్క అధికారంలో తొమ్మిది 'ఇయలు' లున్నవి. ఈ గ్రంథముపై అనేకులు వ్యాఖ్యానములు వ్రాసినారు.

పై గ్రంథము కాక మూడో సంగమునకు సంబంధించిన గ్రంథములు 'ఎట్టుత్తొ హై', 'పత్తుప్పాట్టు), 'పదినెణ్ 'కీఌకణక్కు' అనేవి. వీటికి శిలప్పదిగారం, మణిమేహలై అనే వాటిని కూడా కొందరు చేరుస్తారు. ఈ తుదిరెండున్నూ నవీనములని, అనగా తరువాతి కాలవపువని కొందరి అభిప్రాయము.

'ఎట్టుత్తొహై' అనే గ్రంథములో 'నట్రిణై', 'కురుందొహై', 'ఐంగుఋనూరు', 'పదిట్రుప్పత్తు', 'పరిపాడల్', 'కలిత్తొహై'. 'నిడుందొహై', 'పుఋనామాఋ' అనే ఎనిమిది గ్రంథసంపుటములున్నవి.

1. నట్రిణై'లో నన్నూట ఒక్క పద్యములున్నవి. ఒకొక్క పద్యములో తొమ్మిది నుండి పండ్రెండు పంక్తులవకు ఉన్నవి. ఇవి 175 మంది కవులు రచించినవి. ఈ పద్యములు ఐదు 'తిణై'లకు సంబంధించినవి. 'తిణై' అనగా ఒక స్థలమన్న మాట. ఇవి 'ముల్లై' (పర్వత ప్రాంతము), 'మరుదం' (నదీ ప్రాంతములు), 'పాలై' (ఎడారులు), 'నెయ్దల్' (సముద్ర తీరములు), 'కురింజి' (అరణ్యములు) అని ఐదు విధములుగా ఉంటవి. మనుష్యుని నాగరికత ఆయా స్థలములందు వరుసగా అభివృద్ధి పొందుతూ వచ్చిందని దీనికర్థం చెప్పుతారు. 'నట్రిణై'లో 'ముల్లై'కు సంబంధించినవి 28, మురుదంకు సంబంధించినవి 32, 'పాలై'కు సంబంధించినవి 107 'నెయ్దల్'కు సంబంధించినవి 103, 'కురింజి'కి సంబంధించినవి 120 పద్యములున్నవి. ప్రణయము వీటిలోని విషయము. 'పన్నాడుతంద పాండియ మాఋన్ వఋది' అనే పాండ్యరాజు ఈ పద్యములన్నిటినీ ఒక చోట చేర్పించినాడు. ఈ గ్రంథముమీద ప్రాచీన వ్యాఖ్యాన మేదీ లేదు. క్రీ.శ. ఎనిమిదో శతాబ్దిలో మహాభారతమును 'తమిళించిన' పెరుందేవనార్ అనేవాని ఈశ్వరస్తోత్రరూపమైన పద్యము ఈ గ్రంథమును కాదియందున్నది. ఈ విషయమును బాగుగా గమనించవలె.

2. 'కురుందొ హై' అనగా చిన్న పద్యముల సంపుట మన్నమాట. దీనిలో 205 మంది కవులు 'అహవల్' ఛందస్సులో నున్న 402 చిన్న పద్యములు చేరినవి. ఒక్కొక్క పద్యమునకునాల్గునుండి ఎనిమిది పంక్తులుంటవి. 'నట్రిణై'వలెనే వీనిలోని పద్యములు ప్రణయ విషయప్రకములు. వీటినికూడ ఐదు 'తిణై'ల క్రింద విభాగించవచ్చును. ఈ గ్రంథము 'పూరి'అనే దేశపు రాజైన 'పూరిక్కో' అనే వాడు ఒక చోట చేర్పించి నాడు దీనిమీద 'పేరాశిర్యర్', అనే వాడు వాఖ్యనమును వ్రాసేవట. కాని అదిప్పుడు లేదు. దానిలో 20 పద్యములమీద మాత్రము 'నచ్చినార్కిణియర్' వ్రాసిన వ్యాఖ్యానము మాత్రమున్నది.

3. 'ఐంగుఋనూఋ', అనగా ఏనూరు చిన్నపద్యములన్నమాట.ఇవి కూడా అహవల్ ఛందస్సులోనే ఉన్నవి. నూరేసిపద్యములకొక భాగము క్రింద ఈగ్రంథమును ఐదు భాగములుగా విభజించవచ్చును. వీటిలో ఒక్కొక్క పద్యములో మూడు నుండి ఆరు పంక్తు వరకు ఉన్నవి. ఐదు భాగములలో ఒక్కక్క భాగమును ఐదు 'తిణై'ల క్రింద విభజించవచ్చును. మొదటి భాగములోని నూరుపద్యములు నదీ ప్రాంతమునకు సంబంధించినవి. వీటిని వ్రాసిన కవి 'ఓరంగబోగియార్'. రెండోభాగము 'అమూవనార్' రచించినాడు. దీనిలోని పద్యములు సముద్ర తీరమునకు సంబంధించినవి. మూడో శతకమును కపిలరు వ్రాసినాడట. దీనిలోని పద్యములు అరణ్యవాసుల ప్రణయమునకు చెందినవి. నాల్గో శతకము 'ఓదలాందయ్యార్' అనే కవి రచించినాడు.

దీనిలో పద్యములు ఎడారులకు సంబంధించినవి. 'తేయణార్' అనేకవి పార్వతీయ ప్రేమకు సంబంధించిన ఐదో శతకమును రచించినాడు. ఈ గ్రంథమును ఒకచోట జేర్చిన విద్వాంసుని పేరు 'కూడలూర్ కిళార్' అనే సంగ్రహనామముగల 'పులత్తుఱై ముఱ్ఱియకూడలూర్ కిళార్' అనేవాడు. ఈ విద్వాంసుడు 'చేరమాన్ ఇరుంమొఱై' అనే సంగ్రహనామముగల 'యానైక్కాట్ శైమాందరన్ జేరల్ ఇరుంమొఱై' అనే రాజు ఆస్థానమువాడు. ఈ గ్రంథముమీద వ్యాఖ్యాన మేదీ దొరకలేదు.

4. 'పదిఱ్ఱుప్పత్తు' – అనగా పదిపదులు. దీనిలో చేరవంశమునకు సంబంధించిన అనేక రాజుల పరాక్రమము వర్ణింపబడినది. పది భాగములలోనూ మొదటిదిన్నీ తుదిదిన్నీ యిప్పుడు లేవు. తక్కిన ఎనిమిది సంపుటములలో ఒకొక్కదానిలో నూరుపద్యములున్నవి. వీటిలో ఇమయవరంబ నెడుంజేరలాత, పల్యానై చెల్కెళుకుట్టువ, కలంగైక్కణ్ణి నార్ముడిచ్చేరలు, శంగుట్టువన్, అతని కొడుకు కుట్టువజేరత్‌న్, ఆడుకోట్పాట్టుచ్చేరలాతన్, శెల్వక్కడుంగోవాళియాతన్, తగడూరించ పెరుంజేరల్ ఇరుంవొరై, కుడక్కో ఇళంజేరలిరుంబొరై అనే రాజుల పేర్లు కనబడుతున్నవి. రెండో పదిలో 'ఇమయవరంబ' ఏభైయెనిమిదేండ్లు రాజ్యము చేసినట్టున్నూ, మూడో పదిలో అతని తమ్ముడు 'పలియాణైకుట్టవను' ఇరవైయేండ్లు రాజ్యము చేసినట్లున్నూ తెలుస్తున్నది. ఈ రెండో వాడు 'పాలైగోదవనారన్' అనే వానికి గొప్ప యజ్ఞము చేయడమునకు సహాయము చేసినట్టున్నది. నాలుగోపదిలో 'నార్ముడిచ్చేరలు8 ఇరవై సంవత్సరములున్ను, ఐదోపదిలో శంగుట్టవను ఏభైయేండ్లున్ను, ఆరోపదిలో చేరలాతను ముప్పై ఎనిమిదిదేండ్లున్ను రాజ్యమేలినట్లున్నది. ఏడో పదిలో 'శెల్వక్కడుంగో' 20 ఏండ్లున్ను, ఎనిమిదోపదిలో ఇరుంబొరై 17, తొమ్మిదోపదిలో 'కుడక్కొ' 16 ఏండ్లున్న రాజ్యముచేసినట్లు తెలుపబడ్డది. ఈ 'పదిఱ్ఱుపత్తు'ను ఎవరు గ్రంథముగా కూర్చినారో, ఏరాజు కూర్పించినాడో తెలియదు.

5. 'పరిపాడల్' – అనే గ్రంథము మొదటి సంగము గ్రంథములోనూ, మూడో సంగము గ్రంథములలోనూ గూడా కనపడుతున్నది. ఈ రెండు గ్రంథములున్నూ వేరువేరుఐన యెడల, మొదటి సంగములోనిది నశించినది. మనకు మిగిలిన గ్రంథములో 24 పద్యములు మాత్రము మిగిలి ఉన్నవి. వీటిమీద 'పరిమేలఴిగరు' వ్యాఖ్యానము వ్రాసినాడు.

6. 'కలిత్తొహై' – అనే పేరు దానిలోని నూటయాభైపద్యములన్నూ 'కలి' అనే ఛందస్సులో వ్రాయబడడమువల్ల కలిగినది. ఈ గ్రంథమునకు కరుంగలిత్తొహై లేక 'కలి' అనికూడా పేళు ్లన్నవి. దీనిలోని పద్యములు ఐదు 'తిణై'లకు సంబంధించినవి. వీటిలోని విషయము ప్రణయమేఐనా, కొన్ని నీతివాక్యములు కూడా ఉన్నవి. దీనిలోని పద్యములనుబట్టి ఆకాలములలోని వివాహములను గురించిన ఆచారములు కొన్ని తెలుస్తున్నవి. దీనిలోని పద్యములను కడుంగో, కపిలర్, మరుద ఇళనాగనార్, చోళ నల్లుత్తిర, నల్లందువనార్ అనేక కవులు రచించినారు. ఈ పద్యములను ఎవరు చేర్చినారో, ఎవరు చేర్పించినారో కూడా తెలియదు. పై కవులలో ఒకడైన నల్లందువనారే.

వీటిని చేర్చినాడని ప్రతీతి. నచ్చినార్కిణియరు యీ గ్రంథము మీద వ్యాఖ్య వ్రాసినాడు.

7. 'నెడుందొహై – దీనికి అహప్పాట్టు, అహనానూఱు, అహం అనికూడా పేళ్లున్నవి. దీనిలో 40 పద్యములు 'అహవల్' ఛందస్సులో ఉన్నవి. వీటిని 'క్రైటియానైనిరై' అనే 121 పద్యములుగాను, 'మణిమిడైపవడం' అని 120 పద్యములగాను, 'నిత్తిలకోవై' అని 100 పద్యములుగాను విభజించినారు. ఈ గ్రంథములోని విషయము కూడా ప్రణయమే. పద్యములలో 13 నుండి 32 వరకు పంక్తులున్నవి. దీనిలో 142 మంది కవుల పేర్లు కనబడుతున్నవి. వీటినన్నింటిని మదురలోని 'ఉప్పూరిగుడికిళార్' అనేవాని కొడుకైన 'ఉరుత్తిరశర్మ' అనేవాడు పాండ్యరాజైన 'ఉక్కిరప్పెఱువళుది' అనే వాని ఆస్థానమున గ్రంథముగా కూర్చినాడు.

8. 'పుఱనానూఱు' – లేక 'పుఱప్పాట్టు' లేక 'పుఱం' అనే గ్రంథములో 'అహవల్' ఛందస్సులో 400 పద్యములున్నవి. ఇది అహనానూరు అనేదానికి శేష గ్రంథమనవచ్చును. ఈ గ్రంథములో తర్వాతి కాలపు 'పొయిగెయ్యార్' అనే కవి పేరుండడము చేత ఇది నవీనగ్రంథమని కొందరంటారు.

ఇంత వరకూ 'ఎట్టుత్తొహై' అనే గ్రంథమును గురించి వ్రాయబడినది. ఇక 'పత్తుప్పాట్టు'లో పదికావ్యములున్నవి. 'ఇరైయనార్ అహప్పొరుళ్' అనే గ్రంథపు వ్యాఖ్యానములో చెప్పబడ్డ వాటిలో ఈ గ్రంథము లేకపోవడము చేత ఇది సంగం కాలపు గ్రంథము కాదని కొందరంటారు. కాని వాటిలో 'ఎట్టుత్తొహై'లోని భాగములను రచించిన కవులున్ను, దానిలో చెప్పబడ్డ రాజులున్ను దీనిలోగూడా ఉండడముచేతనున్ను, భాషా విషయమునుబట్టిన్నీ దీనిని సంగం కాలపు గ్రంథముగానే పరిగణించవలసిదనికొందరి వాదము.

ఈ గ్రంథములో (1) తిరుమురు హాఱ్ఱుప్పడై, (2) పొరునరాఱ్ఱుప్పడై, (3) శిఱుపాణాఱ్ఱుప్పడై, (4) పెరుంబాణాఱ్ఱుప్పడై, (5) ముల్లైప్పాట్లు, (6) మదురైక్కాంజి, (7) నెడునల్వాడై, (8) కురింజిప్పాటు, (9) పట్టణప్పాలై, (10) మలైప్పడుకడాన్ – అని పదికావ్యములున్నవి.

1. వీటిలో 'తిరుమురు హాఱ్ఱుప్పడై' లో 317 పంక్తులున్నవి. దీనిని వ్రాసినకవి నక్కీరర్. తమిళ దేశములో వివిధ దేవాలయములందున్న. 2.పొరునరాఱ్ఱుప్పడై దీనిని వ్రాసిన కవి 'ముడత్తామకణ్ణియార్.' దీనిలో చెప్పబడ్డరాజు ఇలంజేర్ చెన్ని కొడుకైన కరికాఱ్‌చోడన్. దీనిలో కరికాలచోడుని పరివృంత్తాంతము, అతని వీరకృత్యములు, జన్మపాలనా సామర్థ్యము వర్ణితమైనవి. ఈ కావ్యములో 248 పంక్తులున్నవి.
3. 'శిఱుపాణాఱ్ఱుప్పడై' – దీనిని 'ఇడైగళినాట్టునల్లూర్ నత్తత్తణాన్' అనే కవి రచించినాడు. దీనిలోని రాజు పేరు ఓవియర్ తెగకు చెందిన ఓయిమా నాటి ప్రభువైన 'నల్లియక్కోడవ్' అనేవాడు. ఈ రాజుపేరే కాక మరికొందరు చిన్న ప్రభువుల పేళ్ళున్నూ ఈ గ్రంథములో గలవు. దీనిలో 269 పంక్తులున్నవి.

4. 'పెరుంబాణాట్రుప్పడై' దీనిని రచించిన కవి – 'కడియలూర్ పురుత్తిరన్ కణ్ణనార్'. 'పత్తినప్పాలై' అనే భాగమును రచించిన కవి కూడా ఇతడే. 'పొరునరాట్రుప్పడై'లో చోళరాజ్యము వర్ణింపబడియుండగా, నీ గ్రంథములో కాంచీరాజ్యము వర్ణింపబడినది. దీనిలోనిరాజు 'తొండైమాన్ ఇళందిరయన్' అనేవాడు. దీనిలో 500 పంక్తులున్నవి.
5. 'ముల్లైప్పాట్టు'ను కావిరిప్పూం బట్టిణమ్‌లోని 'నప్పూదనార్' అనే కవి రచించెను. దీనిలో 103 పంక్తులున్నవి. 'తలైయాలంగానమ్" రాజైన నెదుంజెలియన్ అనేవాని స్తోత్రమే ఈ కావ్యము. దీనిలోని విషయము ప్రణయము. యుద్ధమునకు వెళ్లిన వీరుడైన తన భర్త యెడల, అతని ప్రేయసికి గలప్రణయమిందు వర్ణితమైనది.
6. 'మదురైక్కాంచి'ని వ్రాసినవాడు మాంగుడి మరదనార్. ఈ గ్రంథములో పాండ్యరాజ్య మభివర్ణితమైనది. దీనిలో స్తుతింపబడిన రాజు ప్యాండ్య తలైయాలంగానత్తు చ్చెరువెన్ఱ నెదుంజెలియన్ అనేవాడు. దీనిలో 782 పంక్తులున్నవి.
7. 'నెదునల్వాడై' అనే గ్రంథమును వ్రాసిన వాడు 'నక్కీరర్'. ఇందలి రాజు 'తలైయా లంగానమ్'నకు సంబంధించిన నెదుంజెలియన్ యుద్ధమునకు వెడలిన ప్రియునికై అతని ప్రేమసికి గల ప్రణయ మిందు వర్ణితము. దీనిలో 188 పంక్తులున్నవి.
8. 'కురింజిప్పాట్టు'ను కపిలర్ రచించెను. ఒక చక్కని యువతి మరియొక కన్యకతో జొన్న చేనిని కాచుటకు బంపబడినది. ఒక కొండ రాజు వేటాడుతూ అక్కడకు వచ్చి ఆమెను చూచి మోహించి గాంధర్వ వివాహం చేసుకున్నాడు. నాటినుంచిన్నీ వారిద్దరున్నూ జొన్న చేనిలో కలుసుకుంటూ ఉండేవారు. ఆ సంగతి ఆమె తల్లిదండ్రులకు తెలియదు. ఆమె నానాటికిన్ని కృశించిపోతున్నది. దానికి కారణమును కన్యక తల్లితో చెప్పింది. వారిద్దరికీ పెండ్లిచేసినారు. ఇది దీనిలోని కథ. కావ్యములో 261 పంక్తులున్నవి.
9. 'పత్తినప్పాలై' అనే కావ్యమును వ్రాసినవాడు ఉరుట్టిర కణ్ణనార్. దానిలోని రాజు కరికాఌ చోళ. కావ్యము సొగసును గుర్తించి రాజు కవికి 16,00,000 పొన్నులు బహుమానముగా ఇచ్చినాడట. దీనిలో 301 పంక్తులున్నవి.
10. 'మలైపరుగడాన్' – దీనికి 'కూత్తరాట్రుప్పడై' అని నామాంతరము కలదు. దీనిని పెరుంగౌశిగనార్ అనేకవి రచించినాడట. దీనిలో 583 పంక్తులలో 'నన్నన్ అనేవానిని గురించిన్ని, వాని పూర్వీకులను గురించిన్నీ వర్ణనలున్నవి.

'పదినెన్‌కీఌకణక్కు' – ఇది నీతిని బోధించే 18 కావ్యములుగల సంపుటము. కీఌ కణక్కు అంటే ఏబై పద్యములకు తక్కువ ఉన్న కావ్యమాట. ఏభై నుండి 50 పద్యముల వరకు గల కావ్యములకు మేఌకణక్కు అని పేరు. 'ఎట్టుత్తొహై', 'పత్తుప్పాట్టులు' 'మేఌకణక్కు' గ్రంథములు. ఈ కీఌ కణక్కులో చేరిన 18 గ్రంథములున్న ఇవి:–

1. తిరుక్కురల్ దీనికి ముప్పాల్ అని కూడా పేరున్నది. దీనిని తిరువళ్లువర్ రచించినాడు. ఇతడు క్రీ.పూ. మొదటి శతాబ్దములలో ఉండేవాడని కొందరున్ను, క్రీ. తర్వాత 6 లేక 7వ శతాబ్దములలో ఉండేవాడనికొందరున్ను అంటారు. దీనిలో పద్యములు ద్విపదల రూపముగా నున్నవి; అంటే ఒకొక్క పద్యములో రెండుపాదము లుంటవన్నమాట. వాటికిన్నీ తెలుగులోని ద్విపదలకున్నూ సంబంధంలేదు. వీటిలో ధర్మార్థ కామముల విషయముబోధింపబడినది. గ్రంథములో 133 అధ్యాయములున్నవి. ఒకొక్కధ్యాయములో 100 పద్యములున్నవి. ఈ గ్రంథము తమిళ వాఙ్మయములో ఉన్నత స్థానము నాక్రమించినది.
2. నాలడియార్ – ఇదీ కురళ్ వంటి గ్రంథమే. దీనిలో అధ్యాయమునకు 10 పద్యముల చొప్పున 40 అధ్యాయములున్నవి. ఈ పద్యములను వివిధ కవులు రచించినారు. వాటిని పదుమనార్ అనే ఆయన ఒకచో జేర్చినాడు. ఈ పద్యములలో ముత్తరైయర్‌ల ప్రశంస ఉ ండడము చేత ఇది ఎనిమిదో శతాబ్దపు దనికొందరంటారు.
3. కళవైనాఌదు – అనగా యుద్ధ పద్ధతులను, సాధనములను తెలిపే నలభై పద్యములన్నమాట. దీనిని 'పొయిహైయార్' అనే కవి రచించినాడట. దీనిలోని రాజు చేరగణైక్కాల్ ఇరుంబొరై అనేవాడు. ఇతనిని శెంగణాన్ అనేచోడరాజు కళుమలంయుద్ధములో ఓడించి కుడవాయిలులో చేరలో ఉంచినాడు.
4. కైనిలై అనే గ్రంథము వ్రాతప్రతి మాత్రమున్నది. ఇంకా అచ్చుపడలేదు.
5. ఇనియవైనాఌదు, లేక ఇనియదు నాఌదు – లో నలభై పద్యములున్నవి. దీనిని పూద శేందనార్ అనేకవి రచించినాడట. ఇనియవై అనగా ఇష్టార్థములని యర్థము. అట్టి అర్థములు ప్రపంచములో 126 కలవని కవి యీ గ్రంథములో తెల్పినాడు.
6. ఇన్నానాఌదు – ఈ గ్రంథమును కపిలరు రచించెను. దీనిలో కూడా నలభై పద్యములున్నవి. ఇన్నా అనగా అనిష్టమని అర్థము. అనిష్టార్థములు లోకములో 164 ఉన్నవనిన్నీ, బుద్ధిమంతుడు వాటిని కోరకూడదనిన్నీ కవి యీ గ్రంథములో ఉపదేశించినాడు.
7. నాన్‌మణిక్కడిహై – అనే గ్రంథమును విళంబినాగనార్ రచించెను. ఈ కవిని గుఱించి ఏమిన్నీ తెలియదు. గ్రంథమునుబట్టి అతడు వైష్ణవుడైనట్టు తెలిసికోవచ్చును. గ్రంథములో 104 పద్యములున్నవి. మనుష్యుడు చేయవలసిన, చేయరాని పనులను గురించి ఈ గ్రంథములో ఉపదేశింపబడినది.
8. కార్‌నాఌదు – దీనిని రచించిన కవి మదురైక్కణ్ణ కూత్తనార్. ఈ గ్రంథములో 40 పద్యములున్నవి. విషయము ప్రణయము. ప్రోషితభర్తృక విరహ మిందు వర్ణితము. గ్రంథము మేఘసందేశము మాదిరిగ నుండును.
9. ఐందినై ఐంబదు. – ఇది కూడా శృంగార గ్రంథమే. దీనిని మాఱ బత్తైనార్ రచించినాడు. ఇతనిని గురించి ఏమీ తెలియదు. దీనిలో ఏభైపద్యములున్నవి.

10. తిణైమతియైంబదు. దీనిని శాత్తందియార్ కొడుకైన కణ్ణంశేందనారు రచించినాడు. కవి గురించి ఇంతకంటె ఏమిన్నీ తెలియదు. దీనిలో ఏభై పద్యములునూ ఐదు తిణైలకు సంబంధించినవి గలవు.

11. వెందిణై ఎఱుబదు – ఇది పై రెండు గ్రంథములవంటిదే. కవిమువ్వాదియాఱ్. ఇతనిని గూర్చి యేమిన్నీ తెలియదు. గ్రంథములో 70 పద్యములున్నవి. విషయము శృంగారము. 14 పద్యములు కొక తిణైచొప్పున వర్ణనలున్నవి.

12. తిణైమాలై నూట్రైంబదు. ఇది పై మూడు గ్రంథముల వంటిదే. కణిమేదావియార్ అనేవాడు దీనిని వ్రాసినాడట. దీనిలోని 105 పద్యములున్ను ఐదుతిణైలకు సంబంధించిన శృంగార వర్ణనములుగనున్నవి. కవిని గూర్చిన యితర విషయములు తెలియవు.

13. తిరిగడుహం (త్రికటుకం). దీనిలోని 101 పద్యములను నల్లాదనార్ అనే కవి వ్రాసినాడు. త్రికటుకములు ఏరీతిగా శారీరక రోగములను పోగొట్టునో అదే రీతిగా ఈ పద్యములలోని యుపదేశములు మానసిక రోగములను పోగొట్టి శాంతి నిచ్చునని కవి అభిప్రాయము.

14. ఏలాది ఇది తిరిగడుహం అనే గ్రంథమువంటిదే. తిరిగడుహములోని ఒక్కొక్క పద్యములలో మూడేసి ఇష్టపదార్థములు చెప్పబడి ఉండగా దీనిలో ఆరేసి చెప్పబడినవి. ఈ ఉపదేశములు కూడా మానసిక రోగములను పోగొట్టే ముందులే. ఈ గ్రంథములో 82 పద్యములున్నవి. దీన్ని వ్రాసినవాడు కణిమేదావియారు. ఇతడు జైనుడుగా కనబడుతున్నాడు.గ్రంథములో నాల్గువేదముల ప్రశంస ఉన్నది.

15. ఆచారక్కోవై అనే గ్రంథమును పెరువాయిల్‌లోని ముళ్లియార్ రచించినది. దీనిలో గృహస్థుల ధర్మములు వివరింపబడినవి. ధర్మశాస్త్రములో నున్నట్లే దీనిలో గృహస్థధర్మములు వివరింపబడ్డవి.

16. పఱముతి నానూఱు. – దీనిని రచించినవాడుమున్నుఱయ్యఱయ్యర్. ఇతడు జైనుడు. ఈ గ్రంథములో నన్నూరుపద్యములున్నవి. ఒకొక్కపద్యము తుదను ఒకొక్క సామెత ఉన్నది. ఈ సామెతలు కొన్ని నేడును వాడుకలో ఉన్నవి.

17. శిఱుపంచమూలం – అనగా మందుకు పనికివచ్చే ఐదువేళ్ళన్న మాట. దీనిలో 68 పద్యములున్నవి. పంచమూలముల వల్ల శారీరక రోగములు కుదిరినట్లే, ఈ ఉపదేశముల వల్లజననమరణ రోగము కుదురుతుందట. కవి పేరు కార్యాశాన్. గ్రంథములోని విషయము స్వధర్మము, అహింస, సత్యము, మాంసాహార వర్జనము, ఆస్తేయము అనేవి.

18. ముదుమొఴిక్కాంజి – దీనిని రచించినవాడు మదురై కూడలూర్‌కిళార్. గ్రంథములో పది అధ్యాయములున్నవి. అధ్యాయమునకు సూత్రప్రాయముగా పది నీతి వాక్యములున్నవి. లోకములోని అనిత్యపదార్థములకు నిత్యత్వము కలిగే ఉపాయము ఈ గ్రంథములో తెలుపబడినది. దీనిని రచించిన కవి పుఱనానూఱు, కురుందొ హైలలోని కొన్ని పద్యములను

గూడా వ్రాసినాడు. ఇతడు తొండై మండలమువాడని కొందరున్ను, మదురవాడని కొందరున్ను అంటారు.

ఇంత వరకున్ను సంగము గ్రంథములని చెప్పబడేవాటిని గురించి సంగ్రహముగా చెప్పబడినది. వీటిని ఆధారముగా చేసుకొని తమిళ విద్వాంసులు తమిళ భాషా ప్రాచీనత్వమును స్థిరపరచడానికి ప్రయత్నిస్తున్నారు. వీటిలో తెలుపబడిన రాజులుగాని ఇతర నాయకులు గాని ఎవ్వరున్నూ చరిత్ర ప్రసిద్ధులు కారు. వీరిని గురించి తెలిపే ఒక్క శాసనమున్నూ లేదు. ఆయా పురుషుల పేళ్లు వికారములుగా ఉండడమే కాకుండా సాధారణ మనుష్యుల కుండవలసిన పేర్లుగా కూడా కనబడవు. వారి వారి గుణములను వర్ణించే పదములు వారి పేళ్లగా ఉదాహరించడము వల్ల అవి కల్పితనామములేమో ననిపించును. ఐనా తమిళ విద్వాంసులు ఆయా పురుషులను చరిత్ర పురుషులుగా నమ్మి వారి కాలమును నిర్ణయించడానికిపాట్లుపడుతున్నారు. వారిలో నక్కీరరు, కపిలరు, పరణరు, అవ్వయ్యారు,అనేవారి చరిత్రములను వర్ణించడానికి ప్రయత్నములు జరుగుతూ ఉన్నవి. వీరందరున్ను క్రీస్తు మొదటి శతాబ్దముల వారని ఎట్లాగో సరిపెట్టుకొంటున్నారు. కానివారి కాలనిశ్చయమునకు తమ ఊహలే ఆధారముగా ఉన్నవి కాని సరియైన ఒక్క కారణమున్ను వీ రెవ్వరున్ను చెప్పియుండలేదు. చారిత్రక పురుషులుగా కనబడే కరికాలుడు, కొచ్చెంగణాన్, శెంగుట్టువన్ మొదలైనవారిని గురించి కూడా అవిశ్వసనీయములైన, లేక అతిశయోక్తులతో కూడిన కొన్ని గాథలు మాత్రము కనబడుతున్నవి కాని వారిని గురించి మరేమిన్నీ తెలియదు. అందుచేతనే వీరు చాలా పురాతన పురుషులుగా ఎన్నబడవలెనని సంగమవాదులంటారు. వారు చారిత్రక పురుషులు కారని గాని, ఇటీవలి పురుషులై ఉండవచ్చునని గానిచెప్పడమెంత నిర్హేతుకముగా ఉంటుందో వారు క్రీస్తుశకారంభమున ఉన్నవారని చెప్పడము కూడా నిర్హేతుకముగానే ఉంటుంది.

వీరి పేళ్లలో ఒకటిన్నీ ఒక శిలాకాసనములలో గానీ ఒక్క తామ్రశాసనములో గానీ కనిపించకపోవడము చాలా వింతగా కనబడకమానదు. ఐనా శాసనముల మీద అంత నమ్మకముంచి గ్రంథస్థ విషయములను, అనగా తాటియాకుల మీద వ్రాసిన విషయములను నమ్మకపోవడానికి కారణము కనబడదని నీలకంఠశాస్త్రి గారు మొదలైన వారు తమ గ్రంథములలో శాసన పరిశోధకులను, వాటిపై విశ్వాసముగల వారిని ఎత్తిపొడిచినారు. కాని శాసనస్థ విషయములకున్ను గ్రంథస్థ విషయములకున్ను ఒక గొప్ప భేదమున్నది. శాసనము శిలాశాసనమైన యెడల దానిని కల్పించడానికి వీలు ఉండదు. శిలాశాసనాలు సాధారణముగా జనులందరియెదుటనూ నిత్యమునూ కనబడుతూ ఉండేవి. వాటిని ఫోర్జరీ చేస్తే వెంటనే యెప్పటికప్పుడు దొరకిపోతారు. తామ్రశాసన విషయములలో ఫోర్జరీలు కలగడానికిఅవకాశము లేకపోలేదు. కాని ఏవి ఫోర్జరీలో ఏవో కనుకొనడానికి అనేక మార్గములున్నవి. వ్రాతలోని భేదమునుబట్టి తిథి, వార, నక్షత్ర, మాస, సంవత్సరములలోని అవకతవకలనుబట్టి, రాజుల పేళ్లనుఉదాహరించడములో తబ్బిబ్బులనుబట్టి ఇంకా ఎన్ని విధములుగానో ఫోర్జరీలను సులభముగా కనుగొనవచ్చును. అట్టి కృత్రిమశాసనముల

నెన్నింటినో ఫ్లీటు మొదలైనవారు కనుగొని ప్రకటించయే ఉన్నారు. ఒకవేళ శిలాశాసనములు కూడా ఫోర్జరీలైన యెడల వాటిని కూడా సులభముగా కనుగొనవచ్చును. ఇదిగాక శాసనములు ఒకసారి వ్రాయబడిన తర్వాత స్థిరముగా నిలిచిపోతవి. వాటిలో మరెట్టి మార్పున్నూ కలుగదు. కలుగజేయడానికి ప్రయత్నిస్తే రాయి పగిలిపోడమో జరిగి తీరుతుంది. తామ్రశాసనముల విషయములో కూడా ఇంతే. ఇట్టివాటినే ఇంగ్లీషులో పేలింప్ పెస్టులు అంటారు. ఇట్టివాటిని గూడా ఎన్నింటినో శాసన పరిశోధకులు కనిపిట్టియే ఉన్నారు. గ్రంథముల వ్రాత ప్రతుల విషయములో అట్లు గాదు. అక్షరములు వ్రాయబడిన ఆకు చిరస్థాయిగా నిలవదు. కొద్ది కాలములో అదిచివికిపోతుంది.

అందుచేతనే గ్రంథములను మరల మరల ఎత్తి వ్రాయవలసి ఉంటుంది. ఏ తాటాకు పుస్తకం గూడా నేటికి మున్నూరేండ్లకు పూర్వపుది దక్షిణ హిందూ దేశములో ఇంత వరకున్నూ కనపడలేదు. గ్రంథములను త్రిప్పి వ్రాసేటప్పుడు గ్రంథ విషయమును వ్రాయసగాని జ్ఞానముననుసరించి మారిపోవడము సంభవిస్తుందనివ్రాతప్రతులను పరిశోధించిన వారికి తెలిసిన సంగతే. ఇందులో విషయములు కవుల నోళ్లలో పడి బుద్ధిపూర్వకముగానూ, కాకుండానూ కూడా అనేక వికారములకు లోనౌతవి. ఒకడు మరియొకణ్ణి మించవలెనని తన పాండిత్యమును చూపించి, ఉన్నదానిని మార్చి, లేని దానిని కూర్చి, ఉన్న దానిని పెంచి లేక కుదించి, అద్భుత విషయములను జేర్చి, సాధారణ విషయములను ఆశ్చర్యావహములుగా జేసి, ఎన్నో మార్పులను గలుగజేస్తూంటారు. ఇట్టి గ్రంథములను పరమప్రమాణములుగా స్వీకరించడము సాహసమే. గ్రంథములోని విషయములు శాసనములలోని విషయములను స్థిరపరుపగలుగునే గాని, చారిత్రకముగా వాని కెక్కువ విలువలు ఇచ్చుటకు వీలులేదు. గ్రంథస్థ విషయములు శాసనముల మూలమున స్థిరపడును. శాసనాధారములు లేనప్పుడు చారిత్రకముగా గ్రంథములు నిరుపయోగములు.

దక్షిణహిందూ దేశమున అశోకుని నాటి నుండియు శిలాశాసనములు కానవచ్చుచున్నవి. అవి సంఖ్యలో వెనుకకు పోనుపోను తక్కువ ఔతున్న మాట నిజమే. ఆరోశతాబ్దమునుంచిన్నీ మనకు శిలాశాసనముల సంఖ్య హెచ్చవుతున్నది. తామ్రశాసనములు కూడా పల్లవుకాలమనుంచిన్నీ ఎక్కువ తరచుగా కనిపిస్తున్నవి. క్రీస్తు మొదటి శతాబ్దములలో నాసిక, అమరావతి, మదుర, తిరుచునాపల్లి, మొదలైన చోట్ల బ్రాహ్మీలిపిలో కొన్ని శాసనములు కానవచ్చినవి. కాని వీటివల్ల సంగము వాఙ్మయ స్థితిని నిర్ణయించడానికి తగిన ఆధారాలు కనబడలేదు. తిరుచునాపల్లి ప్రాంతములలో కనబడిన చిన్న శాసనములు తమిళ భాషలో ఉన్నవని నిర్ణయించడానికి కె.వి.సుబ్రహ్మణ్యయ్యరు గారు చాలా తంటాలుపడినారు. అవి ప్రాకృత శాసనములే అని రుజువు చేయడానికి (New Indian Antiquary)లో వ్రాసిన వ్యాసములో నేనున్నూ తంటాలుపడినాను. దక్షిణ దేశ శాసనముల చరిత్రను బట్టిగాని, వాఙ్మయ చరిత్రమునుబట్టి గానిఆలోచిస్తే ఈ ప్రాంత మంతట్లోనూ ప్రాకృత భాషలే ప్రచారములో ఉండినట్లు తెలుసుకోవచ్చు.

తమిళ భాషలో వ్రాయబడే కాలము నిరూపింపబడిన ఒక్క శాసనమున్నూ ఆరవశతాబ్దానికి పూర్వపుది లేదని తమిళవిద్వాంసులే ఒప్పుకున్నారు. ఐనా అంతకు పూర్వము తమిళ భాషా వాఙ్మయ ముండకూడదా అని శంకించి, ఉన్నదని నిర్ధారణ చేయడానికి విద్వాంసులు పూనుకుంటున్నారు. అదేవిధముగా కన్నడులు కూడా క్రీ.శ. మూడో, నాలుగో దశాబ్దపు ఒక గ్రీకు భాషలోనిఒక ప్రహసనములో గ్రీకు భాషలో లేని కొన్ని వాక్యములు కనబడగా, ఆ వాక్యములు కన్న డవాక్యములని నిర్ణయించడానికి ప్రయత్నము చేసి విఫలమనోరథులైనారు. అట్లే తెనుగు వాఙ్మయమునకు కూడా ప్రాచీనతను కల్పించడానికి ప్రయత్నం చేసినవారు లేకపోలేదు. అట్టి అభిమాన ముండడము సహజమే. కాని తగిన ఆధారములు లేనప్పుడు శాస్త్ర దృష్టితో పరిశోధనలు చేసేవారు ఎట్టి సిద్ధాంతమును చేయడానికి పూనుకొనరు. తమిళ సంగము గ్రంథములని చెప్పబడేవి వివిధ కవుల చిన్న చిన్న కావ్యముల సంకలనములు. వీటిలో కొన్ని తెనుగులోని 'దేశింగు రాజుకథ', 'బాలనాగమ్మ కథ' మొదలైన పదములవంటివి. ఒక్కటి కూడా పెద్ద గ్రంథముగా నెన్నదగినది లేదు. నోటిపాటలలోనూ, వానిని ఒక చోట కూర్చినవారి చేతుల్లోనూ, వాటిపై వ్యాఖ్యానములు వ్రాసిన వారి చేతుల్లోనూ, తర్వాత వ్రాతప్రతులమూలమున వ్రాయసగాండ్ర చేతుల్లోనూ, ఆ తరువాత వాటిని ముద్రణమునకు తయారుచేసిన పండితుల చేతుల్లోనూ ఎన్నో మార్పులు పొందిన గ్రంథములలోనివిషయముల కపార్థములు గల్పించిన్నీ, లేని విషయములను ఊహించిన్నీ, సిద్ధాంతములకు సరిపడని విషయములను పరిహరించిన్నీ కూర్చిన చరిత్ర విశ్వాసార్హము కానేరదు. ఇంతవరకున్న స్వామినాథయ్యరు గారున్ను, మరికొందరున్ను ప్రకటించినగ్రంథములు అసమగ్రములనిన్నీ, వారు చేసుకొన్న పాఠములలో ఎన్నో సందేహాస్పద విషయములున్న వనిన్నీ, గ్రంథములలో ఒకే చోట ఉండవలసిన పద్యములు మరొక్క చోట చేరి ఉండవచ్చుననీ, అందుచేత వాటి అర్థము దురవగాహముగా ఉన్న దనిన్నీ, వారే గ్రంథ పీఠికలలో వ్రాసుకొన్నారు. పెద్ద గ్రంథములైన శిలప్పదిగారము, మణిమేహలై అనే గ్రంథముల కాలముకూడా ఇప్పటికిన్నీ సరిగా నిర్ణయము కాలేదు. గ్రంథములోని జ్యౌతిష్య వివరములనుబట్టి ఆ గ్రంథములు ఎనిమిదో శతాబ్దములో బయలువెడలినవని స్వామి కన్నుపిళ్లమొదలైన జ్యోతిశ్శాస్త్ర పండితులు తెలియజేసినారు. ఆ గ్రంథములు సంగము కాలములోనివని నమ్మినవా రాతడు నిర్ణయించిన కాలము సరికాదని వాదిస్తున్నారు. స్వామి కన్నుపిళ్ల గారినిర్ణయమునకు ఆపాటి ఆధారమైన ఉన్నది. వీరి కది కూడా లేదు.

ఇట్టి యవస్థలో ఉన్న సంగపు గ్రంథముల కాలమును నిర్ణయించడానికి ఒక్కటే మార్గమున్నది. అది భాషా చరిత్రమునకు సంబంధించినది. భాషా ప్రాచీనత ననుసరించి ఇంచుమించుగా ఆయా గ్రంథముల కాలమును నిర్ణయించవచ్చును. ఈ విషయమును నీలకంఠ శాస్త్రి గారు చక్కగా గుర్తించినారు. "చోళుల చరిత్రము – రాజ్య పద్ధతి" (Studies in Chola History and Administration) అనేగ్రంథములో వారిట్లు వ్రాసినారు – (పుట. 4)

"ఈ రీతిగా తేలిన కష్ట సమస్యలను గూర్చి సిద్ధాంతము చేయడము, ఈ వ్యాసోద్దేశము కాదు. సంగము వాఙ్మయము విస్తారమైనది కాకపోయినా దానిని గూర్చిన చారిత్రక భాషా విషయములు చాలా చిక్కులతో గూడి ఉన్నవి. వాటిని గూర్చి సర్వతోముఖముగా,సక్రమముగా విచారింప అర్హత గలవిద్వాంసులు చాలా తక్కువగా ఉన్నారు. వాటిని గూర్చిన పర్యాలోచన ఇంకా ఆరంభము కాలేదనే చెప్పవచ్చును. చరిత్రకారుడీ వాఙ్మయములోని గ్రంథముపౌర్వాపర్యమును కాలనిర్ణయమును చేస్తాడేమో అని భాషాశాస్త్రజ్ఞుడు నిరీక్షిస్తున్నాడు. అట్టి చారిత్రకజ్ఞానము లేకపోతే భాషా చరిత్రమును దానివివిధావస్థలనూ నిర్ణయించడానికి వీలులేదు. ఇట్లుండగా ఇతర విధములైన సాక్ష్యముల వల్ల ఎట్టిప్రయోజనమున్నూ కనబడక చరిత్రకారుడు భాషా పరిమాణ విషయమున భాషా శాస్త్రజ్ఞు లేమైనా కృషి చేస్తారేమో అని నిరీక్షిస్తున్నాడు" అని.

ఇంతవరకున్నూ సంగముగ్రంథముల భాషను గురించిన పరిశోధనలు ఎక్కువగా జరుగలేదు. భాషాపండితులైన శివరాజపిళ్లె వంటి వారు ఈ కార్యమునకు పూనుకొనవలసి ఉన్నది. అట్లు పూనుకొనక పిళ్ల గారు 'ప్రాచీన తమిళుల కాలనిర్ణయము' (The Chronology of the early Tamils) అనే గ్రంథములో ఒక క్రొత్త మార్గము నవలంబించినారు. వారు సంగమువాఙ్మయములో కనబడే అద్భుతములు, అ సందర్భములు, ఐన విషయములనన్నిటిని విడిచి పెట్టినారు. ఆ తరువాత ఈ తమిళ వాఙ్మయములో వారికి మూడు అవస్థలను తెలియజేసే పట్టులను ప్రత్యేకించి వాటికి ప్రాకృతికావస్థ, నైతికావస్థ, మతావస్థ అని పేరు పెట్టినరు. ఈ అవస్థలలో ప్రాకృతికావస్థ మొదటిదనిన్నీ, నైతికావస్థ తరువాతిదనిన్నీ, మతావస్థ తుదిదనిన్నీ నిర్ణయము చేసుకొన్నారు. ప్రాకృతికావస్థలో మనుష్యుడు దేహధారణము కోసము, అన్న పాసముల కొఱకు మాత్రము పాటుపడుతూ ఉండేవాడట. జీవిత సౌకర్యములు కొంత వరకు సమకూడిన తర్వాత సంఘములుగా జేరి నీతి నలవరచుకొన్నాడట. ఆ తరువాతనే ఈశ్వరుడు ఆత్మ మొదలైనవాటివిచారమునకు దిగినాడట. ఈ సంగమ వాఙ్మయమును ప్రాకృతికావస్థకు సంబంధించి ఉండవలెనట. కాబట్టి ప్రాకృతికావస్థకు సంబంధించిన సంగం వాఙ్మయపు పద్యములే ఆ కాలపు చిత్ర నిర్మాణమునకు పరమాధారములట. కాబట్టి వాటినే ఆధారములుగా చేసికొని తమిళుల ప్రాచీన చరిత్రమును నిర్ణయించడానికి ఆయన పూనుకొని తన గ్రంథమును సాగించినారు. సమకాలికులైన ఉండవచ్చునని తానూహించిన కొద్ది మంది పురుషులను మాత్రమే తీసుకొని ఒక పెద్ద పట్టికను ఏర్పాటు చేసినారు. వీరి విషయమై చేసిన పరిశ్రమ అసాధారణమైనదని ఒప్పుకోకతప్పదు. కానివీరిప్రయత్నము కూడా సంగం కాలనిర్ణయ విషయమున కృతార్థను బొందలేదు.

పైని చెప్పిన విషయాలనుబట్టి ఇప్పటి వరకున్ను క్రీ.శ. ఆరో శతాబ్దమునకు బూర్వముతమిళ వాఙ్మయమున్నదని చెప్పడానికాధారములు కానరాలేదని స్పష్టవుతున్నది. సుమారు ఈ శతాబ్దములోనే తక్కిన ద్రావిడ వాఙ్మయము కలిగి ఉండడాని కనుకూలమైన పరిస్థితులను సూచించే పద్యములును,

గద్యములునూ శాసనములలో కనబడుతున్నవి. కాబట్టి తమిళ, ఆంధ్ర, కన్నడములు మూడింటిలోనూ ఏకకాలమునందే వాఙ్మయము బయలుదేరడాని కారంభించిందని మాత్రమే ఇప్పటికి చెప్పవలసి ఉన్నది. అంతకుబూర్వపు భాషావస్థలను నిర్ణయించడానికి తగిన ఆధారము లింతవరకున్ను బయలుపడలేదు. ఉన్న ఆధారములను బట్టి చూస్తే ప్రాకృతభాషలే దేశములో వాఙ్మయము నందు వినియోగపడుతూ ఉండే వనిన్నీ, ప్రాకృతభాషల వ్యావహారిక రూపములుగా ఉండిన ద్రావిడ భాషలు గ్రంథస్థములుటకు ఆరోశతాబ్దపు ప్రాంతమున ఆరంభించినవనిన్నీ చెప్పవలసిఉంది.

ఈ వ్యాస రచనకు తోడ్పడిన గ్రంథములు:

1. Tamils 1800 years ago - by Kanakasabha Pillai
2. The Beginnings of South Indian History - by Dr. S.Krishnaswami Ayyangar.
3. Historical sketches of Ancient Deccan - K.V.Subramanya Lyer.
4. History of the Tamils - P.T.Srinivasa Iyengar.
5. Studies in Tamil Literature and History - V.R.Rama chandraDikshitar.
6. The Pandyan Kingdom - K. A. Nilakantha Sastry.
7. Studies in Chola History and Administration - K. A. Nilakantha Sastry.
8. The Cholas - K.A.Nilakantha Sastry.
9. History of the Pallavas of Kanchi - R.Gopalan.
10. The Chronology of the Early Tamils - K.N.Sivaraja Pillai
11. Tamil Studies - M. Srinivasa Iyengar.

ప్రపంచీకరణ నేపథ్యంలో సాహిత్య విమర్శ పదజాలం

-డా॥దార్ల వెంకటేశ్వరరావు

సమాజంలో మార్పులు వస్తున్నప్పుడల్లా సాహిత్యంలో వాటి ప్రతిఫలనం కనిపిస్తుంది. నేడు మనం ప్రపంచీకరణ యుగంలో ఉన్నాం. ప్రపంచవ్యాప్తంగా సాహిత్య పరిశోధన, విమర్శ రంగాల్లో దీనికి అనుగుణమైన నూతన పారిభాషిక పదాలను ఎన్నింటినో ప్రయోగిస్తున్నారు. ప్రగతిశీల, చైతన్యవంతమైన సమాజం వాటిని వేగవంతంగా అందుకోగలుగుతుంది. తెలుగు సాహిత్యంపై కూడా ఈ ప్రభావం కొంతవరకు కనిపిస్తున్నా, ఆ పదజాలాన్ని స్థిరీకరించుకోవడంలో తర్జనభర్జనలకు గురవుతున్న పరిస్థితి ఉంది. అందువల్ల ఆ పదాలను యథాతథంగా స్వీకరిస్తున్న వాళ్ళు కొంతమందైతే, వాటిని సాధ్యమైనంత స్థానీకరించుకొనే ప్రయత్నం చేస్తున్న వాళ్ళు మరికొంతమంది కనిపిస్తున్నారు. అటువంటి పదాలకు సాధ్యమైనంతగా తెలుగులో ఏకీకృత అంగీకారంతో పారిభాషిక పదాలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. దీని వల్ల తెలుగు భాషాభివృద్ధిని సాధించడానికి మరింతగా అవకాశం కలుగుతుంది. వీటిని ఈ వ్యాసంలో పరిశీలించాలనుకుంటున్నాను.

Globalization (ప్రపంచీకరణ):

ఈ పదాన్ని తెలుగు సాహిత్యంలో 'ప్రపంచీకరణ' అని ఇంచుమించు స్థిరీకరించుకున్నాం. ఈ పారిభాషిక పదం ప్రధానంగా ఆర్థికశాస్త్రానికి సంబంధించింది. అయినప్పటికీ, 'ప్రపంచీకరణ' అనే పారిభాషిక పదం సాహిత్యంలో విస్తృ తంగానే వాడుకలో ఉంది. కానీ, అది ఎప్పుడు ప్రారంభమైందనే విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. 'ప్రపంచీకరణ' అనేది 1960 నుండి కనిపిస్తున్నా, 1980 తర్వాతనే అది ప్రపంచవ్యాప్తంగా ప్రారంభమైందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. (Encyclopedia of Globalization, పుట: 526) అయితే, భారతదేశంలో మాత్రం 1990 తర్వాత వచ్చిన ఆర్థిక సరళీక ృత విధానాలను అమలు చేయడం నుండి ఈ పదవ్యాప్తి పెరిగింది. అంతకు ముందు అత్యంత ఎక్కువగా వాడుకలో ఉన్న వలసరాజ్యాలు, సామ్రాజ్యవాదం, పారిశ్రామికీకరణ, ప్రయివేటైజేషన్ వంటి పదాల స్థానాన్ని ప్రపంచీకరణ భర్తీ చేసింది. ఆర్థిక, రాజకీయ రంగాలతో పాటు సాహిత్య రంగంలో కూడా ఈ పదం అధ్యయనాంశం అయ్యింది.

"ప్రపంచదేశాల మధ్య వస్తువులు, సేవలు, మూలధనం, సాంకేతిక పరిజ్ఞానం, శ్రమ, మానవ మూలధనం మొదలైనవి ఎలాంటి అడ్డంకులు అవరోధకాలు లేకుండా స్వేచ్ఛగా ప్రవహించేలా చేసి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను సంఘటితం చేసే ప్రక్రియను ప్రపంచీకరణ అంటారు' అని ఆర్థికశాస్త్రనిపుణలు నిర్వచిస్తున్నారు. (నాగేశ్వరరావు, కె, పుట: 693) *"భారీయెత్తున రవాణా, సమాచార ప్రసార వ్యయం తగ్గిన దృష్ట్యా, వస్తువు సేవలు, మూలధనం, జ్ఞానం,*

కొంతవరకు ప్రజలు సరిహద్దులు దాటి ప్రవహించడానికి ఉన్న కృత్రిమ అడ్డంకులను నిర్మూలించే ప్రక్రియను ప్రపంచీకరణ" అంటారు అని స్టిగ్ లిజ్ (Stig Liz) అనే ఆర్థికశాస్త్రవేత్త నిర్వచిస్తున్నారు.

పై నిర్వచనాల ప్రకారం చూసిన శాస్త్ర, సాంకేతికరంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులు ప్రపంచవ్యాప్తంగా వ్యాపించడానికి ఇంటర్నెట్ (అంతర్జాలం), ప్రసారమాధ్యమాలు ఎంతగానో సహకరిస్తున్నాయి. ఈ శాస్త్రవిజ్ఞానం వల్ల స్థానిక సాహిత్యం, కళలు, ఆచార వ్యవహారాలు విశ్వవ్యాప్తమవుతున్నాయి. శాస్త్ర, సాంకేతిక రంగాలను అత్యధికంగా ఉపయోగించుకునే వారి జ్ఞానమే విజ్ఞానంగా చెలామణీలోకి రావడం కూడా సహజంగా జరిగిపోతుంది. 'జ్ఞానం' అనేది ఒక రంగానికి చెందింది మాత్రమే కాదు. భాష, సాహిత్యం, కళల వరకు తీసుకున్నప్పటికీ ఆంగ్లభాష ద్వారా ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సాహిత్య విజ్ఞానం విస్తరిస్తోంది. ఇంతకు ముందు వాడుకలో ఉన్న పదాలకంటే ప్రపంచీకరణ అనే పదం భూమి మీద ఉండే ప్రజలందరి భిన్న భావాల, సంస్కృతుల సమ్మేళనంగా అవగాహన చేసుకోవడానికి తోడ్పడుతుంది. అయితే, ఆర్థిక, రాజకీయ, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందిన దేశాల సంస్క ృతి, ఇతర దేశాలపై ప్రభావాన్ని చూపించడం ఎక్కువగా జరుగుతుంది. అందువల్ల ప్రపంచీకరణ అంటే ఇతర దేశాలపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కొన్నిఆధిపత్యదేశాల భావజాలాన్ని ప్రసరింపజేయడమనే భావన నెలకొంది. తెలుగు భాషా సాహిత్యాలు ఇంచు మించు ఈ అవగాహనతోనే కొనసాగుతున్నాయి. అన్యభాషా పదజాలాన్ని ప్రపంచీకరణకు ముందు కూడా చాలా మంది తమ సృజన సాహిత్యంలో ప్రయోగిస్తున్నప్పటికీ, ఈ పారిభాషిక పదజాలం తెలుగు అనువాదాలకు లొంగని స్థితి కనిపిస్తుంది. అందువల్ల వాటిని ప్రస్తుతం యథాతథంగా తీసుకోక తప్పని సరి పరిస్థితి ఏర్పడుతుంది. ఉదాహరణ: రూపాయి మారకం, డాలర్ విలువ, మార్కెట్ గా మారుతున్న మానవ సంబంధాలు, గాట్ ఒప్పందాలు, టెర్మినేటెడ్ సీడ్స్, మోనోసాంట్ విత్తనాలు, కార్పోరేట్ సేద్యం, కార్పోరేట్ వైద్యం, కార్పోరేట్ విద్య, కార్పోరేట్ జీవితం, అపార్ట్ మెంట్ జీవితం వంటి పదాలు ప్రపంచీకరణ ఫలితంగా వచ్చినవే. సృజనకారులు తాము ప్రపంచీకరణ ప్రభావానికి గురయ్యామని తెలిసో, తెలియకో కవిత్వం, కథలు, నవలలు, నాటకాలు రాస్తున్న వాళ్ళున్నారు. ఆ రచనలను ప్రపంచీకరణ దృష్టితో పరిశోధకులు, విమర్శకులు అధ్యయనం చేస్తున్నారు. సృజనకారులు తెలిసి రాస్తున్నారో, తెలియక జీవితాల నుండి పుట్టిన ఒడిదుడుకులను చిత్రికపడుతున్నారో తెలియాలంటే, అది విమర్శకులు ప్రత్యేకమైన పద్ధతులను అవలంబించి విశ్లేషించాల్సి ఉంటుంది.

Orientalism (ప్రాచ్య వాదం):

ప్రపంచీకరణ ప్రభావం వల్ల లోతైన పరిశోధన చేయాల్సిన అంశాలు కూడా కొన్ని పారిభాషిక పదాలు తెలుగులో ప్రవేశించాయి. అటువంటి వాటిలో Orientalism ఒకటి. దీన్ని తెలుగులో ప్రాచ్య వాదం, ప్రాచ్య తత్త్వంగా పిలుస్తున్నారు. *"పశ్చిమ దేశాల వారు తూర్పుదేశాల సాహిత్యాన్నీ సామాజిక స్థితిగతుల్నీ, విజ్ఞానశాస్త్ర సంబంధ విషయాలనూ, చరిత్రనూ, భాషనూ,*

రాజకీయాలనూ, నైసర్గిక స్వరూపాన్నీ, మానవపరిణామ శాస్త్రాన్నీ అధ్యయనం చేయగా వచ్చిన అవగాహనను 'ప్రాచ్యతత్త్వం'గా" భావిస్తున్నారు. (నళిని, పుట: 127) తూర్పు ఆసియాలోని జపాన్, చైనా, కొరియా, హాంగ్ కాంగ్, తైవాన్, భారతదేశం, పాకిస్తాన్, నేపాల్ తదితర దేశాలనను ప్రాచ్యదేశాలని పిలుస్తారు. వీటితో పాటు ఉత్తర ఆఫ్రికా, దక్షిణాసియా దేశాలను కూడా ప్రాచ్య దేశాలుగానే పిలుస్తారు. 1812లో ఈ పదాన్ని లార్డ్ బైరన్ అనే కవి ప్రయోగించినట్లు ఆక్స్ ఫర్డ్ ఇంగ్లీషు నిఘంటువు తెలుపుతున్నా,ఎడ్వర్డ్ వాద్వీ సైయిద్ Orientalism అనే పుస్తకాన్ని 1978లో ప్రచురించిన తర్వాత నుండీ ఈ వాదం ప్రాచుర్యంలోకి వచ్చింది.

కొలంబియా విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా పనిచేసిన Edward w.Said (1935–2003) రాసిన "*Orientalism (Western conceptions of the orient)* అనే ఈ పుస్తకంలోప్రధానంగా మూడు అంశాల్ని స్పష్టంగా చర్చించారు. (Encyclopedia of Globalization, పుట: 922) ఒకటి: పాశ్చాత్య మేధావులు ప్రాచ్యదేశాల గురించి ఎలా ఆలోచిస్తుంటారు. రెండు: సుమారు నాలుగు వేల సంవత్సరాల సాంస్కృతిక చరిత్ర పట్ల పాశ్చాత్యుల, ప్రాచ్యుల మధ్య గల సంబంధాలు, వ్యత్యాసాలను వివరించడం. మూడు: పాశ్చాత్య కళ్ళతో ప్రాచ్యుల భాషను, సాహిత్యాన్ని, వాటిలో ప్రతిఫలించిన అంశాలను అశాస్త్రీయ పద్ధతుల్లో, అసంబద్ధ విషయాల్ని అద్భుత పురాగాథలుగా కల్పించడం, పురాణాలుగా వ్యాప్తిచేయడంగా భావించేవారని, అందువల్ల పాశ్చాత్య మేధావులు ప్రాచ్యుల ఆలోచనలను 'ఇతరుల' ఆలోచనలు, సంస్కృతులుగానే గుర్తించేవారని తెలుస్తుంది.

పందొమ్మిదో శతాబ్ది నుండీ ప్రాచ్యులపట్ల పాశ్చాత్యుల ఆలోచనా ధోరణులపై రెండవ ప్రపంచయుద్ధం పూర్తయ్యేవరకు ఫ్రెంచి, బ్రిటన్ దేశాల ఆధిపత్యంగానే కొనసాగింది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం నుండీ అమెరికా ఆలోచనా విధానం తన ఆధిపత్యాన్ని చెలాయిస్తుంది. ప్రపంచీకరణ ప్రభావం వల్ల ప్రాచ్య వాదంలో రెండు పార్శ్వాలు ప్రపంచానికి వెల్లడయ్యాయి. మొదటిది ప్రాచ్యదేశాలు 'ఆధునికత'ను సంతరించుకోవడంలో అమెరికా సాంస్కృతిక ప్రభావమే పాశ్చాత్య ప్రభావంగా మారింది. ఆయా దేశాల్లో ఆసియా దేశాల విద్యాభ్యాసం కోసం వెళ్ళిన వాళ్ళంతా పాశ్చాత్య దేశాల్లో ప్రాచ్యతత్త్వాన్ని కొన్ని పరిమితులకు లోబడే అధ్యయనం చేయాల్సి వచ్చేది. ప్రపంచీకరణ వల్ల వచ్చిన ప్రాచ్యదేశాల మేధావుల్లో వచ్చిన చైతన్యం వల్ల ఐరోపా కేంద్రిత ఆలోచనలనుండి బయటపడాలనే సంఘర్షణలకు గురయ్యారు. దానితో పాటు ప్రాచ్యతత్త్వ జ్ఞానాన్ని పునర్ నిర్మించుకునే ప్రయత్నాన్ని మొదలు పెట్టారనడానికి Encyclopedia of Globalization లో పేర్కొన్న కింది వాక్యాలే నిదర్శనం.

With the advent of globalization, world culture has been "remapped," with the center moving to the periphery and the periphery moving to the center- and with the monolithic center being deconstructed." (pp: 922)

ఈ ప్రభావం తెలుగు బోధనా రంగంపై కూడా కనిపిస్తోంది. ముఖ్యంగా ఆధునికత–ఉత్తరాధునికతలపై కొన్ని వ్యాసాలు, పుస్తకాలు, పరిశోధనలు, విమర్శ గ్రంథాలు వచ్చాయి. ప్రాచ్యవాదం ప్రభావం తెలుగులో నవ్యసంప్రదాయంపై కనిపిస్తుంది. ప్రాచ్యవాదంలో తమ విజ్ఞానాన్ని, సంస్కృతిని చిన్నచూపు చూసే పాశ్చాత్యీకరణ స్థానంలో తమ మూలాల్ని వెతుక్కోవడం కనిపించినట్లే, సంప్రదాయ సాహిత్యవాదులు ఆధునిక సాహిత్యంలో నవ్యసంప్రదాయ వాదుల స్థానాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేశారు. సాధారణంగా గ్రీకు, లాటిను భాషాసాహిత్య కళారూప నిర్మాణ సంప్రదాయాన్ని క్లాసిసిజం అంటారు. యూరోపియన్ భాషాసాహిత్య కళారంగాల్లో ముఖ్యంగా ఆంగ్ల సాహిత్యంలో 17వశతాబ్దం ఉత్తరార్ధం నుండి 18 వశతాబ్దం పూర్వార్థం వరకు కొనసాగిన సాహిత్య పునరుజ్జీవన కాలాన్ని నియో క్లాసిసిజం అంటారు. దీని ప్రభావం నుండి నవ్యసంప్రదాయం వచ్చిందనే విమర్శకులున్నా దేశీయమైన పునాది నుంచే ఇది ఆవిర్భవించిందని విమర్శకులు అంటున్నారు (లక్ష్మణ చక్రవర్తి, పుట: 927). ఆ దేశీయ భూమిక ప్రధానంగా తెలుగు సాహిత్యానికి చెందిందే. తెలుగులో వస్తున్న అభ్యుదయ, విప్లవ, దిగంబర కవిత్వానంతరం సంప్రదాయ సాహితీవేత్తలు తీవ్రమైన ఆలోచనల్లో పడ్డారు. తెలుగు సాహిత్యాన్ని అత్యంత ప్రభావితం చేస్తున్న మార్క్సిజం, భౌతికవాద దృష్టి, మనోవిశ్లేషణ విమర్శ ధోరణులు, కూడా వీరిని భయాందోళనలకు గురిచేశాయి. వీటికి ప్రత్యామ్నాయ సాహిత్యవాదాన్ని తీసుకురావాలనే ఆలోచనలతో చేతనావర్తనం పేరుతో ఆత్మ–అంతరాత్మ, తాత్త్వికత, దేశీయత, జాతీయత, దేశభక్తి, మార్గ–దేశీకవితారీతుల్ని ఆదరించడం మొదలైన భావనలను ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు. ఆధునికత అనేది పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో ఏర్పడలేదని కూడా నవ్య సంప్రదాయవాదుల్లో కోవెల సంపత్కుమారాచార్య భావించారు (యు.ఎ. నరసింహమూర్తి, పుట: 4).

భరతుని రససిద్ధాంతం, ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతాలు మొదలైన వాటిలోని భారతీయ సాహిత్య సిద్ధాంతాల విశిష్టతను వివరించే ప్రయత్నం చేశారు. భారతీయ లాక్షణిక సంప్రదాయాన్ని, దాన్ని అనుసరించి వచ్చిన కావ్య కర్తృత్వాది అంశాల్లో కనిపించే దేశీయ విమర్శనాంశాలను వివరించే ప్రయత్నం చేశారు. అలాగే, దేశీయసాహిత్య ఔన్నత్యాన్ని వివరించే వేదాలు, రామాయణ, భారత, భాగవతాది కావ్యేతిహాసాలను, అష్టాదశ పురాణాలను పాశ్చాత్య సాహిత్యంతో తులనాత్మకంగా విశ్లేషిస్తూ, కవిత్వం, ఛందస్సు, వ్యాకరణం, ఆలంకారికాంశాలతో పాటు వాటి పరిమాణాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని, వీటి విశిష్టతను వివరించారు. తర్వాత కాలానుగుణమైన మార్పులో భాగంగా ఆధునికతను పరిగణించాలని చెప్తూ ఒకకాలంలో ప్రాచీనం, మరొక కాలానికి ఆధునికమవుతుందన్నారు. అది భారతీయ సాహిత్యంలోను, తెలుగు సాహిత్యంలోను స్పష్టంగా కనిపిస్తుందన్నారు. కాలానుగుణమైన మార్పుల ఫలితంగా అన్ని వర్గాలు, వర్ణాలు విద్యాభ్యాసం చేయడం, వారి జీవితాల నుండి వచ్చిన దేశీయ సాహిత్యంలో మాలపల్లి, వేయిపడగలు మొదలైన నవలలను, మహాప్రస్థానం కవితా సంపుటినీ, కొయ్యగుర్రం, ఆసుపత్రి గీతం వంటి దీర్ఘకావ్యాలను నవ్యసంప్రదాయ సాహిత్యంగా అభివర్ణించారు.

ఇక్కడ జాగ్రత్తగా పరిశీలిస్తే పాశ్చాత్యదేశాల్లో వచ్చిన ఓరియంటలిజమ్ నుండి తెలుగులో నవ్యసంప్రదాయ సాహిత్య వాదం అనే పారిభాషిక పదం పుట్టుకొచ్చిందని అర్థమవుతుంది. మరొక కోణంలో పాశ్చాత్య ప్రభావం నుండి దేశీయ సాహిత్య భూమికను పునర్ నిర్మించుకునే ప్రయత్నం జరిగిందని తెలుస్తుంది. దీనిపై సాహిత్య ప్రపంచంలో వాదోపవాదాలున్నాయి.

Orientalism గురించి జరిగిన అధ్యయనం సందర్భంలోనే ప్రపంచ భాషాసాహిత్యాలకు ప్రపంచీకరణ కొన్ని పారిభాషిక పదాలను, నూతన భావజాలాన్ని అందించింది. Modernity(ఆధునికత), Colonialism(వలసవాదం), Colonial literature(వలసవాద సాహిత్యం), Post-colonial literature(వలస వాదానంతర సాహిత్యం, వలసవాదోత్తర సాహిత్యం), Post Modernism(ఉత్తరాధునిక వాదం, ఆధునికోత్తర వాదం, అత్యాధునికత, పోస్టు మోడర్నిజం), Diaspora literature(డయాస్పోరా సాహిత్యం), Deconstruction (విఘటన వాదం, వినిర్మాణ వాదం) మొదలైనవి వాటిలో ముఖ్యమైనవి. ప్రపంచ సాహిత్యం (World literature) లో ప్రయోగంలో ఉన్న ఈ పదాలు కొన్ని తెలుగు భాషా సాహిత్యాల్లోను ప్రవేశించాయి. కానీ, వాటిలో కొన్ని పారిభాషిక పదాలను స్థిరీకరించడంలో సాహితీ వేత్తల్లో ఏకాభిప్రాయం కనపడ్డం లేదు.

Post-colonial literature (వలస వాదానంతర సాహిత్యం)

1947 నుండి 2010 వరకు వచ్చిన తెలుగు వలస వాదానంతర సాహిత్యాన్ని పరిశోధకులు (కె.యస్.రమణ, 1851) వివరిస్తూ.. The major trends in Telugu literature in the post-colonial period from 1947 to 2010 are namely; a) Progressive, b) Feminist, c) Dalit, d) Minority, e) Regionalism, f) Globalization అని అన్నారు. దీనిలో పేర్కొన్న వాదాలు, ఉద్యమాలే నేటి వరకు కూడా అనువర్తితం అవుతున్నాయని తెలుస్తుంది. దీని ప్రభావం తెలుగు పరిశోధన, సాహిత్య విమర్శపై కనిపిస్తోంది. వలసవాదానంతర సాహిత్యంలో ఒక వాదంగా వచ్చిన 'ప్రాంతీయ అస్తిత్వవాదం' వల్ల 'అంతర్గత వలస వాదం' పుట్టుకొచ్చిందనే విశ్లేషణలు (వెల్దండ శ్రీధర్, xvi) కూడా కనిపిస్తున్నాయి. సమకాలీన తెలుగు సాహిత్యంలో సామ్రాజ్యవాద ప్రభావ సాహిత్యం, ప్రపంచీకరణ సాహిత్యం, వలసవాదోత్తర సాహిత్యం అనే పారిభాషిక పదాలను వాడేవాళ్ళెలా వీటిని అర్థం చేసుకుంటున్నారనే దిశగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది.

Post modernism (ఉత్తరాధునిక వాదం):

'ఆధునికత–అత్యాధునికత' (1990) పేరుతో అఫ్సర్ కొన్ని వ్యాసాల్ని ఒక పుస్తకంగా తీసుకొచ్చాడు. ఆంగ్లంలో Post modernism అనే పదాన్ని తెలుగులో ఉత్తరాధునికవాదం, అత్యాధునిక వాదం, ఆధునికానంతరవాదం మొదలైన పారిభాషిక పదాలతో ప్రయోగిస్తున్నారు. దీన్ని అర్థం చేసుకోవడానికి ముందుగా ఆధునికత, ఆధునికవాదాలను అర్థం చేసుకోవాలి. 'ఆధునికత'ను కాలాన్ని, తత్వాన్ని బట్టి గుర్తించాలనే ఆలోచనలు వచ్చాయి. సంప్రదాయ సాహిత్యం అతీంద్రియ శక్తుల ప్రభావం వల్ల మానవ సృష్టితో పాటు సాహిత్య సృజన కూడా జరిగిందనే

భావాలు ప్రచారంలోకి వచ్చాయి. ఆ విధంగా మానవాతీత శక్తులకు సాహిత్యంలో ప్రాధాన్యం పెరిగింది. దానివల్ల సామాజిక వాస్తవికతకు దూరంగా సాహిత్యం నిలిచిందనీ, అందువల్ల సాహిత్యం ఇంద్రియానుభవాల స్పందననుండి పుట్టిందనే వాదన బయలుదేరింది. మానవుడి ఆలోచనల ఫలితమే సాహిత్యమనీ, మానవుడే కేంద్రం కావాలని అదే నిజమైన ఆధునికతగా భావించినవాళ్ళున్నారు. మరొక దృష్టితో చూసినప్పుడు కాలానుగుణంగా ఒకకాలంలోని సాహిత్యం మరొక కాలానికి వస్తువులోను, దాని అభివ్యక్తి వల్లా నవ్యత కనిపించడమే ఆధునికతగా భావించినవాళ్ళూ ఉన్నారు.

సాహిత్యంలో భావవాద, భౌతికవాద చర్చోపచర్చల మధ్య మార్క్సిజం ప్రపంచవ్యాప్తమైంది. భౌతికతకు ప్రాధాన్యం పెరిగింది. మానవ చైతన్యమంతా వ్యక్తి చైతన్యంతోనే ముడిపడి ఉందనీ, వ్యక్తి చైతన్యం తన సమాజ భౌతిక పరిస్థితులనుండే రూపొందుతుందనీ సిద్ధాంతీకరించారు. ఉత్తరాధునికవాదం గురించి బి.తిరుపతిరావు 'పోస్ట్‌మాడర్నిజం' (1999) అనే గ్రంథంలో 'ఆధునికానంతరవాదం' అనే పారిభాషిక పదాన్ని ప్రయోగించారు. దీనిలో 'ఆధునికత' గురించి కూడా కొన్ని అభిప్రాయాల్ని వివరించారు. Modernఅనే ఆంగ్ల పదానికి ఫ్రెంచిలో Modernus, ఇటాలియన్ లో Modernus పదాలు లాటిన్ లోని Modo నుంచి వచ్చింది. వీటన్నింటికీ 'ఇప్పుడు' అని అర్థం. ఆంగ్ల భాష ప్రారంభంలో ఈ పదం 'సమకాలీన' అనే అర్థానికి దగ్గరగా ఉంది. పదిహేడు, పద్దెనిమిదో శతాబ్దం నుంచి ఆధునికత, ఆధునికతావాదం అనే పారిభాషిక పదాలు ప్రయోగంలోకి వచ్చాయి. పారిశ్రామిక విప్లవానంతరం నుండీ ఈ 'ఆధునికత' అనే పదం విస్తృతమైన వాడుకలోకి వచ్చింది.(బి.తిరుపతిరావు,పుట:3)

ఆధునికత –కొన్ని లక్షణాలు:

గెలీలియో (1609) టెలీస్కోపు ద్వారా చంద్ర గ్రహాన్ని చూడ్డంతో ఆధునిక సైన్స్ కిఅంకురార్పణ జరిగిందనీ, ఆధునికతను గెలీలియో కనుగొన్నాడనీ సాహితీవేత్తలు (బి.తిరుపతిరావు, పుట: 5) భావిస్తున్నారు. ఆధునిక మానవుడు హేతువాది, దేవుడిపై నమ్మకం లేదనే అభిప్రాయం , ఆధునికత దేవుని మరణాన్ని ప్రకటించింది. మతం మీద విశ్వాసం సడలిపోవడం, ఒక గణిత శాస్త్రసమస్యని,ఒకయంత్రసంబంధ సమస్యని అర్థం చేసుకోగలిగినట్టుగానే మనిషి తన అనుభవంలోంచి ఈ విశ్వాన్ని అర్థం చేసుకోగలడు. సైన్స్ లాగే హేతువాదం కూడా నిరూపణను, కార్యకారణాన్ని విశ్వసించినా, హేతువాదం విలువల నిర్ణయానికి కట్టుబడి ఉంటుంది. సైన్స్ కి మానవ విలువలతో పనిలేదు.

ఉత్తరాధునికవాదం–కొన్ని ముఖ్యాంశాలు:

సిద్ధాంతాల అఖండతను ప్రశ్నిస్తూ ముందుకు వచ్చిన సిద్ధాంతం. (ii),సత్యం, హేతువు, హేతుబద్ధత, గుర్తింపు, విశ్వజనీన విముక్తి, పురోగతి, మహాకథనాలు మొదలైన వాటి గురించిన సాంప్రదాయిక ఆలోచనారీతుల్ని సంశయంగా చూస్తూనే, విశ్లేషించింది. ప్రపంచవ్యాప్తంగా

అన్నిసిద్ధాంతాలు, ముఖ్యంగా మార్క్సిజం సంక్షోభంలో వున్న కాలంలో ముందుకొచ్చింది. సమగ్రసిద్ధాంతాలు, పథకాలు, ప్రతిమానాలు అనే వాటిని ఈ సిద్ధాంతం నిరాకరిస్తుంది. సైద్ధాంతిక బహుళత్వం ఈ సిద్ధాంతానికి ప్రాణం. చరిత్రకు సంబంధించిన విశ్వజనీన భావనల్ని కాక, ప్రాంతీయమైన చరిత్రలను గురించిన స్పృహను ముందుకు తెస్తుంది. భాషలో ఉండే బహుళత్వాన్ని గుర్తించడం కూడా ఉత్తరాధునికవాదంలో భాగంగా కనిపిస్తోంది.

The Death of the Author (రచయిత మరణం):

సంప్రదాయ సాహిత్య విమర్శకు ఒక కొత్త సవాలుగా నిలుస్తూనే, సరికొత్త ఆలోచనను అందించిన భావన The Death of the Author. దీన్ని ఫ్రెంచి సాహితీవేత్త Ronald Barthes (1915–1980) 1968లో ప్రతిపాదించాడు. సాహిత్య విమర్శ చేసేటప్పుడు రచనను విశ్లేషించేటప్పుడు ఆ రచన రాసిన వారి జీవితాన్ని, ఆ రచన నేపథ్యాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలనేది సంప్రదాయ సాహిత్య విమర్శలో ఒక పద్ధతి. అయితే, రోనాల్డ్ బార్త్ ప్రకారం ఒక రచన వెలువరించేవరకే రచయితకు సంబంధం ఉంటుంది. తర్వాత ఆ రచనను అతడు చదివి విమర్శించినా రచయితతోను, రచనా నేపథ్యంతోను సంబంధం లేకుండా రచనను మాత్రమే విశ్లేషించాలి. అంటే రచన వెలువడిన తర్వాత రచయిత ఆలంకారికంగా మరణించినట్లేనని, అందుకే దీన్ని Death of author అనే పారిభాషిక పదంతో పిలవవచ్చనీ ఆయన అభిప్రాయపడ్డాడు. Textకి ఉండే అనేకమైన అర్థాలు అర్థం చేసుకోవడానికి ఈ విధానం ఎంతగానో తోడ్పడుతుందనీ, సాహిత్య విమర్శలో వస్తుగత సత్యాన్ని ఆవిష్కరించడానికి తోడ్పడుతుందనీ భావించే విమర్శవిధానంగా చెప్పుకోవచ్చు. సీతారాం (తెలంగాణ కవిత్వం), అద్లూరి రఘురామరాజు (*మైదానం లోతుల్లోకి...*) జిలుకర శ్రీనివాస్ మొదలైన విమర్శకులు తెలుగులో దీన్ని ప్రచారం చేసే ప్రయత్నం చేశారు.

Magical realism (మాంత్రిక వాస్తవికత)

ఈ పారిభాషిక పదాన్ని మొట్టమొదటిసారిగా Franz Roh అనే జర్మన్ కళా విమర్శకుడు 1925లో ప్రయోగించాడని పరిశోధకులు చెప్తున్నారు. (Slemon, Stephen, pp. 9-24, pp: 9) అయితే, ఆంగ్ల సాహిత్యంలో 1955 నుండీ కనిపించసాగిందని పరిశోధకులు అంటున్నారు. (Bowers, Maggie Ann, pp:6). ఇది మొదట్లో చిత్రకళకే పరిమితమైంది. తర్వాత కాలంలో 1970 తర్వాతనే ఆంగ్లసాహిత్యంలో కనిపించసాగింది. కొలంబియా దేశానికి చెందిన పాత్రికేయుడు, నవలా రచయిత Gabriel García Márquez (1927–2014) రాసిన One Hundred Years of Solitude అనే నవల ద్వారా మ్యాజికల్ రియలిజమ్ ప్రపంచ సాహిత్యానికి పరిచయం అయ్యింది.

"విరోధాభాసమైన అంశాలను గాని చిత్ర విచిత్ర రూపాలను గాని పక్కపక్కనే నిలబెట్టి, మామూలు వస్తువులను మార్మికత్వం ఆవిష్కరించే కోణంలోంచి చూపుతూ ఒక అవాస్తవిక, స్వాప్నిక

అనుభూతిని సూచింపజేయడం, ఛాయాచిత్ర సదృశ వస్తు స్వాభావికతను ఒక స్వాప్నిక దృశ్యంలాగా ప్రతిబింబించడం ఈ ప్రక్రియ లక్షణంగా విమర్శకులు (ఆడెపు లక్ష్మీపతి, తెలుగు సాహిత్య విమర్శ దర్శనం, పుట: 999) భావిస్తున్నారు. అంతేకాకుండా దీనిలో accurate detail, smooth photographic clarity, and portrayal of the 'magical' nature of the rational world. It reflects the uncanniness of people and our modern technological environment. (Bowers, Maggie Ann (November 4, 2004). *Magic(al) Realism*. New York: Routledge. ISBN 978-0-415-26854-7.) ఉంటాయని కూడా వివరిస్తున్నారు.

*"ఒక సమాజంలో రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక పరమైన మార్పులు చోటుచేసుకుంటున్నప్పుడు మనిషి నిజ అస్తిత్వస్థితికి సంబంధించిన సరిహద్దు రేఖలూ చెరిగిపోతాయి. అప్పటి సంక్లిష్టవాస్తవికతను సంపూర్ణంగా చిత్రించేందుకూ, సంధికాలంలోని సదరు సమాజపు సంక్షుభిత చైతన్యాన్ని ప్రతిఫలింపజేసేందుకూ ఇలాంటి శిల్పపద్ధతులను పాటిస్తారు"*ని విమర్శకులు భావిస్తున్నారు. తెలంగాణాలో నైజాం పాలనకు మూలస్థంభాలుగా నిలబడ్డ దేశీయులకు, దేశ్ ముఖ్ లకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన లెజండరీ వీరుల గాథలు కొన్ని మౌఖికంగా మొన్నటిదాకా ప్రచారంలో ఉన్నాయి. కొండలరాయుడు, సర్వాయి పాపారాయుడు గట్టెపల్లి మురళి వంటి తెలంగాణ వీరుల గాథల్లో ఇలాంటివి అనేకం కనిపిస్తాయని ఇవి కూడా మాజిక్ రియలిజంలో భాగంగానే ఆడెపు లక్ష్మీపతి చూడాలంటున్నారు. వర్ధమాన, వలస, మూడో ప్రపంచ దేశాల ప్రజలను చైతన్యాన్ని ప్రతిబింబించడం మాజిక్ రియలిజం ముఖ్య అజెండాగా కనిపిస్తుందంటున్నారు సాహితీవేత్తలు. పశ్చిమ ఆధిపత్యవాదానికి అడ్డంగా వలసవాదానంతర జాతుల ఉపజాతుల సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చేందుకు అణగారిన వర్గ ద ృక్కోణాల్లోంచి వాస్తవికతా స్వభావాన్ని ఆత్మాశ్రయిక ధోరణిలో ఆవిష్కరిస్తుంది. మాజిక్ రియలిజం సైన్స్ ఫిక్షన్ కాదు. పలాయనవాదం అంతకన్నాకాదు. రచయిత ఆశించిన ఒక ప్రయోజనం మేరకే పాత్యంలో ఇంద్రజాలం, వాస్తవికత చెట్టా పట్టాలేసుకు తిరుగుతాయని వివరిస్తున్నారు. తెలుగు రచయితల్లో మునిపల్లి రాజు, వి.చంద్రశేఖరరావు, గోపిని కరుణాకర్, కేశవరెడ్డి మొదలైన వాళ్ళు తమ కథలు, నవలల్లో మాజిక్ రియలిజంతో రచనలు చేస్తున్నారని విమర్శకులు విశ్లేషిస్తున్నారు.

పోస్ట్ మోడర్నిజం తర్వాత అఖండ సిద్ధాంతాలకు కాలం చెల్లడం, సమస్త చీలికలు శిరోధార్యం కావడం వంటి ఆలోచనలు సాహిత్యంలో కొత్త వర్గాల్ని ఆలోచింపజేసింది. ఇంతవరకు విస్మరణకు గురైన వర్ణాలు, వర్గాలు తమ గొంతుల్ని వినిపించే ప్రయత్నం తీవ్రతరం చేశారు. దీనితో Discourse – Counter Discourse అనే భావనలు తెలుగు సాహిత్య విమర్శలో కనిపించసాగాయి. దీనికి ప్రాతిపదికను ఏర్పరించింది మాత్రం డెరిడా సిద్ధాంతాలనే అభిప్రాయం ఉంది. నల్లజాతీయుల కళాసాంస్కృతికాంశాలు నిరాదరణకు గురైనట్లే, భారతదేశంలో దళిత,

బహుజనుల తత్త్వాన్ని కళాత్మకంగా అభివ్యక్తీకరించిన విమర్శకుల్లో జి.లక్ష్మీనరసయ్య ముఖ్యుడు. 1985 దళిత, బహుజనులు సాహిత్య, కళారంగాల్లో తీసుకొచ్చిన అభివ్యక్తినీ, తాత్త్వికతనూ లక్ష్మీనరసయ్య సాధికారికంగా నిరూపించాడు. దీనితో దళిత సౌందర్య శాస్త్రం అనే భావన తెలుగు సాహిత్య విమర్శలో పుట్టుకొచ్చింది.

చేకూరి రామారావు వచన కవిత్వాన్ని విశ్లేషిస్తూ చేసిన విమర్శలో నూతన విమర్శ పారిభాషిక పదజాలాన్ని అవగాహన చేసుకోవడమెలాగో తెలుస్తుంది. ఈయన భాషాశాస్త్రాన్ని ఆధారం చేసుకొని కవిత్వనిర్మాణం గురించి విశ్లేషించారు. చేరా విస్మరించిన దళిత బహుజన కోణాన్ని జి.లక్ష్మీనరసయ్య కవిత్వనిర్మాణపద్ధతుల్లో కొనసాగించాడు. చేరా భాషాశాస్త్రాన్ని కవిత్వ నిర్మాణ విశ్లేషణకు శక్తివంతంగా ఉపయోగించుకుంటే, జి.లక్ష్మీనరసయ్య దేశీయ సాంస్కృతిక పునాదుల్ని, కళావిలువల్ని గుర్తించే పద్ధతుల్నీ సమర్థవంతంగా అందించారు. కవిత్వ పరిభాషను అవగాహన చేసుకోవడానికి ఇరువురి కృషీ ప్రశంసనీయం. కవిత్వనిర్మాణానికి 'వ్యూహం' ప్రధానంగా భాషతో ముడిపడి ఉందని చేరా అంటే, జీవితంతో ముడిపడి ఉందని జి.లక్ష్మీనరయ్య అంటారు. ఇద్దరూ కూడా తెలుగు వచనకవిత్వ విమర్శకు నూతన సైద్ధాంతిక భాషా పదజాలాన్ని అవగాహన చేసుకోవడాన్ని నేర్పారు.

ద్రవాధునికత (Liquid Modernity):

ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు సాహిత్య పరిశోధన, విమర్శల్లో ఆధునిక, ఉత్తరాధునిక వాదాల గురించిన చర్చ కనిపిస్తుంది. దీనితో పాటు ద్రవాధునికత (Liquid modernity) అనే పారిభాషిక పదం కూడా వ్యవహారంలోకి వచ్చింది. దీన్నే గతించిన ఆధునికత అనే అర్థంలో Later modernity n అనే పదంతో ప్రయోగిస్తున్నారు. ఇది ప్రపంచీకరణ నేపథ్యంలోనే వచ్చింది.

*"మీరు చూసే ఉంటారు. రోడ్డు మీద అపరిమిత జనసందోహం మధ్య ద్విచక్రవాహనం మీద పాతికేళ్ల కుర్రాడు శరవేగంతో పోతుంటాడు. తల పక్కకి వాలిపోయి భుజాన్ని తాకుతుంటుంది. చెవికి, భుజానికి నడుమ ఒక సెల్‌ఫోను అతుక్కుపోయి ఉంటుంది. అతను తన బాస్‌తో ఆ పూట ఆఫీసు పని గురించి మాట్లాడుతున్నాడా, లేక స్నేహితురాలితో సాయంత్రం సినిమా గురించి ముచ్చటిస్తున్నాడా అనేది మన కనవసరం. సదరు ద్విచక్ర వాహన చోదకుడి పరిస్థితిలో చలనవేగం ఉంది. అందువల్ల అస్థిరత ఉంది. అందువల్ల అభద్రత కూడా ఉంది. ద్రవాధునిక (*Liquid Modernity*) అనే భావనని అర్థం చేసుకోవటానికి ఆ దృశ్యం చక్కని ఉదాహరణ"* అంటూ ద్రవాధునికతను తెలుగులో పాపినేని శివశంకర్ వివరిస్తున్నారు.

పోలెండ్ కి చెందిన సామాజిక శాస్త్రవేత్త జిగ్మంట్ బౌమన్ (Zygmunt Bauman, (1925-) *Liquid Modernity* అనే పుస్తకం (2000) ద్వారా ఈ భావన వచ్చింది. బౌమన్ సుమారు 57 పుస్తకాలు రాశాడు. వాటిలో అత్యధిక శాతం ప్రపంచీకరణ (*Globalization*), ఆధునికత (*Modernity*), ఉత్తరాధునికత (*Post Modernity*) లకు సంబంధించినవే. మారుతున్న

ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ఘనాధునికత (*Solid Modernity*), ద్రవాధునికత (*Solid Modernity*) అనే పారిభాషిక పదాలను వాడుకున్నాడు. ఈ పదాలు అర్థం కావాలంటే ఆధునికత ముందుగా అర్థం కావాలని విమర్శకులు అంటున్నారు. భౌతికంగా పారిశ్రామిక విప్లవం, భావజాలపరంగా ఫ్రెంచి విప్లవం తర్వాత ఆధునికత కనిపించసాగిందనేది ఒక అభిప్రాయం. కానీ, భౌమన్ ఆలోచనలో స్థలకాల సంబంధంలో మార్పు ఆధునికతకి ప్రారంభ బిందువు. మనిషి జీవనాభ్యాసం నుంచి స్థలకాలాలు విడివడటంతో, అవి పరస్పరం విడివడటంతో ఆధునికత మొదలైందంటాడు.

"ద్రవాధునికతలో ప్రపంచీకరణ ఉందీ వలసలున్నాయి. సంచార జీవనం ఉందీ అంతర్జాలం ఉందీ సెల్‌ఫోన్లు ఉన్నాయి. జీవితంలో మార్పు అనేది ఇవాళ 'శాశ్వత' పరిస్థితి. మార్పు లేని గానుగెద్దు పద్ధతి ఇంక కుదరదు. ఏదో ఒక గత ఉదాహరణని అనుసరించటం 'మంచిది' కాదు. జ్ఞానం సంపాదించి, దానిమీదనే ఆధారపడటం ఇవాళ 'తెలివైన ప్రతిపాదన' కాదు. అంటే ఏవో కొన్ని స్థిరమైన అభిప్రాయాలను అంటిపెట్టుకొని బ్రతకటం గాక ఎప్పటికప్పుడు మారే పరిస్థితుల కనుగుణంగా మారుతూ పోవటమే నేటి జీవన విధానంగా బౌమన్ గుర్తించాడు" అని పరిశోధకులు వివరిస్తున్నారు.

ప్రపంచీకరణ ప్రభావం వల్ల తెలుగు సాహిత్య విమర్శలో కూడా నూతన పదజాలం, నూతన భావనలు, నూతన సిద్ధాంతాలు ప్రాచుర్యంలోకి వస్తున్నాయని దీన్నిబట్టి తెలుస్తుంది. పర్యావరణ సమస్యల్ని మన తెలుగు సాహిత్యంలో అందించిన వాళ్ళున్నారు. కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ 'వెలుతురు పిట్టలు', 'ఇస్మాయిల్ 'చిలుకలువాలిన చెట్టు' మొదలైన కవితా సంకలనాల్లోను, రైతు సమస్యలను వర్ణిస్తూ వచ్చిన కవిత్వం కూడా పర్యావరణ స్పృహతో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. అలాగే, కేశవరెడ్డి రాసిన 'అతడు అడవిని జయించాడు' వంటి నవలికను కూడా ఈ పద్ధతిలో చూడాల్సిన అవసరం ఉంది. ఇంకా ఇటువంటి పారిభాషిక పదాలెన్నో తెలుగుసాహిత్యంలో కనిపిస్తున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యం వల్ల తెలుగు సాహిత్య బోధనలోను, పరిశోధనలోను, విమర్శలోను నూతన పారిభాషిక పదజాల ప్రయోగాలు విస్తృతంగా కనిపిస్తున్నాయి. ఇవి తెలుగు భాషాభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయని భావించవచ్చు.

ఆధార గ్రంథాలు:

నరసింహమూర్తి, యు.ఎ. విశిష్ట విమర్శకుడు: సంపత్కుమారాచార్య (వ్యాసం), http://eemaata.com/em/issues/201101/1671.html?allinonepage=1

నళిని.ఎస్.ఎస్. సాహిత్య విమర్శ పదాల డిక్షనరి. హైదరాబాద్: రమేశ్ పబ్లికేషన్స్, 1999.

నాగేశ్వరరావు,కె., (సంపా.). భారతదేశ ఆర్థిక వ్యవస్థ–సంపుటి–1. హైదరాబాదు:తెలుగు అకాడమి, 2016.

తిరుపతిరావు, బి. పోస్ట్ మోడర్నిజం. హైదరాబాదు: హైదరాబాదు బుక్ ట్రస్ట్,1999.

మృణాలిని.సి., ఆనందన్.కె., చెన్నకేశవరెడ్డి.జి. (నిర్వాహక సంపాదకులు), లక్ష్మణ చక్రవర్తి (సం.పా.).తెలుగు సాహిత్య విమర్శ దర్శనం (విజ్ఞాన సర్వస్వం, పదకొండవ సంపుటం). హైదరాబాద్: కొమర్రాజు వేంకట లక్ష్మణరావు విజ్ఞాన సర్వస్వ కేంద్రం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2016.

వీరభద్రరావు, కొత్తపల్లి., రాఘవాచార్యులు.డి.వి.కె., వీరభద్రశాస్త్రి, ముదిగొండ, (సంపాదకులు.).విశ్వసాహితి (విజ్ఞాన సర్వస్వం, ఐదవ సంపుటం). హైదరాబాద్: కొమర్రాజు వేంకట లక్ష్మణరావు విజ్ఞాన సర్వస్వ కేంద్రం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 1994.

వెంకటేశ్వరరావు, దార్ల. పునర్మూల్యాంకనం. హైదరాబాదు: సొసైటి అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు, 2011.

మంజుశ్రీ, ఎం.దళిత కవిత్వం, కథల్లో ప్రపంచీకరణ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం: పిహెచ్.డి.సిద్ధాంత గ్రంథం, 2014.

Ramana Kanakasabha. Post-Colonial Socio-Cultural Reflections in Telugu Literature. http://waset.org/publications/10291/post-colonial-socio-cultural-reflections-in-telugu-literature

Robertson, Roland., Scholte, Jan Aarte, (Ed.) Encyclopedia of Globalization (1-4 Volumes), New York: Routledge, 2007.

ఎరుకల భాష – వారణాసి శర్మ

–డా.వి.ఎమ్.సుబ్రహ్మణ్య శర్మ

1. ఉపోద్ఘాతం

పూర్వకాలంలో కేవలం అడవి ప్రాంతానికే పరిమితమైన ఇటీవలి కాలంలో జనసామాన్యంలో భాగంగా మారిన గిరిజన తెగనుతెలుగు వారు 'ఎరుక, ఎరుకలు' అని పిలుస్తారు. ఎరుకలను మహారాష్ట్రలో 'కైకడీలు', మధ్యప్రదేశ్‌లో 'కర్రు', 'పాండిచ్చేరి'లో 'నిద్దనార్', కర్ణాటకలో 'కొరమరాలు', తమిళనాడులో 'కొరవ, కొరచ' అని పిలుస్తారు. (కుర్రు మాసపత్రిక, 2006, 3). తెలుగు ప్రాంతాల్లో మాత్రం ఎరుకల, ఎలుకల, కొరచ, కుర్రు అనే పేర్లు వ్యవహారంలో ఉన్నాయి. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అన్ని జిల్లాలో ఉన్నారు.

ద్రవిడియన్ ఎటిమలాజికల్ డిక్షనరీ (డి.ఈ.డి 314; 29)లో తెలుగుపదంగా 'ఎఱుక' కనిపిస్తుంది. 'ఎఱుక' అనే పదానికి "to know? understand, perceive, ascertain" అనేవి క్రియాపరమైన అర్థాలు. 'ఎఱుక'కు నామవాచకంగా జ్ఞానం (knowledge) అనిఅర్థం.'ఎఱుక' పదానికి భావిశుభాశుభాలను తెలియజెప్పేవారు (fortune tellers), దేశద్రిమ్మరి (gypsy) అనే అర్థాలు కూడా కనిపిస్తున్నాయి.

జ్ఞానం కలవారు అనే అర్థంలో వారి ఆధ్యాత్మిక ప్రవృత్తి, విజ్ఞత కనిపిస్తుంది. భవిష్యత్తు చెప్పేవారు, సోదరికిచెప్పేవారు అనడంలో తమకున్న తెలివితేటలను వాస్తవిక జీవితంలో ఎలా ఉయోగించుకుంటున్నారో తెలుస్తుంది. ద్రిమ్మరి అనే అర్థంలో త్రిప్పట జీవన విధానం కలవారుగా తెలుస్తుంది.

2. ఎరుకల భాష మండలికమా?

గ్రియర్సన్ (1906) లాంటి ప్రాచీన పరిశోధకుల ప్రకారం "ఎరుకలను భాషగా కొన్ని సార్లు పరిగణించినప్పటికి..... ఎరుకలభాష తమిళ మాండలికాలలో తేడాను ఇతర ద్రావిడ భాషలతో సామ్యాన్ని కలిగి ఉంది. అయినప్పటికీ ఎరుకల భాష స్వరూపం మొత్తం కూడా తమిళ భాషా స్వరూపాన్ని కలిగి ఉంది." అని అభిప్రాయపడ్డారు.

జి.శ్రీనివాసశర్మ (1978) గారు "ఎరుకల భాషను ప్రత్యేకమైన భాషగా కాక తమిళ మాండలికంగా" నిర్ధారించారు. ఎరుకల భాషలో తెలుగు పదాలు ఎక్కువగా ఉన్నాయనే అభిప్రాయాన్ని కూడా వారు తెలిపారు. వారే తమ "ఏ కంపారటివ్ స్టడీ ఆఫ్ ఎరుకల అండ్ తమిళ్" అనే వ్యాసంలో ఎరుకలనుతమిళ మాండలికంగా పరిగణించాల్సిన అవసరం లేదని ఆధారాలతో నిరూపించాడు. అంటే ఎరుకలొక ప్రత్యేకమైన భాషగానే పేర్కొన్నాడు.

వి.ఎం.సుబ్రహ్మణ్య శర్మ (2007) గారి అభిప్రాయం ప్రకారం తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఎరుకలు, తెలుగు, ఎరుకల భాషలు మాట్లాడుతారు. వీరికి తమిళ భాషా వ్యవహర్తకు

మధ్యలో "పరస్పర అర్థావగాహనాక్షమత" (mutual intelligibility) లేని కారణంగా ఎరుకలను ప్రత్యేకమైన భాషగా పరిగణించాల్సి వస్తుంది అని ఆ భాషా వ్యవహర్తల అభిప్రాయం ప్రకారం కూడా ఎరుకల ప్రత్యేకమైన భాషని అభిప్రాయపడ్డారు.

3. ఎరుకల – మాండలిక భేదాలు:

తెలంగాణ రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఎరుకలు ఉన్నప్పటికీ వారి భాషలో తేడాలు ప్రాంతాన్ని బట్టి కనిపిస్తాయి.

వరంగల్	మహబూబ్‌నగర్	
dya:mo	duvvam	'దయ్యం'
garri	gellu	'బంగారం'
ka:rva:y	ka:vurgo	'కాకి'

ఒకప్పుడు ఎన్నో ఉపకులాలున్న ఎరుకల్లో ఇప్పుడు ఎరుకల మరియు కుంచెరుకల అనే రెండు ముఖ్యమైన రకాల మాత్రమే కనిపిస్తాయి. వారి పదజాలంలో కూడా తేడాలు కనిపిస్తాయి. ఈ భేదాల్ని బట్ట ఎరుకల్లో వరగ లేక వృత్తి మాండలికాలు ఉన్నట్టుగా తెలుస్తుంది.

ఎరుకలు	కుంచెరుకలు	
nosal(u)	necci	"నుదురు"
cevi	soyyi	"చెవి"
keyyi	kiyyi	"చెయ్యి"
no:ntu/no:man	na:na:si	"ఉప్పు"
kegam	kego	"మెడ"
neram	nerro	"నరం"

4. ఎరుకల భాష – వర్ణాలు:

ఎరుకల భాషలో ఇరవై ఏడు వర్ణాలున్నాయి అందులో పదిహేడు హల్లులు, పది అచ్చులు.

హల్లులు

అచ్చులు

P(ప) b(బ) t(త) d(ద) T(ట) D(డ) c(చ) j(జ) k(క) g(గ)

		(ఇ) i i: (ఈ)	(ఉ)u u:(ఊ)
	s(స)	(ఎ) e e: (ఏ)	(ఒ)o o:(ఓ)
	r(ర)	(అ)a a:(ఆ)	
m(మ)	n(న)		
w(వ)	l(ల)	y(య)	

ఛాంస్కి చేసిన అనేక ధ్వని విభజనల్లో ఒకటైన నిరుద్ధ (continuants), అనిరుద్ధ (non-continuants) విభజన ఎరుకల హల్లుల విషయంలో స్పష్టంగా వర్తిస్తుంది. ఎందుకంటే ఈ

హల్లులలో ఒక్క నిరుద్ధ వర్ణాలలోనే నాద (voiced), శ్వాస (voice less) భేదకత్వం, ఉన్న అన్ని స్థానాల్లో కనిపిస్తుంది.

అనిరుద్ధ వర్ణాల్లో మాత్రం ఉష్మశ్వాసం తప్ప మిగిలినవన్నీ కేవలం నాదాలే. వాటికి మనస్థాన ప్రయత్నాలైన శ్వాసాలు కనిపించవు. అయితే ఊష్మ శ్వాసమైన "స" అనే వర్ణమే తప్ప, దానికి నాద ప్రతిబింబము (voiced counterpart) వర్ణముగా లేదు.

నిరుద్ధ స్పర్శాల ఉత్పత్తి స్థానాలు వరుసగా ఉభయోష్ఠ, దంతమూల, మూర్ధ, తాలు, కంఠాలు. ప్రతిస్థానంలోనూ శ్వాస, నాద భేదకత్వంతో వర్ణయుగ్మాలు కనపడతాయి. చ, జలు స్పర్శలే కాక స్పర్శోష్మాలు కూడా.

అనునాసికల్లో ఉత్పన్నమైన ఉభయోష్ఠ దంతమూల మ, న అనునాసికాలు మాత్రమే ఈ భాషలో వర్ణాలు, కాంపితమైన 'ర', పార్శ్వికమైన 'ల' రెండూ వర్ణాలు. అంతస్థలైన 'వ', 'య'లు కూడా వర్ణాలే.

మహాప్రాణ ధ్వనులు ఎరుకలలో కనిపించవు. ఆదానపదాల్లోని మహాప్రాణ ధ్వనులు మహాప్రాణత్వాన్ని కోల్పోతాయి. ఉదా: ధోతి – దోతి.

ఈ భాషలో కంఠమూలీయ ధ్వని 'హ' లేనందున అదానపదాల్లో 'హ' అనే ధ్వని 'గ'గా మారుతుంది. padihe:nu >padige:nu.

ద్రావిడ భాషాలక్షణంగా చెప్పబడే 'ఴ', 'ళ'లు ఈ భాషలో వర్ణాలుగా కనిపించవు. ఇది ఈ భాష యొక్క ముఖ్య లక్షణం.

ఎరుకల భాషలో ఉన్న అన్ని హల్లువర్ణాలు పదాదిలో వస్తాయి. పదమధ్యలో కూడా వస్తాయి. కాని పదాంతంలో మాత్రం బ,త,ద,చ,జ హల్లువర్ణాలు రావు. ఇవి కాక మిగిలిన హల్లులు పదాంతంలో వచ్చినప్పటికీ వాటికి అచ్చు ధ్వని జోడించి పలకడం జరుగుతుంది. అయితే అచ్చుధ్వని పాక్షికమైన ఉచ్చారణ కలిగి ఉంటుంది. ఆ అచ్చు ధ్వని లేకుండా కూడా వారి వ్యవహారంలో కనిపిస్తుంది.

ఉదా: ma:D / ma:D(u) "ఎద్దు" ku:p/ ku:p(u) "కొడవలి"

ఇది ఎరుకల భాషకు తెలుగు భాషా ప్రభావం వల్ల వచ్చిందని తెలుస్తుంది. ఇలా చేరిన అచ్చుతో అంతమయే పదాలే కాక ఎరుకలలో అవే అచ్చులు సహజంగానే అంతంలో గల పదాలు కూడా ఉన్నాయి.

ఉదా: botku "సొమ్ము" nalladu "మంచిది"

ఎరుకల భాషలో అచ్చు వర్ణాలు మొత్తంపది. అందులో ఐదు హ్రస్వాలు ఐదు దీర్ఘాలు. పైన పేర్కొన్న అచ్చులలో ప్రతి జతలో హ్రస్వ, దీర్ఘాలకు భేదకత్వం ఉంది. కాబట్టి దీర్ఘం ఈ భాషలో వర్ణస్థాయిని కలిగి ఉంది. ఎరుకల అచ్చులన్ని పదాదిలోనూ, పదమధ్యంలోనూ వస్తాయి.

పదాంతంలో ఈ హ్రస్వాచ్చులన్నీ వస్తాయి. దీర్ఘాచ్చుల్లో ఒక 'ఆ' మాత్రమే పదాంతంలో కనిపిస్తుంది. నిర్దేశక సర్వనామాలైన "ఆ", "ఈ", "ఏ"లు ఏకాక్షరాలు అయినందువల్ల పదాలు దీర్ఘాచ్చులతో అంతమౌతాయని గనక భావించి, ఈ మూడు పై సూత్రానికి అపవాదాలు.

5. సంయుక్త ధ్వనులు:

ఎరుకల భాషలో హల్లులో ద్విసంయుక్త, త్రినంయుక్త హల్లులున్నాయి. పదాదిన కేవలం ద్వినంయుక్త హల్లులే వస్తాయి తప్ప త్రిసంయుక్త హల్లులు రావు. పదాదిలో ద్విసంయుక్త హల్లులు కూడా చాలా తక్కువగా ఉన్నాయి.

పదమధ్యలో కూడా ద్విసంయుక్త, త్రిసంయుక్త హల్లులున్నాయి. వీటిలో కూడా ద్విసంయుక్త హల్లులే ఎక్కువగా కనపడతాయి. పదాంతంలో సంయుక్త ధ్వనులు ఉండవు. ద్విత్వ హల్లులున్నాయి కానీ అవి పదాదిన రావు. పద మధ్యలోనే వస్తాయి.

పదాది సంయుక్త హల్లులు:

పదాది సంయుక్త హల్లులు కేవలం రెండు మాత్రమే ఉన్నాయి. అవి –

ky- kya:da "గాడిద" dy- dya:mo "దయ్యం"

అంటే ద్విసంయుక్త హల్లుల్లో మొదటి హల్లు స్పర్శం గాను రెండవ హక్కుల ఖచ్చితంగా తాలవ్య అంతస్థ మాత్రమే వస్తుంది.

పదమధ్య ద్విసంయుక్త హల్లులు:

పదమధ్య సంయుక్త హల్లుల్లో మొదటి హల్లు, రెండవ హల్లుగా అన్ని హల్లులూ వస్తాయి. పదమధ్య ద్విరుక్తాలుగా "న" వర్ణం తప్ప అన్నీ హల్లులూ వస్తాయి. పదమధ్య సంయుక్త హల్లుల్లో మొదటి హల్లు కనుక "బ" లేదా "వ" అయితే రెండవ హల్లు తప్పనిసరిగా "బ" లేదా "వ" నే అవుతుంది. మరే ఇతర హల్లులూ రావు. అంటే తప్పనిసరిగా "'బ' లేదా "వ"లు ద్విరుక్తంగానే వస్తాయి.

ఉదా: ko**bb**ari "కొబ్బరి" ke**vv**u"త్రొవ్వ"

పదమధ్యంలో ఆరు రకాలైన ద్విసంయుక్త హల్లుల అల్లిక ఉంటుంది.

1. మొదటి వర్ణం	రెండవ వర్ణం	2. మొదటి వర్ణం	రెండవవర్ణం
స్పర్శం	స్పర్శం	అనునాసికం	అనునాసికం
స్పర్శం	కంపితం	అనునాసికం	స్పర్శం
స్పర్శం	అనునాసికం/పార్శ్వం		
3. పార్శ్వం	పార్శ్వం	5. ఊష్మం	ఊష్మం
పార్శ్వం	స్పర్శం	ఊష్మం	స్పర్శం
పార్శ్వం	ఊష్మం		
4. అంతస్థం	అంతస్థం		
అంతస్థం	పార్శ్వం		

5. ఊష్మం	ఊష్మం
ఊష్మం	స్పర్శం

పదమధ్య త్రిసంయుక్త హల్లులు:

ఎరుకల భాషలో పదమధ్య త్రిసంయుక్త హల్లుల్లో మొదటి హల్లు అనునాసికం రెండవ హల్లు స్పర్శం మూడవ హల్లు కంపితం లేదా స్పర్శం లేదా పార్శ్వం కాని రావడం జరుగుతుంది. కేవలం ఈ రకమైన అల్లిక మాత్రమే ఉంటుంది.

ఉదా: ge**NDr**u "బావి" si**ngd**i 'ఇంద్రధనస్సు"

పైన చర్చించిన సంయుక్త హల్లుల అల్లిక తెలుగుతో సామ్యాన్ని కలిగి ఉంది.

6. ముగింపు:

తెలుగు, తమిళ, కన్నడ భాషల పదాల కలయికతో ప్రత్యేకమైన భాషగా ఉన్న ఎరుకల ఒక విలక్షణమైన భాష. తెలంగాణ తెలుగు భాషలో ఉన్న వర్ణాల్లో ఒక్క "ఙ" తప్ప మిగిలిన అచ్చులు హల్లులు అన్ని వర్ణాలు ఎరుకల్లో ఉండటం విశేషం. తెలుగు నుండి ఎరుకల భాష అజంత లక్షణాన్ని తీసుకోవడం తెలుగు ప్రభావాన్ని తెలియజేస్తుంది. ఎరుకలలో ఉర్దూ ప్రభావాన్ని సూచించే ప్రత్యయాలు, పదాలు కూడా ఉన్నాయి.

ఉదా: **isa**(<hissa (ఉర్దు) "భాగం"

paga**da:ru**(ఉర్దు) "శత్రువు

ఎరుకల్లో సంయుక్త హల్లులు వాటి అల్లిక చాలా వరకు తెలుగుతో సామ్యాన్ని కలిగి ఉ ండటం తెలుగుతో ఎరుకలకున్న సంబంధాన్ని తెలియజేస్తుంది. ఎరుకల భాష పదశాస్త్రం, వాక్యశాస్త్రం అధ్యయనం చేయడం ద్వారా చాలా విశేషాలు బయల్పడే అవకాశం ఉంది.

యునెస్కో నివేదికలో ఎరుకల భాష త్వరగా నశించేదిగా చెప్పబడింది. ఇటువంటి పరిస్థితుల్లో ఈ భాషపై పరిశోధన అత్యవసరంగా జరగాల్సి ఉంది.

ఉపయుక్త గ్రంథాలు:

1. గ్రీయర్సన్, జి.ఎ. 1906. లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా IV ముందా అండ్ ద్రవిడియన్ లాంగేవ్జెస్. కల్కత్త.
2. కృష్ణమూర్తి, బిహెచ్. 2003. ద్రవిడియన్ లాంగ్వేజెస్, కేంబ్రిడ్జ్: కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ ప్రెస్.
3. శ్రీనివాస వర్మ, జి. 1978. యొరుకలడైలెక్ట్. అన్నా మలైనగర్: అన్నామలై యూనివర్శిటీప్రెస్.
4. సుబ్రహ్మణ్యం, పి.ఎస్. 2006. ద్రావిడ భాషలు (చతుర్థ ముద్రణ). హైద్రాబాద్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
5. సుబ్రహ్మణ్యం వి. ఎమ్. 2007. ఎరుకల భాష–వర్ణనాత్మక అధ్యయనం (అముద్రిత ఎమ్.ఫిల్ గ్రంథం) హైద్రాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

కులాధారిత ఐతిహ్యాలు

– డా. డి.గాయత్రి

భిన్నత్వంలో ఏకత్వం అంటూ మనం ఎంత గొప్పలు చెప్పుకున్నా, ఎంత అత్యాధునిక యుగంలో మనం జీవిస్తూ ఉన్నా కూడా కులమత భేదాలు వర్గవైషమ్యాలు మాత్రం నేటికీ రూపుమాసిపోవడం లేదు. స్వచ్ఛమైన జానపదుల్లో అయినా శిష్ట జానపదుల్లో అయినా ఈ కుల/మత సంబంధ సంప్రదాయాలు, కట్టుబాట్లు అనేకం. మానవత్వంలో, మంచితనంలో ముందుండి కోపంలో కూడా పట్టువిడుపులు ప్రదర్శించే జానపదుల్లో వారి వారి కులాలకు/మతాలకు సంబంధించిన పంతాలు, పట్టింపులు, దాపరికాలు ఎక్కువ. అన్ని కులాల వారు అనాదిగా ఆచరించే సంప్రదాయాల్లో మంచితో పాటు చెడు ఉన్నట్టే, చెడుతో పాటు మంచీ ఉంది.

ఆయా కులాలకు చెందిన వ్యక్తులు గతంలో చేసిన మంచి/చెడు పనుల వల్ల నేటికీ జానపదులు వారికి తగిన గౌరవాన్నివ్వడమో, లేదా ఆయా కులాల వారు ఆయా గ్రామాలప్రజల నిరాదరణకు గురికావడమో జరుగుతోంది. ఆయా సందర్భాల్లో ఆయా కులస్థులు మాత్రమే అనాదిగా ఆచరించే ఆచారాలవల్ల, నమ్మకాలు లేదా మూఢనమ్మకాల వల్ల జరిగిన ఆయా సంఘటనలు నాటి నుండి నేటి వరకు జానపదుల్లో గద్యకథనాల రూపంలో ప్రచారంలో ఉన్నాయి. ఇలాంటి గద్యకథనాలన్నీ ఐతిహ్యాలే. ఐతిహ్యం అన్న పదాన్ని కథల కంటె చిన్న దానికి, గద్యరూపంలో ఉండే పరిమిత పాఠాంతరాల కథనానికి వాడుతున్నాం. నిర్దిష్ట స్థలం, వ్యక్తి లేక సంఘటనను గురించిన మౌఖిక సాంప్రదాయిక వివరణమే జానపద ఐతిహ్యమని నిర్వచించవచ్చు.[1]

ఆయా కులాల్ని/కులాలలోని వ్యక్తుల్ని ఆధారంగా చేసుకొని ప్రచారంలో ఉన్న ఐతిహ్యాలు ఎన్నో. ఇందులో భాగంగా గ్రామనామాలు ఏర్పడిన సందర్భాలు ఉన్నాయి. అదేవిధంగా కులంలోని వ్యక్తులు చేసిన మేలు/కీడును కలిగించే పనుల వల్ల కూడా గ్రామనామాలు, నమ్మకాలు పుట్టుకొచ్చిన దాఖలాలూ ఉన్నాయి. ఈ పరిశోధనా పత్రం కొరకు ఎంచుకున్న అంశాన్ని బట్టి రెండు భాగాలుగా విభజించడం జరిగింది.

1.1. కులాధారిత గ్రామనామాలు

1.2. కులాధారిత నమ్మకాలు

1.1. కులాధారిత గ్రామనామాలు : కులాన్ని / అందులోని వ్యక్తుల్ని ఆధారంగా చేసుకుని ఏర్పడిన గ్రామనామాల్లో ముందుగా చెప్పుకోవాల్సిన గ్రామం సఖ్యతకు మారు పేరైన 'కులుమాల'. గోనెగండ్ల మండలంలోని ఈ గ్రామం పూర్వనామం 'పూలమాల'. ఎన్ని సమస్యలు తలెత్తినా గ్రామస్థులందరూ ఐకమత్యంగా మాల (దండ)లోని పూవులుగా ఒదిగిపోయి ఉండాలన్నది వారి తత్త్వం. అందుకే ఒకప్పుడు ఈగ్రామాన్ని 'పూలమాల'గా పిలిచేవారు. నేటికీ గ్రామంలోని వారి

మధ్య ఏవైనా సమస్యలు వస్తే కులమతాలకు, పార్టీలకు అతీతంగా కలిసిమెలిసి పరిష్కరించుకుంటారు. అన్ని కులాల వారు కలిసిమెలసి సఖ్యతగా జీవిస్తుండడంతోఈ గ్రామానికి కాలక్రమంలో 'కులమాల'గా పేరొచ్చింది. ఈ పేరే కాలక్రమేణా 'కులుమాల' అనే పేరుగా స్థిరపడిపోయింది.

పత్తికొండ మండల కేంద్రానికి 8 కి.మీ.ల దూరంలో ఉన్న 'దూదేకొండ' గ్రామనామం వెనుక కూడా దూదేకుల కులానికి చెందిన వ్యక్తుల దానగుణం కనిపిస్తుంది.

'దూదేకొండ' గ్రామాన్ని ఒకప్పుడు 'పోతుపాళెం'గా 'దుర్గమ్మకొండ'గా కూడా పిలిచేవారు. సమీపంలో మండగిరిని పరిపాలించిన విజయనగర రాజుల వంశీయులకు చెందిన ఆనెగొంది రాజులు దుర్గమ్మ కొండను ఏలుబడిలోకి తెచ్చుకున్నట్లు సమాచారం. దుర్గామాత కొలువైన ఈ గ్రామమే అలనాడు 'దుర్గమ్మ కొండ'గా పిలువబడి కాలక్రమంలో 'దూదేకొండ'గా మారింది.

ఓసారి దుర్గమ్మ కొండ గ్రామంలో మహమ్మారిలా ప్లేగు వ్యాధి విరుచుకుపడి వందలాదిమందిని పొట్టనబెట్టుకుంది. దాంతో భీతిల్లిన జనం భయంతో ఇతరగ్రామాలకు వలస వెళ్ళిపోయారు. గ్రామం దాదాపు కనుమరుగైపోతున్న దశలో గ్రామంలోని దూదేకుల కులానికి చెందిన చక్రప్ప, బుడ్డకాశన్న అనేవారు ఉన్న ఊరికి, ఇళ్ళు కట్టుకోవడానికితమ ఐదెకరాల పొలాన్ని దానంగా ఇచ్చారు. దీంతో కొండ క్రిందకు వచ్చి పలువురు ఇళ్ళు నిర్మించుకున్నారు. దూదేకుల కులానికి చెందినవారి సౌజన్యంతో ఊరు మళ్ళీ ఊపిరిపోసుకోవడంతో 'దూదేకులకొండ'గా రానురాను ఇదే 'దూదేకొండ'గా మారింది. అప్పటి వరకు ఉన్న 'దుర్గమ్మకొండ' పేరు కాలక్రమంలో కనుమరుగైంది.[2] ఈ విధంగా 'దూదేకొండ' గ్రామానికి పేరు ఏర్పడటంవెనుక దూదేకుల కులస్థుల దయార్ద్ర హృదయం, ఔదార్యం కనిపిస్తుంది.

1.2. కులాధారిత నమ్మకాలు: ఇందులో ఆయా కులస్థుల వారు గతంలో చేసిన మంచి/చెడు పనులు, జానపదులు వారికిచ్చిన స్థానం, గౌరవం, నమ్మకాలు మొదలైన విషయాలు తెలుస్తాయి.

'తుగ్గలి' మండలంలో వర్షం కోసం చెన్నకేశవస్వామి దేవాలయంలో తొమ్మిది రోజులు భజనచేస్తారు. అనంతరం లింగబలిజ కులస్థులు మాత్రమే మహానందికి వెళ్ళి కోనేరులోని నీటిని బిందెల్లో తీసుకుని కాలినడకన మోసుకువస్తారు. ఈ నీటితో తుగ్గలి నుంచి ఒక మైలు దూరంలో ఉన్న శివాలయంలోని శివలింగానికి అభిషేకం చేస్తారు. అయితే లింగబలిజ కులస్థులు మాత్రమే నీటిని మోసుకురావాలన్న ఆచారం ఉంది ఈ గ్రామంలో. అలా అయితేనే (15 రోజుల్లోపు) వర్షం కురుస్తుందన్న నమ్మకం ఉంది ఈ గ్రామస్థుల్లో.

డోన్ మండలంలోని జలదుర్గం గ్రామానికి 3 కి.మీ.ల దూరంలో 'గొల్లపల్లిబుగ్గ' అనే ప్రాంతం 100 సం॥లకు పూర్వం ఒక గ్రామంగా వెలుగొందుతుండేది. మునుల ఆగ్రహానికి గురై శాపవశాన గ్రామం నాశనమైందని చెబుతున్నారు గ్రామస్థులు. ఇక్కడ నివసించే గొల్లభామలు మునులకు తగిన గౌరవం ఇవ్వని కారణంగా మునులు కోపించి గొల్లభామలు నివసించే ప్రాంతం

నాశనం కావాలని శాపం పెట్టారట. దాంతో క్రమంగా ఈ గ్రామం అంతరించిపోయిందని అంటారు. గొల్లపల్లి బుగ్గ శివాలయం పక్కన ఉన్న కోనేరులోని నీళ్ళు 'సర్వరోగ నివారణి'గా పనిచేస్తాయని నమ్మకం.

అయితే ఇక్కడ ఒక మూఢనమ్మకం కనిపిస్తుంది. గొల్లపల్లి బుగ్గ నుండి కొండపైకి ఒక కిలోమీటరు దూరం కాలినడకన వెళితే వీరభద్రస్వామి విగ్రహం ఉంది. విగ్రహానికి దగ్గరలో ఒక బావి ఉంది. బావిలోని నీళ్ళు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా మెరుస్తూ ఉంటాయి. కాని బావిలోని నీటిని దళితులు ఉపయోగిస్తే మాత్రం ఆకుపచ్చరంగులోకి మారి తాగడానికి పనికి రాకుండా పోతాయని, మళ్ళీ తిరిగి ఉదయానికంతా నీళ్ళు పరిశుభ్రంగా ఉంటాయని, ఇందుకు కారణం ఈ బావిలో నాగకన్యలు స్నానం చేయడమేనని ఇక్కడి జానపదులు నమ్ముతారు.

ఇక బనగానపల్లె మండలం నుండి 9 కి.మీ.ల దూరంలో ఉన్న 'నందవరం' గ్రామంలో వెలిసిన చౌడేశ్వరి మాత విషయానికొస్తే, ఇక్కడి నందవరీక బ్రాహ్మణులు అమ్మవారికి బలులివ్వనందుకు, వారు గ్రామ పొలిమేరల్లో ఉంటే జీవనోపాధి కష్టం అవుతుందని అమ్మవారు శాపం పెట్టారట. ఈ శాప కారణంగానే ఈ గ్రామంలో ఉన్న బ్రాహ్మణులు కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారని ఇక్కడ జానపదులు విశ్వసిస్తున్నారు.

అంతేకాకుండా ప్రతిరోజు తొగటవీర క్షత్రియుల ఇంటికి అమ్మవారు చిన్నపిల్లలా వచ్చి వారింట్లోని పిల్లలతో ఆడుకుని, ఆట మధ్యలో వారి పిల్లను కొట్టి పారిపోయేదట. ఇది గమనించిన ఇంటి యజమాని నేతవేసే బర్రెతో కొట్టాడు. అందుకే అమ్మవారు గ్రామంలో తొటవీర క్షత్రియులుంటే వారి వంశంవృద్ధికాదని శాపం పెట్టిందట. ప్రస్తుతంగ్రామంలో ఉన్న తొగటవీర క్షత్రియులకు వంశం వృద్ధి కావడంలేదని జానపదులు చెబుతున్నారు.

ఇక అవధూతల విషయానికొస్తే గోనెగండ్ల మండలంలో కొలువైన శ్రీ చింతలాముని నల్లారెడ్డి స్వామి తన 12వ ఏట దేశసంచారం కోసం బయలుదేరి రాంపురం గ్రామంలో కల్లుపెంట రాగా గౌడులను కల్లు అడిగాడు. వారు ఇవ్వడానికి తిరస్కరించారు. అపుడు స్వామి తన మహిమతో ఆ కల్లు తిత్తులన్నింటిని ఖాళీ చేయించినాడు. గౌడులు స్వామి పాదాలపై పడి వేడుకున్నారు. స్వామి మహిమవల్ల తిరిగి మళ్ళీ కల్లు తిత్తులన్ని నిండిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు మాలదాసరులు ఏ కల్లు పెంటకు వెళ్ళి కల్లు ఇవ్వమని అడిగినా ఉచితంగా ఇచ్చే ఆచారం గోనెగండ్లలో నేటికీ కొనసాగుతూనే ఉంది.

కోడుమూరు మండలంలో ప్యాలకుర్తి గ్రామం ఉంది. ఈ గ్రామంలో బోయకుల వారు రాత్రి పూట నిద్రిస్తే తల పగిలి చచ్చిపోతారన్న నమ్మకం ఉంది. దాదాపు ఐదువేల కుటుంబాలతో పదకొండువేల మంది జీవిస్తున్న ఈ గ్రామంలో బోయ కులస్థులు మినహా అన్ని మతాల, కులాల వారు ఉన్నారు. ఈ నమ్మకానికి ఒక శాపసంబంధమైన కథ ప్రచారంలో ఉంది. ఈ కథనే గ్రామస్థులు పలురకాలుగా చెప్తారు.

పూర్వం ఇక్కడ నివసిస్తున్న బోయ కులస్థులు బ్రాహ్మణ కుటుంబానికి చెందిన నిండు గర్భిణిపై అత్యాచారానికి పాల్పడ్డారు. దీంతో కోపించిన మునులు బోయ కులస్థులు ప్యాలకుర్తి గ్రామంలో నివాసం ఉంటే తలి పగిలి చస్తారని శాపం పెట్టి ఆ కులం వారినందరిని గ్రామం నుండి బహిష్కరించారు. మళ్లీ ఎప్పుడైనా ఆ కులం వారు గ్రామంలోకి వస్తే రక్తం కక్కుకొని చనిపోతాన్న శాపం కూడా ఉంది. అందుకే ఆనాటి నుండి ఈనాటి వరకు బోయ కులస్థులు ప్యాలకుర్తి గ్రామంలోకి ఏదైనా పనిమీద అడుగుపెట్టినా ఆ పని చూసుకొని వెంటనే వెళ్ళిపోతారే తప్ప గ్రామంలో నిద్రచేసేంత సాహసం చెయ్యరు.

మరొక కథనం ప్రకారం పూర్వం ఈ గ్రామంలో గొల్ల కులస్థులు, బోయ కులస్థులు కలిసే ఉండేవారట. అనంతరం బోయ కులస్థులు గొల్లలను మరియు ఇతర కులస్థులనందరిని ఏడు రోజులలో ఊచకోత కోశారు. ఆ సందర్భంలోనే ఒక గర్భవతిని చంపడానికి తరుముకురావడంతో రెడ్డి కులం వార మగ్గరకుచ్చరలో దాచి రక్షించారు. చీకటి పడిన తర్వాత ఆమె వంశీయులు సంబంధించిన డాలు కత్తిని ఇచ్చి ఆమెను పుట్టిల్లు అయిన గూటిపల్లికి పంపారు. ఆమె ఇచ్చిన శాపం కారణంగానే గ్రామంలో బోయకులస్థులు వశించడానికి భయపడుతున్నారు.

మరో కథనం ప్రకారం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్యాలకుర్తి గ్రామాన్ని విడిచివెళ్ళిన ఆ గర్భిణి స్త్రీ గూటుపల్లి గ్రామంలో గురునాథ్‌ని ప్రసవించింది. గురునాథ్ యుక్తవయస్సులో బొంగరాళ్ళ ఆటను ఆడుకొంటుండగా బొంగరం వెళ్ళి బ్రాహ్మణుల కుండకు తగలడంతో ఆ బ్రాహ్మణ కులస్థురాలు తండ్రిని చంపినా, ఊరు నుంచి తరిమేసినా నీకు కండ్లకావరం తగ్గలేదురా' అని దూషించింది. ఆ మాటలు విన్న గురునాథుడు వెంటనే ఇంటికి వెళ్ళి తల్లిని నిలదీశాడు. జరిగిన విషయాన్ని తెలుసుకున్నాడు. తిరిగి తన తల్లితో ఆ గ్రామంలో అడుగుపెట్టాడు. తన వంశీయులందించిన డాలు, కత్తితో గ్రామంలో బోయ కులస్థులందరిని ఐదు రోజులలో ఏకధాటిగా పోరాడి చంపేశాడు. గ్రామం చుట్టూ ఉన్న దారులలో బోయల తలలను వేలాడదీశాడు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో బోయకులస్థుల కారణంగా అశాంతి రేగింది, కాబట్టి బోయలు తలపెట్టి పడుకొంటే తల పగిలి చస్తారని గురునాథుని యొక్క తల్లి శపించింది. ఇందువల్లే నేటికి బోయలు ప్యాలకుర్తి గ్రామంలో నివసించడానికి, నిద్రించడానికి కూడా భయపడుతున్నారు.[3]

'గూడూరు' మండలంలో వడ్లోళ్లు, కంసలోళ్లు మాత్రమే కొలిచే గ్రామ దేవత అయిన "కాళమ్మ" దేవత, అర్ధరాత్రి సమయంలో గ్రామంలో సంచరిస్తూ, గ్రామాన్ని సంరక్షిస్తుందని నమ్మకం. ఊర్లో అనారోగ్య పరిస్థితులు నెలకొన్నప్పుడు అమ్మవారు మానవరూపంలో ఇచ్చి వారి బాధల్ని వింటుందట. ఆమె విన్న వెంటనే గ్రామంలో ఆ రోగాలన్నీ క్రమంగా నయమౌతాయని గ్రామస్థులు చెబుతున్నారు.

"బేతంచెర్ల" మండలంలోని "గోర్‌మాన్‌కొండ" గ్రామం నుంచి 11 కి.మి. దూరంలో, ఊరి బయట ఉన్న దిగుడు బావికి కూడా ఒక కులాధారిత ఐతిహ్యం ఉంది. చాలా సంవత్సరాల క్రితం వడ్డెలు ఈ బావిని ఎక్కువ ఖర్చుతో కాశీకట్టడంలో సగం వరకే నిర్మించి వదిలేశారు. చాలాకాలం తర్వాత ఆ ఊరి గ్రామ పెద్దలు బావి నిర్మాణం ఎలాగోలా పూర్తి చేయాలన్న ఉద్దేశ్యంతో తక్కువ ఖర్చుతో కట్టించారు. ఇందువల్ల బావి నిర్మాణం అందాన్ని కోల్పోయింది. ఇది అవమానంగా భావించి వడ్డెలు ఆగ్రహంతో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి బావిలోని నీళ్లు ఎండిపోవాలని శాపం పెట్టారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు ప్రతీ మూడు సంవత్సరాలకు ఒకసారి బావి ఎండిపోతూనే ఉంది. ఇందుకు కారణం వడ్డెలు పెట్టిన శాపమేనని గ్రామస్థుల నమ్మకం.[4]

ఏదేమైనప్పటికీ జానపదులకు కుల/మతపరమైన విషయాలలో ఉన్న విజ్ఞానం, విశ్వాసం మెండు. ఇందువల్ల మేలు కలిగిన సందర్భాలున్నాయి. కీడు కలిగిన సందర్భాలూ ఉన్నాయి. ఈ ఐతిహ్యాల వల్ల మనకు ఆయా కులాలవారికిఆయా గ్రామాల ప్రజలు చూపే విశ్వాసం, భక్తి, గౌరవం మొదలైన విషయాలు తెలుస్తాయి. ఇంకా (శాప సంబంధమైన) నమ్మకాలు, మూఢనమ్మకాలెన్నో తటస్థపడతాయి. అయితే ఈ ఐతిహ్యాలు కాలక్రమంలో మరుగునపడి అంతరించిపోతున్నాయి. కనుక క్షేత్రపర్యటన ద్వారా వీటినన్నింటినీ సేకరించి వీటి వెనుక దాగి ఉన్న చరిత్రను, ఆనాటి సామాజికాంశాల్ని, భవిష్యత్ తరాలకు అందించాల్సిన, ఆదర్శంగా తీసుకోవాల్సిన అంశాల్ని తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

పాదసూచికలు:

1. సుందరం ఆర్వీయస్ – ఆంధ్రుల జానపద విజ్ఞానం – పుట. 134.
2. ఈనాడు దినపత్రిక – జిల్లా సంచిక – నవంబర్ 16, 2010.
3. సూర్య – ద్వితీయ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక – పుట 85, 86.
4. గాయత్రి. డి – కర్నూలు జిల్లా జానపదుల నమ్మకాలు, శకునాలు.

ఉపయుక్త గ్రంథసూచి:

ముద్రిత గ్రంథాలు:

1. గాయత్రి. డి – జానపదుల నమ్మకాలు, శకునాలు – గాయత్రి పబ్లికేషన్స్ – కర్నూలు
3. మోహన్. జి. యస్. – జానపదుల నమ్మకాలు – శారదా ప్రింటర్స్, కమలానగర్, అనంతరం – ఆగష్టు 1983.
3. వెంకట్రామయ్య, వేములపల్లి – భారతదేశంలో కుల వ్యవస్థ భిన్న దృక్పథాలు – ప్రజాపంథా ప్రచురణలు, హైదరాబాదు – జనవరి 2003.
4. సుబ్బాచారి. పులికొండ – తెలుగు పురాణాలు ఆశ్రిత వ్యవస్థ – ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్ – హైదరాబాదు – మే 2000.

5. సుందరం. ఆర్వీయస్ – ఆంధ్రుల జానపద విజ్ఞానం – డైరెక్టర్, ప్రచురణల విభాగం, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, లలిత కళాక్షేత్రం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాదు – 500004 – 2004.

అముద్రిత గ్రంథాలు:

1. నాగేశ్వరరెడ్డి. రేనాటి – అనంతరంపురం జిల్లా జానపదుల నమ్మకాలు – 1990.
2. వీరాంజనేయులు. కె – తెలుగు సాహిత్యంలో మూఢనమ్మకాలు – 1984.

దినపత్రికలు:

1. ప్రజాశక్తి
2. వార్త
3. ఆంధ్రప్రభ
4. ఆంధ్రజ్యోతి
5. ఈనాడు
6. సాక్షి

15వ శతాబ్దినాటి తాళ్ళపాక పదకవులు – 21వ శతాబ్దిలో కొనసాగుతున్న కొత్త పరిశోధన

–ఆచార్య వేటూరి ఆనందమూర్తి

పరిశీలిస్తే కొంత వింతగానే తోస్తుంది గానీ, పదిహేనవ శతాబ్ది కాలానికి చెందిన తాళ్ళపాక వాగ్గేయకారుల పదకవితా రచనలను గూర్చిన అన్వేషణం ఇరవయ్యో శతాబ్దిలోనే ఆరంభం అయింది. ఆ అన్వేషణం యింకా ముగియకుండా ఇరవయ్యొక్కటో శతాబ్దిలోకీ చొచ్చుకుపోతూ ఉంది. ఆశ్చర్యం కాదూ!

ఎప్పుడో ఆరంభమైన మన ప్రాచీన తెనుగుభాషా వాఙ్మయ వికాసచరిత్రలో 15వ శతాబ్దికి చాలా ప్రాముఖ్యముంది. ఆ శతాబ్దిలోని వాఙ్మయ గౌరవ భారాన్నంతటినీ మోస్తూన్న రెండు ప్రధానమైన కవితాశాఖల్లో ఒకటి ప్రబంధ కవిత అయితే రెండోది మన పదకవిత. మొదటి ప్రబంధకవితా ప్రక్రియ మన ప్రాచీన కవితా సంప్రదాయానుసారియై ప్రధానంగా రాజస్థానాలలో వర్ధిల్లి, సహజ పరిణామ పరిణాహాలందుకొన్నట్టిది. ఇక రెండోదైన పదకవిత ఏటికి ఎదురీతగా సాగినట్టిది. మన పదకవితలు ఆనాటి పండితవర్గం వారి మెచ్చుకోలుకి నోచుకోలేదు. కేవలం జానపదుల వాగ్వ్యవహారంలోనే నలుగుతూ, పామరజనాకర్షణ మాత్రమే కలిగి ఉండి, ఉన్నత వర్గాల వారి తిరస్కారానికి గురి అవుతూ వచ్చింది. అలాంటి కాలఖండంలో పుట్టి, తిరస్కృతమైన అలాంటి పదరచనా ప్రక్రియనే చేపట్టిదానికిపరిశుద్ధిని కల్గించి, అసాధారణ రీతిలో పండితజనరంజకమైన ప్రామాణికతను ఆ పదరచనా ప్రక్రియకు కల్పించి, నాటి వాఙ్మయసీమలో మేరునగధీరుడై నిలవడంలోనే తాళ్ళపాక అన్నమాచార్యుల వారి ప్రతిభ కనిపిస్తుంది. భాషలో వ్యావహారిక నుడికారానికీ, వేదాంత భావనలో సరళ సుందరమైన తాత్త్వికాభివ్యక్తికీ, ప్రక్రియలో పదకవితారీతికీ పట్టంకట్టిన తెనుగుకవులలో నాటికీ నేటికీ అన్నమయ్యను మించినవారు లేరంటే అతిశయోక్తి కాదు. ప్రయోజనాత్మకమైన సాహిత్యభాషా పరిణతిలోనూ, పరమార్థాభిముఖమైన వస్తుపరిగ్రహణంలోనూ, కావ్యానుగుణమైన రసాత్మక భావనల అల్లికలోనూ, నవ్యములైన సృజనాత్మక రచనా ప్రక్రియల్లోనూ నూతనత్వాన్ని ప్రతిపాదిస్తూ, అప్పటి ప్రభు పండిత పామర వర్గాలనన్నిటినీ సమంగా రంజింపజేస్తూ, సాగించి వారికృషి. మరి అంతటి విలువైన వారి సాహిత్య సామగ్రిలో ఏ ఒకటి రెండు ద్విపద కావ్యాలలో తప్పించి, వారి తక్కిన రచనలన్నీ కొన్ని శతాబ్దాలపాటు స్మరణకు కూడా నోచుకోకుండా మూతపడిపోయాయంటే ఆశ్చర్యంకాదూ! వాటి ఆచూకీలు తెలియ వచ్చిన తర్వాత కూడా అవన్నీ తిన్నగా వెలువడడానికి మరో శతాబ్ది కాలం పట్టిందంటే అది మన భాషాసాహిత్యాలమీదా, మన సాంస్కృతిక వారసత్వ సంపద మీదా మనకున్న అశ్రద్ధకు ఉదాహరణం కాక మరేమిటి?

పదిహేనవ శతాబ్దినాడే ఆసేతుశీతాచలం ప్రసిద్ధి కెక్కినవారుగా గ్రంథస్థాధారాలనుబట్టి తెలియవస్తున్నా, ఆ తాళ్ళపాక కవివంశం వారిని గురించి మనం విస్పష్టంగా తెలుసుకొన్నది మాత్రం గత ఇరవయ్యో శతాబ్ది ఆరంభంలోనే.ఇలా ఇంచుమించు, నాలుగైదు వందలయేళ్ళపాటు, ఏకారణాలచేత నైతేనేమి, మరుగున పడి ఒక్కసారిగా భళ్ళున వెలుగులోకి వచ్చింది మాత్రం మన తాళ్ళపాకవారి పదసాహిత్యమే. నూతిలో పడ్డ సూదుల్లోన, తామ్రఫలకాలనో, గొళ్ళెపు గాలాలు వేసి వెదికి చేదుకోవలసినంత పని అవుతున్నది. అందుకు మనం సంతోషించాలి.

అసలు సక్రమమైన సాహిత్య పరిశోధనకు మన సాహిత్య దృక్పథమూ, దాని ప్రయోజనమూ, మూల్యమూ తెలియడమెంత ముఖ్యమో, సమగ్రమైన ఆకరాల సేకరణమూ, వాటి విశ్లేషణమూ, శోధనమూ అనేవి కూడా అంతే ముఖ్యము.

ఏటికియెదురీతగా సాగిన వాఙ్మయ కృషి తాళ్ళపాకవారిదీ అనుకొన్నాము కదా! అదీ ఏ ఒక్కరిదో కాదు. ఒకే కుటుంబానికి చెందిన పలువురు మేధావులైన కవిపుంగవులది. ఒక శతాబ్దం పాటు ఏకైకలక్ష్యంతో దీక్షగా కొనసాగించి సాధించుకొన్నట్టిది. అదీ నరపరంగా కాక దైవపరంగా అంకితమైనట్టిది. ఇన్ని కారణాల చేతనూ వారి వాఙ్మయంలోని ప్రత్యేకత చాలా విశిష్టమైనది. విడమరిచి చెప్పుకోవాలంటే, దేశీ తెనుగు భాషాసారస్వతంలో నాటి సమకాలాన్నికన్నా భిన్నంగా, వ్యావహారిక భాషా ప్రయోజనాన్ని గుర్తించి వాడుకలోకి తెచ్చింది వారే. అంతే కాదు సహజ తెనుగు నుడికారానికి సన్నిహితంగా, కావ్యకవితా భావనలోనూ పౌరాణికతకు లౌకికతను జోడించి, తమ రచనల ద్వారా సమసమాజస్థాపన కోసం వారు ప్రయత్నం చేశారు; ప్రక్రియాబాహుళ్యంలోనూ సమగ్రతను ప్రదర్శిస్తూ కొత్తపుంతలు తీశారు; నూతనమైన దివ్య గేయ సారస్వతానికి ఉన్నతిని కల్గిస్తూ, సంకీర్తనా పారిశుద్ధ్యాన్ని గావించి, లయాత్మక సంగీత సౌరభాన్నీ సమకూర్చారు. సమకాలం వారికి కూడా ఉత్తేజాన్ని కల్గించే విప్లవాత్మకమైన వైవిధ్యంతో కూడుకొన్నట్టిది వారి వాఙ్మయం. రాచరికపు గౌరవ ప్రాభవాల మోజులో పడి రాజస్థానాలలో రూపుదిద్దుకొంటున్న అలనాటి లౌకిక ప్రబంధ సాహిత్యోద్యమానికి దీటుగా, ఘాటుగా, ప్రతి స్పందిస్తూ, అందుకు భిన్నమైనరీతిలోనే, మడికట్టుకొన్నట్లుగా, దేవస్థానాలనే అంటి పట్టుకుని, కొత్త తరహా ప్రజా సాహిత్యోద్యమానికి రూపకల్పన చేసిన పదసాహిత్య సమ్రాట్టులు వారు.

తాళ్ళపాక కవులు జీవించిన తమ సమకాలంలోనే ఒక విధంగా అప్పటి ఆకరాల కూర్పు, సేకరణ, వాటి పరిరక్షణ కొంతవరకూ జరిగినా ఆ తరువాతి కాలంలో వాటిని గూర్చిన పరిశీలన, శోధన, పరిరక్షణ పద్ధతి ప్రకారం, అంత తిన్నగా కొనసాగినట్లు కానరాదు. అందుకు ఆనాటి సామాజిక రాజకీయ పరిస్థితులే ప్రధాన కారణాలు కావచ్చు కూడా. కారణాలేమైతే నేమి కొంతజాప్యం జరిగిన కారణంగానే, ఆధునిక యుగపురుషుడైన శ్రీ కందుకూరి వీరేశలింగంపంతులు గారి కవుల చరిత్ర పుటల్లో సైతం తాళ్ళపాకపద కవులను గూర్చిన ప్రస్తావన మొదట్లో బొత్తిగా లేకుండానే జారిపోయింది. అలాంటి దశలో, ఆ శతాబ్ది తొలి దశకంలోనే,

పరిశోధనాకాశంలోని అలాంటి కటిక చీకటి వేళలోనే, ప్రాచీన గ్రంథ పరిశోధనలోనూ, ఆకరాల శోధనలోనూ పండబారిన ప్రజ్ఞ గల కారణజన్ములు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారి వాఙ్మయ కృషి వల్ల ఆ తాళ్ళపాక అన్నమయ్య పేరు తొలిసారిగా మన విమర్శ వాఙ్మయ వీధుల్లో వినవచ్చింది. ఆ తర్వాతక్రమంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు సల్పిన శాసనశోధనవల్లనూ, తిరుమలలోని సంకీర్తన భాండాగారం నుండి వెలికితీసిన వారి సంకీర్తనలూ లఘుకృతులూ గల రాగిరేకుల్ని ముద్రించే ప్రారంభ ప్రయత్నం వల్లనూ, ఆ తరువాత ప్రధానంగా ప్రభాకర శాస్త్రి గారిప్రేరణవల్లనూ, తాళ్ళపాక పదకవుల చారిత్రక నేపథ్యం, వాఙ్మయస్వరూపం సనసన్నగా బహిర్గతం కావడం మొదలై, ఆ శతాబ్ది తొలి సగంలో అవసరమైన ప్రాథమిక కృషి జరిగింది. 1940 దశకంలో అప్పుడే కొత్తగా లభ్యమైన తాళ్ళపాక చిన్నన్న గారి ద్విపదకృతి 'అన్నమాచార్య చరిత్ర', మొదటిసారిగా ప్రభాకర గురుదేవుల పరిష్కరణలో గొప్ప పీఠికతో వెలువడింది. సంకీర్తన తామ్రపత్రాల ఉపలబ్ధి, పునఃపరిశీలన, విశ్లేషణ, పరిష్కరణ, ప్రకటన సుసాధ్యములై పరిశోధనలోనే ఒక నూతన చైతన్యం కలిగింది.

1950లో ప్రభాకరశాస్త్రి గారి నిర్యాణానంతరం వారి శిష్యుల, పండిత మిత్రుల పర్యవేక్షణలో తాళ్ళపాక సంకీర్తనల పరిష్కరణ ప్రచురణ మహా యజ్ఞం నిర్వాహం చెంది ఇరవయ్యో శతాబ్ది చివరికి ఆ కార్యం సుసంపన్నమైంది. వెనువెంటనే పరిశోధనావకాశాలూ, సందర్భాలు పెరిగినవి.

దానితో ఒక విధమైన తాళ్ళపాక పద కవుల వాఙ్మయ స్వరూప విస్ఫోటనం జరిగినట్లైంది. ఇదిఇలా ఉండగా 1949లోనే వెల్లడై, ఆ శతాబ్దిలోనే మొట్టమొదటిసారిగా వెలుగుచూసిన తాళ్ళపాకవారి 'ప్రథమోపలబ్ధ స్వరసహిత సంకీర్తన శిలాలేఖం' ఒకటి అస్మదాదుల కృషి వల్ల సుపరిష్కృతమై అచ్చుపడి, ఆ వాగ్గేయకారులను గూర్చిన పరిశోధనలోనిఅతి ముఖ్యమైన సంగీతపార్శ్వాన్ని కూడా చక్కగా ఆవిష్కరించింది. ఆ స్ఫూర్తితో సాగిన మా తరువాతి పరిశోధన యజ్ఞం కొనసాగింపులో, ఇంతవరకూ తిరుపతిలోని ఆకరాలలో దొరకని తాళ్లపాక వారిసస్వర సంగీత రచనలు – వారి గీతములు, ప్రబంధములు, ఠాయాలాపములు, సంకీర్తనములు మొదలైనవి ఒకటొకటిగా లభించసాగినవి. దీనితో ఈ ఇరవయ్యొకటో శతాబ్దిలో తాళ్ళపాక వారి సంగీత ప్రజ్ఞాపాటవానికి సంబంధించిన మరో విజ్ఞాన విస్ఫోటనం జరుగుతున్నట్లు అనిపిస్తున్నది. తాళ్ళపాకవారి స్వరసహితములై ఇలాంటి రచనలకు సంబంధించిన ఆకరాలు చెల్లాచెదురులై కొన్ని తంజావూరు సరస్వతీ మహలు లైబ్రరీలో దాగి ఉన్నవి. పోయినవి ఎట్లాగూపోయినవి. ఉన్న వాటినైనా సమగ్రంగా పరిశీలించి గుర్తించడం, రక్షించుకోవడం, పాడించి ఆడించి ప్రచారానికి తెచ్చుకోవడం, మన ప్రప్రథమ ప్రధాన కర్తవ్యంగా భావిస్తున్నాను.

ఇలాంటి అనంతర కాలపు నా అనుబంధ పరిశోధనాన్వేషణంలోనే మరికొన్ని సరికొత్త విషయాలు కూడా వెలుగులోకి వచ్చినవి. అంతకు పూర్వం తిరుపతిలో లభించిన సంకీర్తన

రాగిరేకులనుబట్టి ప్రముఖంగా అన్నమయ్య, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య అనే ముగ్గురు పదకర్తలే మనకు తెలియవచ్చారు. ఆ ముగ్గురే కాక తాళ్ళపాక పదకర్తలు మరి కొందరు కూడా ఆ కుటుంబంలో, ఆ యుగంలో, ఉన్నారనీ, వారూ తమ తమ ప్రత్యేక ముద్రలతో పాటలు రాశారని ఇప్పుడు స్పష్టమవుతున్నది. మొదటి ముగ్గురు పదకర్తలూ పాటలు రాశారనీ, ప్రధానంగా వారివన్నీ వెంకటేశాంకితములని తెలిసినా, వారివారి ప్రత్యేకముద్రలేవిటో పరిశోధకులకు పూర్వం స్పష్టంగా తెలిసిన విషయం కాదు. నా పరిశీలనలో వెల్లడైన విషయం ఏమిటంటే అన్నమయ్య 'తిరువెంకట' ముద్రను అభిమానించాడనీ, 'అలమేలుమంగాసమేత శ్రీ వెంకట' ముద్ర ఉంటే అది పెదతిరులాచార్యులదనీ, 'శ్రీవెంకటనాథ' అనే ముద్రతో ఉంటే అది చినతిరుమలయ్యదనీ తెలియవచ్చింది. ఈ దృష్టి కలిగిన తర్వాత 'తాళ్ళపాక సంకీర్తనలు' అనే పేరుతో ఆ దేవబయకారుల యింటి వ్రాత ప్రతిలోనే అముద్రిత 'శ్రీకృష్ణ–ముద్రాంకితపదాలు' కొన్ని కానరావడం వల్లనూ, 'విట్ఠల' ముద్రతో ఉన్న తాళ్ళపాకవారి మరో అపూర్వమైనతెలుగు సూడ ప్రబంధ మొకటి శాసన శిల్ప సాక్ష్యాధారాలసంవాదంతోటి బయటపడడం వల్లనూ, ఆ దేవబయకారుల ముద్రలకు సంబంధించిన విభిన్న భేదాల్లోని అభేద దృష్టి కూడా వ్యక్తమైంది. అంతకుపూర్వం వారి మూలమంత్రంగా భావిస్తుండిన 'వెంకట' అనుబంధం ఉండినా లేకున్నా కూడా, 'శ్రీకృష్ణ' ముద్రతోనే పాటలు రాసిన చిన్నన్నయే ఆ కుటుంబంలోని నాలుగో పదకర్త అనే భావం బలపడింది. ఈ భావనకు వేటూరి ప్రభావకరశాస్త్రి గారి పరిశీలనలో వెంకటముద్ర లేని సుప్రసిద్ధమైన అన్నమయ్య గారి 'జో అచ్యుతానంద జోజో ముకుందా' అనే జోలపాట 'మంగళము –తిరుపట్ల మదనగోపాల' అనే ముద్రాంకము కలిగి ఉండడమూ, అందులో వెంకటముద్ర లేకపోవడము; తాళ్ళపాక చిన్నయ్యను పదకర్తగా సుబ్బరామదీక్షితుల వారు పేర్కొనడమూ, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారు ఆ చిన్నయ్యనే ద్విపదకవి చిన్నన్ననుగా భావించడమూ కూడా సహాయకారులు అయినవి. అంతేకాదు, ఆ దేవబయకారుల పద రచనల్లో వెంకటనామానికీ, విష్ణునామానికే పర్యాయ నామాలు కాదగిన ముద్రాసామ్యం ఏర్పడినట్లైంది. ఇట్లా నిరంతర పరిణామ శీలంతో అవిచ్ఛిన్నంగా సాగుతున్న పరిశోధనాన్వేషణంలోనూ కొత్తకొత్త సత్యాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. అన్నమయ్య, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య, చిన్నన్నలు నలుగురితో పాటు ఇటీవలనే ఆ కుటుంబంలోని నాటి ఐదవ పదకర్తగా మరో పేరు కూడా 'ముద్దునరసింహ' ముద్రతో ముందుకువచ్చి, రెండు సంకీర్తనలు కూడా వెలుగుచూశాయి. అతడే అన్నమయ్య పెద్దకుమారుడైన నరసింగన్న. "పాడ జెప్పగ వర్ణపద్ధతి నీడు–జోడులేడని సభజొచ్చి వాదించి, పరగిన ధీశాలిప్రతివాది దైత్య–నరసింహుడన గల్గెనరసింహగురుడు'' అనిపించుకున్నవాడు ఆ నరసింగన్న. పెదతిరుమలచార్యులకు 'తిరుమలగురుడు' అనే బిరుదు ఉన్నట్లే అతని అన్నగారైన నరసింగన్నకూ 'నృసింహ గురుడు' అనే బిరుదునామం ఉంది. స్వామి నామమూ, స్వనామమూ కలిసివచ్చేట్లుగా "(ముద్దు) నరసింహముద్ర''తో అతనివి ఇప్పటి వరకూ రెండు కొత్తపాటలు దొరికాయి. వాటిని ఇటీవలనే సోషల్ మీడియాలోనూ పరిచయం చేశాను.

'తిరుమలగురు'డైన పెదతిరుమలాచార్యుల సంగీత ప్రబంధరచనలు 1998లో మొదటిసారిగా లభించిన పిమ్మట 'నృసింహగురుడు'గా ప్రసిద్ధుడైన, ఆ నరసింహగురుని రచనలకై అన్వేషిస్తుండగా, ఇటీవల తంజావూరు వ్రాతప్రతుల (2015) లోనే "ముద్దు నరసింహముద్ర" తోగల ఈ క్రింది సొగసైన 'దశావతారలాలి పాట' ఒకటి, స్తోత్రరూపాన గలది, గోచరించింది. సుప్రసిద్ధమైన "జోవచ్యుతానంద" అనే జోలపాటను గురుదేవులు ప్రభాకరశాస్త్రి గారు ఉద్ధరించి ప్రకటించిన తర్వాత, "లాలనుచు నూచేరులలన లిరుగడల" అనే మరో లాలిపాటను కూడా తంజావూరి పుస్తకశాల నుండి తాళ్ళపాక వారి రచనగా శాస్త్రిగారే గుర్తించి అన్నమాచార్య చరిత్ర పీఠికలో ఉద్ధరించి చూపారు. (చూ. అ.చ.పీ పుట. 62-63). అది బాగా ప్రచారానికి కూడా నోచుకొంది. ఆ స్ఫూర్తితోనే ఇప్పుడీ దశావతార లాలి పాటను కూడా తాళ్ళపాక వారి కొత్తపాటగా గుర్తించి ప్రకటిస్తున్నాను. ఈపరిశోధన రవీంద్రనాథ్ ఠాకూర్ రీసెర్చ్ ఫెలోషిప్ ఇస్తున్న ప్రోత్సాహ ఫలితమే. ఈ పాటలోని 'ముద్దునరసింహ' సంబోధన పరమైన యే సమకాలిక వ్యక్తికో సంబంధించినది కాదని చెప్పవచ్చు. ఇది దైవపరమైన ముద్రయే! ఇందులో స్వామి నామాంకంతో పాటు "నృసింహగురుడు"గా ప్రసిద్ధుడైన తాళ్ళపాక నరసింగన్న వాగ్గేయకారుని (దేవబయకారుని) ముద్ర కూడా చేరి ఉందని భావిస్తున్నాను. వీరి సంగీత రచనలు మరికొన్ని ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్నవి. తంజావూరు పుస్తకశాలలోనే లభిస్తున్న గుమ్మ కాంబోది - అటతాళ రచన మరొకటి "ముద్దు నరసింహరాయా! నా వయసున గూడి నాదువలపు దీర్చనే" అనే పాట కూడా ఈ కోవకు చెందిందే! తంజావూరు సరస్వతీమహలు వ్రాతప్రతులలో గోచరించిన ప్రాచీనమైన ఈ 'లాలి' పాటనూ, అందులోని సుందరమైన ఈ 'దశావతార స్తోత్రాన్నీ' తాళ్ళపాక వారి రచనలుగానే నేనిప్పుడు గుర్తిస్తున్నాను. ఇవేవీ తిరుపతి రాగిరేకుల్లో మనకిపుడు కానరావు. అసలివన్నీ రాగిరేకుల కెక్కినవో లేదో, ఎక్కినవైనా అన్నీ దొరికినవో లేదో కూడా మనకిపుడు తెలియదు. తాళ్ళపాక చిన్నన్న రచన 'అష్టమహిషీకల్యాణం'లో, సంగీతచర్చా సందర్భంలో, నారదాదులుపాడిన 'బలసోదరుని మీదిపదమును గూర్చిన ప్రస్తావన ఉన్నది. తాళ్ళపాకవారి 'ముద్దుగారే యశోదముంగిటిముత్యము', 8-142లోని "ముద్దు గోవిందుని" మొదలైన ప్రయోగాలను పోలినదే ఈలాలి పాట చివరలో నృసింహస్వామిని పదకారుడు పేర్కొన్న "ముద్దునరసింహము" ప్రయోగము కూడా అని భావిస్తున్నాను. ఈ పాట కిందులో రాగతాళములు పేర్కొనబడలేదు. ఈ వ్రాతప్రతులలోనే 'ముద్దు నరసింహరాయ' సంబోధనముగల మరొకపాట కూడా రాగం గుమ్మ కాంబోది - అటతాళములో ఉన్నది. ఇలాంటివాటినన్నీ తుదముట్ట పరిశీలిస్తే, మరికొన్ని కొత్త విషయాలు బయలుపడ గలవని నా నమ్మకం!

మచ్చుకి ఈ రెండు పాటలూ చూడండి...

స్తోత్రం:-

ఉదధిలో మత్స్యమై యదయించినావు - వెదకి కనుగొని దెచ్చి వేదములు నీవు
ముదముతోడనె చతుర్ముఖుదున్నతావు - కదిసియిచ్చిన దేవ గాచి మము బ్రోవు//
మంధరముచే జలధి మధియించగాను - పొందుగా జగదీశ పుడమి క్రిందటను
అందముగ కూర్మమై యాధారముగను - వుందుగా ధరణికిని వుపకారిగాను//
వరహావతారమై ధరనవతరించి - విరసుడు హిరణ్యాక్షు వీరుని వధించి
కరుణచే హితజనుల గాచి రక్షించి - సరసుడై వెలసిన స్వామిని దలంచి//
పలు విధములను సురలపాలింప దలచి - బలు గంభమున రేయు బగల నుదయించి
ఖలుని రాక్షస హిరణ్యకశిపుని వధించి - నిలచి నరసింహుడై నెగడితివి మించి//
బలి యాగ సమయమున పాద త్రయమును - కొలిచి వేదగ నియ్య నిల నదిమి తాను
గెలిచి వామనమూర్తి గంభీరముగను - బలు నణంచినయట్టి బలవంతునకును//
బటువైన పరశువున ప్రభలుతేరగను - పటుతరం బయిన తన బాహుబలమునను
కుటిల రిపురాజులను గొట్టి మీరుచును - దిటవైన భృగురాముడే వీరు డిలను//
గరిమతో కౌసల్య గర్భమున బుట్టె - సురలు బొగడగ జనక సుతను చేట్టి
అరి రావణాదులను హతముగా గొట్టి - ధర వెలయురఘురామ దశరథునిపట్టి//
బలు హలాయుధముచే బట్టుకొన్నాడు - చెలువ శ్రీకృష్ణునకు చేకొనిన తోడు
లలన రేవతి యనే రమణికిని విభుడు - బలభద్ర రాముడును బాలుండె వీడు?//
నుతిపరుడవై కృష్ణ! క్షితి నవతరించి - అతి పరాక్రమముచే దితిజులను ద్రుంచి
అతి చక్కదనమైన - యతివల వరించి - ప్రతిలేని కీర్తిచే ప్రబలితివి మించి//
బలవంతులగు నీచ బహు రక్కసులను - కలికావతారమై ఖండింపగాను
వలగొనుచు దేవతలు వర్ణింపగాను - వెలసితివి భువిలోన విభవములతోను//
ముద్దు నరసింహ! మిము మొక్కి వేడుదుము - పద్దుగా సంపదల ప్రబలించు మమ్ము
వొద్దికల మా మనవి వొనర గైకొనుము - కద్దనినప్రహ్లదు కరుణించు విధము//
గుమ్మ కాంబోది - ఆటతాళం.
పల్లవి//
కోలు కోలో యన్న - కోలో కోలన్న - (కొలనీ దొంగల వేడి - కో లన్నా) //
పోవన్న వనమూలోన - కన్నియలతో రాగ -వెన్నుడు నరసింహుడు - సన్నాజేసేనే//1//
కలికీరో రావే యని - కన్నుల కింపైన, మంచి - చిలుక పన్నే చీర - చేతి కందించేనె//2//
బటువు ముత్తెపు దండ - పైడి చే కడియాలు- కఠిన మౌ వజ్రాల - కమ్మ లిచ్చేనే //3//
వగవగలా సొమ్ములు- వలసీన వరహాలు - బిగువైన రవికెలు - బ్రీతి నిచ్చేనే//4//
మొగలీ రేకులు (మేలు) - మొల్ల సరులూ చాల-వగ మీరా జడ నిండా - వాడు జుట్టేనే//5//

వెలదీరో పాయని – వింతాగా మృగ మద – తిలకాము కొనగోట – దిద్దేనే చెలియా//6//
మచ్చికతొ నా మేన – పచ్చి కస్తురి బూసి – పచ్చకప్పుర బాగలు – పణతీ యిచ్చేనే//7//
నయమూ మీరిన ముద్దు – నరసింహ రాయడు నా వయసూన గూడి నా–వలపూ దీర్చేనే//8//

ఈ పాట 'ముద్దునారసింహరాయ' ముద్రగల చెంచులక్ష్మీ చెంచుపడతుల కోలాటపు పాట! తంజావూరి వ్రాత ప్రతులలో ఈముద్రతో ఇప్పటికి లభించిన కొత్త పాటలలో యిది రెండవ పాట. రచనా శైలిని బట్టి యిది తాళ్ళపాక వారిదిగాను, ముద్రను బట్టి నృసింహగురుడైన నరసింగన్న రచనగాను గుర్తిస్తున్నాను.

తెలంగాణలో బౌద్ధం

–డా॥ సంగనభట్ల నరసయ్య

జాతిపరంగా, దేశపరంగా వాడిన ఆంధ్ర శబ్దం మొట్టమొదట తెలంగాణకే చెల్లుతుంది. ఈ అంశాన్ని వాయు మొదలైన పురాణాలేకాక బౌద్ధవాఙ్మయం నిరూపించింది. అంతేకాదు బౌద్ధం ఆచరించిన తొలి నేలగా ఈ ప్రాంతాల చరిత్రను బౌద్ధ సాహిత్యమే తొలుత తెల్పింది. దాంతో తెలంగాణ చరిత్ర క్రీ.పూ. 2600 సం॥ నుండే ఉనికిలో ఉందన్న అంశం నిర్ధారితమైంది. ఇది బౌద్ధం వల్ల తెలంగాణకు కలిగిన లాభం.

"సుత్తనిపాత" (పారాయణ వర్గ) ఈ ప్రాంతాన్ని "అంధక రట్ట"గా పేర్కొంది. అస్సక, ములక రాజ్యాలు ప్రధానంగా నాటి షోడశ జానపదాల్లో పేర్కోబడ్డాయి. అస్సక దేశరాజధాని బోధన్ నిజామాబాద్ జిల్లా. ఈ అస్సక దేశంలో ములక విషయంలోని (కరీంనగర్) ప్రాంతాన్ని గూర్చి కూడా ఈ గ్రంథం తెలిపింది. పరమార్థ జ్యోతికా వ్యాఖ్యానం కరీంనగర్ జిల్లాలోని నేటి బాదనకుర్తి ద్వీపాన్ని కవిటవన ద్వీపంగా గోదావరి మధ్యస్థమైన దాన్ని గూర్చి తెలిపింది. నాటి బావరి అనే బుద్ధుని సమకాలికుడైన బ్రాహ్మణుని గాథను గ్రంథస్తం చేసింది సుత్తనిపాత. ఈతని 16 గురు శిష్యులు. ఈయన ఆజ్ఞతో బుద్ధుని కలిసినారు. వీరిలో పింగియ మాత్రం తిరిగి తెలంగాణకు వచ్చినాడు. వీరి ప్రయాణ మార్గం ఉత్తర తెలంగాణ నుండి శ్రావస్తి వరకు పేర్కొనబడింది. నాటి చారిత్రకుల వ్యాపారపథానికిది దగ్గరగా ఉంది. ఈ పింగియ తెలుగువాడే. నాడు నామాల చివర వుండే అయ్య, అన్న పదాలు చారిత్రకాధారలతో లభించాయి. తిస్సమెత్తయ్య సుత్తనిపాతలో పేర్కొనబడ్డవాడు. కప్పదు మరొకడు. వీడి పేరిట కప్పరాయపేట నేటికీ కోటిలింగాల ప్రక్కన ఉంది. బుద్ధుని సన్నిహితుడైన పాయసి రాకుమారుని పేరిట పాయసిగా కప్పరాయపేట ప్రక్కనే కరీంనగర్ జిల్లాలోని కోటిలింగాల ప్రక్కగల మరో గ్రామం. మూడు బౌద్ధ స్థూపాలున్న గ్రామం పాశిగాం.

అంధకులు బౌద్ధానికి చేసిన సేవలో వారు నిర్మించిన అంధకవనాలు. అవి మహావగ్గలో పేర్కొనబడిన శ్రావస్తిలో 'అంధవనం, రాజగృహలో అంధకవింద అనేవి. బౌద్ధానికి వ్యాఖ్యాన ప్రాయాలైన గ్రంథాలు అంధక భాషలో (తెలుగులో) వచ్చాయి. అప్పటికీ అంధక భాష ద్రావిడం నుండి విడివిడి, ప్రాకృతమిశ్రంగా వాడుకలోగల తెలుగే. శాతవాహనుల శాసనాల్లో, సాహిత్యంలో ఈ ప్రాంతపు గ్రామ నామాలలో తెలుగు భాష ఉంది. సెరివణిజ్జ జాతనం తెలివాహనది ఒడ్డునగల ఆంధ్ర నగరాన్ని పేర్కొంది. తెలివాహ గోదావరి నది. దీని ఒడ్డునగల నగరం ఆంధ్రుల తొలిరాజధాని కోటి నగరం (నేటి కోటిలింగాల). ఇక్కడ శాతవాహనుల పూర్వరాజులైన గోబద, సమగోప, నరన వంటి ఆంధ్రరాజుల నాణేలు దొరికాయి.

ఈ పింగియ ఈ ప్రాంతంలో తొలుత బుద్ధుని దర్శించినవాడు. ఇతడు బౌద్ధం తాను రచించి, తన గురువును బావరిని బౌద్ధంవైపు తిప్పి, తరువాత ఈ ప్రాంతాన్ని (ఉత్తర తెలంగాణను) బుద్ధ ధర్మానికి అంకితం చేసినాడు. ఈతని పేరిట నిజామాబాద్‌కు 150 కి.మీ. దూరంలో పింగళి అనే గ్రామం ఏర్పడింది. ఇది తరువాత అనేక తెలుగు కుటుంబాల గ్రామనామమైంది. ఇది ఈ ప్రాంతపు తొలి బౌద్ధ క్షేత్రం. దీన్ని హ్యూయన్‌త్సాంగ్ దర్శించి ... అని రాస్తే బి.యస్.యల్.హనుమంతరావు వంటి వారు వేంగి అని భ్రమపడినారు. ఇది పింగళి. నేడిది పర్భణి తాలూకాలోనికి (మహారాష్ట్ర) పోయింది.

దండకారణ్యంలోని గోదావరి తీర భూములు అరణ్య జీవనులైన అంధకుల నివాసస్థానం. నేటికీ అదిలాబాద్ జిల్లాలో 'అంధకులు' అనే తెగ వారున్నారు. తెలంగాణ జనగణనలో వీరు 20వేలకుపైగా ఉన్నారు. ఐతరేయ బ్రాహ్మణం విశ్వామిత్రుడు శపించిన కాలం నుండి వీరిక్కడ నివాసంలో ఉన్నారని భావించాలి. వీరిది అనార్యజాతి. అందుకే హిందూ ధర్మానికి ముందే బాగా ప్రచారాంలోకి వచ్చిన బౌద్ధన్ని వీరు బుద్ధునిబోధనల నుండే స్వంతంచేసుకున్నారు. వీరి ఆహ్వానంతో బౌద్ధం తొలుత ఈ మధ్య గోదారి తీరంలో వేళ్ళూనింది. తైర్థికుల వల్ల రాజపథా లేర్పడి మరి 4 శతాబ్దాలలో ఈ ప్రాంతపు ఉక్కు పరిశ్రమ వల్ల వ్యాపారపథాలేర్పడి విదేశీయులనాకర్షించింది.

ఈ ప్రాంతాలనేలిన ఆంధ్ర రాజులు బౌద్ధాన్ని ఆచరించి ప్రచారం చేసారనడానికి కోటి లింగాల రాజకుమారుడు పాయసి సాక్ష్యం. పాయసిగాంలోని నాలుగు బౌద్ధ స్థూపాలు సాక్ష్యం. ఇవి తెలుగునాట అతి ప్రాచీన స్థూపాలు. వీటిలో అలంకారాలు ఏమీలేవు. స్థూపాలు కూడా చిన్నవే. ఒక్క కోటిలింగాల స్థూపం మాత్రం పెద్దది. బుద్ధుని సూక్తులు శిలా ఫలకాలుగా ఉన్న ఏకైక బౌద్ధక్షేత్రం కోటిలింగాల. క్రీ.పూ. 6వ శ. నుండే ఇది రాజధాని నగరంగా విలసిల్లింది. శాతవాహనుల్లో తొలి రాజన్యుల కాలాన అనగా వారు రాజ్యాధికారంలో భాగస్వాములైన కాలాన (ఆంధ్ర భృత్యులుగా ఉన్నకాలాన) వీరి సైనిక కేంద్రాలుగా భావించాల్సిన కొండాపూర్, పెద్దబంకూరు, ధూళికట్ట, పింగళి, ప్రతిష్ఠానాల వంటివి, తరువాత వారి కుటుంబ వర్గాలకు రాజధానులుగా విలసిల్లినవి. ఈ ప్రాంతపు మట్టి కోటలు వీటికి సాక్ష్యాలు. ఇవి గ్రీకు మెగస్థనీస్ పేర్కొన్నవే.

చిముకుని తమ్ముడు కృష్ణుడు ఏలేనాటికి తిరిగి వైదిక ధర్మం ఆచరణలోచి వచ్చింది. బహుశ ఈ కాలానికి బౌద్ధం ఇతర ప్రాంతాల్లో కృష్ణా, విశాఖ తీరాల్లోకి వెళ్లి, ఉచ్ఛస్థితిలోకి పోయింది. తెలంగాణ బౌద్ధం (క్రీ.పూ.6వ శ నుండి (బుద్ధుని నుండి) క్రీ. పూ. 2వ శతాబ్ది వరకే ప్రాభవంలో ఉందని భావించాలి.

ఈ ప్రాంతాల్లో బౌద్ధం ఇంత వైభవంలోకి రావడం వెనుక మరొక ప్రధానాంశం ఉంది. బుద్ధుడు స్వయంగా తెలంగాణకు వచ్చినాడు. ఈయన రాకను, 'అంతొలా'కు వచ్చి ధర్మబోధ చేసినాడని యువాన్ ఛాంగ్ పేర్కొన్నాడు. ఈ విషయంగా బుద్ధుడు స్వయంగా ఆనందునితో

చెప్పిన ప్రయాణ వివరాలను నేను ఓ వ్యాసంలో తెలిపాను. 'అంతొలా' అంత (ఆంధ్ర) ప్రాంతం ఇదే. ఇది తొలుత ఆంధ్రప్రాంతమే కదా! బుద్ధుడు 'గంగదాటి కోటి గ్రామానికి వెళ్లాం' అని చెప్పినాడు. తిరుగు ప్రయాణంలో గంగ దాటుతుంటే ఇక్కడి ప్రజలు మీరు వచ్చిన గుర్తుగా ఈ నదికి గౌతమి అని, మీరు దాటే తీరానికి గౌతమి ద్వారమని పేరు పెట్టుకుంటామంటే బుద్ధుడు సరేనన్నాడు.

బుద్ధుడు ధాన్యకటకానికి వచ్చాడని ఆంధ్రప్రాంతపు చారిత్రకులు రాసిన వారిది ఊహే. ఏ ఒక్క ఆధారం చూపలేదు. మూడవ ధర్మచక్ర ప్రవర్తనకు వచ్చినాడని రాసినారు. రెండో ధర్మచక్ర ప్రవర్తనలకు వచ్చాడని రాసే అవకాశం లేనేలేదు. (తొలుత కాశీ దగ్గరి సారనాథ్‌లో నన్నది అందరూ అంగీకరించేది రెండవది రాజగృహ అనే స్థలంలో జరుగగా బుద్ధుడు ఉన్నాడా అనేది కూడా సందేహించే అంశమే).

గంగ ఒడ్డున ప్రాచీన కోటి గ్రామం ఎక్కడా లేదు. గోదావరికి గంగ అని పేరు. బుద్ధుని తిరుగుప్రయాణంలో దానికి తీరప్రాంతీయులు 'గౌతమి' అని పేరు పెట్టుకున్నారు. గౌతమి అన్నది గోదావరి పేరే. కోటి గ్రామం నేడు శైవం కారణంగా కోటిలింగాల. పైగా రాజధాని నగరం. ఈ రాజ్యపు రాజకుమారుడు లేదా రాజు పాయసిబుద్ధుని ప్రత్యక్ష శిష్యుడు.బౌద్ధాభిమాని. ఇవన్నీ దీనికి సాక్ష్యాలు.

తెలివాహ నదిని కృష్ణానదిగా గుర్తించేందుకు కొందరు చారిత్రకులు ప్రయత్నించారు. తెలి తెల్లనిది, కృష్ణ నల్లనిది. చాలా స్పష్టంగా పేర్లు చెప్తుండగా తెలివాహ కృష్ణానది ఎలా అవుతుంది? ఈ బుద్ధుని రాకవల్ల ఈ తెల్లనిది గోదావరి ప్రశస్తమై, జాతక కథలలో సెరివణిజ జాతక కథగా పేరు పొందింది. అది బౌద్ధులలో, బౌద్ధ వాఙ్మయంలో ప్రసిద్ధి పొందింది కనుకనే జాతక కథగా నిర్మించబడింది. ఈ కథలో కూడా బుద్ధుడు 'ఆంధ్ర నగరం'కు వచ్చినట్లు రాయబడింది.

అశోకుడు ఆంధ్రలో బౌద్ధం ఆచరణలో ఉందని తెలిపినాడు. 13వ అశోకుని శిలాశాసనం, ధాన్యకటకలోని అశోక స్తంభఖండ శాసనం తెలిపినదీ విషయం. ఆయనకు 2 వందల సంవత్సరాలముందే బౌద్ధం తెలంగాణలో ఆచరణలో ఉంది. 'బతికిబట్టకట్టి, జనజీవనాన్ని పరిమార్చింది అశోకుని రాకతోనే' అన్న ఆంధ్రా ప్రాంతపు బౌద్ధుల వాదన కూడా తప్పే. తెలంగాణలోని తొలిదశ బౌద్ధం 6 వందలేండ్లది, మలిదశ అభివృద్ధి క్రీస్తు శకారంభం నుండి మరో 5 వందల ఏండ్లు కృష్ణా తీరం. మిగతా ప్రాంతాలకు విస్తరించింది. ఐదు శతాబ్దుల అధిక కాలగమనంలో తెలంగాణ స్థూపాలు, బౌద్ధ నిర్మాణాలు శిథిలమైపోయినాయి.

ధూళికట్ట:

ధూళికట్ట కరీంనగర్ జిల్లాలోని హుసేన్‌మియా వాగు ఒడ్డున బౌద్ధ స్థూపంఉంది. తెలంగాణలో ఇది ప్రాచీన బౌద్ధ స్థూపమే కాక అతి పెద్దది కూడా.

ఈ స్థూపానికి అడ్డంగా ఉన్న వాగుకు దక్షిణ ఒడ్డున తవ్వకాలలో ప్రాచీన నగరం బయటపడింది. ఇక్కడ కోట ఆనవాళ్ళు ఉన్నాయి. భూమిలో తవ్వినప్పుడు ఒక కోట లేదా రాజమందిర ముఖద్వారం, నివాసగృహాలు, బావులు నీటి పారుదల వ్యవస్థ ఇటుక నిర్మాణాలుగా భూమిలో తవ్వకాలు బయటపడ్డాయి. ధూళికట్టును ప్రాచీనంగా ధూళికోట (మట్టికోట) అనివ్యవహరించేవారని చారిత్రకులు ఊహాత్మక నిర్ణయం చేసినారు. ఈ స్థూపానికి సంబంధించిన తవ్వకాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురావస్తు శాఖ 1972–75 మధ్య చేపట్టింది. గోళాకృతిలోని ఒక స్థూపం కింద స్థూపాకృతి, ఆయకాలు, ప్రదక్షిణాపథం బయటపడింది. స్థూపానికి అద్దిన శిల్పాలు దొరికాయి. వాటిలో నాగముచిలింద శిల్పం, బోధివృక్షం, బుద్ధ పాదాలు, ఉపాసకుల శిల్పాలు బయటపడ్డాయి. ఈ రెండు నాగముచిలింద శిల్పాల్లో ఒకటి నేటి ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతికి నాడు క్రీ.శ. 2006లో జరగిన బుద్ధ ఉత్సవాల్లో ప్రదర్శన నిమిత్తం తరలించబడింది. అది ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వానికి తిరిగి రావాల్సి ఉంది.

శిలాఫలకాల్లో కొన్నింటిపై బ్రాహ్మీలిపిలో శాసనాలు ఉన్నాయి. అవి క్రీ.శ. 1వ శతాబ్ది లిపులుగా గుర్తించవచ్చు.

ఈ తవ్వకాలో శివశ్రీ పులుమావి పేరిటగల నాణెములు, రోమన్ రాజుల నాణెములు, మట్టి బొమ్మలు, గాజుపూజలు, గాజులు, పేర్లు చెక్కిన దంతపు ముద్రలు (సీల్స్), మాతృదేవతారాధనా సూచకంగా ఇత్తడి తల్లీకూతుళ్ళ బొమ్మ లభించాయి.

ఈ శిలాఫలకాల శిల్పములలో అమరావతి శైలి, బార్హూత్ స్థూపంలోకల శృంగుల శైలి ఉన్నాయని విజ్ఞులు స్థిరపరిచినారు. లభించిన శిల ఫలకాల సంఖ్య 47. అన్నీ శిల్పశోభితాలే.

విహారగదులలో పెంకులు దొరకడం వల్ల ఇవి కప్పుకు వాడినట్లుగా ఊహించారు. అయితే వీటి పూర్తి ఆనవాళ్లు లభించలేదు. విహారంలో రెండు భాగాలుగా 48+48 = 96 గదులున్నాయి. ఉద్దేశిక స్థూపాలు, చైత్రాలయం బయల్పడ్డాయి. కాంస్యంతో చేయబడిన మాతాశిశువుల ప్రతిమ లభించింది. తల్లి పేరు హారతి. శిశువు పేరు పింగళ. ఇలాంటి విగ్రహం లభించడం అపురూపం.

నాగుల, యక్షుల ప్రతిమలు లభించాయి. ఈ ప్రతిమల పూజను మట్టి ఈ ప్రాంతాల ఆర్యేతర సంస్కృతీ నిలయాలని భావించవచ్చు. ఐతే హాలుని గాథాసప్తశతి 'శివస్తుతి'తో ప్రారంభం కావడం వల్ల క్రీ.శ. 1వ శ.కి ఆర్య సంస్కృతి ఈ ప్రాంతాల్లో విస్తరించిందని, అంతకు పూర్వం క్రీ.పూ. 2వ శ. నాటికి ఇది అనార్య సంస్కృతి కేంద్రంగానే భావించాలి.

ఇక్కడ దొరికిన స్థూప ఫలకాలపైన ఉన్న రాత, ఆయక స్తంభాలపైన గల రాత బ్రాహ్మీ లిపికి చెందినది.

గహపతినో పతాలస మతూయదానం పితానంది పుతస।

అజాని సిరియాగం కామారియా హజ కథా సానం॥

అనే అక్షరాలున్నాయి. పతాల, నంది, హజకుడు మొదలైన దాతలు ఈ స్థూపాలకు దానాలు ఇచ్చినారు.

నిర్మాణాలు:

ఇక్కడ జరిగిన తవ్వకాలలో నివాసగృహాలు, రాజమందిరం బయటపడ్డాయి. 1.05×0.65 మీ. కొలతతో ఒకటి, 1.05×1.05 మీ.తో మరో గది అదనంగా మరో రెండు గదులు తవ్వకాల్లో బయటపడ్డాయి. అవి సామాను దాచే గదులు.

ఒక చతుశ్శాల భవనం గుర్తించబడింది. మధ్యలో ఆకాశం, నాలుగు పక్కల దీర్ఘ చతురస్రపు గదులున్నాయి. 9.35×4 మీ. హాలు కల్గి వుంది. నైరుతి దిశగా ఇటుక గోడలు గల ఒక బావి బయటపడింది. 70 సెం.మీ. వెడల్పు గల ఒక మురికినీటి కాలువ ఈ బావి పక్క నుండి బయటికి వెళ్తోంది.

బావికి కొంచెం ఉత్తరంగా రెండు ధాన్యాగారాలున్నాయి. 1.30×1.35×4.00 మీ. ఒకటి, 1.25×1.35×3.00 మీ. కొలతలు గలవి. పిరమిడ్ బోర్లించినట్లు, నేలవైపు చిన్నదిగా, పైకి వెళ్ళే కొద్ది విశాలంగా ఉన్నాయి. ఇవి ఇటుకతో నిర్మించినవి. ఈ నిర్మాణంవల్ల పై నుండి ఒక్కో పొర దిగుతూ మనిషి అడుగుకు చేరేలా నిచ్చెనలా ఉన్నాయి ఇవి. ఈ బావుల్లోంచి మట్టి తీసినపుడు బంగారి మధ్య రంధ్రపు బిళ్లలు, శాతవాహనుల పొటీను నాణెములు, జంతువుల ఎముకలు దొరికాయి. ఇదే పరిధిలో మరో ధాన్యాగారం 1.35×1.435×1.60 మీ. కొలతలు గలది తవ్వి తీసారు.

రాజభవనం పక్కనగల గదులనేల అంత 26×27×7 సె.మీ. కొలతలు గల ఇటుకలతోఅద్ది ఉంది.

ధూళికట్ట లఘుశాసనాల్లో, స్థూపానికి, విహారాలకు దానాలిచ్చిన వ్యక్తుల (దాతల) పేర్లున్నాయి. మాతృదేవత విగ్రహాలు మట్టితో మూస చేసినవి, ఇనుప మొలలు, ఉంగరాలమూట ఆభరణాలు దొరికినవి. నాణెములపై పాళీ, తెలుగు భాషల్లో బొమ్మాబొరుసులుగా వివరాలున్నాయి.

"గహపతిలో పతాస సమతూయదానమ్" వంటి అక్షరాలు చెక్కిన శిల్పాలున్నాయి. గహవతి అంటే గృహపతి (ఇంటి యజమాని) దానము ఇది.

రాజసభాగారానికి పక్కగల బావిలో మట్టి తీయగా లభించిన దంతపు ముద్రికపై రాతలున్నాయి. దీంట్లోనే బంగారు నాణెముల ముద్దలు, శాతవాహన పోటీన్‌లోనూ నాణెములు, జంతువుల ఎముకలు, ఎర్రమట్టి కుండ పెంకులు దొరికినాయి.

18 హెక్టార్ల స్థలంలో ఈ కోట ఉంది. భూమికి 6 మీ. ఎత్తులో కూలిపోయిన కోట చాపతో మట్టితో దిబ్బ ఏర్పడినట్టుంది. వానలకు కరిగిపోగా ప్రస్తుతం 3–5 మీ. ఎత్తుగా ఈ కోటగోడలు మట్టి ప్రాకారాల ఆనవాళ్లుగా 15 మీటర్ల పొడవుగా మిగలి ఉన్నాయి. గోడల చుట్టు కందకాలున్నాయి. దక్షిణం దిశగా కోట ద్వారం ఆనవాళ్లు దానికి కుడి ఎడమలుగా గదులు బహుశా భటుల కోసం నిర్వహించినవి కావచ్చు ఉన్నాయి. రక్షకుల కోసం కేటాయించిన ఈ గదులు 6.30×3 మీ.గా ఉన్నాయి. ఉత్తరంవైపు ప్రముఖుల ఇండ్ల ఆనవాళ్ళు, ధాన్యాగారాలు,

బావులు, ఇతర జనావాసాలు బయటపడ్డాయి. భవనాల అడుగులు, ప్రవేశ ద్వారాన్ని గుర్తుపట్టేలా వాటికి అమర్చిన ఇటుకమెట్లు బయటపడ్డాయి. 4.25 మీ. వెడల్పుప్రవేశ ద్వారాలివి.

కోటకు ఆవల ఉత్తరాన హుసేన్‌మియా వాగు ప్రవహిస్తోంది. వాగు దాటితే కోట స్థలానికి ఉత్తరంగా అతి పెద్దదైన బౌద్ధ స్థూపం ఉంది. ఇది మొత్తం శిథిలమైంది. స్థూపంగర్భం, ప్రదక్షిణా పథానికి (బహుశ) చుట్టు అద్దిన 47 శిలాఫలకాల్లో సున్నపురాయి/తెల్ల పాలరాయి చెక్కిన అనేక అపురూప శిల్పాలున్నాయి. వాటిలో నాగముచిలింద శిల్పం ప్రధానమైంది. వీటిపై లిపులు (లఘు శాసనాలు) ఉన్నాయి. బోధి వృక్షం, మహాభినిష్క్రమణ,బుద్ధపాదం, అనేక చిన్న గజ శిల్పాల ముక్కలు లభించాయి. చేతిలో పూలతో చెక్కిన స్త్రీమూర్తి, ఆమెకు చెవిపోగులు, కంఠాభరణాలు, వడ్డాణం,కంకణాలుమొదలైన ఆభరణాలున్నాయి. ఈ స్థూపం నిర్ఘనం పూర్తి ఐంది. రోడ్డు వేస్తే కరీంనగర్ నుండి నేరుగా వెళ్ళి దర్శించిరావచ్చు. హుసేన్‌మియా వాగుపై కల్వర్టు నిర్మించాలి. దీన్ని దర్శనీయ స్థలంగా అభివృద్ధి చేయాలి.

కోటిలింగాలు:

ఉత్తర తెలంగాణ ప్రాంతంలో అతి ప్రాచీనమైన నగరం ఈ కోటిలింగాలు. ఇది కరీంగనర్ జల్లాలో వెల్గటూరు మండలంలో గోదావరి తీరాన విలసిల్లింది. క్రీ.పూ. 3 శతాబ్దాల ముందు నుండే శాతవాహనులకు పూర్వం ఆంధ్ర రాజులకు, తరువాత శాతవాహనులకు రాజధానిగా ఉన్నది. శాతవాహనులు, వారికి ముందటి ఆంధ్రరాజులు బౌద్ధాన్ని ప్రోత్సహించడం అనే ఈ ప్రాంతపు బౌద్ధాచరణ చరిత్రనుబట్టి నిర్ధారించవచ్చు. ఈ ప్రాంతం బుద్ధుని సమకాలికంగా బౌద్ధం ఆచరించిన ప్రజలు నివసించిన నేల.

తొలి శాతవాహన ప్రభువు చిముకునివి, తత్పూర్వ రాజులు సిరికంపయ, గోబద, నరన వంటి ప్రభువులవి, మాహాతలవర, మామా సేనాపతిస వంటి అధికారుల నామాంకిత నాణెములు, వివిధ స్థాయిల్లో అనేకంగా లభించాయి. 1978 నుండి ప్రారంభించి 5 సంవత్సరాలు, నాణెములు, కోట ఆనవాళ్ళు, బౌద్ధస్థూపం ఆనవాళ్ళు, బావులు, పారిశుద్ధ్యపు కాలువలు, ఇటుకల నిర్మాణంతో లభించాయి. 27 శిలాఫలకాలు లఘుశాసనాలతో లభించాయి.

రెండో దఫా తవ్వకాలలో బౌద్ధస్థూపం బయల్పడింది. అది గజ పుష్పాకారంలో ఉంది. నిధుల కొరత కారణంగా ఈ స్థలం తవ్వకాలు పనులు మధ్యలో మానివేసి తవ్విన మేరకు తిరిగి మట్టితో కప్పి, ఆంధ్రప్రదేశ్ ఆర్కియాలజీ శాఖ తిరుగుముఖం పట్టింది. ఇది ప్రపంచంలో ఏ ఆర్కియాలజీ వారు చేయని ఓ ఘనకార్యం. దీని ఫోటోలు లభిస్తున్నాయి.

తొలిదశ తవ్వకాలలో లభించిన శిలాఫలకాలు బ్రాహ్మీలిపి కంటే ప్రాచీనమనిపించే లిపిలో లఘు శాసనాలతో లభించాయి. ఇవి బౌద్ధస్థూపానికి అద్దిన రాళ్లు కావచ్చు. వీటిపై గల రాతలను బట్టి అవి బుద్ధధర్మ సూక్తులుగా భావించబడ్డాయి.

శెరవణిజ్జ జాతకం ప్రకారం తెలివాహనుడిని (గోదావరిని) దాటి ఆంధ్ర నగరానికి వచ్చిన వ్యాపారుల కథలోని ఆంధ్రనగరం ఇదేనని నేను నిరూపించాను.

ఈ కోటిలింగాల గ్రామం పశ్చిమ చాళుక్యుల కాలంలో శివాలయంగా మార్చబడిన బౌద్ధస్థూపం కలది. ఈ స్థూపం చుట్టూ ప్రదక్షిణను ఊహిస్తే అర్ధ పరిక్రమలో పక్కనే పారే గోదావరి మనోహరంగా దర్శనమిస్తుంది. లింగాల శబ్దం తరువాత వచ్చింది. మొదలీ గ్రామం పేరు కోటి. రాజ్యం పేరు కోటి. ఇది రాజ్యపు ఆదాయం బట్టి ఏర్పడిన నామం. హాలుడు గాథాసప్తశతిలో దీన్ని కోటి అని పేర్కొన్నాడు.

ఈ కోటి గ్రామానికి బుద్ధుడు వచ్చినాడు. తెలుగునాట బుద్ధుడు ధాన్యకటకం, లేదా అమరావతి కాలచక్ర ప్రవర్తనకు వచ్చినాడన్న ఊహలు చారిత్రకులు చేసినా అవి నిరాధారాలు. కాని ఇది ఆధారాలతో నేను నిరూపించాను. బుద్ధడే స్వయంగా ఆనందునితో గంగ దాటి కోటి గ్రామంకు వెళ్లాలని అన్న సంగతి, గ్రామంలో సభ ఐనాక తిరిగి గంగ దాటుతుండగా అక్కడి ప్రజలు ఈ నదికి (గోదావరికి) గౌతమి అని పేరు పెట్టుకుంటామన్న సంగతి సంత్తనిపాతలో రికార్డు ఐంది. వాటిని నేను నా వ్యాసంలో ఉదాహరించాను. బుద్ధుడు ఇక్కడికి రావడం వెనుక బుద్ధుని సహచరులైన పింగయ, పాయసి (కోటి లింగాల ఆంధ్రరాజు), లేదా బావరి కారణమయి ఉంటాయి. వీరు బుద్ధుని బోధనలు స్వయంగా విని బౌద్ధ ధర్మం ఆచరించిన ఈ (కరీంనగర్ గోదావరి తీర) ప్రాంతపు తొలి బౌద్ధులు.

ఈ కోటిలింగాలలో బుద్ధుని బోధనలు లిఖించబడిన 27 శాసన స్తంభాలు లభించినవి. అవి బ్రాహ్మీలిపి శాసనాలు. వాటిలో 9 అక్షరాలు బ్రాహ్మీ లిపిలో లేవు. అంటే అంతకుముందువి. దీన్ని పూర్వ బ్రాహ్మీలిపి అన్నాను. (భూమిపై ఎల్లప్పుడు కోరికలుంటాయి) "మాయూం చ సదా ఏచ్చ మయేన". ఈ శాసనాల భాష ప్రాకృతం. పుంఖేమ సదాదమ ఏచ్చయా ఏవుదశమకోద (డేగవలె ఎల్లప్పుడూ ధర్మాన్ని ఈ కోర్కెలు తగ్గిస్తాయి.) క్షమద ఏసదా యా పచ్చ క్లేస రసమా ఛిఛేరసి (ఇది నిజమైతే కోర్కెలను వివిధ దశలలో ఛేదించాంథ) వంటి వాక్యాలు ఈ శాసనాల్లో ఉన్నాయి. ఈ రాతి రాతలు బౌద్ధం స్థూపం చుట్టూరా అద్దిన శిలాఫలకాలవిగా నేను భావిస్తున్నాను.

ఈ స్థూపాన్ని పూర్తిగా తవ్వి తీసి, చుట్టూ నిర్మాణాలను తిరిగి పునర్నిర్మించి, ఫలకాలను తిరిగి స్థూపానికి అద్ది, స్థూపాన్ని తరిగి యథాతథ స్థితి తేవాలి. ఇది గనుక తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే యావద్భారతంలోనే ఒక గొప్ప బౌద్ధ పర్యాటన క్షేత్రాన్ని ఆవిష్కరించిన ఘనత దక్కుతుంది.

కోటిలింగాల, పాశిగాం, స్తంభంపల్లిలోని మొత్తం నాలుగు స్థూపాలు తెలుగునాట మొదటి స్థూపాలు. ఇవి హీనయానం కాలం చివరలో నిర్మాణం అయ్యాయి. క్రీ.పూ. 4వ శతాబ్దినాటివిగా గుర్తించవచ్చు. వీటిని ఒక్క అర కిలోమీటర్ పరిధిలోనివి గనుక వీటి చుట్టూరా పునఃనిర్మాణం, కంచె వేస్తే బాగుంటుంది. ఆలస్యంఐతే ఈ స్థూపాలు మాయం కావచ్చు.

ప్రస్తుతం ఈ గ్రామం ఎల్లపల్లి ప్రాజెక్టు కారణంగా ఎదురు తన్నిన నీటిలో (బ్యాక్ వాటర్) మునిగి ఉంది. దీనికి రక్షణగా గోడకట్ట ఈ గ్రామాన్ని రక్షించాలి. ఇది మొత్తం తెలంగాణ రాష్ట్రానికే అతిముఖ్యమైన చారిత్రక పరిరక్షణాస్థలం. దీన్ని 'తెలంగాణ మొహెంజొదారో' అనవచ్చు.

పాసిగాం:

కరీంనగర్ జిల్లాల కోటిలింగాలకు రెండు మైళ్ళ దూరంలో వాయవ్యాన గోదావరి తీరాన ఈ గ్రామం ఉంది. ఇది కరీంనగర్ రాయపట్నం మీద నేడు కరీంనగర్‌కు 60 కి.మీ. దూరంలో రోడ్డు అంచున, కుడివైపు ఉంది. ఈ కొత్త రహదారి కోదాడ రాయపత్నం స్టేట్ హైవే. ఈ రహదారిమూడు బౌద్ధ స్థూపాల స్థలాన్ని చీలుస్తూ వెళ్లింది.

ఇది గోదావరి తీరాన ఉంది. ధర్మపురి నుండి కోటిలింగాలకు ప్రవహించే గోదావరి నదికి స్తంభంపల్లి రేవుకు 2 కి.మీ. దూరాన ఈ గ్రామం ఉంది. గ్రామం పక్కన రోడ్డుకు ఆనుకొని మట్టిదిబ్బపై ఈ బౌద్ధస్థూపం ఉంది. స్థూపం చిన్నదే ఐనా చంద్రకాంత శిలా నిర్మితం ఐన గుండ్రని కట్టడం.

తెలుగునాట తొలి బౌద్ధస్థూపాలు మూడు ఇక్కడే అరకిలో మీటరు దూరం వృత్తంలో ఉన్నాయి. మిగతా రెండు శిథిలమైన ఇటుక కట్టడాలు. వాటి పక్క తవ్వకాలు జరిపి, మధ్యలో మానివేసిన ఆర్కియాలజీ వారి హెచ్చరిక బోర్డులు అవశేషాలుగా మిగిలి ఉన్నాయి.

పాసింగాం ప్రాచీన నామం పాయసిగాం. గాం అంటే గ్రామం. ఈ పదం ప్రాకృత భాషలోనిది. ప్రాకృత జన్యమైన హిందీ లాంటి ఔత్తరాహిత భాషల్లో గాం అంటే నేటికీ గ్రామమే. కరీంనగర్, అదిలాబాద్ జిల్లాలోని గోదావరి తీరాల్లో ప్రాకృతం రాజభాషగా ఉన్న శాతవాహనుల కాలాన వెలసిన ఇలాంటి గ్రామాలు చెగ్గాం, అంతర్గాం, దహగాం (దశ గ్రామాలని) వంటివి ఉదాహరణగా చూపవచ్చు.

ఈ పాయసి బుద్ధునికి సమకాలికుడు. బౌద్ధ వాఙ్మయంలో పేర్కొనబడ్డవాడు. బుద్ధునికి పరిచర్యలు చేసినవాడు. ఇతడు రాజకుమారుడని పేర్కోబడ్డాడు. బహుశా కోటిలింగాలలో శాతవాహనులకు పూర్వం ఏలిన ఆంధ్ర రాజవంశాలలోని వాడు. కరీంనగర్ జిల్లాలో బౌద్ధం తొలినాళ్లలో బావరి అనే బ్రాహ్మణుడు తన 16 గురు శిష్యులను తానుండే తవిటవన ద్వీపం (నేటి బాదనకుర్తి) నుండి బుద్ధుని వద్దకు పంపి, బోధనలను విని తృప్తి పొంది బౌద్ధం ఆచరించాక ఈ ప్రాంతం అంతా బౌద్ధం స్వీకరించినపుడా పాయసి (తానొక రాజుగా) గురువు బావరి అభిప్రాయాలను గౌరవించి బౌద్ధం స్వీకరించి ఉంటాడు. బావరి నాడు రాజగురువుగా వ్యవహరించిన బ్రాహ్మణుడు.

రాజు పేరిట గ్రామం నెలకొల్పినపుడు పాయసి పేరిట రాజధాని సమీపంలో (కోటిలింగాల దగ్గర) ఈ పాయసి గ్రామం, దాని పక్కనే మట్టి దిబ్బపై స్థూపం నిర్మాణం జరిగిందని భావించడంలో అభ్యంతరం ఉండదు.

ఈ స్థూపం వ్యాసం 2.10 మీటర్లు. 1.14 నుండి 1.18 మీటర్ల ఎత్తులో ఉంది. దీని చుట్టూ తాపడం చేసిన ఫలకాల మందం 17-22 సెం.మీ.గా ఉంది. తూర్పుకు ముఖం చేసి ఈ చైత్యం ఉంది. ఈ చైత్యం నిర్మాణానికి తాపడం చేసిన శిలాఫలకాలలో పూర్ణకుంభం, అర్ధకమలాలు, పై భాగాన జంతువుల (సింహం, అశ్వం) బొమ్మలు ఉన్నాయి. తూర్పు నుండి గజపృష్ఠాకార నిర్మాణం (యు షేప్)తో ప్రవేశం ఉంది. 11.65 మీటర్ల తూర్పు పడమరగా, 5.30 మీటర్ల ఉత్తరదోణంగా 1 మీటర్ మందం కుడ్య నిర్మాణంలో నలుపు, సున్నపురాతి గోడలతో నిర్మాణం ఉంది.

ప్రస్తుతం ఈ నిర్మాణం ధనదాహానికి బలై, శిథిలమై, కరీంనగర్ మ్యూజియంలో ఉంది. దీన్ని కూడా పునర్నిర్మాణం చేయాల్సిన అవసరం తెలంగాణ ప్రభుత్వంపై ఉంది. పై కొలతలను నేను పురావస్తు శాఖ సాంవత్సరిక నివేదికల ద్వారా సేకరించాను. 1981-82లో కృష్ణశాస్త్రి గారి సంపాదనంలోని నివేదికా గ్రంథంలో ఇవి ఉన్నాయి. నేనీ స్థూపాన్ని నా బాల్యంనుండి చూస్తున్నాను. శిథిలం (నిధుల కోసం) 2009లో జరిగింది.

పాసిగాంకు పడమట మరి రెండు బౌద్ధస్థూపాలున్నాయి. అవి చాలా శిథిలావస్థలో ఉన్నాయి. మట్టి దిబ్బలుగా కనపడినా ఇవి లోపల ఇటుకలతో నిర్మాణం జరిగినట్లు కనబడుతున్నాయి. వీటిలో ఒక దానిని నిధుల వేటలో గర్భంలో తవ్వినారు. వీటి ఎత్తు సుమారు 3 మీటర్లు. వీటి గూర్చి ఆర్కియాలజీ తవ్వకాలు జరిపి, వదిలి వేసింది.

నేలకొండపల్లి:

ఖమ్మం జిల్లాలో ఖమ్మం - కోదాడ రహదారిలోని ఈ గ్రామంలో బౌద్ధ స్థూపం బయటపడింది. నేలకొండపల్లి, మజ్జిగూడెం గ్రామాల మధ్యలో ఈ స్థూపం ఉంది.

విరాటరాజు దిబ్బ, బైరాగుల గుట్ట అనే చారిత్రక స్థలాల్లోని దిబ్బలపై జరిగిన తవ్వకాల్లో ఇవి బయటపడ్డాయి. బుద్ధుని సున్నపురాయితో చేసిన విగ్రహాలు, జలసారణుల ఇటుక కట్టడాలు, వీటితో బాటు విహారాలు, ఒక మహాచైత్యం, మినియేచర్ వోటివ్ స్థూపం, మట్టి విగ్రహాలు, ఇక్ష్వాకుల విష్ణుకుండినుల కొలవు నాణెములు లభించాయి. బోధిసత్వ పద్మపాణి విగ్రహం ఇత్తడిది ఒక జాలరివద్ద లభించింది. ఇది క్రీ.శ. 4, 5 శతాబ్దాల కాలంనాటిది. ఇది తెలుగునాట ఇలాంటి విగ్రహం ఇక్కడే ప్రథమంగా లభించింది.

శిల్పాల వల్ల థేరవాద, మహాయాన బౌద్ధులు ఇక్కడ విలసిల్లాయి అని తెలుస్తోంది. ఇది తెలంగాణలో ఆర్వాచీన బౌద్ధక్షేత్రం. చంద్రకాంత శిల నిర్మిత సింహాసనం లభించింది. బుద్ధునివిగ్రహాలు దొరికాయి. ఇవి బహు సంఖ్యలో దొరకడం విశేషం. బుద్ధుని విగ్రహాలు చెక్కే శిల్పుల నివాస కేంద్రంగా ఇది భావించబడింది. ఇవి విజయవాడ విక్టోరియా మ్యూజియంలో ఉన్నాయి.

స్థూపం చాలా పెద్దది. 42 మీటర్ల వ్యాసంతో ఉంది. మొత్తం వైశాల్యం 72 మీటర్ల వ్యాసంతో నిర్మించబడింది. ఎర్ర ఇటుకతో ఈ నిర్మాణం చేయబడింది. ఆయక వితర్దిక, ప్రదక్షిగా పథం ఉన్నాయి. గోళం మీద అతికించబడిన సున్నపురాయి ఫలకాలు 60 సంఖ్యలో విడిగాలభించాయి. 2 మీ. × 1 మీ. × 0.2 మీ. మందంగల విగిరిన శిల్పాలు, 3 ఖండాలుగా పెద్ద రాతి స్థూపం, త్రిరత్న చిమ్నాలు సున్నపు నేల తాపడం, 4 శాసనాలున్న ఫలకాలు లభించాయి.

కేంద్ర స్థూపం చాలా బలమైన నిర్మాణం. సిలండ్రిక్ షేప్ స్తంభాకారం. స్థూపం 18 మీ × 18 మీ. స్థలంలో ఆవరించి ఉంది. మొత్తం ఈ స్థూపం 10 ఎకరాల స్థలంలో ఆవరించి ఉ ంది. ఇది మొత్తం తెలుగు నేలపైనే పెద్ద స్థూపం.

ఈ మహాచైత్యానికి సంబంధించిన తవ్వకాలు 1984–85లో జరిగాయి. దీన్ని ఇక్ష్వాకుల కాలంలో భృగురి పట్టణంగా పలిచేవారు.

ఇక్కడ బౌద్ధస్థూపం అతి విశాలమైంది ఉంది. దీనికి దగ్గరగా జరిపిన తవ్వకాల్లో విహారాలు, భవనాల పునాదులు, బావులు ఇటుకలతో నిర్మించినవి బయటపడ్డాయి. బుద్ధుని కంచు విగ్రహం దొరికింది. అనేక మట్టి బొమ్మలు దొరికినాయి. ఈ మహాస్థూపాన్ని పునర్నిర్మాణం చేస్తే మంచి పర్యాటక స్థలం కాగలదు. ఇక్కడే ఒక మ్యూజియం ఏర్పాటు కూడా కావాలి.

ఫణిగిరి:

తెలంగాణలోని అతి ప్రాచీన బౌద్ధ స్థూపాల్లో విరాజిల్లిన కేంద్రం ఉంది. ఇక్కడి స్తంభాలు, ఫలకాలు, చంద్రకాంత శిలా నిర్మాణాలు, చాలా సున్నితమైన వివరణాత్మకమైన సౌందర్య శోభితమైన శిల్పం ఇక్కడ గోచరిస్తుంది.

నల్గొండ జిల్లాలో సూర్యాపేటకు 30 కి.మీ. దూరంలో హైదరాబాద్‌కు 110 కి.మీ. దూరంలో పర్వతాగ్రాన ఉంది ఈ స్థూపం.

మహాస్థూపం, చైత్యగృహాలు, విహారాలు, వోటివ్ స్థూపాలు, శిలామండపాలు, వితర్దికలు, అంతస్థులకు అనువైన మెట్లు, శాతవాహనుల, ఇక్ష్వాకుల కాలపు శాసనాలు (క్రీ. శ. 2–3 శతాబ్దాలకు చెందినవి), విద్ధాంకనాణేలు, క్షత్రపుని కాలపు నాణెములు, రోమన్ల శాతవాహనుల నాణెములు, ఇక్ష్వాకుల నాణెములు లభించాయి. మహాతలవర వంటి అధికారుల నామాలున్న నాణెములు లభించాయి. సున్నపురాయి ఫలకాలు స్థూపానికి అద్దినవి, బుద్ధునిబౌద్ధపు జీవిత ఘట్టాలుకల శిల్పంతో లభించాయి. వీటిని స్థానికంగా ఓ ఇంట్లో భద్రపరిచినారు. ప్రస్తుతం ఈస్థూపం నిర్మాణంలో ఉంది. పూర్తి నిర్మాణం అయ్యాక ఇది అమరావతికి ధీటుగా పర్యాటకుల ఆకర్షణకు నోచుకోనుంది.

ఈ ఫణిగిరి తవ్వకాలు నిజాం రాజ్యంలో 1941–44 వరకు సాగినాయి. ఈ ఫణిగిరి (నల్గొండ జిల్లా సూర్యాపేట దగ్గరగా) చుట్టూ వరద్ధమానకోట, తిరుమలగిరి, అరవపల్లి, నాగారం, సింగారాల వద్ద కూడా ఇలాంటి ఆరామాల ఆనవాళ్లు బయటపడ్డాయి. ఇది క్రీ.పూ. 2వ శ.

కాలంనాటి ఆరామం. ఇక్కడి బౌద్ధ భిక్షువులు తిరిగిన నేలపై పారుతున్న ఆలేరునదికిప్రాచీనకాలంలో భిక్కేరు అని పేరుండేది.

ఈ ఫణిగిరి కొండపై బౌద్ధస్థూపకంకు సంబంధించినవి, విహారాలు, ఆరామాలు, మండపాలు బయటపడ్డాయి. విహారాలను 6 విహారాలుగా నేటికీ మనం గుర్తించవచ్చు. బుద్ధ పాదాలు, ప్రతిమలు, శాసనాలు,రోమన్ రాజులవి, సమకాలీన స్థానిక రాజులు నాణెములు దొరికినవి.

ఇక్ష్వాకు రుద్రపురుష దత్తుని కాలపు ప్రజాశాసనం, ఆ రాజు 18వ రాజ్య సంవత్సరానిది లభించింది. రాజుగారి వైద్యుడు ధేమసేనుడు ధర్మచక్ర ప్రతిష్ఠాపన చేసి శాసనం చెక్కించినాడు.

తవ్వకాలలో మట్టి కుండలు, కప్పురాళ్ల శిథిలాలు, బౌద్ధ శిలాఫలకాలు, బ్రాహ్మీలిపిలో రాసిన చిన్న శాసనాల శకలాలు లభించాయి. ఈ శిల్పాలలో అమరావతి శిల్పాలకంటే ప్రాచీనమైన అందమైన శిల్పాలు, శిల్పి నైపుణ్యం పనితనం ఇక్కడ కనబడుతోంది. పైగా ఈ కట్టడం క్రీ. పూ. 2 శతాబ్దుల నాటిది.

క్రీ.పూ. 1వ శ. వరకే ఇది ప్రముఖ బౌద్ధ కేంద్రం. ఇక్కడ క్రీ.పూ. నుండే జనావాసాలున్నాయి. ఇక్కడ లభించిన బౌద్ధ చైత్యం తాలూకు శిల్పాలు అత్యద్భుతంగా ఉన్నాయి. ఇవి అమరావతి బౌద్ధ స్థూప శిల్పంకంటే కూడా చాలా అందంగా చెక్కబడినవి. వాటి కొలతలు చూస్తే ఇది బౌద్ధ చైత్యాల్లోని అతి పెద్ద చైత్యమని తెలుస్తుంది. ఇక్కడ తెలంగాణ ప్రభుత్వం ఆర్కియాలజీ శాఖ ద్వారా పునర్నిర్మాణం పనులు చేయిస్తోంది. ఇది ఒక్క గొప్ప బౌద్ధ పర్యాటక కేంద్రం కావాల్సిన అర్హతలున్న స్థావరం. శిల్పాలన్నిటీ అమరావతి శిల్పానికి వాడిన శిలలే (సున్నపురాయి) వాడినారు. ఇవి చంద్రకాంత శిలలవలె (వైట్ గ్రానైట్) ఉంటాయి.

ఫణిగిరిలో రుద్రపురుషదత్తుని శాసనం:

1. సిద్ధం 1 సంవత్సర 18 హేమంత పక్షం 3 దివసం 3 ప్రఖ్యాత దీప్తయ
2. శశో రజ్ఞో శ్రీరుద్ర పురుషస్య అగ్రభిషజి క్రితోయం
3. ముచ్ఛయొ ధమ్మ చక్రస్య। దర్పధ్వజియొ మరకధ్వజస్యన పటితో

ఫణిగిరి బౌద్ధ విహారంలో తవ్వకాలలోబుద్ధుని పాదాల శిల్పాలు రెండు బయల్పడ్డాయి. ఈ పాదాల మధ్య ధర్మకచక్రంతో, దానికి కాలివేళ్లకు మధ్య స్వస్తిక, శ్రీవత్సం, రెండు చేపలు, అష్టమంగళ చిహ్నాల బలిపీఠంలో ఉన్నాయి. కాలివేళ్లపై త్రిరత్న చిహ్నాలున్నాయి. వేళ్ల ముందట బ్రాహ్మీ లిపిలో శాసనాలు ఉన్నాయి. అంచున జంతువుల బొమ్మలున్నాయి.సకలజంతుకోటి బుద్ధునికి మొక్కుతుందని అర్థం కావచ్చు.

లభించిన మరికొన్ని శాసనాలు:

శాసనం. 1: సిద్ధం భయం(త) (ద) స(న) తుసక బోధికస దయధమ పదసంఘరో భయంతదుడు, తుకస, బోధికుడు అనేవారలు సంఘానికి పాదాలను ధర్మంగా దానం

చేసినారనిదీనిభావం. (స అనేది ప్రథమా విభక్తి. దేయం ఇవ్వబడింది. సంఘద అంటే సంఘానికిఅని అర్థం)

ఈ శాసనం క్రీ.శ. 1వ శతాబ్ది నాటిది లిపిని, భాషను బట్టి చెప్పవచ్చు.

రెండో పాదంలో రెండు చేపల జంటలు త్రికోణాకార బలిపీఠం ఉన్నాయి. తొలి పాదశిల్పం శాతవాహనుల కాలం నాటిది కాగా, రెండవది ఇక్ష్వాకుల కాలం నాటిది.

శాసనం. 2: సి (ధ)ం థ(భగ)వతో అపన నివనసం భరతో కరపిత మితి

భరతుడనేవాడు బుద్ధ భగవానుని పాదముద్రలను చేయించాడు.

గాజులబండ:

ఇది నల్లగొండ జిల్లాలోనిది. తెలంగాణలో తొలినాళ్ల బౌద్ధస్థూపాల్లో ఒకటి. ఫణిగిరికి నాలుగుమైళ్ల దూరంలో పర్వతం మీద ఇదిఉంది. తవ్వకాలలో విహారాలు స్థూపం బయటపడ్డాయి. సింహప్రతిమ దొరికింది.

9.60 మీటర్ల పొడవుతో దక్షిణంగా ఒక వేదిక నిర్మాణం ఉంది. 1.10×1.75 మీటర్ల వైశాల్యంతో స్థూపంకు వెళ్లేలా ఒక మార్గం (తివాచీ పరిచినట్టు) నిర్మాణం ఉంది. మహాచైత్య గృహం 11.7×3.5 మీటర్ల వైశాల్యంతో ఉంది. ఎనిమిది గదుల విహారంగా ఉన్నాయి. దీర్ఘచతురస్రాకారపు వరండా ఉంది. 1.65×1.4 మీటర్ల వితర్దికతో చతురస్రంగా మధ్యలో ఒక స్తంభం నిలిపి ఉంది. ఇది ఇప్పుడు విరిగి వాయవ్యంగా స్థూపానికి 0.3 మీ. దూరంలో ఉంది. దీనిపై శాసనం ఉందని ఖనన పర్యవేక్షకులు రాసినారు గాని శాసనం తీసినట్టు, ఫోటోగాని అలభ్యం. విరిగిన ఆ స్తంభం 1 మీటర్ ఎత్తుతో పద్మాలు చిత్రీకరించిన శిల్పంతో అలరారుతుంది.

విహారం పడమటి భాగాన ఉంది. ఉత్తరాన ఐదు పిల్లర్లు (స్తంభాలు) ఉత్తర దక్షిణాలుగా, 3 స్తంభాలు తూర్పుపడమరలుగా ఉన్నాయి. అంటే ఎనిమిది గదులున్నాయన్నమాట. ఈ విహారం తూర్పు ముఖంగా నిర్మితమైందని చెప్పవచ్చు. ఈవిహారం మొత్తం 14.3×7.85 మీటర్ల వైశాల్యంతో ఉంది. ఇటు స్తంభాల్లో రాళ్ల తాపడం చేశారు.

స్థూపం చక్రాకారపు పునాదిపై నిర్మితం అయ్యింది. 30 అడుగుల వ్యాసం కొలత ఇది. పడమటి వైపు చైత్య నిర్మాణం బయల్పడింది.

బౌద్ధం తరువాతీ ఆరామం హిందూ మతస్థావరంగా మార్చబడింది.

కొండాపూర్:

మెదక్ జిల్లాలోని కొండాపూర్ మరొక ప్రాచీన తెలంగాణ మహానగరం. హైదరాబాద్ బీదర్ రాజమార్గం మీద వాయువ్యంగా ఉంది. ఇక్కడ శాతవాహనుల కాలపు అనేక ఆనవాళ్లు, నివాస స్థలాలు తవ్వకాల్లో లభించాయి. ఈ ప్రాంతాన్ని ఒక మట్టికోట చుట్టుకొని ఉంది. గ్రీకు రాయబారి వరించిన ఆంధ్రుల 30 మట్టి కోటలు ఇది ఒకటని చరిత్రకారులు భావించారు.

ఆనాటి ప్రధాన తెలంగాణ బౌద్ధ స్థూపాల్లో ఒకటి ఇక్కడే ఉంది. ఇటు నిర్మాణాలుగా స్థూపం, చైత్యాలు, విహారాలు బయటపడ్డాయి. ఒకటంక ముద్రణశాల, ఓ కర్మాగారం, నివేశన స్థలాలు, భూగర్భంలోని గదులు బయటపడ్డాయి. ఇవి శాతవాహనుల కాలపువే. క్రీ. పూ. 1, 2 శతాబ్దాల కాలంనాటి అనేకమైన ఆనవాళ్లులభించాయి.

నాణెములు, ముద్రణకై వాడిన అచ్చులు, గాజు పూసలు, గాజులఱు, బంగారం ఆభరణాలులభించాయి. పెద్ద పెద్ద మట్టి బానలు లభించాయి. ఆ బానలపై క్రీ.శ. 1వ.శ బ్రాహ్మీలిపి రాతలున్నాయి. ఒక బంగారు రోమన్‌రాజు ఆగష్టు (37 బి.డి. పరిపాలకుని) నాణెం, పది వెండి నాణెముల, 50 రాగి నాణెములు, అంతే సంఖ్యలో సీసం నాణెములు లభించాయి. సున్నపురాయి శిలాఫలకాలు లభించాయి. వాటిపై శిల్పం ఉంది. అవి బౌద్ధానికి సంబంధించిన శిల్పాలు. పెద్ద ఎత్తున లభించిన వాటిని తవ్వకాల స్థలం పక్కన ప్రదర్శన శాల నిర్మాణం చేసి భద్రపరిచినారు.

ఇది నాటి శాతవాహన ప్రధాన నగరాల్లో ఒకటి. కోటిలింగాల ప్రధాన రాజధానిగా, ఇది మరొక పెద్ద సైనిక స్థావరంగా లేదా మరొక అనంతరకాల (క్రీ.శ. 1వ. శ) రాజధానిగా నిలిచి ఉంటుంది.

ఇక్కడి బౌద్ధస్థూపం వివరాలింకా ముద్రణలోకి రావాలి.

చైతన్యపురి (హైదరాబాద్) :

హైదరాబాద్ మహానగరంలో దిల్‌సుఖ్‌నగర్ సమీపంలో (ఫణిగిరి గ్రామం లేదా కొత్తపేట అనే నేటి పేర్లతో పిలువబడుతున్న చోట మూసీనది ఒడ్డున కొసగండ్ల నారసింహాలయం (నేడు) ఉన్నచోట పర్వతం మీద గోవిందరాజ విహారంఅనే పేరుతో బౌద్ధారామం ఉండేది. విష్ణుకుండిన వంశపు రాజు గోవిందరాజు బౌద్ధ సన్యాసుల కోసం ఈ విహారాన్ని నిర్మించాడు. దీంతో బాటే సిరిదామ విహారం కూడా సమీపంలో నిర్మాణం చేసినాడు.

విష్ణుకుండిన రాజు గోవిందవర్మ భార్యపరమ మహాదేవి (లేదా పరవం భట్టారిక) బౌద్ధానికి సేన చేసింది. విష్ణుకుండినులు తెలంగాణవారే. ఇంద్రపాలనగరంలో అనగా నేటి తుమ్మలగూడెంలో ఈవిడ కట్టించిన విహారం 'పరమభట్టారిక విహారం'. దీంతోబాటు హైదరాబాద్ మహానగరంలోని దిల్‌సుఖ్‌నగర్ పరిధిలోని చైతన్యపురిలో కూడా గోవిందవర్మ శాసనం ఉంది. నేటి నరసింహాలయంలో ఈతని శాసనంకొండమీద ఉంది. ఇప్పుడు బౌద్ధం ఆనవాళ్లు లేక విష్ణ్వాలయంగా మారినా ఇవి ఒకప్పటి బౌద్ధ క్షేత్రాలే.

ఇక్కడ శాసనం లభించింది. క్రీ.శ. 4వ శతాబ్దిది. భాష ప్రాకృతం తత్సమాల ప్రయోగం కూడా ఉంది. ప్రాకృతంలో తెలంగాణలో ఇది చివరిదశ శాసనం. శాసనకాలం శాసనంలో నిర్ధారితం కాకున్నా పాలియోగ్రఫీ (లిపి శాస్త్రం) బట్టి ఈ కాలంనిర్ధారించవచ్చు. బి.ఎన్.శాస్త్రి గారందించిన విష్ణుకుండినుల గోవింద వల్లభుని ఇతర శాసనాలను బట్టి ఈ రాజు బౌద్ధ విహారాలను నిర్మించాడని "అనేక మహావిహార ప్రతిష్ఠాపనాధిగతనంత" వంటి వాక్యాలాధారంగా చారిత్రకులు నిర్ధారించినది. అయితే ఇతడు హిందూమతాభిమాని.

ఇక్కడ కొండమీద సామాన్యులు శాసనాన్ని సేకరించలేనంత పెద్ద ఎత్తులో మరో శాసనం ఉంది. ఈ శాసనం ప్రభుత్వం పూనుకొని చేయాల్సిన పని.

భదంత సంఘదేవుడు గోవిందరాజ విహారంలో ఉన్న గందక కుటీరంలో తరువాతి కాలంలో శిలాగృహం నిర్మించాడనిఉంది. ఈ శాసనంలో పుష్పగిరి మహావిహారాన్ని నిర్మించిన వీతరాగ వాసుదేవ సిరిదాముని శిష్యునిగా, పిండపాలిక వామదరుల శిష్యపరంపరలో బ్రహ్మదేవ థేవరిస శిష్యునిగా ఈ సంఘదేవుడు పేర్కొబనడ్డాడు.

ప్రస్తుతం రాతిగుహలో నరసింహ విగ్రహం ఉండి పూజలందుకొంటున్న ఈ కొండను ఇప్పటికే కొంత తొలిచారు. చుట్టూరు పెద్దగా శిథిలాలు కనబడుతలేవు. ఇక్కడ నగరం విస్తరించి ఇండ్లు నిర్మాణం ఐనాయి. రక్షితస్థలంగా దీన్ని ప్రభుత్వ పురావస్తుశాఖ తీసికొన్ని చర్యలేమీ లేవు.

నాగార్జునసాగర్ బుద్ధవనం:

కృష్ణాతీరంలో నాగార్జునసాగర్ ఎడమకాల్వ వద్ద ఈ బుద్ధవనం ఉంది. చారిత్రకంగా ఈ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యత నాగార్జునుని వల్ల వచ్చిందే. శ్రీపర్వంతపై నాగార్జునుని నివాసం వల్ల వచ్చింది. క్రీ.శ. 1, 2 శతాబ్దుల్లో బౌద్ధం తిరిగి ప్రాభవం పొందడానికి మహాయాన శాఖీయుడైన ఈ రెండో బుద్ధుడు నాగార్జునుడే కారణం. దీనికి గుర్తుగా రాష్ట్రం రెండుగా విడిపొయ్యాక తెలంగాణ ప్రభుత్వం ఇక్కడ నిర్మాణాలు చేపట్టింది.

బుద్ధ చరితవనం, జాతకవనం, ధ్యానవనం, స్థూపం, ఆచార్య నాగార్జున అంతర్జాతీయ విద్యాలయం, దిగువ కృష్ణా–లోయ ఆరామం వంటివి నిర్మాణంలో ఉన్నాయి. అన్ని సంపూర్ణం ఐతే ఇది ఒక అంతర్జాతీయ పర్యాటక కేంద్రం అవుతుంది. ఇది 279 ఎకరాల్లో విస్తరించి ఉంది. నాగార్జున డ్యాంకు దగ్గరలో ఉంది. ఇక్కడే 35 ఎకరాల స్థలంలో విపశ్యన ధ్యానకేంద్రం ఉంది. తూర్పు ఆసియా దేశాలు ఇక్కడ నిర్మాణాల విషయం తగు భాగస్వామ్యం కావాలని కోరుకుంటున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నఅమరావతి బౌద్ధస్థూపం నమూనాలో ఇక్కడో స్థూపం నిర్మాణం అయ్యింది. సాగరమధ్యలో నందికొండ ఇక్కడ అవిభక్త ఆంధ్రదేశపు మరో పర్యాటక క్షేత్రం ఇప్పటికే ప్రసిద్ధం. సాగర్‌డ్యాం నిర్మాణంలో తవ్వకాల్లో లభించినర పురావస్తువులతో మ్యూజియం ఉంది. సాగర మధ్యంలో నౌకావిహారం మరో ప్రత్యేక ఆకర్షణ. ప్రకృతితో తాదాత్మ్యం కల్పించే మధురానుభూతికి, చరిత్ర స్పృహ, బౌద్ధంపట్ల గురుభావన ఈ పర్యాటకం జమిలిగా లభిస్తాయి.

శ్రీ పర్వతారామం (బుద్ధవనం):

ఇది తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బృహత్తర ప్రణాళికా బద్ధారామం. బుద్ధిష్ట థీంపార్కుగా తయారుచేస్తున్న ఈ కేంద్రం దేశంలోనే ప్రప్రథమం. 279 ఎకరాల్లో దీన్ని అభివృద్ధి చేస్తున్నారు. నాగార్జునసాగర్‌లో గతంలో ఏర్పాటైన సాంస్కృతిక కేంద్రం విభజనతో ఆంధ్ర ప్రాంతానికి వెళ్లడం వల్ల కృష్ణానదికి ఒడ్డున తెలంగాణ తన రాష్ట్రంలో ఈ ప్రాజెక్టు చేపట్టింది.

శ్రీలంక ప్రభుత్వంఅవుకనబుద్ధ ప్రతిమ (తన దేశంలో దానికి) ప్రతిరూప విగ్రహం 27 అడుగుల దానిని ఈ ప్రాజెక్టుకు బహుకరిస్తోంది. ఇండో శ్రీలంక సాంస్కృతిక ఆదానప్రదాన కార్యంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వానికి ఈ భారీ విగ్రహం లభిస్తోంది. అంతేకాదు సింహళ విహార కేంద్రం నిర్మించాలని తాను భావిస్తున్నట్లు, దానికిగాను ఒక పెద్ద ధర్మఘంటను కూడా కానుకగా ఇవ్వబోతున్నట్టు తన ఆకాంక్షను తెలిపింది. ప్రపంచ బుద్ధ సాంస్కృతిక కేంద్రం, టిబెట్ మరియు ఉత్తరప్రదేశ్‌లోని ప్రజ్ఞోపాయ చారిటబుల్ ట్రస్ట్ కూడా దీనిలో భాగస్వామ్యం తీసుకుంటున్నాయి. ఈశాన్య రాష్ట్రాల సహకారం కూడా ఉండబోతోంది. కృష్ణానదిలో నాగార్జునసాగర్ డ్యాం నిర్మాణంలో మునిగిన లోయలోని 10 సంఘారామాలను తిరిగి తెలంగాణవైపు ఒడ్డునే నిర్మాణం చెయ్యాలని ప్రభుత్వం ఆలోచన. 8 విభాగాలుగా ఉండే ఈ 279 ఎకరాల స్థలంలో వివిధ నిర్మాణాలు చేపడుతారు. బుద్ధుని జీవితాన్ని తెలిపే శిల్పాలు, అమరావతి తరహాలో బౌద్ధస్థూపం నిర్మాణం వీటిలో జరుగుతాయి.

పరమ భట్టారికా మహావిహారం (ఇంద్రపాలనగరం) :

నల్గొండ జిల్లా తుమ్మలగూడెం వద్ద ప్రాచీన కాలంలో విష్ణుకుండిన రాజుల రాజధాని నగరం ఉండేది. దీని శివార్లలో మహావిహారం ఉండేది. శాసనాధారం ఉన్న బౌద్ధ క్షేత్రం. స్థూపావశేషాలున్నాయి.

కీసరగుట్ట మరో బౌద్ధ క్షేత్రం. ఇక్కడ లభించిన శాసనంలో 'తులుచు వాన్లు' అన్న తెలుగు పదం దొరికింది. ఇక్కడ బౌద్ధశిల్పం లభ్యం.

హైదరాబాద్ నగరంలో బౌద్ధం:

ప్రాచీనం: దిల్‌సుఖ్‌నగర్ వద్ద మూసీ ఒడ్డునగల పర్వతంపై ఒక బౌద్ధారామం ఉండేది. విష్ణుకుండినరాజు గోవిందవర్మ క్రీ.శ. 4వ శ.లో అక్కడ బౌద్ధ విహారం నిర్మించి, 'గోవిందరాజ విహారం' అనే పేరుతో బౌద్ధ భిక్షువులకు అంకితం చేసి, శాసనం వేయించాడు. ఆ శాసనం పూర్తి పాఠం ఇంకా సంపాదించాలి. రాయికి చాలా ఎత్తున ఉంది. ప్రస్తుతం ఇక్కడ కొసగండ్ల (కొండపేరు) నరసింహాలయం ఉంది. ఆ ప్రాంతం పేరు న్యూ మారుతీనగర్.

మచ్చబొల్లారం వద్ద ఒకపుడు ప్రాచీన బౌద్ధరామం ఉండేది. దాని ఆనవాళ్లు ఇపుడు లేవు.

హైదరాబాద్‌కు 60 కి.మి. దూరంలో కొండాపూర్ (ప్రస్తుతం మెదక్ జిల్లా)లో బౌద్ధక్షేత్రం ఉండేది.

ఆధునికం: దలైలామా సెంటర్ ఫర్ ఎథిక్స్ పేరిట ఒక బుద్ధ విహారం సిద్ధమవుతోంది. సికింద్రాబాద్‌లోని మహేంద్రాహిల్స్‌లో 3 ఎకరాల స్థలంలో మహాబోధి బుద్ధ విహారం ఉంది. ఇది ఒకప్పుడు ఆనందమిత్ర అనే బౌద్ధ భిక్షువు 1940 ప్రాంతంలో ఇక్కడ నివసించేవాడు. సి.ఆంజనేయరెడ్డి గారి కృషి దీనివెనుక ఉంది. ప్రస్తుతం బెంగళూరు మహాబోధి సంస్థ నిర్వహణలో ఉంది.

నల్లగొండ జిల్లా:

నందికొండ: నల్గొండ జిల్లాలోని ఈ గ్రామం మిర్యాలగూడకు 55 కి.మీ. దూరంలో ఉంది. కృష్ణానది తీర గ్రామం. నది ఒడ్డున బౌద్ధస్థావరాలు నిర్మాణం అయినాయి. ఇక్కడ ఆర్కియాలజీ శాఖ తవ్వకాలు చేసింది. బౌద్ధారామాలు, స్థూపం బయటపడ్డాయి. కేంద్ర పురావస్తుశాఖ ఆధీనంలో ఈ స్థావరం ఉంది.

బాసర:

అదిలాబాద్ జిల్లాలోని సుప్రసిద్ధ సరస్వతీ మాతృ క్షేత్రమైన బాసరలో సరస్వత్యాలయానికి ఉత్తరంగా ఒక కొండపై బౌద్ధస్థూపం ఉండేది. ఆ కొండ దక్షిణం వైపు నుండి ఇటుకల మెట్లు ఉండేది. స్థూపం ఉండేచోట నేడు ఒక శివాలయం ఉంది. ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. దీనికి తూర్పున దిగువగా కొండకింద ధ్వజస్తంభం రాతితో చేసినది ఉంది. ఆలయం ధ్వజస్తంభం మధ్యలో గల పెద్దరాయిపై బుద్ధుని పాదాలు సుందరంగా చెక్కి ఉన్నాయి.

ఈ పాదముద్రలు 18 అంగుళాల వ్యాసంతో ఉన్న ఒక వృత్తంలో చెక్కుబడి ఉన్నాయి. పాదం మధ్యన వేళ్ల వద్ద మనోహరంగా ధర్మచక్రాల వంటి చిహ్నాలు చెక్కబడి ఉన్నాయి. హ్యూయన్ త్సాంగ్ తన యాత్రలో చూసిన కాశీనగరపు బుద్ధపాదముద్రికలవలె ఉన్నాయి.

బుద్ధునిపాదముద్రికల గూర్చి మహావంశం గ్రంథం వివరించింది. గాంధారలో లభించిన పాదముద్రలు లాహోర్ మ్యూజియంలో ఉన్నాయి. స్వాత్ నది ఉత్తరతీరాన పెద్ద రాయిపై పాదముద్రలున్నాయని, ఇక్కడ ఆలయ నిర్మాణం చేసి, ప్రజలు ఆరాధించేవారని మహావిహారంలో కూడా బుద్ధ పాదముద్రలున్నాయని హ్యూయన్‌త్సాంగ్ పేర్కొన్నాడు. ఈ పాదాల పూజ క్రీ.శ. 15 శ. నాటిది. అమరావతి, బావికొండ, తోట్లకొండ, నాగార్జునకొండ, ఫణిగిరిలలో ఇలాంటి పాదముద్రలే ఉన్నాయి.

రాయలసీమ దళిత నవలల్లో సాంస్కృతికాంశాలు

–ఆర్. బాలి రెడ్డి

రాయలసీమ అనగానే జనసామాన్యంలో కరువు ప్రాంతంగా స్థిరపడిపోయింది. అతివృష్టి లేదంటే అనావృష్టితో ఈ ప్రాంతం ఎన్నో కష్ట నష్టాలకు గురవుతూవుంటుంది. దీని కారణంగా రాయలసీమ ప్రాంతంలో ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉంటుంది. రాయలసీమలోని అనేకమంది ప్రజలు అప్పులతో పుట్టి, అప్పులతో పెరిగి చనిపోతున్నారని, ప్రజలు ఒక కరువు నుండి బయటపడే సమయానికి మరొక కరవు ప్రత్యక్షమవడం వల్ల ఆర్థిక పరిస్థితులు తారుమారవుతున్నాయని *'తర తరాల రాయలసీమ'* కరువు సమస్యల ప్రత్యేక సంచిక ప్రొఫెసర్ గంగూలి వివరించారు. దీన్ని బట్టి రాయలసీమ నిరంతరం కరువు కాటకాలతో ఇబ్బందికరమైన దుర్భరపరిస్థితులు ఆ ప్రాంతంలో చోటుచేసుకున్నాయని తెలుస్తుంది. ఇటువంటి రాయలసీమలోని పరిస్థితులను చాలావరకు రచయితలు తమ రచనల ద్వారా పాఠకులకు అందించే ప్రయత్నం చేశారు. ఆ రచనల్లో ముఖ్యంగా రాయలసీమలో వచ్చిన నవలలను పరిశీలిస్తే ఈ ప్రాంత సాంస్కృతికాంశాలను చాలా వరకు గుర్తించవచ్చు. నేనిక్కడ రాయలసీమ దళిత నవలల్లో ప్రతిఫలిస్తున్న సాంస్కృతికాంశాలను విశ్లేషించాలనుకుంటున్నాను.

రాయలసీమలో వచ్చిన తొలి తెలుగు నవలగా 'శ్రీరంగరాజు చరిత్ర' (1872) ను చెప్పవచ్చు. అది ఒక లంబాడీ యువతి జీవితాన్ని కేంద్రంగా చేసుకొని వచ్చింది. అయితే, తర్వాత ఆమె లంబాడీ ఇంటిలో పెరిగినా, ఒక క్షత్రియ యువతిగా తెలుస్తుంది. కానీ, ఆ నవలలో చిత్రించిన సంస్కృతి అత్యధికంగా దళిత సంస్కృతిగానే తెలుస్తుంది. దీని తర్వాత 1925 లో కల్వటాల జయరామారావు రాసిన 'రేనాటి వీరుడు' నవల తప్ప 1950 వరకు ఎటువంటి నవలలు రాలేదని వల్లంపాటి వెంకట సుబ్బయ్య 'రాయలసీమలో ఆధునిక సాహిత్యం–సామాజిక –సాంస్కృతిక విశ్లేషణ' అనే పుస్తకంలో తెలియజేశాడు. వల్లంపాటి వెంకట సుబ్బయ్య– ఇంద్ర ధనస్సు(1962), దూర తీరాలు(1964), మమతలు – మంచు తెరలు(1974), జానకి పెళ్లి (1976),పి. రామకృష్ణారెడ్డి– నత్త గుల్లలు(1975), కేశవరెడ్డి– ఇన్ క్రెడిటబుల్ గాడెస్ , మూగవాని పిల్లన గ్రోవి, సిటీ బ్యూటిఫుల్, అతడు అడవిని జయించాడు. (1985), రాముడుండాడు –రాజ్జవుండాది(1987), చివర గుడిసె(1993), చిలుకూరి దేవపుత్ర–అద్దంలో చందమామ (1989), పంచమం(1998).నామిని సుబ్రహ్మణ్యం నాయుడు – ముని కన్నడి సేద్యం(1990), మధురాంతకం మహేంద్ర– స్వర్గ సీమకు స్వాగతం(1991), స్వామి – గద్దలాడతండాయి (1996), మీ రాజ్యం మీరేలండి(1997), వి. ఆర్. రాసాని – చీకటి రాజ్యం (1994), బతుకాట, జొన్నవిత్తుల శ్రీరామచంద్ర మూర్తి– వలస దేవర నవ్వు, సన్నపు రెడ్డి వెంకట రామి రెడ్డి –కాడి,

శాంతి నారాయణ –పెన్నేటి మలు పులు, పినాక పాణి –నిప్పుల వాగు (2001),కొమ్మిరెడ్డి విశ్వ మోహన రెడ్డి – మానవ హోమం (1980), లంకి పల్లి –ఏటి గట్టు,ద్వారక –పల్లె పిలిచింది, పి. రాజ గోపాల నాయుడు – జేజవ్వ, కలువ కొలను సదానంద – బంగారు నడిచిన బాట , గందరగోళం, ఆర్ .యస్. సుదర్శనం – మళ్ళీ వసంతం, సంసార వృక్షం, వసుంధరా దేవి – రెడ్డమ్మ గుండు,కాశీ భట్ల వేణుగోపాల్ –తపన, నేనూ, చీకటి మొదలైన నవలలు రాయలసీమ నవలల్లో ప్రసిద్ధి చెందినవిగా చెప్పుకోవచ్చునని రాయలసీమ నవలలపై పరిశోధన చేసిన నాగరాజు పేర్కొన్నారు. అయితే, రాయలసీమలో దళిత జీవితాలెలా ఉన్నాయనే దృష్టితో ఈ వ్యాసాన్ని రాస్తున్నాను. అందుకు గాను, స్వామి 'గద్దలాడతండాయి'(1991), పి. నాసరయ్య 'మాదిగ పల్లె'(1998), సన్నపు రెడ్డి వెంకట రామి రెడ్డి 'కాడి' (1998),చిలుకూరి దేవ పుత్ర 'పంచమం'(1998), నిప్పుల వాగు(2001). వీటిని రాయలసీమ నవలలుగా రాచపాళెం చంద్రశేఖర రెడ్డి "1980 తర్వాత దళిత నవల" పుస్తకం లో పేర్కొన్నాడు. రాయలసీమ దళితుల జీవితాలను బలంగా అభివ్యక్తీకరించిన కేతు విశ్వనాథ రెడ్డి 'వేర్లు' (1978) కూడా నా వ్యాసంలో తీసుకున్నాను.

సంస్కృతి–లక్షణాలు:

సమాజంలో ప్రతి మానవుడు తన జాతి వ్యవహారాలు, సంప్రదాయాలు, పండగలు, జాతరలు వంటివన్నీ ఆచరించే అలవాటు నే సంస్కృతి అని చెప్పవచ్చు. మానవ జీవిత ప్రారంభం నుండి చరమాంకం వరకు మానవుడు అనుసరించే పద్ధతులే సంస్కృతి. సంస్కృతి విజ్ఞానాన్ని మేథా శక్తిని వినియోగించి తనను తన చుట్టూ ఉన్న పరిసరాన్ని మలచుకుని అంతకు ముందున్న పరిస్థితి కంటే మెరుగుపరచడానికి, మార్చడాన్ని బాగు చేయడాన్ని, అభివృద్ధి చేయడాన్ని కూడా సంస్కృతి అని అంటారు. మనిషి స్వతహాగా సాంస్కృతిక జంతువని, అతడు తనను తాను సంస్కరించుకుని తనలో నిక్షిప్తమైన వాటిని గ్రహించి వాడుకోవడమే సంస్కృతి అని పద్మావతి 'సంస్కృతి అంటే ఏమిటి?' అనే పుస్తకంలో వివరించారు. ఈ విషయాలను పరిశీలిస్తే గొప్పతనానికి, శ్రేష్ఠతకు మారు పేరు సంస్కృతి. మానవుడు జీవించే ఉన్నతమైన జీవితానికి సంస్కృతి ఎంతగానో తోడ్పడుతుంది. సంస్కృతి సంస్కార సంబంధమైనదని అర్థమవుతుంది. అంటే ఇతరులతో మాట్లాడేటప్పుడు వారి గౌరవాన్ని కించపరచకుండా మానవతా భావాలతో వ్యక్తిత్వాన్ని నైతిక విలువలను నిలబెట్టు కోవడమే నిజమైన సంస్కృతి అని తెలుస్తుంది.

రాయల సీమ దళిత నవలలు– వస్తువైవిధ్యం

రాయలసీమలో వచ్చిన దళిత నవలల్లో ఎంతో వస్తువైవిధ్యం కనిపిస్తుంది. గ్రామంలో దళితుల సంబంధాలు, చదువుకున్న దళితుల ఆత్మగౌరవం కోసం పడే సంఘర్షణ, ఉద్యోగాల్లో అనుభవించే ఒత్తిడులు, మరొక వైపు స్వకులాల నుండి జరిగే దోపిడీలు, వీటిన్నింటినీ జయించుకుంటూనే రాజ్యాధికారాన్ని సాధించే క్రమాన్ని అవగాహన చేసుకోవడం వంటివన్నీ

రాయలసీమ దళిత నవలల్లో చాలా వరకు ప్రతిఫలించాయి. కేతు విశ్వనాథ రెడ్డి 'వేర్లు' నవలను రాశాడు. ఒక విద్యావంతుడైన దళిత యువకుని మానసిక సంఘర్షణ ఈ నవలలో చోటుచేసుకుంటుంది. ఒక చదువుకున్న పాత్ర తన కుటుంబం వారు చేసే కులవృత్తులను స్వీకరించలేక, ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూస్తుంటాడు. తన ఊరి వాతావరణం, పరిసరాలు అతనికి జుగుప్సాకరంగా ఉంటాయి. ఇటువంటి పరిసరాలలో, దుర్భరమైన వాతావరణంలో అగ్రవర్ణాల వారు పిలిచే కులాన్ని సూచిస్తూ పిలిచే పిలుపుల మధ్య ఉండలేక సతమతమవుతుంటాడు. తన పరిస్థితుల నుండి తప్పుకోవడానికి ప్రయత్నాలు చేస్తాడు. అతని మనసులో ఏర్పడిన కుల సంఘర్షణ అతని అనేకమైన ఆలోచనలకు గురి చేస్తుంది. తనకు అంతః సంఘర్షణకు పరిష్కార మార్గాన్ని వెతుక్కోలేక సతమతమవుతుంది.'గద్దలాడతండాయి' నవలను స్వామి 1996 లో రాశారు. ఈ నవల దళితులతో ఇతరుల జీవితాలెలా ఉంటాయనే మానవ సంబంధాలను తెలియజేస్తుంది. కరువు కాటకాలు, కులాధిపత్యాల మధ్య మనుషుల మనుగడను చిత్రించింది నవల. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం ఏ విధంగా పతనమైందో అందులోని రాజకీయ లొసుగులను ఈ నవలలో చిత్రించాడు రచయిత. అస్పృశ్యత, రెడ్ల రాజకీయాలు, బానిసత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారం వంటివి అన్నింటినీ ఈ నవలలో చూడవచ్చు. కరువు కాటకాలు, రెడ్ల సామాజిక, ఆర్థిక, రాజకీయాధిపత్యాలు రాయలసీమలో మాదిగల చుట్టూ పెనవేసుకున్న వారి సంఘర్షణలను చిత్రించిన నవలగా దార్ల వెంకటేశ్వర రావు *'దళిత సాహిత్యం–మాదిగ దృక్పథం'* అనే పుస్తకంలో అభివర్ణించారు.

'మాదిగ పల్లె' నవలను పి. నాసరయ్య 1998 లో రచించాడు. ఈ నవలలో అంటరానితనం, దళిత జీవిత వాస్తవ చిత్రణ కనబడుతుంది. భూస్వాముల కుట్రలు వాటిని ఎదిరించడానికి దళితులు చేసే ప్రయత్నాలు ఈ నవలలో చోటుచేసుకున్నాయి. దళితులను చైతన్య పరిచి వారిని సంఘటిత శక్తిగా మార్చే ప్రయత్నానికి వ్యతిరేకంగా భూ స్వామ్య వర్గం తెలివిగా ఎలా కుట్రలను పన్నుతుందో ఈ నవలలో కనబడుతుంది. దళితులకు మార్క్సిస్టు పోరాటాలు అందించిన చైతన్యాన్నీ, ఆ ఉద్యమాలతో దళితులు కలిసి పనిచేయాల్సిన అవసరాన్నీ కూడా నొక్కి చెప్పిన నవల.

'కాడి' నవలను సన్నపు రెడ్డి వెంకటరామిరెడ్డి 1998 లో రచించాడు. గ్రామీణ వ్యవస్థలో జరిగే మార్పులు ఈ నవలలో కనబడతాయి. రాజకీయ ప్రాబల్యం దళితుల ఆవేదన వంటి విషయాలు ఇందులో చర్చించబడతాయి. అలాగే పల్లెలు, పట్టణాల మధ్య భేదాలు కూడా ఇందులో వివరించబడతాయి. ముఖ్యంగా రైతులనుండి రెడ్లు వారి నుండి మాల మాదిగలు వారి వారి వృత్తులనుండి ఎలా స్వతంత్ర ను పొందారో అర్థమవుతుంది. మాదిగ దండోరా ఉద్యమం ద్వారా వారి హక్కుల కోసం పోరాడటం ఇందులో కనబడుతుంది. రాజకీయ వైనం కులాలను ఎలా వినియోగించుకుంటుందో ఇందులో చిత్రీకరించబడింది. రాజకీయ నాయకులు పల్లెలో వారే

విభేదాలు సృష్టించి వారికి వారే పరిష్కార మార్గాన్ని చూపించి ప్రజల్ని ఎలా వశపరుచుకుంటున్నారో ఈ నవలలో స్పష్టమవుతుంది.

'పంచమం' నవలను చిలుకూరి దేవపుత్ర 1998 లో రచించారు. ఈ నవల దళిత ఉద్యమ ప్రభావంతో వచ్చిన నవల. చిలుకూరి దేవ పుత్ర తన ఉద్యోగ జీవితంలో చవి చూసిన యథార్థ సంఘటనకు, తను ఉద్యోగం చేస్తున్న రెవిన్యూ వ్యవస్థలోని అధికారుల లంచగొండితనానికి నడుస్తున్న దళిత ఉద్యమాలను జోడించి రాసిన నవల ఇది. ఆంధ్రదేశంలో ప్రభుత్వం భూ సంస్కరణలను ప్రవేశపెట్టడం , గ్రామాలలో మిగుల భూములు పంపిణీ, దళితులు వెనుకబడిన తరగతులు భూములు పొందడం గ్రామాల్లో భూ స్వాములు తన అధికార పలుకుబడితో రికన్వే చేయించడం, రెవిన్యూ అవినీతి, దళిత యువత ఉద్యమించడం, నక్సలిజం విజృంభణ, కారంచేడు, చుండూరు లాంటి సంఘటనలు వంటివి ఎన్నో ఈ నవలలో చిత్రీకరించబడ్డాయి. 'నూట ఇరవై ఏళ్ళ తెలుగు నవలా చరిత్రలో వస్తు వైవిధ్యంలో సంక్లిష్టత సామాజిక సంచలనాలకు అద్దం పట్టడంలో, వ్యక్తి జీవితానికి సమాజ జీవితానికి మధ్య ఉన్న సంబంధాన్ని సరిగ్గా వ్యక్తీకరించడంలో పంచమం అగ్రస్థానంలో నిలుస్తుందని ఎన్. వేణుగోపాల్ చెప్పిన అభిప్రాయం సమంజసమనిస్తుంది.

'నిప్పుల వాగు' నవలను పినాక పాణి 2001 లో రచించాడు. ఈ నవలలో ప్రధానంగా అగ్రకులాల , అగ్రకులాల వారి మధ్య, మాల మాదిగల మధ్య సంఘర్షణలు ఉంటాయి. అగ్రవర్ణాలు మాల మాదిగల మధ్య దూరాన్ని పెంచే క్రమంలో ఎన్నో అక్రమాలకు పాల్పడ్డం ఇందులో గమనించవచ్చు. అగ్ర వర్ణాల వారు వారికి వారు గొడవపడినా వారి వ్యాపారంలో తగాదాలు ఏర్పడినా, అవతల పార్టీ వాళ్ళను దెబ్బతీసే క్రమంలో వారి దగ్గర పనిచేసే మాల మాదిగలే నష్టపోవడం ఈ నవలలో కనబడుతుంది. అంతే కాకుండా ముఠా కక్షలలో దళితులు తమ బిడ్డలను దూరం చేసుకుంటున్నప్పుడు తల్లిదండ్రుల ఆవేదన, ఇందులో చక్కగా రూపుదిద్దుకుంది. ఇలా ఈ నవలలో అనేకాంశాలు మన ఆలోచనా తీరును మార్చేలా దర్శనమిస్తాయి. ఏది ఏమైనా చివరకు నష్టపోయింది మాత్రం మాదిగ కులస్తులే ఏ నేరం చేయకపోయినా వారి ఇల్లులు దగ్ధమవడం ఆ పేటలోని వారి నందరిని కలచివేస్తుంది.

దళిత సాంస్కృతికాంశాల ప్రతిఫలనం:

దళితులు జీవన విధానంలో జరిగే ప్రతి చర్య దళిత సంస్కృతిని తెలియజేస్తుంది. దళితుల ఆచారాలు, పండుగలు , జాతరలు, ఆహారపు అలవాట్లు, వృత్తులు, వస్త్రధారణ వారి వ్యక్తిత్వాలు ఇవన్ని దళిత సంస్కృతి కింద కు వస్తాయి. నేడు దళిత, వెనుకబడిన, మైనారిటీ ప్రజల్లో ఎక్కువ మంది హిందూ సంస్కృతి పట్టులో ఉన్నారు. ఈ హిందూ సంస్కృతి వారిలో కులతత్వాన్ని వ్యాప్తి చేయడం వలన వారు ఐక్యం కాలేక పోతున్నారు. కులం గోడలు కూల్చే చరణ పథకం రూపొందించాలి. అలాగే కళలు, విద్య, ఆర్థిక రాజకీయ జీవన విధానంలో మార్పు రావాలి ఈ మార్పు కోసం పునాదులను కూల్చడానికి కొన్ని సూత్రాలను పొందుపరిచారు. ఈ సూత్రాల

ఆధారంగా దళిత సంస్కృతి విధి విధానాలు ఏమిటో తెలుసుకోవడానికి వీలవుతుందని కత్తి పద్మారావు 'కులం ప్రత్యామ్నాయ సంస్కృతి' గ్రంథంలో సవివరంగా వివరించారు. తాము నివసించే ఇల్లు, కట్టుకునే బట్ట, మాట్లేడేభాష, తినే తిండి, తాము పెట్టుకునే పేరు, ఆచరించే మతం, చేసుకునే పండుగలు మొదలైనన్నీ దళిత సంస్కృతిని తెలియజేస్తుంటాయి.

వివాహం- కులాంతర వివాహాలు:

'వేర్లు' నవలలో వివాహాలు ఎలా జరుపుకుంటారు అనే దానిమీద చర్చ లేదు. 'గద్దలాడతండాయి' నవలలో పెండ్లి చేయడానికి పందిరిని ఈ విధంగా అలంకరిస్తారు. గుడిసె ముందు నీళ్లు పోసి దమ్మను కొట్టి సాపు చేస్తారు. నాలుగు గుంజలకు నాలుగు టెంకాయ పట్టెలు బిగించేస్తారు. పెళ్లి పందిరి సిద్ధం అయిపోతుంది. ఈ విధంగా నిరాడంబరంగా వివాహ ప్రస్తావన ఉంటుంది (పుట:75). అమ్మాయిలకు వివాహం ఏ వయసులో చేయాలి అనే దాని మీద చర్చ ఉంటుంది. 'మాదిగ పల్లెలో' నవలలో సుందర్రావు, సువార్త సంప్రదాయం ప్రకారంగా చేసుకున్నట్టు ఉండదు. ఎందుకంటే మంత్రాలలో అర్థాలను వివరిస్తే అవి వ్యంగ్యార్థాలతో కూడిన విధంగా ఉంటాయి. అందుకని సుందర్రావు , సువార్త అభ్యుదయ మార్గంలో వివాహం చేసుకుంటారు (పుట:49). 'కాడి' 'నిప్పుల వాగు' నవలలో వివాహాల ప్రస్తావన కనబడదు. వివాహం ద్వారా కుల నిర్మూలన జరగొచ్చనే అంశాన్ని కొన్ని దళిత నవలలు ప్రతిపాదించాయి. అందువల్ల కుల నిర్మూలనకు కులాంతర వివాహాలు దోహదకారిగా ఉంటాయి. 'వేర్లు' నవలలో వాసు అనే వ్యక్తి వర్ణాంతర వివాహం చేసుకున్నట్టు రచయిత దేవ దానం పాత్ర ద్వారా తెలియజేస్తాడు. (పుట:11.) 'గద్దలాడతండాయి' నవలలో ప్రేమ వివాహాలు ఉన్నాయి కాని కులాంతర వివాహాలు లేవు.'మాదిగ పల్లె' నవలలో భూస్వామి కొడుకు భాస్కర్, మాల కులస్తురాలు సుశీల ప్రేమించుకుని వివాహం చేసుకుంటారు (పుట:66.). ఇది కులాంతర వివాహం గా పరిగణించబడుతుంది. 'పంచమం' నవలలో చాకలి వాడు ఓబన్న అగ్రవర్ణాల వాడైన శంకరప్ప కూతురు రుక్మిణి ప్రేమించుకుంటారు. కులాంతర వివాహానికి పెద్దవారు ఒప్పుకోక పోవడంతో ఇద్దరు లేచిపోవడానికి సిద్ధపడతారు. (పుట:67) 'కాడి',' నిప్పుల వాగు' నవలలో కులాంతర వివాహాలు కనబడవు.

దైవ చింతన - మతాచారాలు:

భారతీయ సమాజాన్ని చూసినట్లయితే, నాటి నుండి నేటి వరకూ దళితులు రకరకాల పీడనలను ఎదుర్కుంటూనే ఉన్నారు. ఆ పీడనల నుండి రక్షించుకోవడానికి మత మార్పిడిలను తప్పని పరిస్థితుల్లో అంగీకరించవలసి వచ్చింది. ఏ కొందరు ఇష్టపడి కొన్ని మతాల్లోకి వెళ్లినా, ఆ మతాల్లోనూ దళితులకు దక్కిన గౌరవం అనుభవంలోకొచ్చేసరికి, అందులోను ఇమడ లేని పరిస్థితులు. ఇలా హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులుగా దళితులు మారిపోవడంలో పీడన నుండి బయటకు రావాలనే ఆలోచనే ప్రధానం. దీని ఫలితంగా సాంస్కృతిక వైవిధ్యం

దళితుల్లో ఎక్కువగా కనిపించినా, కులంలోని అంటరానితనం దళితులందరినీ ఏక సూత్రంలో కట్టి పడేసిందని దార్ల వెంకటేశ్వర రావు 'వీచిక' లో వివరించారు. ఒక్కొక్క మతానికి ఒక్కోరకమైన సంస్కృతి, నమ్మకాలు, విశ్వాసాలు ఉంటాయి. దళితుల్లో చాలా మంది తినడానికి గతి లేని పరిస్థితుల్లో మత మార్పిడి వలన లాభం పొందవచ్చు 'దళిత సంస్కృతి' పుస్తకంలో పొన్నం రెడ్డి నీరజ వివరించారు.

'వేర్లు' నవలలో క్రైస్తవ మతం యొక్క చర్చ జరుగుతుంది. క్రైస్తవ మతంలోని సేవా భావం హిందూ మతంలో ఉండదని సెయింట్ ఆంథోనీ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ను దిక్కులేని వారిని ఆదుకుందని చెప్తాడు (పుట:26). దిక్కు తోచని స్థితిలో ఉన్నవారిని ఆర్థిక మాంద్యంతో బాధపడుతున్నవారిని క్రైస్తవ మతం ఆదరించిందని ఇక్కడ తెలుస్తుంది. చాలా మంది దళితులు మత మార్పిడికి ఒక కారణం ఇలాంటి భావాలు ఈ నవలలో రచయిత ప్రవేశిస్తాడు.'గద్దలాడతండాయి' లో మత ప్రస్తావన కనబడదు.'మాదిగ పల్లె' లో అమరయ్య క్రైస్తవ మతాధిపతిల చెప్పిన వివరాలన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తాడు. అతను చెప్పిన విధంగా రాతి బొమ్మను మొక్కడం తప్పని చెప్తాడు. మానవుడు అనాది కాలంలో పశుప్రాయుడని అతని జీవితం పశు ప్రాయంగా ఉండేదని అప్పుడు కులాలు, మతాలు లేవని, అవి మానవులు సృష్టించినవేనని బౌద్ధమతం అభివృద్ధిని సహించలేని బ్రాహ్మణులు బౌద్ధంలో చేరి బౌద్ధమతం కూడా హిందూమతమేననే అపవాదును సృష్టించారని చెప్తాడు. బ్రాహ్మణ వ్యతిరేకంగా పోరాటాలు జరిగినప్పటికి తక్కిన ప్రజలతో కలవకుండా వాళ్ళు చెప్పే నీతులు వినకుండా చేసేందుకు వాళ్ళను అస్పృశ్యులుగా చిత్రీకరించారని చెప్పడంతో అమరయ్య అంటరానితనానికి కారణం బ్రాహ్మణులేనని అటువంటి హిందూమతం తనకు అవసరం లేదని యేసోబు పేరుతో క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తాడు. (పుట:31). 'కాడి' నవలలో మాదిగ యువకులంతా చర్చి దగ్గరకు వెళ్తారు. అక్కడ స్వాముల వారి చారిత్రక నేపథ్యాన్ని వివరిస్తూ తరతరాలుగా హిందూమత వివక్షకు గురవుతూ వచ్చిన మాదిగలకు క్రైస్తవ మతం ఎలా మఱ్రి చెట్టులా నీడనిచ్చి ఆదరించిందో వివరిస్తాడు. వేల ఏళ్ళుగా అగ్రవర్ణాల్ని ఎదిరించే ధైర్యాన్నిచ్చిందని చెప్తాడు. హిందూమత అగ్రవర్ణాల దురహంకారం మీద చర్య తీసుకోవాలనేది ఫాదర్ నిర్ణయంగా చెప్పబడుతుంది.(పుట:104.), 'పంచమం' నవలలో కూడా క్రైస్తవ మత ఛాయలు ఉన్నాయి. 'నిప్పుల వాగు' నవలలో నాగరాజు తన ఆలోచనల్లో ఇలా అనుకుంటాడు ఒకప్పుడు తాగుబోతు, తిరుగుబోతు అయిన తాను చర్చిలో మనుష్య లోకం పాపంతో నిండిపోయింది అన్న మాటలతో అతనిలో మార్పు వచ్చిందని భావిస్తాడు (పుట:79). హిందూమతం దళితుల ఆత్మగౌరవాన్ని ఛిద్రం చేసినందువల్ల, కొంతవరకు క్రైస్తవం వారిని దగ్గరకు తీసుకుందనే ఆలోచనలు ఈ నవలల్లో వ్యక్తమవుతున్నాయి. అంబేద్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించడం, దాని ప్రకారం వివాహాది కార్యక్రమాలు జరగాల్సిన అవసరాన్ని 'మాదిగపల్లె' నవలలో కనిపిస్తుంది.

ఆహారపుటలవాట్లు:

దళితుల ఆహారం చర్మ కారిత్వంతోనే సంబంధించి ఉంటుంది. గొడ్డు మాంసం తినడం వారి జన్మ హక్కని కొలకలూరి మధు జ్యోతి 'దళిత సాహిత్యం– సౌందర్య తత్వం' అనే గ్రంథంలో పేర్కొన్నారు. దళితులు ఆహారం తమ కష్టాన్ని బట్టి ఉంటుంది. అలాంటి ఆహారం తినకపోతే తగినంత శ్రమచేయలేరు. అంతేకాకుండా, ఆర్య–ద్రావిడ సిద్ధాంతాల ప్రకారం దళితులంతా ఆర్యుల చేతిలో ఓడిపోయిన తర్వాత తమ బతుకుదేరువుకోసం అడవుల్లో జీవిస్తూ, మాంసాన్ని తినడం అలవాటు చేసుకున్నారని చరిత్రకారులు చెప్తున్నారు. అందువల్ల కూడా మాంసాహారం తమ జీవానాహారంగా మారిపోయిందనుకోవచ్చు.

'వేర్లు' నవలలో వెంకట్రాముడు చదువుకునే పాఠశాలలో బడి పంతులు గొడ్డు మాంసం తినే వాళ్ళకు చదువేంవస్తుంది మడత నాలుక గాళ్లు అని క్లాసులో ఉన్న వాళ్ళను ఆక్షేపిస్తాడు. దీనిని బట్టి దళితుల ఆహారంలో గొడ్డు మాంసం ముఖ్యమైనదిగా తెలుస్తుంది (పుట:6.). 'గద్దలాడతండాయి' నవలలో లింగప్ప తన కూతురి పెళ్లి చేయించేటప్పుడు ఆహారపదార్థాల్లో పెండ్లి భోజనానికి వరి అన్నం, బేళ్ళ చారు, పరమాన్నం, చిత్రాన్నం చేస్తారు. ఇలాంటి శుభకార్యాలప్పుడే పేదవాళ్లు ఇన్ని రకాల వంటకాలు చేసుకుని తింటారని తెలుస్తుంది పుట:76.) 'మాదిగ పల్లె' నవలలో ఆహారపు అలవాట్లను ప్రస్తావించబడలేదు. 'కాడి' నవలలో ఇప్పుడు ఆహారంలో సంగటి దొరకడం కష్టంగా ఉందని ఏ పండగకో పబ్బానికో వరి అన్నం వండుకుని, తినే వాళ్ళమని ఒకప్పుడు ఒక్కొక్క ఇంట్లో ఒక్కో రకం బువ్వలు ఉన్నాయని చెప్తూ వాటిలో రకాలకు అరిగి బువ్వ, కొఱ్ఱ బువ్వ, బరిగె బువ్వ, సోమ బువ్వ, జొన్న బువ్వ, సొద్ద బువ్వ. ఎప్పుడో పండగలకు పులగం. ఒక పొద్దులకు స్వామి బువ్వ అని పేర్కొంటాడు. (పుట:13).'పంచమం' నవలలో శివయ్య తను ఇంటర్ ఫస్ట్ క్లాస్ పాసయిన సంగతి తల్లికి చెప్పినప్పుడు తల్లి అతనితో ముందు బువ్వ తిన్నావా అంటూ ఇంట్లో సంగటి కడి, చింత తొక్కు ఊరిమిండి ఉంది తిను అంటుంది. (పుట: 10). ఇక్కడ దళితుల సంగటి, చింత తొక్కు పచ్చడి; ఇవి పేద వారింటి ఆహారాన్ని తెలియజేస్తాయి.'నిప్పుల వాగు' నవలలో ఆహారపు అలవాట్ల గురించి ప్రస్తావన కనబడదు.

పండగలు –జాతరలు:

'వేర్లు' , 'గద్దలాడతండాయి' నవలలో పండగలు, జాతరలు పేర్కొనలేదు. 'మాదిగ పల్లె ' నవలలో మాల పల్లె లో రామమందిరాన్ని నిర్మించి పండగ చేసుకుంటున్నట్టు తెలియజేస్తారు. వారి ఉత్సవాలలో గులాం కు గల ప్రత్యేకతను తెలుపుతారు. వారి ఉత్సవాలలో ప్రధానమైనది తప్పెట ఈ ఉత్సవాలకు అందరూ తాగి చిందేస్తారు. (పుట:12).'కాడి' నవలలోనూ ఉత్సవాలు, పండగలు జరుపుతున్నట్టు కనబడదు. 'నిప్పుల వాగు' నవలలో సుంకులమ్మ జాతరను నిర్వహిస్తారు. సుంకులమ్మకు గొర్రెను బలివ్వడానికి తీసుకు వస్తారు. సుంకులమ్మ దగ్గరకు పోయిన చోట

తప్పెట్లు, ఈలలు, చిందు వెయ్యడం సందడిగా ఉంటుంది (పుట :112).

భావ జాల సంఘర్షణ:

దళితుల్లో అంబేద్కర్ ప్రసంగాలు, రచనలు ప్రాచుర్యంలోకి వచ్చిన తర్వాత జ్యోతిరావు పూలే, రామస్వామి నాయకర్ మొదలైన వారి తాత్త్విక ఆలోచనలు చర్చలోకి వచ్చాయి. అంతకు ముందు గాంధీజీ, కారల్ మార్క్స్ ప్రభావం విస్తృతంగానే ఉంది. అంబేద్కర్ తర్వాత బౌద్ధిజం తమ జీవనవిధానంగా ఉండాలని అంబేద్కర్ అనుయాయులు చాలామంది భావిస్తున్నారు. కానీ వాస్తవంలో, ఆచరణలో అది కనిపించడంలేదు. హిందూ, క్రైస్తవ, ఇస్లాం మతాల్లోనే దళితులు ఎక్కువగా ఉన్నారు. అందువల్ల వీరి భావజాలంలో కూడా చాలా సంఘర్షణ కనిపిస్తోంది. అది వేర్లు, మాదిగపల్లె, పంచమం వంటినవలల్లో చాలా వరకు ప్రతిఫలించాయి.

'వేర్లు' నవలలో రాజకీయవేత్తల ద్వారా కుల నిర్మూలన వలన కలిగే లాభాలను తెలియ జేయడంతో పాటు వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించడం కనబడుతుంది. బుద్ధుడు, అంబేద్కర్, జీసస్, వంటి పేర్లను తీసుకోవడం వలన వారి ఆశయాలనే ఇందులో పేర్కొన్నట్టు తెలుస్తుంది. కావున ఈ నవలలో అంబేద్కర్ భావజాలం ఉంది. 'గద్దలాడతండాయి' నవలలో ప్రభుత్వ వాలంటరీ ఆర్గనైజేషన్ ప్రవేశపెట్టిన ఆశయాన్ని దళితులు జీవనోపాధికి ఉపయోగించకుండా దుర్వినియోగం చేస్తారు. వారి అభివృద్ధి జరిగి వుంటే అంబేద్కర్ ఆశయానికి చేరువుగా ఉండేది. 'మాదిగ పల్లె' అంబేద్కర్ ఆశయమైన అట్టడుగు, బలహీన వర్గాలు తమ అభివృద్ధిని సాధించుకోవడం రాజ్యాధికారం కోసం పాటుపడం వంటి అంశాలు కనబడటం చేత అంబేద్కరిజం ఉందని చెప్పవచ్చు. మార్క్సిజం భావాలు కూడా అక్కడక్కడా చోటుచేసుకున్నాయి. 'కాడి' నవలలో మాదిగ కులస్తులు వారి హక్కుల కోసం, రిజర్వేషన్ల కోసం పోరాడటానికి ఉద్యమాలు చేపడతారు ఇక్కడ అంబేద్కరిజం చోటుచేసుకుంది. 'పంచమం' నవలలో మార్క్సిజం భావాలు దాగి ఉన్నాయి. 'నిప్పుల వాగు' లో ముఠా కక్షలు, రెడ్ల రాజకీయాలు ప్రధానంగా కనబడుతాయి. ఈ విధంగా వేర్లు, గద్దలాడతండాయి. మాదిగ పల్లె , కాడి, పంచమం, నిప్పుల వాగు నవలలో కొంతవరకు దళిత సంస్కృతి కనబడుతుంది.

రాయలసీమలో వచ్చిన నవలల్లో దళితుల సంస్కృతి పరిపూర్ణంగా చిత్రితం కాలేదనీ, ఇంకా అనేకాంశాలను చిత్రించాల్సిన అవసరం ఉందని ఈ దళిత నవలల్ని పరిశీలిస్తే స్పష్టమవుతుంది. దళిత సంస్కృతి ప్రతిఫలనం అనేది ఒక ప్రత్యామ్నాయ సంస్కృతిగా కళ్యాణరావు 'అంటరానివసంతం'లో వచ్చినా, అది క్రైస్తవమతాచారాలే ప్రబోధించింది. తెలంగాణ దళిత సంస్కృతిని వేముల ఎల్లయ్య 'కక్క' కొంతవరకు అందుకోగలిగినా, దానిలోని భాష చాలా కఠినంగా అనిపిస్తుంది. దాన్ని దళితుల భాషగా సాధారణీకరించే అవకాశం లేదనుకుంటున్నాను. అందువల్ల కోస్తాలోగానీ, రాయలసీమలో గానీ, తెలంగాణాలో గానీ పూర్తిగా దళిత సంస్కృతిని ప్రతిఫలించే నవలలు వచ్చాయిని చెప్పుకోలేం. ఈ పరిస్థితుల్లో రాయలసీమలో వచ్చిన దళిత

నవలల్లో చాలావరకు దళిత వాస్తవిక సాంస్కృతికాంశాలే ప్రతిఫలించినా, సంపూర్ణమైన దళిత సాంస్కృతిక నవల రావలసిన అవసరం ఉందని మాత్రం తెలుస్తోంది.

ఆధార గ్రంథాలు:

1. చంద్రశేఖర రెడ్డి, రాచపాళెం. *1980 తర్వాత తెలుగు దళిత నవల* (వ్యా.సం), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2003.
2. చిలుకూరి దేవ పుత్ర, *పంచమం,* హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్,
3. నాగరాజు, పొదిలి. *రాయలసీమ నవల,* సాహితి పబ్లికేషన్స్, మైదుకూరు, 2015.
4. నాసరయ్య, పి. *మాదిగ పల్లె,* ప్రగతి బుక్ హౌస్, విజయవాడ, 1998.
5. నీరజ పొన్నం రెడ్డి. *దళిత సంస్కృతి,* కీర్తి ప్రింటర్స్, తిరుపతి, 2012.
6. పద్మావతి, *సంస్కృతి అంటే ఏమిటి ?*, నవభారత్ బుక్ హౌస్, విజయవాడ, 1990.
7. పినాక పాణి, *నిప్పులవాగు.* నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్, 2001.
8. విశ్వనాథ రెడ్డి, కేతు. ***వేర్లు,*** (ప్ర.ము). విశాలాంధ్ర బుక్ హౌస్, హైదరాబాద్ , 1978.
9. వెంకట్రామి రెడ్డి, సన్నపు రెడ్డి. ***కాడి,*** ఆటయూత్ కన్వెన్షన్,1998.
10. వేంకటేశ్వర రావు, దార్ల. *దళిత సాహిత్యం– మాదిగ దృక్పథం,* విశాలాంధ్ర బుక్ హౌస్, హైదరాబాద్, 2008.
11. వేంకటేశ్వర రావు, దార్ల. ***పునర్మూల్యాంకనం*** , నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్,2010.
12. వేంకటేశ్వర రావు, దార్ల. ***వీచిక*** (సాహిత్య విమర్శ వ్యాసాలు), ప్రజాశక్తి డైలి ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్, 2009.
13. స్వామి, ***గద్దలాడతండాయి***, విశాలాంధ్ర బుక్ హౌస్, హైదరాబాద్ ,1991.

రచయితల చిరునామాలు

1. **ఆచార్య శలాక రఘునాథ శర్మ,** 'జ్ఞానపూర్ణిమ', 75-1-3/ఎ5, బ్లూమూన్ అపార్ట్‌మెంట్స్, ప్రకాశం నగర్, రాజమహేంద్రవరం - 533 103
2. **డా.పి.ఎస్.గోపాలకృష్ణ,** 1-6-207, ఫణిగిరి కాలని, చైతన్యపురి, హైదరాబాదు - 500 060
3. **ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు,** తెలుగు శాఖ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి - 221 005
4. **డా.ఎ.కె.ప్రభాకర్,** బి-205, సోలంకీస్ గుల్మోహర్, బ్రాహ్మణవాడ, బేగంపేట, హైదరాబాదు - 500 016
5. **శ్రీ వి.చెంచయ్య,** 10-40-15ఎ, జనతాపేట నార్త్, కావలి, నెల్లూరు జిల్లా - 524 201
6. **ఆచార్య గాలి రాధాకృష్ణ,** భాషాశాస్త్ర శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి - 517 502
7. **డా.పి.ఆర్.హరినాథ్,** తెలుగు శాఖ, రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, మానసగంగోత్రి, మైసూరు - 570 006
8. **డా.దార్ల వెంకటేశ్వరరావు,** తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాదు - 500 046
9. **డా.వి.ఎమ్. సుబ్రహ్మణ్య శర్మ,** భాషాశాస్త్ర విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు - 500 007
10. **డా.డి.గాయత్రి,** ఇంటి నం.ఎల్ఐజి-1, 170, న్యూ ఎపిహెచ్‌బి కాలని, బి క్యాంపు, కర్నూలు - 518 002.
11. **ఆచార్య వేమూరి ఆనందమూర్తి,** 605, బిఇఎంఎల్ లేఔట్, 1వ క్రాస్ 3వ స్టేజ్, ఆర్.ఆర్.నగర్, బెంగళూరు - 560 098.
12. **డా.సంగనభట్ల నరసయ్య,** ఫ్లాట్ జి-3, ఫ్లాట్ 199, ఇంటి నం.16-11-16/ఇ/ఎ, శ్రీ గాయత్రి రెసిడెన్సి, శ్రీపురం కాలని, మలక్‌పేట, హైదరాబాదు - 500 036.
13. **శ్రీ ఆర్.బాలిరెడ్డి,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాదు - 500 046.

ద్రావిడ భారతి

(అర్ధ వార్షిక తెలుగు పరిశోధన పత్రిక)

శైలీ పత్రం

- వ్యాసాలు ద్రావిడ భాషాసాహిత్యాలు, చరిత్ర, సంస్కృతి, జానపదవిజ్ఞానం, తత్త్వశాస్త్రం, మానవశాస్త్రం, ఇతర ఏ మానవీయ శాస్త్రాలకు చెందినదైనా ద్రావిడ సంబంధమైన పరిశోధన వ్యాసాలు రాయవచ్చు. కాని విషయం ఏ శాఖకు చెందినదైనా వ్యాసం తెలుగులోనే ఉండాలి.
- ఇతర ద్రావిడ భాషల పరిశోధన పత్రికలలోని ఉత్తమ వ్యాసాలను మూల రచయితల, ఆ పత్రికల యాజమాన్యాల అనుమతితో తెలుగులోకి అనువదించి పంపవచ్చు. కాని మూలభాషలోని మూల ప్రతిని కూడా పంపాలి.
- వ్యాసాలు తప్పనిసరిగా సరికొత్త పరిశోధనాంశాలతో ఆ శాఖాంశాలపై సరికొత్త ప్రతిపాదనలు కాని సరికొత్త విజ్ఞానదృష్టిని కాని అందించేవై ఉండాలి. ఏ ప్రాచీన సాహిత్యం సరికొత్త సాహిత్య ధోరణుల గురించి రాసినా పరిశోధనలో కొత్తదనం తప్పనిసరి. గతానుగతికమైన వాదనలను ఇప్పటికే చాలా మంది చెప్పిన విషయాలపైన తిరిగి రాసే వ్యాసాలను పత్రిక అనుమతించకపోవచ్చు.
- వ్యాసాల పరిమాణం మరీ చిన్నదిగా ఉండకూడదు. అచ్చులో కనీసం ఐదు పుటల వ్యాసాలు చిన్నవిగా ఉండవచ్చు. మరీ ఎక్కువ పుటలలో ఉంటే పరిశోధన గురుత్వాన్ని బట్టి అంగీకరించవచ్చు.
- వ్యాసాలు ఆధునిక ప్రామాణిక భాషలో ఉండాలి. మాండలిక కథలపైన, ఇతర మాండలిక భాషాధారిత ప్రక్రియలపైన వ్యాసాలు రాసినా వ్యాసం ఆధునిక ప్రామాణిక భాషలోనే ఉండాలి.
- పులుముడు వాక్యాల శైలి దూరాన్వయం దురన్వయం ఉన్న వాక్యాల శైలి కాక సూటిగా క్లుప్తంగా ఉండే వాక్యాలతో విషయాన్ని సూటిగా చెప్పే శైలిని పాటించాలి.
- ఇప్పటికే విస్తృతంగా జరిగిన పరిశోధనాంశాలపైన కొత్త ప్రతిపాదనలు చేసే వ్యాసాలలో తిరిగి ఉపోద్ఘాతాలు చేయకుండా తిన్నగా విషయాంశానికి వెళ్ళి చర్చించవచ్చు. ఉదాహరణకు జానపద గేయాలపై కొత్త వ్యాసం రాయదలచుకున్నప్పుడు. తిరిగి నిర్వచనాలను గురించి చెప్పడం గేయలక్షణాలు వగైరా రాయనవసరం లేదు. భావకవిత్వంపైన సరికొత్త ప్రతిపాదనలు

వివాదాలు రాయదలచుకున్న వారు తిన్నగా విషయంలోనికి వెళ్ళవచ్చు. కాని తిరిగి భావకవిత్వ నిర్వచనాలను గురించి ఉపోద్ఘాతాలు అవసరంలేదు.

- విసంధులు పాటించవచ్చు. అందంగా ఉన్నంత వరకూ వైరి సమాసాలను పాటించవచ్చు. పాలాభిషేకం, మెట్లోత్సవం, ఫిల్మోత్సవ్ వంటి మామూలు పాపులర్ భాషలోని దుష్టసంధులు వర్జించాలి. వ్యావహారికమైన పాపులర్ పత్రిక భాషను వాడకూడదు.
- థ–ధ, శ–ష–స భేదాన్ని తప్పక పాటించవలసి ఉంది. శకట రేఫ అవసరమైన చోట అంటే భాషాశాస్త్ర సంబంధి వ్యాసాలలో ప్రాచీన సాహిత్య చర్చకు సంబంధించిన వ్యాసాల్లో వినియోగించవచ్చు.
- వ్యాసానికి పాదసూచికలు/అంత్యసూచికలు ఇవ్వండి. సూచికలో స్పష్టమైన అవసరమైన సమాచారం ఉంటేనే ఇవ్వండి. చర్చలో అధికంగా ఇవ్వవలసిన సమాచారం ఉన్నా ఇవ్వండి. అతి ముఖ్యమైన విషయమైతేనే వ్యాసంలో ఉండాలి.
- ఉపయుక్త గ్రంథాల పట్టీ ఇచ్చేటప్పుడు వ్యాసంలో చర్చలో వినియోగించిన గ్రంథాలను మాత్రమే ఇవ్వాలి. దీనికి సంబంధం ఉన్నా ఇతర పుస్తకాలు జాబితాలో చేరవలసిన పనిలేదు.
- ఉపయుక్త గ్రంథాల జాబితా ఆధునికంగా అంతర్జాతీయంగా ఉపయోగించే పద్ధతిలో ఉండాలి. కింద ఉదాహరణ చూడవచ్చు.

  కృష్ణకుమారి నాయని, 1979. **జానపద గేయగాథలు,** తెలుగు అకాడమీ, హైదరాబాదు.

- జాబితాలో రచయితల పేరు పక్కన వారి బిరుదులు, హోదాలు రాయనవసరం లేదు. వ్యాసాన్ని కోట్ చేసినప్పుడు వ్యాసం ఉన్న పుస్తకాన్ని పై విధంగా రాయాలి. గ్రంథాల జాబితా గ్రంథకర్తల పేర్లతో అకారాది క్రమంలో ఉండాలి. జాబితాకు వరుస సంఖ్య అవసరం లేదు.
- అముద్రిత గ్రంథాలను, అముద్రిత సిద్ధాంత గ్రంథాలను కూడా ఉపయుక్త గ్రంథాల జాబితాలో అకారాది క్రమంలోనే రాయాలి. కాని (అముద్రితం) అని కుండలీకరణంలో, చివరిలో చెప్పాలి.
- Ibid, et.al. Op. Cit, వంటి వాటిని యథాతథంగా వాడుకోవచ్చు.
- ఉపశీర్షికలు వ్యాసరచనలో మరింత స్పష్టతనిస్తాయి. కాబట్టి వాడుకోవచ్చు.
- ఉటంకించే పాఠ్యం చిన్నది అయితే కొటేషన్ మార్కులలో ఉంచండి. లేదా ఒక పేరా అంత పరిమాణం ఉంటే దాన్ని ప్రత్యేకంగా మార్జిన్ పెట్టి వేరే చిన్న ఫాంట్‌లో రాయాలి.

- వ్యాసకర్తలే డి.టి.పి చేయించి పంపే పక్షంలో అను (version-7) కు కన్వర్ట్ కాగలిగిన ఫాంట్‌లనే వాడాలి. ఏ సాఫ్ట్‌వేర్ వాడింది ఏ ఫాంట్ వాడింది స్పష్టంగా రాసి పంపాలి. సాఫ్ట్ కాపీ ఇ–మెయిల్‌లో పంపవచ్చు.

  E-mail - publicationsdu@gmail.com

- మూలరచయిత అనుమతి పత్రం అనువాదానికి తప్పక జతచేయాలి.

ఈ పత్రికను ప్రాంతీయ భాష అయిన తెలుగులో వెలువరిస్తున్నా అంతర్జాతీయంగా వెలువడుతున్న పరిశోధన పత్రికల స్థాయిలో ప్రచురించాలనే మా అభిలాషను అర్థం చేసుకుని పరిశోధకులు సహకరించవలసిందిగా మనవి. ఇందుకు మీరూ తగిన సూచనలు చేయవచ్చు. మరిన్ని వివరాలకు సంపాదక మండలిని సంప్రదించవచ్చు. మీ రచనలు అందించి పత్రికను ఉత్తమ ప్రామాణిక పత్రికగా దిద్దితీర్చడంలో సహకారం అందించాలని మనవి.

సంపాదకమండలి

ద్రావిడ భారతి

(అర్ధవార్షిక తెలుగు పరిశోధన పత్రిక)

చందా వివరాలు

1) విడి ప్రతి వెల - రూ. 75.00

2) సంవత్సర చందా (రెండు సంచికలు) - రూ. 150.00

'ద్రావిడ భారతి' పత్రిక కావలసినవారు, చందాదారులుగా చేరాలనుకున్నవారు **"రిజిస్ట్రార్, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం"** పేరు మీద కుప్పంలో చెల్లుబాటు అయ్యేటట్లుగా డి.డి.ని కింది చిరునామాకు పంపగలరు. ప్రచురణార్థం వ్యాసాలను ఈ చిరునామాకు/ఈ-మెయిల్‌కు పంపగలరు.

సంచాలకులు
ప్రచురణల కేంద్రం
ద్రావిడ విశ్వవిద్యాలయం
శ్రీనివాసవనం, కుప్పం - 517 426
E-mail - publicationsdu@gmail.com